


# ఆంధ్రప్రదేశ్

జులై '64

## నెహ్రూ సంచిక



# అఖండ జ్యోతి

"మన జీవితాల్లోని జ్యోతి ఆరిపోయింది: అంతటా యామిని నిండుతున్నది....

"జ్యోతి ఆరిపోయింది అన్నాను నేను. కాని అది తప్పు. ఈ దేశంలో ప్రకాశించిన జ్యోతి మామూలు జ్యోతి కాదు.

"అనేకానేక సంవత్సరాలుగా ఈ దేశాన్ని వెలిగించిన జ్యోతి మరో వెయ్యేళ్ళ తర్వాతకూడా యీ దేశంలో వెలుగొందుతూనే వుంటుంది. అనేక కోట్లాది హృదయాలను ఆజ్యోతి ఓదారుస్తుంది అనే విషయం ప్రపంచమే దర్శిస్తుంది."

1948 జనవరి 30న గాంధీజీ మరణంపై నెహ్రూ వ్యాఖ్యానం

# ఆంధ్రప్రదేశ్

## నెహ్రూ సంచిక

సంపుటి : 8 సంచిక : 9

ఆషాఢ - శ్రావణ 1886 శకం

జులై, 1964

## విషయ సూచిక



---

వెనుక అట్ట: దేశమంతటా 12 రోజులు సంతాపం పాటించబడింది. పతాకాలు అవనతం చేయబడినవి.

---

సంవత్సరం చందా –రు. 3–00
విడి ప్రతి రు. 0–25 నయాపైసలు.

సంపాదకీయం:

# మన సచివుడు, మన నెయ్యము...

"ఈ భువిలో పుట్టిన ప్రతిమనిషీ ఎప్పుడో ఒకప్పుడు చనిపోక తప్పదు" — అని మెకాలే కథానాయకుడు అన్నాడు. కాని యీ "జాతస్య మరణం ధ్రువం" అనే సార్వజనీనిక సూత్రానికి కట్టుబడనివ్యక్తి ఒకరు ఉన్నా రని మనం,— ఈ భారతదేశ వాసులం — భావించేవాళ్ళం. భారత దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదించడంకొరకు తమ జీవితకాలమంతా పోరాటం సాగించిన అగ్రశ్రేణి నాయకులు చాలామంది మనలను వీడి వెళ్ళిపోయారు. యీ ఒక్క మహానాయకుడే మిగిలివున్నాడు వారంతా ఒకరి తరువాత ఒకరు గతించిపోయారు. కాని ఆయనమాత్రం రససిద్ధి పొందారా అనిపిస్తుంది. ఆఖరివరకూ ఆయన కాలాతీతుడుగానే వున్నాడు. అందువల్లనే ఆయన అమరుడు అని మనం భావించాం

కాని చివరకు మృత్యువు కబళించింది. వస్తుందని ఎవరూ కలలోనన్నా ఊహించని తరుణంలో దొంగచాటుగావచ్చి కబళించేసింది మృత్యువు యిప్పట్లో తన దగ్గరకు రాదని ఆయన కూడా అనుకున్నారు ఇప్పట్లో తాను మరణించేది లేదని మూడు రోజుల క్రిందటే ఆయన ప్రకటించారు. లోగడ కలిగిన అనారోగ్యం నుండీ పూర్తిగా ఆయన కోలుకున్నట్టే కనిపించారు. కొద్దిరోజులు విశ్రాంతి తీసుకుని ఆనందంగా తిరిగి వచ్చారు అమరుడని మనం ఊహించిన వ్యక్తి యిక ఎంతోకాలం వుంటాడని నమ్మే పరిస్థితి ఏర్పడింది. కాని మృత్యువు మనల్ని మోసగించింది. ఆ మృత్యువును ఎదుర్కోవడానికి మనం సన్నద్ధులం కానప్పుడు అది ఆయనను కబళించివేసింది.

మృత్యుకబంధ హస్తం ఆయనపై వాలింది. ఆ దెబ్బకు దేశం యావత్తూ తూలిపడింది. నిత్యయౌవనుడుగా భాసించిన ఆవ్యక్తి, మృత్యువుకు అతీతుడుగా అనిపించిన వ్యక్తి చివరకు మృత్యువుకు లోబడిపోయాడు. ఇంత కాలమూ మనం ఒక అమర మూర్తిగా ఊహించిన వ్యక్తి మర్త్యుడని కూడా మనకు జ్ఞాపకం చేసినట్లయింది. జ్ఞాపకం చేసింది నేలవాలిన ఒక ఎర్రగులాబి పూవు!

ఎందరో శ్రద్ధాంజలులు ఘటించారు. భాషాసముద్రాలను శోధించి విలువైన శబ్దమౌక్తికాలతో ఆయన గొప్పతనం శ్లాఘించారు. మరెందరో శ్లాఘిస్తారు. కాని, తమ సర్వస్వమూ ఆయనే అని నమ్ముకున్న కోట్లాది సామాన్య ప్రజల మాటేమిటి? వారికి భాష రాదు. గొంతులో గూడుకట్టుకున్న దుఃఖం ఊపిరి సలపనివ్వదు. కన్నీళ్ళు యింకిపోయాయి. మౌనబాష్పాలతోనే వారు శ్రద్ధాంజలి ఘటిస్తారు ఆ మౌనంలో దాగిన వారి హృదయ పరితాపాన్ని కొలిచే దెవ్వరు?

## భాష విఫలమైంది

మాట్లాడగలిగిన వారికి, అప్పటి తమ మనోభావాలను వ్యక్తం చేయడానికి చిరకాలంగా తెలిసిన యీ భాష ఎంత అసమర్థమైనదో తెలుస్తుంది ఇలాంటి అనుభవం వారికి మున్నెన్నడూ కలుగలేదు. ఆయన మన కుటుంబ సభ్యుడా? కాదు. కాని ఆయన నిర్యాణం వల్ల మనం అప్పుడిని కోల్పోయిన దానికంటే కూడా అధికంగా దుఃఖించాం భావవ్యక్తీకరణలో భాష విఫలమైంది.

ఉత్తమోత్తమ విశేషణాలేవీ ఆయన గుణగణాలను చెప్పలేవు. మానవజీవిత పరివ్యాప్తమైన వివిధ గుణాలేవీ ఆయనను సక్రమంగా నిర్వచించలేవు ఆయన ఈ యుగపు మానవాతీత మహావ్యక్తి. ఆయన ఘనతను గుణించడానికి కొలమానాలేవీ చాలవు.

సుదీర్ఘమైన చరిత్రగతిలో విషాదసంఘటన లెన్నో తటస్థించడం సహజం. ఇలా సంభవించే దుర్ఘటనలు కొన్ని అతి ప్రబలమైనవి కావచ్చు కూడా. అయితే ఇంతటి తీవ్రమైన, భయ, విస్మయాందోళనకరమైన విషాద సంఘటన మునుపెప్పుడూ జరుగలేదనే అనిపిస్తుంది. ఈ సందర్భంలో మహాత్మాగాంధీ మరణాన్ని మినహాయించిపూట్లాడుకోవాలి. కాని ఈ యిద్దరిమధ్య పోలిక తేవడంకూడా మంచిది కాదేమో! గాంధీజీ ఆధ్యాత్మిక రంగానికి చెందిన వ్యక్తి.

ఆయన ఋషిపుంగవుడు. మన జీవితాలపై ఆయన ప్రభావం భావనా రూపంలో పడింది మరి ఈ మహావ్యక్తి మనలో ఒకరుగా భాసిల్లారు. ఈయన మనందరికోసం మన భౌతిక శ్రేయోభివృద్ధికి మన ఆశల్లో ఆశయాల్లో పాలుపంచుకున్నారు మన భౌతిక ఆశయాలనే ఆయనకూడా కలకన్నారు స్వర్గసౌఖ్యాలను గూర్చి పట్టించుకోలేదు మర్త్యలోక సౌభాగ్యానికే ఆయన తీవ్రంగా పరిశ్రమించాడు. గాంధీజీ నిర్యాణం, కుటుంబపెద్దగా బాధ్యతలను విడనాడి తన జీవిత సంధ్యాసమయంలో ప్రవేశించిన కురువృద్ధు మరణం వంటిది అంటే పితామహుడు మరణించినట్లు నెహ్రూ మృతి కన్నతండ్రి కాలధర్మం చెందడం వంటిది. గాంధీజీ మనకు స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టారు దీనిలో నెహ్రూకుగల పాత్ర అసాల్పమైనది దేశ స్వాతంత్ర్యానికి ఆర్థిక, రాజకీయ ప్రజాస్వామ్యం సమకూర్చే బృహత్తర కార్యభారాన్ని నిర్వహించే బాధ్యత వహించారు ఈ కార్యసాధనలోనే ఎంతో శ్రమతో ... ఆయన చివరకు మరణించారు

ఈ బృహత్కృషిలోనే ఆయనను ఆచార్యునిగా ప్రజలు గుర్తించారు. కోట్లాది ప్రజలు ఆయనను తమ ధర్మ ... గా స్మరించుకుంటారు ధర్మ సంగ్రహణ బుద్ధితో కోటాది ప్రజలు తనముందు బారులుతీరి కూర్చొని స్పష్టంగా ... మీద కూర్చొని ఆయన అందరికీ ... గంభీర స్వరంతో ఉపన్యసించేవారు. ఆయన ... వ్యక్తిత్వంలో ఉద్రేకం కానీ, రాజకీయ పక్షపాతం కానీ లేవు ఆయన తన ప్రశాంత గంభీర స్వరంతో మనం జీవిస్తున్న ఈ ప్రపంచాన్ని గురించీ ఇతరులు సాధించిన అభివృద్ధిని గురించీ, ఇంకా మనం చేయవలసిన కృషిని గురించీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడేవారు ఆయన ప్రజానీకానికి వారికి అర్థమయ్యే భాషలో అంతర్జాతీయ రాజకీయాలు, అణుశక్తి ... , ఆర్థిక ... మొదలగు అంశాలను బోధించారు వారు ఆయన్ను అర్థం చేసుకున్నది కొంచెమే అయినా ఆయన చెప్పినది యథార్థమే నని అంగీకరించి తప్పో ఒప్పో తమకు చేతనైనంతవరకు ఆయన్ను అనుసరించడానికి ప్రయత్నించారు వారు ఎప్పుడూ ఆయన కోరినంత చేయలేకపోయేవారు వారు ఆయన అడుగు జాడలలో కొంత వరకు నడిచి తిరిగి తమ పాత మార్గాలలోకి తిరుగుముఖం పట్టేవారు ఆ గురువు అలసట చెందేవారు. అయినా ఆయనకు ఓటమి అనేది లేదు మళ్ళీ ప్రజలవద్దకు తిరిగి వెళ్ళి వారిని ముందలించేవారు ... తిట్టేవారు. ... అలాకాకుండా తాను వెళ్ళిపోతానని చెప్పి వారిని బెదిరించేవారు కూడా మళ్ళీ వారిలో చైతన్యం వచ్చేది ఆ విధంగా కన్న బిడ్డలవలె ప్రజలను నెమ్మది, నెమ్మదిగా గమ్యానికి చేరువగా తీసుకువెళ్ళుతుండేనారు

## ప్రజలు అనాథులైనారు

ఆయన ఎడల మనకు గల ప్రేమకు అవధులు లేవు. పిన్నలూ పెద్దలూ సమస్త ప్రజలూ అనాథులైపోయినట్లుగా భావించడానికి ఆయనలో గల మహత్తు ఏమిటి? కేవలం ఆయనను ఒక వ్యక్తిగా చూచినవారూ, ఒక మహాగర్వ మూర్తిగా భావించినవారూ అందరూ చకితులయ్యారు ఆయన నెప్పుడూ చూడని ప్రజలు ... నార్త యథార్థం ... మనం మన ... గా ప్రేమించిన వ్యక్తి వెళ్ళిపోయారు. ఎంతగా ప్రార్థనలు జరిపినా, ఎంతగా కన్నీటి ధారలు కురిసినా ఆయన తిరిగిరారు మృత్యువు అంత క్రూరమైనది దాని హస్తస్పర్శ అంత అనివార్యమైనది కఠోరమైనది

సాధారణ పద్ధతిలో శ్రద్ధాంజలి ఘటించడం ద్వారా ఆయన ... తీర్చడం అసాధ్యమనే విషయం అందరికీ తెలుసు శ్రద్ధాంజలి ఘటించే ప్రయత్నం చెయ్యడం, ఇదేమి చాలుతుందని మధ్యలో విరమించుకోవడం మళ్ళీ ప్రయత్నించడం జరుగుతుంది. కేవలం ఒక మహా వ్యక్తిగానే ఆయనకు నివాళు లర్పించడం ఆయనను అవమానపరచడమే ఒక శకపు జీవితం, ఆలోచనాసరళిపై ఇంత సంపూర్ణంగా తన ప్రభావాన్ని ప్రసరింపజేసిన వ్యక్తి, తన ... జ్ఞానసంతోషం ... కాలంవరకు ఈ విధంగా జీవితాన్ని ప్రభావితం చేయగల వ్యక్తిని వర్ణించడానికి మాటలు చాలవు. భాషలు చాలవు

ఈ బాధ ... మనం గిలగిల లాడిపోతాము. అనంత ... మనలను మౌనముద్రాకృతులుగా రూపొందిస్తుంది. ... పలుకుతాము

చీకటిందూరి తిన్నగా చేరిపోకు
ఒదుగుచుంటోయి గరించి హుంకరించి
కాంతి మ్రింగిన కటికి చీకటిని జిల్చి
చించి వెంటాడగా ... ఎత్తికొంది

నరేంద్ర లూథర్

జవహర్లాల్ హృదయ కుహరంలో ఆంధ్రప్రదేశ్ యెడ ఎల్లప్పుడూ అభిమానమే వెల్లివిరిసివుండేది. ఈ విషయాన్ని ఎప్పుడూ మనం సంతోషంతో మననం చేసుకుంటూనే వుంటాం. అనేకసార్లు వారు మన రాష్ట్రానికి విచ్చేశారు. రాష్ట్రావతరణప్పుడు ప్రారంభోత్సవానికి నాగార్జునసాగర్ ఆనకట్ట, పంచాయతీరాజ్, శ్రీశైలం, పోచంపాడుల ప్రారంభోత్సవాలకు అనేకసార్లు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు.

1959 సం॥ తిరుపతిలో చేసిన అద్వితీయమైన ప్రసంగంలో "ఆంధ్ర ప్రజలను చూసి నేను గర్విస్తున్నాను" అన్నారు. ఇటీవలే ఒక సందేశంలో వారు "గత పదేళ్ళలోనూ ఆంధ్రప్రదేశ్ అనేక విషయాలలో ముందుకు పోగలిగింది. అంతకన్న ముఖ్యమైన విషయం — భవిష్యత్తులో మరింతగా ముందుకు పోగలదన్న ఆశను కలిగిస్తున్నదిది" అని వ్యక్తంచేశారు. అమరజీవియైన మన మహానాయకుని ఆ ఆశ అడియాస కాదని తెలియజెప్పేందుకు మన రాష్ట్రప్రజ లందరమూ దీక్షతో కృషి చేద్దాం.

జైహింద్
భవదీయుడు

# అవతారపురుషుడు నెహ్రూ

స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అవతారపురుషు డని వెల్లడించే దిగువ సంఘటన కొన్నేళ్ళ క్రితం హిందీ ప్రచారసభవారు ప్రకటించిన ఒక గ్రంథంలో పేర్కొనబడింది;

హృషీకేశ్‌లో శ్రీయుతులు మోతీలాల్ నెహ్రూ, మదనమోహన మాలవ్యా, దీన్ దయాళ్ శాస్త్రి గారలు ఒక సాధువును కలిశారట. శ్రీ మోతీలాల్‌కు పుత్రుడు జన్మించేటట్లు వరమిమ్మని వారు ఆ సాధువును కోరారట. ఆ సాధువు ఒక చెట్టుకొమ్మపై కూర్చొని వున్నాడట. ఆయన కొంతసేపు ఆలోచించి తన జీవిత తపఃఫలితమంతా ధారబోస్తున్నాను, కుమారుడు కలుగుతాడని చెప్పాడట. మర్నాడు తిరిగి మోతీలాల్ ప్రభృతులు ఆ వృక్షంవద్దకు పోయి చూడగా ఆ సాధువు సిద్ధిపొంది వున్నాడట. తరువాత కొన్నాళ్ళకు నెహ్రూ జన్మించారు.

# ఒక యుగం ముగిసింది

డా॥ ఎస్. రాధాకృష్ణ

దుఃఖోద్వేగం పొంగి పొరలుతున్న ఈ క్షణంలో నేను ఆట్టే సేపు మాట్లాడను. స్త్రీలు, పురుషులు, పిల్లలు అందరూ ఆ మహాత్యాగధనుడికి మనస్సుల లోనే కృతజ్ఞతాభావంతో అంజలి ఘటిస్తున్న సమయ మిది.

జవహర్‌లాల్ నెహ్రూ మన తరంలో కెల్లా మహా నాయకులైన వారిలో ఒకరు. మానవ స్వాతంత్ర్యంకోసం అనన్య సామాన్యుడైన ఆ రాజనీతిజ్ఞుని సేవ చిరస్మరణీయమైనది. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన సాటిలేని యోధుడు. నవభారత నిర్మాణంలో ఆయన చేసినకృషి మ రెవ్వరూ చేయలేదు. ఆయన జీవితం, ఆయన దేశ సేవ ప్రభావం మన మనస్సులపైన, సాంఘిక వ్యవస్థపైన, మేధావికాసం పైన ఎంతగానో ఉన్నది. సర్వవ్యాప్తమైన శ్రీ నెహ్రూ నాయకత్వం లేని భారత దేశంలో ఉన్నా మని అనుకోవడం కష్టమే. మన దేశ చరిత్రలో ఒక మహాయుగం పరిసమాప్తమైనది.

ఒక మనిషిగా శ్రీ నెహ్రూలో సునిశిత బుద్ధి, భావ వైదుష్యం ఉన్నతంగా సమ్మిశ్రితమై ఉన్నాయి. బలహీనులపట్ల, నిస్పృహచెందిన నిర్భాగ్యులపట్ల శ్రీ నెహ్రూ సానుభూతి ప్రగాఢం. ఆయన రచయితగా విశిష్టస్థానం సముపార్జించుకున్నారు తనను గురించి నైతికంగా గొప్ప చెప్పుకోవడంగాని తనను తాను కించపరచుకోవడంగాని లేకుండా ఆయన తన జీవితాన్ని గురించి, పోరాటాలను గురించి వ్రాసుకున్న స్వీయచరిత్ర మన కాలంలో వచ్చిన ఉత్తమోత్తమ గ్రంథాలలో ఒకటి.

స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి శ్రీ నెహ్రూ ప్రధానిపదవిని నిర్వహిస్తున్నారు. ఆయన పదవిలో ఉన్న సుదీర్ఘ సంవత్సరాలలో మన దేశాన్ని అభ్యుదయకరమూ, విజ్ఞానదాయకమూ, చైతన్యవంతమూ, మతానికి అతీతమూ అయిన పథంలో పురోగమింపజేయడానికి ప్రయత్నించారు.

లిబరలిజం సిద్ధాంతాలలో ఆయనకు గల విశ్వాసం మన ఆలోచనలకు జీవితాలకు ఒక మార్గం సూచించింది. ఆయన అనుసరించిన వైఖరిలో, ఆయన గైకొన్న చర్యలలో ఆశ్చర్యం కలిగించేవి అసంఖ్యాకం. ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యాలలో ఆయనకు గల విశ్వాసాన్ని మనం దృష్టిలో పెట్టుకుంటే అవన్నీ మనకు సులభగ్రాహ్యాలు. ఈనాటి సాంఘిక, రాజకీయ వ్యవస్థలను ఆయన ఉపయోగించుకుని వాటిలో ఒక నూతనోత్తేజాన్నీ, నవశక్తినీ ఉద్దీపింపజేశారు.

బహిరంగ సభలలో ఆయన చేసిన ప్రసంగాలవల్ల, ఆయన లక్షించిన ఆదర్శాల విలువలు ప్రజలకు గ్రాహ్యము లయ్యేవి. ఉన్నత స్థాయి, మానవ జీవితం కోసం ఆయన పోరాడారు. ఆయన లక్షించిన ఆదర్శాలను ప్రజలకు సుబోధకం జేశారు. గాంభీర్యంతో కూడిన ఆయన ప్రకంపిత కంఠం ఇంక మనకు వినిపించదు. ఆ కంఠంతో ఆయన భారత జాతిలో ఒక తరానికి రూపురేఖలు దిద్దారు. ఉత్తేజితులను చేశారు. తాను ప్రియమైనవిగా భావించుకున్న సిద్ధాంతాలకు ఈ తరాన్ని సన్నిహితం చేశారు. ఆదర్శాలు ఉన్నంత మాత్రాన ప్రయోజనం లేదు. వాటిని సాధించడం కోసం కృషి చెయ్యాలి. పరిస్థితిలో కాలం ముఖ్యమైనది. ఆ కాలాన్ని నెహ్రూ విలువైనదిగా భావించారు. దాక్షిణ్య రహితుడైన కాల పురుషుడికి తిరుగులేదు; ఎదురులేదు. మహానాయకుడైన శ్రీ నెహ్రూ అనంతకాల వాహినిలో కలిసిపోయారు.

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో శాంతి నిర్మాతగా ఆయన ఎన్నో కష్టాలను ఎదుర్కొన వలసి వచ్చింది. దేశ విభజన ఫలితంగా లక్షలాది ప్రజలు తరలిరావడం దారుణమైన హత్యలు, గృహదహనాలు, కల్లోలాలు — ఇవన్నీ రాజకీయ ఆర్థిక క్లిష్ట సమస్యలను తెచ్చాయి. వాటికి పరిష్కారం ఒక పట్టున సాధ్యం కాలేదు. ఇప్పుడు కూడా మన దేశంలో అక్కడక్కడ మత వైషమ్యాలు చెలరేగడం చూస్తున్నాము. గాంధీజీ ప్రారంభించగా, తాను కొనసాగించిన మహత్తర కృషి మంటకలిసి పోతున్నట్లు శ్రీ నెహ్రూకు

తోచి వుండవచ్చు.

ప్రపంచం మిగతాదేశా లన్నింటినుండి ఇండియాను విడదీసి చూడటానికి వీలు లేదన్నది శ్రీ నెహ్రూ విశ్వాసం. స్వాతంత్ర్యం రాక పూర్వం కూడా ఆయన అభిప్రాయం అదే.

ఇండియా స్వాతంత్ర్య సమస్య అంటే దళిత ప్రజల విముక్తి ఉద్యమంలో ఒక భాగంగా శ్రీ నెహ్రూ భావించారు. అందు చేతనే ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికా దేశాలలో స్వాతంత్ర్య ఉద్యమాలను శ్రీ నెహ్రూ బలపరచడం జరుగుతుండేది. జాతి, వర్ణ, దేశ విచక్షణలేకుండా అందరికీ స్వేచ్ఛ అవసరమని శ్రీ నెహ్రూ విశ్వసించారు.

ప్రపంచ శాంతిలో, వసుధైక వ్యవస్థలో ఆయన విశ్వాసం మెండు. ఐక్యరాజ్యసమితి నిబంధనావళిలో శ్రీ నెహ్రూ కంటె మరొకరికి ఎక్కువ విశ్వాసం ఉన్నదని చెప్పలేము. ఈ అణ్వస్త్ర యుగంలో యుద్ధం అంటే నాగరికత అంతా నశిస్తుందని శ్రీ నెహ్రూ విశ్వసించారు. అందువల్లనే రాజనీతిజ్ఞుడైనవాడు యుద్ధాలకు అస్కారంలేని విధంగా సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని, సుహృద్భావ పూరితమైన వాతావరణాన్ని నెలకొల్పాలని ఆయన భావించారు. కొరియా, లావోస్, కాంగో, వియత్నాం మొదలైన అనేక అంతర్జాతీయ సమస్యల విషయంలో శాంతిని ప్రబోధించే వారు. స్నేహాన్ని సూచించే వారు. ఆయన ప్రబోధాలను, సూచనలను సదా గౌరవించడం జరుగుతుండేది.

శ్రీ నెహ్రూ ధైర్యం, విజ్ఞత, వ్యక్తిగత ఔన్నత్యం దేశాన్ని సుసంఘటితంగా ఉంచాయి.

మనం సమైక్యంగా ఉండాలంటే ఆయన అనుసరించిన పద్ధతులను పాటించాలి. ఆయన మానవాళికి వెలుగు చూపిన మహనీయుడు. రాజకీయ ఆర్థిక దాస్యాలనుండి మానవ మేధలను విముక్తం చేసిన మహనీయుడు. ఆయన లక్షించిన ఆదర్శాల కోసం కృషిని కొనసాగించడమే ఆయనకు మనం ఘటించగల ఉత్తమోత్తమ నివాళి.

---

# మంత్రివర్గ తీర్మానం

శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ నిర్యాణానికి సంతాపం ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం జూన్ 5వ తేదీన తీర్మానం చేసింది. ఆంధ్ర రాష్ట్రావతరణ, ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాలలో శ్రీ నెహ్రూ స్వయంగా పాల్గొనడాన్ని, నాగార్జునసాగర్, శ్రీశైలం, పోచంపాడు ప్రాజెక్టుల శంకుస్థాపనలో ఆయన ఆదరపూర్వకంగా పాల్గొనడాన్ని ఈ తీర్మానంలో ఉదహరించారు. హైద్రాబాదు సంస్కృతిపట్ల ఆయనకుగల అవ్యాజమానమైన ప్రేమాభిమానాలను కూడా తీర్మానంలో పేర్కొన్నారు.

# మనతరంలో ఉద్భవించిన గొప్ప వ్యక్తి

అడ్లాయ్ ఇ. స్టీవెన్సన్

ఎవరైనా గొప్ప దేశ నాయకుడు ప్రపంచ రంగస్థలం నుంచి నిష్క్రమించినప్పుడు మానవాళి కార్యకలాపాలలో కొంత స్తబ్ధత ఏర్పడుతుంది. ఆయన నిర్యాణానికి అంతా దురపిల్లుతారు. నిఖిల ప్రపంచం ముక్త కంఠంతో ఆయన దేశానికి సానుతాపం పలుకుతుంది. అయితే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దివంగతులైనప్పుడు ఇంతకంటే బలీయమైన పరిణామం ఏర్పడింది. ఆ పరిణామమేమిటో ఎవరు చెప్పగలరు?. విచారం, ఆందోళన, శ్రద్ధాంజలి — వీటన్నింటినీ మించిన అపూర్వ పరిణామం లక్షలాది ప్రజల మనసులలో కలిగింది. సమస్త మానవాళికీ ఆయన ఆప్తుడు కావడమే దీనికి కారణం

ఈ నాడు మనం గతాన్ని అంటే నిరంతరం సంఘర్షణ పడిన ఆయన జీవితం, ఆయన ధైర్యసాహసాలు, త్యాగాలు, ఆయన అనుభవించిన బాధలు, ఆయన సాధించిన అసంఖ్యాకమైన విజయాలను గురించీ, అలాగే ఆయన ముందున్న అసంపూర్ణమైన కార్యభారాలను గురించీ ఆలోచిస్తాము.

భారతీయుల ఆధ్యాత్మిక నాయకుడు మహాత్మా గాంధీతో కలసి స్వర్గీయ శ్రీ నెహ్రూ ఆధునిక భారతావనిని సృష్టించారు. లక్షలు కోట్లాది ప్రజలలో జాతీయ చైతన్యాన్ని కలిగించారు.

## పరిపూర్ణ సామర్థ్యం

జాతీయ సహజీవనపు ప్రథమ విపత్కర సంవత్సరాలలో సువిశాలమైన తమ దేశానికి పరిపూర్ణమైన సామర్థ్యంతో ఆయన మార్గదర్శకత్వం వహించారు. ఆయన ప్రశాంత వాతావరణం నెలకొన్న పరిస్థితులలో ఆస్తమించలేదు. ఇబ్బందికరమైన పరిస్థితుల మధ్య ఆయన గతించారు.

ప్రధాని నెహ్రూ ప్రభావం ఆయన స్వదేశం హద్దులను దాటి చాలా దూరం వరకు విస్తరిల్లింది. ఆయన ఆసియాకూ అభివృద్ధి చెందుతున్న నూత్న దేశాలకూ నాయకుడు. ఇతర ప్రపంచ దేశాలలో కూడా ఆయన పేరు ఆధ్యాత్మిక ఆశ్యాలకూ, మానవాళి ప్రాపంచిక విశ్వాసాలకూ పర్యాయపదం.

నాకు అనేక సంవత్సరాలుగా మిత్రుడని చెప్పుకోడానికి గర్విస్తున్న వ్యక్తిని గురించి విఘాతం నుంచి తేరుకోకుండా వున్న తరుణంలో మాట్లాడటం సులభం కాదు.

శ్రీ నెహ్రూ క్రితంపర్యాయం ఈ దేశాని (అమెరికా) కి వచ్చినప్పుడు మేము రాజనీతిజ్ఞతను గూర్చి మాట్లాడుకున్నాము. ఆ సందర్భంలో ఆయన నాతో అన్నమాటలు తెలుసుకోడానికి మీకు కూడా ఆసక్తిగా వుంటుందనుకుంటాను.

"మంచి కానీ, చెడు కానీ ఆ సమస్య వున్నది వున్నట్లుగా ఎదురైనట్లయితే ఏదో ఒక మార్గాన్ని అవలంబించడంలో ఇబ్బంది వుండదు. అయితే మంచి చెడ్డలు ఎల్లప్పుడూ వున్నవి వున్నట్లుగా కనిపించవు. తెలుపు, నలుపులో వీటి కలగలుపు ఛాయలు చాలా వుంటాయి."

జీవితంలో తీసుకునే గొప్ప నిర్ణయాలలో చాలావరకు నలుపులో కానీ తెలుపులో కానీ కాక వీటి మిశ్రమ వర్ణాలలో చిత్రితమవుతాయనే విషయం పండిట్ నెహ్రూకు బాగా తెలుసు.

దృఢచిత్తుడైన వివేకి రాజనీతిజ్ఞుడనీ, ఇదే వైఖరి కలిగిన తెలివి హీనుడు ఆపద హేతువు అనీ అంటారు.

ప్రపంచపు ఆశలు దృఢ సంకల్పంగల నాయకులు, సమయోచితంగా వ్యవహరించే నాయకులపై వుంటాయి. దృఢ సంకల్పం, వినయ స్ఫూర్తి — ఈ రెండు సుగుణాలు మూర్తీభవించిన నాయక శిఖామణి స్వర్గీయ శ్రీ నెహ్రూ.

మన తరంలో జన్మించిన మహాపురుషులలో ఆయన ఒకరు. ఆయన దేశమే ఆయన స్మృతి చిహ్నం. మానవాళి శ్రేయస్సు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల స్థాపనకు, ఆయన కన్న కలలే ఆయన స్మృతి చిహ్నాలు.

ఐక్య రాజ్య సమితిలో, ఆయన వాంఛితాలే మనకు వారసత్వంగా, ఆయన కన్న కలలే మన కలలుగా వుండుగాక.

—(ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో చేసిన ప్రకటన).

# శ్రీ నెహ్రూ అపూర్వ సేవకు ప్రశంసలు

భారత రాజకీయ రంగంలో శ్రీ నెహ్రూ అనేక విధాలుగా అపూర్వమైన సేవ చేశారు. ఇతర దేశాలలో జరిగిన వివిధ సంఘటనలను గురించీ, వచ్చిన పరిణామాలను గురించీ భారత ప్రజలకు తెలియచెయ్యడంద్వారా భారత రాజకీయ రంగంలో చైతన్యం కలిగించారు. స్వాతంత్ర్య పోరాటం కొనసాగుతున్న కాలంలోనూ, అటు తర్వాత ఆయన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడూ భారత ప్రజల సమస్యలు ప్రపంచ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల కంటె వేరు కావని వీటిని వేరుచేసి చూడడానికి వీలు కాదనీ పలుమారులు ఉద్ఘాటించారు.

అందువల్లనే ప్రపంచ శాంతిస్థాపన స్వతంత్ర భారతదేశం యొక్క విదేశీ విధానంలో అత్యంత ప్రధాన అంశంగా పరిగణించబడింది. యునైటెడ్ నేషన్సు సంస్థతో ఇండియా అన్ని విధాలా సహకరించింది. కొరియా, ఇండో–చైనా, గాజా, కాంగోలలో శాంతిస్థాపనకై ప్రపంచ సంస్థ అధ్వర్యాన పని చెయ్యడానికి భారత సైనికదళాలు పంపబడ్డాయి. ఈ సుదూర దేశంలో సక్రమంగా విధులు నిర్వహించడం మూలంగా భారత సైనిక దళాలకు గౌరవ ప్రతిష్ఠలు లభించాయి.

నాలుగు సంవత్సరాల క్రితం 1960 మేలో శ్రీ నెహ్రూ గాజాలో సమితి దళాలతో కలిసి పనిచేస్తున్న భారత సైనిక దళాలను సందర్శించడం జరిగింది. ఆయనకు విమానాశ్రయంలో అశేష ప్రజలు స్వాగతం చెప్పారు. శాసనసభా భవనానికి వెళ్లే మార్గం పొడుగుతా దారి కిరు ప్రక్కలా నిలచి లక్షలాది జనం జయ జయ ధ్వానాలతో శ్రీ నెహ్రూకు స్వాగతం పలికారు. ఆయనపట్ల ప్రేమాభిమానాలు తెలియజేస్తూ దారి పొడుగునా జండాలతో తోరణాలు కట్టారు.

విమానాశ్రయంలో సమితి అత్యవసర సైనిక దళాలతో కలిసి పనిచేస్తున్న ఏడు భారతీయ సైనిక దళాలు శ్రీ నెహ్రూకు సైనిక వందనంసమర్పించాయి. అప్పుడు గాజాలో పనిచేస్తున్న 4 వ కుమానోన్ దళం సర్వలాంఛన పూర్వకంగా జరిగిన సైనిక విన్యాసం తిలకించిన అనంతరం భారత సైనిక దళం శ్రీ నెహ్రూ గౌరవార్థం విందు ఏర్పాటు చేసింది. అటు తర్వాత శ్రీ నెహ్రూ కెనడా, ఇండియా సైనిక దళ విభాగాలనూ, సమితి అత్యవసర సైనిక దళాలు నిర్వహిస్తున్న వైద్యాలయాన్నీ, భారత సిగ్నల్స్ దళాన్నీ సందర్శించారు. సమితి అత్యవసర దళాలలోని యుగోస్లావియా సైనికులు శ్రీ నెహ్రూ కన్పించగానే పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో సమితి అత్యవసర సైనిక దళాల కృషిని గురించి ప్రస్తావిస్తూ శ్రీ నెహ్రూ అక్కడ అనేకమంది సైనికులు కన్పిస్తున్నప్పటికీ అక్కడ యుద్ధ వాతావరణం కాక శాంతి పూర్వక వాతావరణం కన్పిస్తున్నదనీ, సంక్షుభిత ప్రపంచంలో యునైటెడ్ నేషన్సు సంస్థ ఒక శాంతి చిహ్నంగా విరాజిల్లగలదని తనకు విశ్వాసం కలిగిందనీ అన్నారు. ప్రపంచంలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను గురించి ప్రస్తావిస్తూ వీటిలో కొన్ని తీవ్రమైన అత్యంత ప్రమాదకరమైన సమస్యలున్నాయనీ, ఇటువంటి తీవ్ర సమస్యలను కూడా యునైటెడ్ కృషి మూలంగా పరిష్కార ప్రయత్నం సాధ్యం అయ్యిందనీ, ముమ్ముందు సమితి కృషి ద్వారా ఈ వివిధ సమస్యలు పరిష్కారమై ప్రపంచంలో ఉద్రిక్తత తగ్గగలదని తాను విశ్వసిస్తున్నాననీ ఆయన అన్నారు.

గాజా ప్రాంతంలో సమితి అత్యవసర సైనిక దళాల అధ్వర్యం క్రింద పని చేస్తున్న వివిధ దేశాల సైనిక దళాల మధ్యా, అధికార వర్గాలు, స్థానిక ప్రజల మధ్యా సహకారం, స్నేహ సౌమనస్యాలు నెలకొని ఉన్నందుకు సంతృప్తి ప్రకటిస్తూ శ్రీ నెహ్రూ సైనిక దళాలు తమ తమ విధులను నిర్వహించడం అవసరమే అయినప్పటికీ అంతకంటె ముఖ్యంగా వాటిని సక్రమమైన పద్ధతితో స్నేహ సహకారాలు సంపాదించాలన్న దృక్పథంలో నిర్వహించడం అవసరమనీ అన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు:

"నా మాతృదేశంనుంచి వచ్చిన దళాల పట్ల నాకు ప్రత్యేక ఆసక్తి ఉండడం సహజం. ఇక్కడ ఉన్న భారత దేశపు సైనికులను అనేక మందిని ఈ వేళ ఉదయం కలుసుకొన్నాను. మరి కొంత మందిని ఈ వేళ మధ్యాహ్నం కలుసుకుంటాను. వారి సత్ప్రవర్తన, సామర్థ్యం దృక్పథం నాకు ఆనంద హేతువులు అయ్యాయి. మరింత సంతోషంగా ఉన్నది. ఇక్కడ పనిచేస్తున్న వివిధ దేశాల సైనిక దళాల మధ్యా, అంతకంటె ముఖ్యంగా ప్రజల మధ్యా శాంతి, సహకారం నెలకొన్నందుకు నాకు ఎంతో సంతోషంగా ఉన్నది. శాంతి స్థాపనకై మీరు నిరంతరంగా కృషి చేసినందుకు మీ అందరికి నా హృదయపూర్వక అభినందనలు." ★

మూడుపూవులారుకాయలుగా భారత ప్రగతికి మూలమైన

# నెహ్రూపాత్ర

భారతదేశ చరిత్రలో దాదాపు అర్థ శతాబ్దిపాటు మహోజ్జ్వల పాత్రను వహించి, నవభారత నిర్మాణానికి బలియమైన పునాదులు వేసి, 'ప్రణాళికా బద్ధమైన ప్రగతి' దేశాన్ని మూడుపూవులారుకాయలుగా రాణింప చేయగలదని నిరూపించిన మహానుభావుడు శ్రీ నెహ్రూ. నెహ్రూ చరిత్రయే దేశ చరిత్రగా. కోటాను కోట్ల భారతీయుల ఆశలు ఆకాంక్షలు ఆదర్శాలకు రూపకల్పన చేసింది కావున. ప్రజా జీవితపు అన్ని రంగాలపై ఆ మహామహుని ముద్ర కలకాలం నిలచిఉండక మానదు. ఆదర్శ నాయకత్వం, నిస్వార్థము, నిర్మాణయుతమైన కార్యాచరణ శక్తి, ప్రజాస్వామ్య పరిరక్షణాభిలాష, పరిపాలనా దక్షత కీ. శే. నెహ్రూ 17 సంవత్సరాల ప్రధానిత్వకాలం దేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖింపదగిన అధ్యాయంగా రాణింపగలదు.

దేశభవిష్యత్తుకు రూపురేఖలు దిద్దడానికి భారత రాజ్యాంగం ప్రాతిపదిక అయితే పంచవర్ష ప్రణాళికలు ప్రగతి సాధనలో మెట్లలాంటివి. మన రాజ్యాంగం ప్రజలకు కొన్ని ప్రాథమిక హక్కులను ప్రసాదించింది సాంఘిక రాజకీయ ఆర్థిక హక్కులతో కూడిన సాంఘిక వ్యవస్థను నెలకొల్పి. ఈ వ్యవస్థారక్షణకు ప్రజా శ్రేయస్సాధనకు ప్రభుత్వం తోడ్పడుతుందని హామీ ఇస్తున్నది. పూర్తి సమాజం శ్రేయస్సాధనకు అనుగుణంగా న్యాయంగా దేశ భౌతిక సంపదల పంపిణీ చేసి, సంపదలు, ఆర్థికబలం ఏ కొంత మంది చేతులలోనో కేంద్రీకృతం కాకుండా, ఉత్పత్తిసాధనాలను కంట్రోలు చేయడానికి ఆర్థిక వ్యవస్థా నిర్వహణను సమర్థంగా కొనసాగించుటకు తగు కట్టుదిట్టాలు చేయబడినాయి.

ఈ ప్రాథమిక స్వత్వాల రక్షణ, లక్ష్యాలసాధన, దేశప్రజల జీవనస్థాయి హెచ్చింపు, ఆర్థిక వనరులను సహజ సంపదలను ప్రజలకు లాభసాటిగా నిర్వహించడం, అందరికీ ఉద్యోగావకాశం కల్పించడం పంచవర్ష ప్రణాళికల లక్ష్యాలుగా గ్రహింపబడినవి. ప్రజాస్వామ్యం, సోషలిజమే మన మూల ధ్యేయాలు కావున మన అభివృద్ధి కృషి ఆసియా ఆఫ్రికా ఖండాలలో క్రొత్తగా స్వాతంత్ర్యాన్ని పొందిన పెక్కు దేశాలను ఆకర్షించి అవి తమ ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకొనడానికి మన ప్రణాళికలు ప్రోత్సాహకములయినవి. ఐతే ప్రణాళికా బద్ధంగా మనం సాగిస్తున్న అభివృద్ధి కృషికి ఒక విశిష్టతా, ప్రత్యేకతా

సి. హెచ్. ఆచార్య

ఉన్నది. మనం మన జాతీయోద్యమం నాటి అంతర దృష్టిని ఆశయాలను చిత్రశుద్ధిని విడనాడలేదు.

ఏ దేశ ప్రభుత్వ లక్ష్యమైనా ప్రజల ప్రాథమిక అవసరాలను ఆహార గృహవసతి సమస్యల పరిష్కరించడం వారి ఆర్థిక పరిస్థితిని బాగుపరచి ఉన్నత జీవిత ప్రమాణాన్ని సాధించడమే. అందుకే ప్రణాళికల ప్రాముఖ్యత పెరిగింది. ఆర్థికాభివృద్ధి కృషితోపాటు సాంఘిక వ్యవస్థలోని లోపాల నిర్మూలన ప్రణాళికా కార్యక్రమాల అమలుకు ప్రజా సహకార సాధనకై సమాజ స్థాయిలో విస్తృత ప్రాతిపదికపై నాయకత్వాన్నీ సృష్టించడం, ప్రజాప్రతినిధులతో కూడుకున్న ప్రజాస్వామిక సంస్థల నెలకొల్పడం జరుగుతున్నది. పంచాయతీ రాజ్ ద్వారా గ్రామీణ ఆర్థిక సాంఘిక సమస్యల పరిష్కారం, భూ సంస్కరణల ద్వారా రైతాంగపు పరిస్థితిని అభివృద్ధి పరచడం, సహకారోద్యమ విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వబడుతున్నది.

మనం ఇప్పుడు మూడవ పంచవర్ష ప్రణాళికను అమలు పరుస్తూ నాల్గవ ప్రణాళికకు స్థూలంగా రూపురేఖల నివ్వడంలో నిమగ్నమై ఉన్నాం. మొదటి పంచవర్ష ప్రణాళిక జాతి భవిష్యత్ జీవితానికి బలియమైన పునాదులను వేసిందన్నమాట. తొలి ప్రణాళిక జవహర్ లాల్ నెహ్రూను సంతృప్తి పరచలేకపోయింది కావుననే సమాజవికాస కార్యక్రమాలకు ఇతోధిక ప్రాధాన్యాన్ని ఇవ్వాలన్నారు. గ్రామసీమల అభివృద్ధికి తగిన శ్రద్ధ వహించివానిని బాగుపరచాలని హెచ్చరించారు. ప్రథమ ప్రణాళికలో శాస్త్రీయ పారిశ్రామిక రంగాల అభివృద్ధిపట్ల గూడా తగినంత శ్రద్ధచూపబడలేదు. దీనిని గమనించి శ్రీ నెహ్రూ ప్రణాళికారచన అంటే కేవలం మన అవసరాల చిట్టాను వ్రాయడం కాదని మన లక్ష్యాలను ప్రాధాన్యక్రమంలో పెట్టడంతో పాటు ప్రాతిపదిక లక్ష్యాలు సాధనోపాయాలను స్పష్టంగా రూపొందించుకోవాలని సూచించారు.

దేశం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రజావసరాల పట్ల సమగ్రమైన అవగాహన, స్పష్టమైన అభిప్రాయాలను కల్గి ఉన్నప్పుడే ఒక క్రమంలో కృషి చేయడానికి వీలుంటుంది. మన లక్ష్యాలు ఊహించుకునే రూపం గడిస్తున్న అనుభవం దృష్ట్యా తగువిధంగా మారినా ఆక్షేపణీయం కాదు. ఈ విధంగా దేశాభివృద్ధి కృషికి స్పష్టమైన లక్ష్యాలు వుండాలనే నెహ్రూ కాంక్షించారు.

కీ. శే. నెహ్రూ తరుచుగా తమ ప్రసంగాలలో దేశం ఎదుర్కొంటున్న

దారిద్ర్యం, అజ్ఞానం, అనారోగ్యాలు ప్రస్తావించి ఈ అనర్థాలపై యుద్ధ ప్రకటన చేయాలని ప్రజలంతా నిర్విరామకృషి ద్వారా భవిష్యత్తును ఉజ్జ్వలం చేసుకోవాలని కోరేవారు. మన దేశంలో నిర్మింపబడే ప్రాజెక్టులు ప్రజాభ్యుదయ సాధనలో దేవతా మందిరాల వంటివని చెప్పేవారు. ఆసియా ఆఫ్రికా ఖండాలలోని బడుగు దేశాల అభివృద్ధి దారిద్ర్యంతో చితికిపోయే ప్రజల సమస్యలు ఆయనను వేధించేవి. వ్యవసాయమే దేశ అభివృద్ధికి ప్రధాన ప్రాతిపదికగా స్వీకరించినా, పరిశ్రమలను విస్తృతంగా నెలకొల్పి అభివృద్ధిని సాధించాలని దేశస్వరూపాన్ని మార్చాలని కోరేవారు. సామ్యవాద సమాజస్థాపనే మన లక్ష్యమని ఉత్పత్తి సాధనాలపై పెత్తనం యాజమాన్యం సమాజానికి ఉండాలని మొత్తం సంఘ ప్రయోజనాలకు ఉపయోగపడాలని నెహ్రూ తమ లక్ష్యాన్ని పలుమారులు వివరించారు. దేశ ప్రగతిలో ప్రయివేటు రంగానికి పబ్లిక్ రంగానికిగూడా అర్హమైన స్థానంఉండాలనిపలు దేశాలలో ప్రయివేటు రంగంలోని పరిశ్రమలే పారిశ్రామికంగా అభివృద్ధిని సాధించాయని ఈ రెండు రంగాలకు అభివృద్ధి సాధనలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని అనేవారు.

పారిశ్రామికాభివృద్ధికై నిరంతరంగా విదేశాలనుండి యంత్రాలను దిగుమతి చేసుకునే స్థితిలో ఏ దేశం ఉండగూడదని, వివిధరకాల పరిశ్రమల అభివృద్ధికై అవసరమగు యంత్రాల ఉత్పత్తి చేసే మూల పరిశ్రమలను ఏర్పరచుకొని పారిశ్రామిక యంత్రాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధతనుసాధించుకోవాలని అనేవారు. వాస్తవంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రాతిపదిక ఇదేను.

స్వయంపోషకమైన ఆర్థిక వ్యవస్థా నిర్మాణానికి శీఘ్రగతిన ఆర్థికాభివృద్ధి సాధనకు తత్క్షణ సాంఘిక సమస్యల పరిష్కారానికి పంచవర్ష ప్రణాళికలు దోహద మివ్వాలనేదే శ్రీ నెహ్రూ ధ్యేయం. ద్వితీయ పంచవర్ష ప్రణాళికను రూపొందించడంలో ఈ భావధోరణులే పనిచేశాయి. సామ్యవాద సమాజ స్థాపన అనేది దీర్ఘకాలిక కార్యక్రమం. ఇందుకే పంచవర్ష ప్రణాళికలు తోడ్పడుతాయి. శాంతియుత పద్ధతులలోనే సంఘపరంగాను పారిశ్రామిక రంగంలోను మార్పులను తేవాలని నెహ్రూ లక్షించారు. మనం అమలు పరచిన కార్యక్రమాల ఫలితాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకొనడం ముఖ్యంగాను గణాంక వివరాలను సేకరించడం అవసర మన్న భావానికి ప్రాధాన్యాన్ని ఇచ్చింది గూడా శ్రీ నెహ్రూయే. జీవితావసర వస్తువుల ఉత్పత్తి వాని వినిమయం, నిరుద్యోగ నిర్మూలన, రవాణాసౌకర్యాలను అభివృద్ధి పరచడం. సంఘసేవ, విద్య, ప్రజారోగ్యం లాంటి వివిధ అంశాలను ప్రణాళికలో అంతర్భాగాలుగా చేర్చడం జరిగింది.

ఉత్పత్తిలోను దేశ పునర్నిర్మాణంలోను ప్రతిఒకరూ భాగస్వామికావాలని నెహ్రూ కాంక్షించారు. సహకార సంస్థలు భారత సేవక సమాజ్ లాంటి స్వచ్ఛంద సేవాసంస్థలకు ప్రాధాన్యాన్ని ఇచ్చారు. నేడు మన దేశంలో ఇనుము, ఉక్కు, ఇంధనతైల ఉత్పత్తి పరిశ్రమల విషయంలో గమనార్హమైన అభివృద్ధిని సాధిస్తున్నది. పబ్లిక్ రంగంలో ఈ కీలక పరిశ్రమలు సంతృప్తి కరమైన అభివృద్ధిని సాధిస్తుండటం సంతృప్తి కరమైన విషయం. రష్యా, అమెరికా లాంటి ప్రపంచ అగ్రదేశాలు మనకు తోడ్పడుతున్నాయి.

ప్రస్తుత మూడవ ప్రణాళికా కాలంలో ఉక్కు బొగ్గు లక్ష్యాల సాధనలో మనం ముందంజ వేస్తున్నాం. భారీ పరిశ్రమలు ప్రాథమిక పరిశ్రమలు తగురీతిగ అభివృద్ధిపరచ బడుతున్నాయి పరిశ్రమల అభివృద్ధికి కీలకమైన విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి గ్రామాల విద్యుదీకరణకు ప్రాధాన్యమివ్వ బడుతున్నది. భవిష్యత్తులో శ్రీ నెహ్రూకు గల విశ్వాసం అపారమైనది – సాంకేతిక విద్య వైజ్ఞానిక, పరిశోధనలకు అధిక ప్రాధాన్య మివ్వాలని వీరు సలహా ఇచ్చారు.

ఆహార స్వయం సమృద్ధితా సాధనకు వ్యవసాయాభివృద్ధి బలపత్తరమైన పారిశ్రామిక ప్రాతిపదిక. స్వయం శక్తితో అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థా నిర్మాణానికి దేశ రాజకీయ వ్యవస్థలోను పరిపాలనా యంత్రాంగంలోను గల లోపాలను సవరించాలని సామర్థ్యాన్ని పెంపొందించాలని శ్రీ నెహ్రూ కోరారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి బాధ్యతా విధానం రాష్ట్ర ప్రభుత్వాలదే. గ్రామీణ ప్రజలకనీస సౌకర్యాల కల్పన, పట్టణాలలో మురికి పేటల నిర్మూలన, శిశు సంక్షేమ కార్యక్రమాలు జవహర్లాల్ నెహ్రూ దృష్టిని అధికంగా ఆకర్షించాయి.

మనదేశంపై చైనా జరిపిన దురాక్రమణ వల్ల దేశరక్షణ సమస్యకు ప్రాధాన్యతవచ్చింది. ప్రణాళికా బద్ధమైన ప్రగతిలో దేశ సరిహద్దుల రక్షణ, సైనిక శక్తి పాటవాన్ని పెంపొందించుకొనడం ముఖ్య భాగమైంది. ఉత్పత్తిని హెచ్చించాలి. అవసరమైన ఖర్చులు తగ్గించాలి. అన్ని విధాల దేశాన్ని పటిష్ఠంచేయడమే, అన్నిరంగాలలో అభివృద్ధిని స్థాపించి జాతిని పైకి తేవడమే మన ప్రణాళికల లక్ష్యం. భారత ప్రజానీకం తమ శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఆత్మవిశ్వాసంతో పురోగమించాలని దేశరక్షణ వ్యవస్థను బలపరచుకోవాలని చైనా దురాక్రమణను అంత మొందించాలని మన ప్రియతమ నాయకుడు సందేశమిచ్చారు. మనదేశం మూడుపూవులారు కాయలుగా రాణించాలంటే నెహ్రూ విధానాలను అనుసరిస్తూ పోవడం, వారు ఏర్పరచిన లక్ష్యాలను సాధించడమే మనలక్ష్యం కావాలి. ఇదే మన పరమావధి అని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ★

# మహాస్మృతి

కొలిపాక మధుసూదనరావు

హోరెత్తెన్ జనసంద్రమొక్కమొగి నెహ్రూబాబునిర్యాణవా
ర్తారింఛోళి, హృదంతరమ్ములను ఘోరంబై ప్రతారింపఁగా
నౌరా! జవ్హారునేత యీ ప్రజకు లేఁడా! కానరాఁడా! ఉష
శ్శ్రీరమ్యంబగు తన్మహాకృతిభువిన్ చెన్నొందదాయింక పై.

ఇది నమ్మ శక్యమౌనే
మదికిని, నౌఁగాక! నిఖిలమానవహృదయా
స్పదుఁ డౌ ప్రియతమభారత
రథసారథి లేమి భరతరాజ్యమ దెట్లో ?

నీవు మహాచరిత్రుఁ డవనిందితకీర్తి వనంతభావనా
శ్రీవిలసన్మహాసుగుణచిత్తపథుండవు నెహ్రుజీ! ప్రపం
చాఖిలదుష్టమార్గము లనంతముగాఁ బెనవైచుకోఁగ, నే
త్రోవల బట్టి పోనగునో! తోఁచదు మా కిఁక భారతప్రభూ!

ఎద యుంది పెన్ భక్తిసదనంబు మా కింకఁ
జాటుకో నగుమహాశయుఁ డెవండు ?
రథ ముంది సుప్రజారాజ్యం బనఁగ దాని
సారథ్య మొనరించుసచివు డెవఁడు ?
పోరు గుంది యిరవుకొని, యిరుపంచలుగఁ గ్రొవ్వి
పుణ్యభారతిఁ గాచుపుత్రుఁ డెవఁడు ?
భయ ముంది యున్మత్తభయదయుద్ధపిశాచి
గమియించ గలజనార్దనుఁ డెవండు ?

రాగవతి గులాబీ కనురాగ మెవఁడు
గూర్చఁ గలఁ డింక ? నల్వదికోట్లభరత
ప్రజలకీర్తికిఁ జల్లలపందిరల్లి
నెహ్రూలు కనుమూయ నేమన నేర్తు మింక ?

దేశముకోసమై బ్రతుకుతేరును నప్పనవెట్టి, బాపు నా
దేశముబాట వెంబడి విధేయుఁడవై పయనించి, దివ్య సం
దేశము లిచ్చి జాతి నిజతేజము దిక్కుల నిండఁ జేసి, నీ
యాశయము ల్మిగిల్చిచనినట్టియశోధన! కొమ్ము మానతుల్.

గిరి యెంత యెత్తో ? హృద్గిరి యంతకును యెత్తు
ఉపమింప నీ రెంట నున్నతుండు
ఝరి వేగ మెంతో ? వాగ్ఝరి యంతకును వేగ
మది చూడ రెంటి కాయనయె మిపులు;
అసి యెంత పదునో ? శాంత్యసి యంతకును పదు
నని యైన రెంట, నాయనదె జయము;
ఉదధిపార మ్మెంతో ? మదిపార మంత యే
యేర్పడ నిందును నితఁడె మిపులు;

పుడమివైశాల్య మెంతో యీపుణ్యమూర్తి
భావవైశాల్య మంతకు పైన నలరె
మించి బ్రతు కెల్ల మాతృభూమిని యజించి
భరతభానంబు నందె జవ్హారుప్రభుండు.

---

స్వాతంత్ర్యం అపాయంలో వున్నది. మన సర్వశక్తులనూ కేంద్రీకరించి దానిని పరిరక్షించుకొందాం.

# శ్రద్ధాంజలి

జె. బాపురెడ్డి

ఓ భారతదేశ మూలస్తంభమా !
ఓ మానవజాతి శాంతిబింబమా !
ఒరిగిపోయితివా, నేడు నేలకు !
తరలిపోయితివా, స్వర్గసీమకు.

జోహారులు, జోహారులు
జోహారులు నెహ్రూజీ !
సర్వమానవుల శ్రద్ధాం
జలు లివిగో పండిత్‌జీ ;

విశ్వ జనాశాజ్యోతిని
విషవాయువు లారిపెనా !
పుడమితల్లి గుండెలోన
బడబాగ్నులు విఁపెనా !

గగనలక్ష్మి, దుఃఖమేఘ
ముఁదేలి విలాపించెను,
మానవతయు, సమానతయు
దీనముగా శోకించెను.

నీకు ప్రియమ్మౌ హిమగిరి
నీరాజన మిడెను నీకు
నేడు, నదీనదములు క
న్నీటి గంగలై పోయెను –

ప్రతిదేశ పతాకలు, క్షో
భాభరమున వంగిపోయె,
ప్రతి జీవనరంగము, పే
ద తనమ్మున క్రుంగిపోయె.

బాల బాలికలు, "చాచా
జీ" లేడని విలపించిరి
పూలు, గులాబీలు, నీ వ
రాల నవ్వులేక వాడె.

నీవులేని భారతమ్ము
నేవిధి ఊహించగలము ?
నీవులేని ఢిల్లీపురి
తావిలేని పూవయ్యెను –

నీ జీవిత లీలామృత
నీరధి వర్ణింప తరమె,
నీ వియోగబాధ, నుడుల
లో వివరించుట వశమా !

ఎవ రోదార్చెదరు మమ్మ
ఈశ్వర నిభుడౌ, ప్రియతమ
నాయకరత్నమును కోలు
పోయిన ఈ దౌర్భాగ్యుల –

కనులకు కన్పడవుగాని
కలవు నీవు జగమెల్లడ,
పలుక లేవుగాని ప్రగతి
పథము చూపుచుందు వెపుడు.

ఆ సంద్రములందు, నదుల
యందెగాదు నీ మహాత్మ
కలిసిపోయె, దేశ కాల
ముల జీవిత నదుల కూడ.

నీ ఆశలు, ఆశయములు
నెరవేర్ప ప్రయత్నింతుము,
స్వాతంత్ర్య సమైక్యతలను
శాంతిని పరిరక్షింతుము –

# శాంతిమార్గం

ఏలం రాజేశం

మనలో మన కెందుకోయి
మనస్పర్ధ లెందుకోయి. ॥మన॥
ఘనమైన పౌరుషాలు
పునః పునః పోట్లాటలు. ॥మన॥
తర తరాల కుటిలాలు
మరవురాని తటపటాలు
మనలోన తలవకోయి
మసలిపోవు టెందుకోయి ॥మన॥
మనసులోనే ఈ జగత్తు
మనతోనే ఈ జగత్తు
మానవు లేకీభవించి
ఘనమగు శక్తిని పెంచి;
జగత్తునే సృష్టిద్దాం ॥మన॥
పగవారే లేనట్టి
బుద్ధుని హితబోధల్లో
గాంధి అడుగుజాడల్లో
చాచాజీ పథకాల్లో
శాంతిమార్గమే కలదోయి. ॥మన॥

# చితి విభూతి

కే. వేం. నృ. అప్పారావు

భూదేవి వణకె నెహ్రూదేహమందలి
తనభాగమును గల్పుకొనెడివేళ
సప్తసముద్రముల్ ఉప్తొన్నతోర్మ్మలై
కలగెఁ దదుదకాంశ కలియువేళ
కరసహస్రము జాపి కౌఁగిలించెను రవి
తనయందు తత్తేజ మెనయువేళ
శ్వసనుఁడు తనలోనిజవమెల్లఁ గోల్పోయె
జవహరశ్వాస తగ్గలియువేళ
ఆకసము స్తబ్ధభావంబు నందియుండె
నతనిలోనిచిదాకాశ మలమువేళ
పంచభూతంబు లీరీతి పంచుకొనియె
విశ్వమానవుదేహంబు శాశ్వతముగ !

# చాచా నెహ్రూ అమర్ హై!

కుమారి ఎమ్. కవిత

బాలల బాంధవుడు 'చాచానెహ్రూ' ఇక మనకు లేరన్న ఘోరవార్త మన దేశంలోని పసిహృదయాల నెంతగానో కలచివేసింది. నిండుజాబిల్లిని పోలిన ఆ ముఖవర్చస్సు నవ నవోన్మేషణమైన ఆ ఉత్తేజం, మూర్తీభవించిన ఉత్సాహం మనకు శాశ్వతంగా కన్పించదు. నెహ్రూజీ అస్వస్థత చెందినప్పుడల్లా బాలల లేత హృదయాలు ఎంతగానో ఆందోళనచెందేవి. ఆ వేదనతో కొట్టుకొనేవి; ఆయన సత్వర స్వాస్థ్యానికై అంతా ప్రార్థనలు సల్పేవారు.

నెహ్రూ ఏ దేశమేగినా ఎందు కాలిడినా, ఆయనకు అత్యంత ప్రీతిపాత్రమైనవారు బాలలే. బాలలతో గడిపే ప్రతిక్షణం ఆయన నిర్విరామ జీవితానికి తృప్తినీ, ఆనందాన్నీ ఇచ్చేది. అలాగే చాచానెహ్రూజీను గూర్చిన గాథలు, మధుర స్మృతులు బాలలకు సదా స్మరణీయాలు.

పిల్లలుఆడుకుంటారు, చదువుకుంటారు, అప్పుడప్పుడూ కొట్లాడుకుంటారు, వెంటనే కలుసుకొంటారు. వారి మనసుల్లోద్వేషాలు, కావేషాలు గూడుకట్టుకొని నిలువవు. అందుకే బాలలంటే నెహ్రూజీకు అపరిమితమైనప్రేమ. బాలలతో కలసి గడుపటం వారి చిన్నిమనసుల్లో బయలుదేరే సందేహాలు తీర్చడం, వారిలో తానుగూడా ఒకడై ఆడుకొనడం చాచానెహ్రూజీకు ఇష్టం. పిల్లలతో కలసి ఉన్నప్పుడు తన వయస్సును నెహ్రూజీ మర్చిపోయేవారట. పెద్దవాళ్ళు సదా పిల్లలనొక కట్టుబాట్లలో ఉంచ ప్రయత్నిస్తారు. అది చేయాలి, ఇది చేయకూడదు అని సలహాలిస్తూ వుంటారు. తమస్వేచ్ఛను ఆ విధంగా కుదింపచేయడం బాలలకు ఇష్టముండదు. ఎంత పెద్దనాయకులైనా ఒకప్పుడు బాలలేకదా? నెహ్రూ ఈ విషయాన్ని బాగా ఎరుగుదురు. కాన బాలలను క్రమంగా మంచిమాటల్తో సరిదిద్దాలనేవారు. సహజంగా పెద్దవాళ్ళు తమకు అన్నీ తెలుసూ, తామే చాల తెలివిగల వాళ్ళమని అనుకుంటారు. కానీ వాస్తవములో పెద్దవాళ్ళంతా తెలివికలవాళ్ళు బుద్ధిమంతులు కారుగా? అసలుకు తెలివికలవాళ్ళు, బుద్ధిమంతులు, తాము గొప్పవాళ్ళమని ఎప్పుడూ చెప్పుకోరు. "అల్పు డెప్పుడు పల్కు నాడంబరముగాను సజ్జనుండు పల్కు చల్లగాను" అనేది అంతా ఎరిగినదే.

పిల్లలకు సాహసగాథలు, విచిత్రకథలు, సుందరమైన ప్రపంచపు వింతలు, నీలి నీలి ఆకాశంలో సుదూరంగా మెరిసే చుక్కలు, వింతైనపూలు, అడవిలో ఆకాశమెత్తు పెరిగేచెట్లు, మంచుకొండలు, పర్వతాల ఉన్నత శిఖరాలు ఇష్టం. మనకే రెక్కలు ఉండి ఏ పర్వతాల ఉన్నత శిఖరాలపై వాలితేనో; ఓ చిలుకమాదిరిగావెళ్ళి ఉవ్వెత్తుగా ఉండే ఏ చెట్టుపండునో కోసుకొని తెచ్చుకుంటేనో ఎంతో బాగుంటుందని రకరకాల ఊహలు అల్లుకుంటారు. ఇట్టి ఆసక్తికరమైన విషయాలకన్నా నెహ్రూజీ చాచాను చూడటం, అతని చిరునవ్వును అందుకోవడమంటే ఎంతో ఇష్టం. నెహ్రూగూడా పిల్లల పట్ల ఎంతో ఆప్యాయతను, ప్రేమను, ప్రదర్శించి బాలల మిత్రు డయ్యేవాడు.

పెద్దలకువలె బాలలకు మతం, కులం, జాతి, భాష, ప్రాంతం అనే పట్టింపులు, భేదభావాలు ఉండవు. బీద, ధనికు డనే భేదభావం వారిహృదయాలలో చొరదు. నెహ్రూగూడా అంతే. వారి హృదయమూ పసిహృదయం; సంకుచితత్వాలు, మనిషిని మనిషిని చీలదీసే అడ్డుగోడలు పడగొట్టాలనే తత్వం వారిది.

అది యునైటెడ్ స్టేట్స్ కానివ్వండి, లేక ఏసోవియట్ యూనియనో, ఇంగ్లాండో, కెనడాయో కానివ్వండి. అక్కడి బాలలు కూడా నెహ్రూను తమవారుగానే భావించేవారు. ఏ దేశం పిల్లలైనా ఏ ఏనుగునో పంపమని కోరితే పంపేవారు.

నెహ్రూజీకు ఆడంబరాలు, రాజభోగాలు అంటే ఇష్టముండకపోయేది. పిల్లలవలెనే పెక్కువిషయాలలో ఉండేవారు. బాలల్ని ప్రేమించేవారు. పొలంలో పనిచేసేసేరైతైనా,

## కన్నీటి పాట

విన్నావ ఈ పాట  
విన్నావ పాపా  
కన్నీటి ఊటనా  
కవిత ఈ పూట!  
భావి భారత ఖండ  
బంగారు కొండ  
బాబు నెహ్రూ నేత  
లేడు మనకండ!  
అపరంజి వన్నెగల  
అందగాడమ్మా  
అతడు పసిపాపల  
ఆట బొమ్మమ్మా!  
చిన్ని పిల్లల గన్న  
శివమెత్తు నెహ్రూ  
నీ బుగ్గపై చిటికె  
మొగ్గయే నెహ్రూ!  
మానవత్వములోని  
మంచియే నెహ్రూ  
పంచ శీలకు నేటి  
ప్రాణమే నెహ్రూ!  
అమ్మ నాన్నల నడుగ  
వమ్మ చాలా ఉంది  
నెహ్రూ జీవిత గాథ  
నీతి గల ఉద్బోధ!

కె. సభా

## బాలల విచారం

ఫ్యాక్టరీలో పనిచేసే కూలీఅయినా, బీదవాడైనా, ధనికుడైనా అందర్నీ సాదరంగా ఆహ్వానించేవారు. ఒక్క భారతదేశవాసులే కాక ప్రపంచ ప్రజలందరికీ నెహ్రూ ప్రేమ పాత్రుడు. అందరి అభిమానాన్ని చూరగొన్నవారు కనుకనే భారతదేశంతోపాటు యావత్ ప్రపంచం నెహ్రూ మృతికి విలపించింది; మనవిషాదంలో పాలుపంచుకుంది.

ఒకరిని ద్వేషించడం, అసూయ పడటమంటే నెహ్రూకు సుతరామూ గిట్టదు. పరస్పరం పోట్లాడుకొనడం అంటే ద్వేషించేవారు. ఐక్యంగా పరస్పరం సహకరించుకొని మాతృదేశానికి సేవ చేయాలని చెప్పేవారు. భవిష్యత్తును ఉజ్వలంగా నిర్మించుకోమనేవారు. ఎంతటి గడ్డు సమస్యనైనా, ధైర్యంగా, విశ్వాసంతో, పట్టుదలతో ఎదుర్కొనమనేవారు. సంతోషంగా నవ్వుతూ జీవితాన్ని అనుభవించాలనీ కష్టాలు పరిష్కరించుకొంటూ ముందుకు పోవాలనీ చెప్పేవారు.

నలుబదికోట్ల భారతీయ ప్రజా హృదయాలను ఏలిన మకుటంలేని చక్రవర్తి నెహ్రూ. ఒకప్పుడు నెహ్రూ ఒక సమావేశంలో ప్రసంగించి వెళ్ళుతున్నప్పుడు కొందరు గ్రామస్థులు వంగి పాదాభివందనం చేయబోయారట. నెహ్రూ వాళ్ళను వారించి దండం పెట్టడం బానిస మనస్తత్వానికి చిహ్నమనీ, అట్టి అలవాటును మానుకోవాలనీ, మనమంతా సమానులం, ఒకళ్ళు గొప్ప ఒకళ్ళు తక్కువ అనిలేదు; అంతా తలెత్తుకుని సమానంగా తిరగాలని చెప్పారట. ప్రజాభిప్రాయాన్ని గ్రహించి ఎప్పటికప్పుడు వారిని మంచి మార్గాలలో మలచేవారు. ప్రజల మనస్సుల్లో నిలచేవారు. తమ్ము తామే మరచి తమని చూడ వచ్చిన వారితో హోలీ ఆడుకున్న రోజులు, పిల్లల మేలాలలో "బొమ్మరైళ్ళ"లో ఎక్కి వారితోపాటు తిరిగిన రోజులు, నాగజాతివారితో కలసినృత్యం చేసిన రోజులు ఇక తిరిగి మనకు లభించవు.

# బాలల నెహ్రూ ఇంక లేడు

డి. చిన్నికృష్ణ

బాలల నెహ్రూ మనకులేడు - అయ్యో
బాలమిత్రుడస్తమించినాడు ॥బాలల॥

1. నేటి పాపలే రేపటి నేతలనే సినాదం
బాలలలో భగవంతుడు వెలయుననే వాదం
రెండింటిని ఆదరించు ఆశాజ్యోతి ఇంక లేడు — అయ్యో
బాలల నెహ్రూ మనకు లేడు ॥

2. చాచా మాటంటే మన నాయకులకు తలపుష్పం
స్వార్థపరుల పాటంటే చాచాకు తెగ కోపం
బాలల మాటెప్పటికీ క్రిందపడిన సహించడు
బాలల గౌరవము భూమి నలుచెరుగుల చాటినట్టి
చాచా నెహ్రూ మనకులేడు - అయ్యో ॥బాలల॥

3. హెచ్చు తగ్గులను మచ్చుకు ఎరుగడు మన చాచా
అంటురోగమే ఎరుగని ఆత్మయోగి మన చాచా
"ఆరామ్" కోరుకొనుట వట్టి హరామనే చాచా
అన్ని హంగులను గల్గిన ఆటబొమ్మ మన చాచా
ఆ రాముని ధామమును చేరుకొనిన చాచా ॥బాలల॥

4. చాచా చెప్పినమాటల తూచాతప్పము మనము
నడుము వంచువాని గడప వేచియుండు సిరియెపుడూ
వంచన తల పెట్టువాని కంచము ఖాళీ యెపుడూ
మనప్రగతిని కాంచి చాచాఆత్మశాంతి నొందవలె — అయ్యో॥బాలల॥

---

మన దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చి నవభారతాన్ని నిర్మించి, పెక్కు డాములను, దేశానికి వలసిన కీలక పరిశ్రమలను ఏర్పరచి, ఒక జాతిగా మనలను రూపొందించినదీ, మన దేశానికి నిర్దిష్టమైన విదేశాంగ విధానాన్ని ఇచ్చి ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని వలస దేశాల స్వాతంత్ర్య ఉద్యమాలకు ప్రోత్సాహాన్ని, బలాన్ని ఇచ్చి, ప్రపంచ శాంతికి అహరహం కృషి చేసినట్టి నెహ్రూ లేని లోటు మన దేశ చరిత్రలో ఇప్పట్లో పూడదు. రోడ్డుకు ఇరువైపులా తల్లులు నిలబడి తమ పిల్లలకు 'అదిగో ఆ కారులో వెళ్లేది చాచా నెహ్రూయే, అటు' చూడు అని చూపించే రోజులు ఇక మనకు లభించవు. మన ఆశలకు, ఆశయాలకు మూలం చాచా నెహ్రూ. ఆయన భౌతికంగా మనలను వీడినప్పటికీ, ఆతని ఆత్మ మనలను సదా వెన్నంటి ఉంటుంది. పిన్నల్ని, పెద్దల్ని మంచి మనసులు కలవారిగా చేస్తుంది. నెహ్రూ తన జీవితకాలంలో ఏయే విధానాలను లక్ష్యాలను రూపొందించారో, ఏ ఆదర్శాలకు కృషి చేసారో, మన దేశం ఏ విధంగా ఉండాలని బంగారు కలలు కన్నారో, ఆట్టి స్వప్నాలకు రూపురేఖలు దిద్దవలసిన భారం మనందరిపై ఉన్నది. నేటి బాలలే భవిష్యత్ పౌరులు. నెహ్రూ విధానాలను, ఆదర్శాలను, మన జీవిత లక్ష్యాలుగా తీసుకొని జీవనరంగంలో ఉన్నత శిఖరాలను అందుకున్నప్పుడే నెహ్రూ ఆత్మకు శాంతి, సంతృప్తి లభిస్తుంది. మన దేశంలో రాముని, కృష్ణుని పేరు చిరస్థాయిగా నిలచినట్లే చాచా నెహ్రూ పేరు గూడా శాశ్వతంగా నిలుస్తుంది. ★

# నిజంగానే నీ విక లేవా ? ★ బోయి భీమన్న

లోకం నీ విక లేవని ఏడుస్తోంది !
నిజంగానే నీ విక లేవా ? జవహర్ !
లోకం పిచ్చి దనుకునేవాణ్ని ఇంతవరకు
ఇది గ్రుడ్డిది కూడానా ? ప్రభూ !
గంగా యమునా సరస్వతులు, తల్లులు
కడుపుకోతతో విడుస్తున్న మౌనదుఃఖాశ్రువులు
గౌతమీ కృష్ణా తుంగభద్రల చెక్కిళ్ళపై జారి,
కావేరి పాలిండ్లపై పడి ఇంకిపోతున్నై !
ఆసేతుహిమాచలమూ, సమస్త ప్రపంచమూ
ఒక తల్లై ఏడుస్తోంది నీకోసం !
శాంతిసమరంలో ఏకైక ధర్మవీరుణ్ని
పోగొట్టుకొని, సుభద్రలా ఏడుస్తోంది !
భారతభాగ్యవిధాత, వేదవేదాంగాల తాత,
జగన్మాతకే పిత, జగదీశ్వరుడికే కన్యాదాత,
హిమవంతుడే కాశ్మీరి సానుహస్తాలతో
గ్రుడ్లనీరు గ్రుక్కుకొంటూవుంటే !
ప్రతి నదీ, ప్రతి ప్రాజెక్టూ, ప్రతి క్షేత్రమూ,
ప్రతి విజ్ఞానకేంద్రమూ, కర్మాగారమూ,
మొత్తం ప్రపంచ మానవ హృదయంలోనే
నీవు వెలిగించిన ప్రతి దీపమూ ఏడుస్తోంది !
చుక్కలతో, చంద్రుడితో, మబ్బులతో, సూర్యుడితో
నీ విమానం కనపడక ఆకాశం ఏడుస్తోంది !
ఐదు ఖండాలై, ఏడు సముద్రాలై ఏడుస్తోంది
భూదేవి - నీ చరణ స్పర్శా సుఖం ఇక లేదని !
ఇంకా దాస్యంలో, దారిద్ర్యంలో, చీకటిలో, మురికిలో
మూలుగుతున్న ప్రతి గుండే కుమిలిపోతోంది !
లోకం సమస్తం నీ విక లేవని ఏడుస్తోంది !
నిజంగానే నీ విక లేవా ? జవహర్ !

ఇందిర ఏడుస్తోంది !
దేశప్రపంచ విశ్వప్రగతిందిరే ఏడుస్తోంది !
క్షితికే సుందర శివంకరమూర్తివి నీవు,
ఎలా వున్నావో చితాభస్మమూర్తివై !

౨

వాడిపోయినదొక్క సంపంగిపూవు !
కన్నుమూసిన దొక్క చెంగల్వపూవు !
రాలిపోయిన దొక్క గులాబిపూవు !
నరుని బ్రతు కితోధికానంద మిడగ !
క్రుంకిపోవుచు దినమణి కొంప కొక్క
దీపమునుమాత్ర మిచ్చి అదృశ్యు డగును !
జీవమణి వీవు, వెలిగించినావు లక్ష
వత్తియల జ్యోతులను ప్రతివాని గుండె !
ఏడి ? మా భవ్యజవహరు డేడి ? యంచు
ఏడ్చుచున్నది లోక మిదేమి వింత ?
భవ్యు డెపుడైన దివ్యుడై పరగకున్నె ?
కొంప మునిగెనె క్షణ మగుపించకున్న ?
ఆరిపోనివి, క్రుంకని వయ్యె ! నీవు
దేశమున పెట్టిపోయిన దివ్వె లెల్ల !
వాడిపోనివి, రాలని వయ్యె ! నీవు
లోకమున చల్లిపోయిన రోజపూలు !

౩

లోకమిట దుఃఖబాష్పముల్ తుడుచుకొనగ,
నాక మట నించుచున్న దానంద సుధలు !
ఇట నొక గులాబి రాలిపోయినదిగాక,
అట నొక గులాబి వికసించె అమృతదీప్తి !
అమరారామ రమామనోహరముగా
ఆనంద పద్మాకరాం
కమునై స్వీయసఖాన నాటిన లతన్
గాంధీమహాత్ముండు కాం
చె మహోర్ధమ్ములు పల్లవింప ! వికసిం
చెన్ దానిలో స్వర్గమే !
సుమనోమోదము లుర్వికిన్ గురిసె తత్
సుస్వాగత శ్రీలతో !
ఎందుండో వచ్చి, ఇట మా
అందరి డెందముల గలసియాడుచు, ఇపు డీ
వెం దేగగలవు ? జవహర్ !
డెందములే మావి ? హిమగిరేంద్రములు సుమీ !
ఇలకు వచ్చిపోయి రెందరో మహితులు ;
లేడు నిన్ను బోలువాడు జగతి !
నరుడె దేవు డన్న - నరలోక క్షేమమ్మె
స్వర్గ మన్న - వాడు జవహరుండె !
ప్రాజెక్టు ప్రతిది గుడియే,
ఈ జనముల నెల్ల వాడు నీశ్వరుడె సుమీ !
భోజన మిడు ప్రాజెక్టుల
పూజింపడు ! అన్న నిన్ను పూజింతు నెదన్ ! ★

# నెహ్రూ : భారతదేశం

అశోక్ మెహతా



స్వర్గీయ శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ వ్యక్తిత్వఛాయల క్రింద పెరిగినవారు తమ భావాలను శ్రీ నెహ్రూ తీర్చిదిద్దారని తెలుసుకోడం బహుకష్టం. కొద్ది మంది మాత్రమే ఆ విషయాన్ని గుర్తించగలుగుతారు

ఆయన ప్రేమాభిమానాలను విశేషంగా చూరగొన్నవారు భారతదేశంలోనూ, విదేశాలలోనూ లక్షలాది మంది వున్నారు. శ్రీ నెహ్రూ సిద్ధాంతాలనూ, విధానాలనూ వారు అత్యంత శ్రద్ధాభక్తులతో అక్షరాలా పాటిస్తున్నారు. ఆయన యుగపురుషుడుగా ఒక తరంవారిని తీర్చిదిద్దారు. మనలో బహు అరుదుగా వుండే మూడు విశిష్ట లక్షణాలు శ్రీ నెహ్రూలో వున్నాయి. మొదటిది ఆయన జ్ఞాన తృష్ణ. జ్ఞాన సముపార్జనలో ఆయన ఏ ఒక్క అంశాన్నీ విడిచిపెట్టక పరిపూర్ణత్వాన్ని సాధించాడనే చెప్పాలి. ప్రజా వ్యవహారాలలో ఆయన ఎంతటి శ్రద్ధాశక్తులు కనబరిచాడో, జ్ఞాన సముపార్జనపట్ల అంతటి శ్రద్ధ వహించాడు. చరిత్రకారుని కుండవలసిన అంతర్‌దృష్టి ఆయనకు అపారంగా వుంది. చరిత్రలోని ప్రతి సంఘటననూ తరిచి చూచి మానవ ప్రయోజనాలకు అనుగుణమైన విధానాలను రూపొందించారు. ప్రతిదానియొక్క పూర్వాపరాలనూ, భవిష్యత్ చరిత్రను వూహించగల దూరదృష్టి కలవాడు కాబట్టి హీనజాతివాడు సైతం గౌరవ మర్యాదలతో జీవించడానికి తగిన వాతావరణాన్ని కల్పించారు. ప్రతి వ్యక్తిలోనూ నిబిడీకృతమైన శక్తి సామర్థ్యాలను వెలికితెచ్చి, అతని వ్యక్తిత్వం పూర్తిగా వికసింప చేయడమే శ్రీ నెహ్రూ యొక్క ప్రాథమిక లక్ష్యం.

మానవుడు గౌరవంగా బ్రతికేట్లు చూడాలన్న ప్రగాఢ వాంఛ ఆయనలో వున్నందునే, ఆయన స్వాతంత్ర్య యోధుడు, ప్రజాస్వామ్యవాది, సోషలిస్టు అయినాడు. మానవజాతి సముద్ధరణకు దాస్య శృంఖలాలను ముందు విచ్ఛిన్నం చేయాలి.

నాయకత్వం సహజంగా ఆయన్నే వరించింది. ఆయన్ను చూచినవారూ, తెలిసినవారూ ఆయన్ను పొగడకుండా వుండలేరు. మానవులలో భావోద్దీపన కలిగించి వారి హృదయాలూ, మనస్సులూ పూర్తిగా వికసించడానికి ఆయన సహాయపడ్డారు. ప్రజలపై ఆయనకు గల ప్రభావం, పలుకుబడి అమోఘమూ, అపూర్వమూ అయినట్టివి. ఆ హోదాను ఆయన తన జీవితకాలం చెక్కుచెదరకుండా నిలుపుకోగలిగాడు, ప్రాచీన ప్రవక్తలవలె మానవ జాతిని సముద్ధరించి వారి ప్రేమ విశ్వాసాలను శ్రీ నెహ్రూ చూరగొన్నారు గాని రాజకీయ నాయకుల వలె ప్రజలను కించపరిచి దౌర్జన్య పద్ధతుల ద్వారాలో బరుచుకొన్న వారుకారు. శ్రీ నెహ్రూ సహేతుకతను మనఃపూర్వకంగా అంగీకరించడం ఆయన గొప్పతనాలలో ఒకటి. వలస రాజ్య నిర్మూలనకు ప్రజలలో భావోద్వేగాన్ని ఆయన పెంపొందించక తప్పనందున, ఆ స్థితిలోకూడ వారు క్రమశిక్షణను విడనాడకుండా చేయగలిగిన మహానాయకుడు శ్రీ నెహ్రూ. జాతీయోద్యమాన్ని నిరాఘాటంగా కొనసాగించి, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అంతర్జాతీయ బాధ్యతలకు కట్టుబడి వ్యవహరించగలిగిన ప్రజ్ఞాశాలి. జాతి, మతం, భాషలపట్ల ప్రజల పరిమిత విశ్వాసాలను ఆయన గుర్తించడమేగాక గౌరవించారుకూడ. ప్రజల కోర్కెలను పూర్తిగా అర్థం చేసుకున్న నాయకుడు. సంకుచిత భావాలనూ స్వల్ప కోర్కెలను ఆయన నిరసించేవారు.

ప్రాథమిక సూత్రాలను పాటించి తీరాలన్న మతం శ్రీ నెహ్రూది. దేశాలన్నీ ఒకదానిమీద ఒకటి ఆధారపడివున్నాయన్న సూత్రాల్ని గుర్తించికూడ, భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోరుతూ కాంగ్రెసు సంస్థ తీర్మానం చేయాలని ఆయన పట్టుపట్టారు. ఆదరణలో అనేక సర్దుబాట్లకు అంగీకరించినా, ప్రజాస్వామిక సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పాలని కాంగ్రెసు చేత

తీర్మానం చేయించారు. పర్వత శిఖరంమీద దివ్వె చీకట్లో వెడుతున్న యాత్రికులకు బాట చూపినట్లు, లక్ష్యాలను సుస్పష్టంగా నిర్వచించి ప్రజలకు మార్గం చూపా లని ఆయన పట్టుబట్టారు.

ప్రజల సృజనాత్మక శక్తిలో ఆయనకు అచంచల విశ్వాస ముంది. ప్రజలవద్ద నుంచి ఉత్తేజం పొందే ప్రతిభావంతుడైన కళాకారు డాయన. శ్రీ నెహ్రూ విజయం సాధించిన విప్లవవాది, స్వాతంత్ర్యోద్యమ నాయకాగ్రణి, సామ్యవాది, పాతకాలపు వ్యవస్థ అంటే తూష్ణీభావంగల ఆధునికవాది. మానవుడు పరిపూర్ణత సాధించకుండా వ్యవస్థ అడ్డుపడుతుం దని ఆయన ఉద్దేశం ప్రజలలో తాదాత్మ్యంపొంది, వారి కష్టసుఖాలలో పాలు పంచుకొంటూ, వారితో సన్నిహిత్యాన్ని నెరపుకొన్న విశిష్ట వ్యక్తి ఆయన.

విధానాలను రూపొందించుకునేందుకు ఆయనకు పార్లమెంటు వేదికగా పనిచేసింది. పార్లమెంటరీ చర్యలతోనే సంతృప్తి పడక, అనేక బహిరంగ సభలలో ప్రసంగించి, ప్రజలకుకూడా తన భావనాధోరణులను ఎరుకపరిచేవాడు. ఈ సంపన్న కులీనుడు, పండితుడు, రాజనీతిజ్ఞుడు, ఎట్టి అరమరికలూ లేకుండా, తన మనసులో తిరుగాడుతున్న భావాలను ఏ ఒక్కరితోనూ చెప్పుకొని ఊరట చెందక, అశేష ప్రజానీకానికే విన్నవించి, నిర్ణయాలు చేసేవాడు. ప్రజలకూ, ఆయనకూ మధ్య అవినాభావ సంబంధమే వుంది.

పార్లమెంటు ప్రాధాన్యంపట్లఆయనకెంత విశ్వాస ముందో, ప్రణాళికా సంఘంపట్ల ఆయన కంత ఆదరాభిమానాలున్నాయి. జాతి ఆశలకూ, ఆశయాలకూ ప్రణాళికా సంఘం రూప కల్పన చేయాలని ఆయన కోరిక. లక్ష్యాలెంత పవిత్రమైనవో, సాధనాలు కూడా అంతే పవిత్రంగావుండా లని జాతిపిత మహాత్మాగాంధీ వలెనే పండిట్ నెహ్రూకూడా నమ్మారు.

ఆయనదర్శనం అందరికీ లభించేది. ఆయన సన్నిధిలో ఉద్రిక్తలు మబ్బు విడిపోయినట్లు తొలగిపోయేవి. ఆయన ముందు ఎంతటివారైనా తమ స్వార్థాన్ని వదులుకుని అధిక సంఖ్యాకుల ప్రయోజనం కోసం పాటు పడతా మని శపథం చేసేవారు. ఆయన ప్రభావం అట్టిది. ఆయనతో సంభాషణ అంత మహిమాన్విత మైనట్టిది. వివిధ వర్గాలమధ్య సామరస్యాన్ని సాధించడంలో ఆయనకు ఆయనే సాటి. మత సంబంధ మైన అసహనతలపైనా లేదా అంతర్జాతీయ అసహనతలపయినా అందుకే ఆయన నిరంతర పోరాటం సాగించారు.

భారతదేశపు ఘనమైన వారసత్వ సంపద వల్ల ఆయనకు అపూర్వ గౌరవభావమే వుంది. కాని, త్రుప్పుపట్టిన సంప్రదాయాలను పట్టుకు వ్రేలాడడం, ఆయనకు సుతరామూ యిష్టంలేదు. అందుకే ఆయన యువతా చిహ్నంగా సుమారు డబ్బైఏళ్ళ పాటు నిలబడగలిగారు.

విజ్ఞానశాస్త్రిలంటే శ్రీ నెహ్రూకు ఎంతో అభిమానం. సమాజంపై శాస్త్ర సాంకేతిక విజ్ఞానాలు ప్రసరిస్తున్న విప్లవాత్మకమైన ప్రభావాన్ని ఆయన హర్షించరు. దేశంలో దారిద్ర్యాన్నీ క్షుద్బాధనూ రూపుమాపడానికి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాలను వినియోగింప చేయ ప్రయత్నించారు. దేశంలో నిర్మించబడుతున్న పెద్ద పెద్ద బహుళార్థ సాధక ప్రాజెక్టులు నవయాత్రి కేంద్రాలు కావాలని ఆయన అభిలషించారు. రాజకీయ స్వాతంత్ర్యం, దేశంలో సాంఘిక, ఆర్థిక రంగాలలో అభ్యున్నతికి దోహదం చేయా లనీ, అప్పుడే రాజకీయస్వాతంత్ర్యం సార్థక మవుతుం దనీ ఆయన మనసారా నమ్మారు. ఇందుకు దేశంలో సహజ సంపదలను పూర్తిగా వినియోగింపచేయడానికికృషి చేశారు. ఈ కృషిలో కూడా ఆయన లక్ష్య సాధనకు ఉత్తమ మార్గాలనే అనుసరించారు.

ఆయనకు తన సహచరులలో ఉన్న విశ్వాసం ఆయన ప్రజాస్వామ్య వాదిగా మరింతగా స్థిరపడడానికి దోహదం కల్పించింది. తన ప్రజలకు పూర్వంకంటె ఎక్కువగా విస్తృతాధికారాలు ఇవ్వడానికీ మరికొన్ని బాధ్యతలు వప్పగించడానికీ ఆయన ఏనాడూ వెనకాడలేదు. అందుకు కారణం ఆయనకు ప్రజలు ఆయా అధికారాలను సద్వినియోగం చెయ్యగల రనీ, ఆయా బాధ్యతలను సరిగా నిర్వర్తించగల రనీ పూర్తి విశ్వాసం ఉండడమే. అటువంటి విశ్వాసం కారణంగానే ఆయనకు మతాతీత మైన దృక్పథం ఏర్పడింది. కేవలం మతం మాత్రమే జీవిత దృక్పథాలనూ, సంస్కృతినీ తీర్చి దిద్దితే ఇక మానవుని విశ్వాసం విశ్వకవి టాగూరు ఉద్ఘాటించిన "మానవుని ధర్మం'' గతి ఏమికాను? అంతర్జాతీయ సామరస్యంతో కూడిన వాతావరణంలో మాత్రమే జాతీయతా భావం వర్థిల్లుతుంది. అదే విధంగా పరస్పర సహన గౌరవాభిమాన ప్రపూర్ణమైన వాతావరణంలో, మత విశ్వాసం వర్థిల్లుతుంది. ప్రజలలో మూఢ విశ్వాసాలు తొలగించి, వారికి వ్యక్తిత్వం కల్పించి సామ్యవాదం బోధించి, సంఘ జీవులుగా రూపొందించి వారి శక్తి సామర్థ్యాలను సహకార మార్గంలోకి మళ్ళించడానికి శ్రీ నెహ్రూ తీవ్రకృషి చేశారు. తాను నమ్మిన సామ్యవాదానికి ఇవి మూల సిద్ధాంతా లని శ్రీ నెహ్రూ విశ్వాసం.

శ్రీ నెహ్రూ ప్రజ లందరినీ గాఢంగా అభిమానించారు. కేవలం పిల్లలనుమాత్రమే కాదు, తన దగ్గరకు వచ్చిన ప్రతివ్యక్తినీ ఆయన అభిమానించారు. ఆయనలోని ఆ ప్రేమాభిమానాల మూలంగానే ఆయన ప్రజలచే ఆకర్షింపబడ్డారు. అతి సాధారణమైన వీణకూడా కళా తపస్వియైన వైణికుని చేతిలో గంధర్వగానమే వినిపిస్తుంది. అదే విధంగా అతి సామాన్యుడు కూడా శ్రీ నెహ్రూ ప్రభావంతో పడినప్పుడు ఉత్తమ మానవుడుగా రూపొందడం, అతనిలో అంకుర మాత్రంగా ఉన్న సృజనాత్మక శక్తికి ఒకమహోదాత్తత అబ్బడం జరిగింది. ★



# వ్యక్తిగా నెహ్రూ

శ్రీ ప్రకాశ్

పెద్ద పెద్ద అంగలతో అతి గంభీరంగా ఈ భూమిపై నడచిన జవహర్లాల్ నెహ్రూ యిక లేరు.

మే 27 వ తేదీ బుధవారం మధ్యాహ్నం వారు దివంగతు లయ్యారు. పుట్టిన ప్రతి మనిషికీ చావు అనివార్యం. అదృష్టవశాత్తూ ఎక్కువ సేపు బాధపడకుండానే ఆయన అంతిమ క్షణాల్లో అతిప్రశాంతంగా కన్ను మూశారు.

దెహరాడూన్‌లో కొద్దిరోజులపాటు విశ్రాంతి తీసుకున్న అనంతరం గతరోజే వారు రాజధానికి తిరిగివచ్చారు. అంతకు పూర్వం కొద్దిరోజులక్రిందటే రానుయిప్పట్లో కన్నుమూసే భయం లేదని పత్రికా విలేఖరుల సమావేశంలో తెలియజేశారు. కాని వారు వెళ్ళిపోయారు. తానొక్కడూ మోస్తున్న బాధ్యతల బరువును దిగవిడిచి, దిగ్భ్రమ స్థితిలో మనల్ని పడవైచి, విచారసాగరంలో ముంచెత్తి వెళ్ళిపోయారు.

సమకాలీన ప్రపంచ ప్రముఖులలో జవహర్లాల్ నెహ్రూ ఒకరు అనడంలో ఏ మాత్రం సందేహంలేదు. ఒక గొప్పవాని గొప్పతనం అతని వ్యక్తిత్వానిది. అతని యీ గొప్పతనం అతనికి యీ విశేషణా లను ప్రసాదించిన గొప్ప విషయాలని కని పిస్తుంది. కాని యీ గొప్పగుణాలను అనుక రించడానికి వీలుండదు. అభినందించడానికీ, అభిమానించడానికీ మాత్రమే వీలవుతాయి. సామాన్యునికి అందుబాటులో వుండవు. కాని గొప్పవాడుకూడా మనిషే. తనవారితోపాటు సామాన్యుని మంచిచెడ్డల్లో అతను కూడా పాలు పంచుకుంటాడు. అదే అతన్ని మాన వున్ని చేస్తుంది. గొప్పవారి జీవితంలోని యివతలి భాగాన్నే చూడడం మంచిది. ఆ జీవితంలో నేర్చుకోవలసినది ఎంతో వుంటుంది. మనం మన జీవితాల్లో అనుస రించడానికి వీలయినది ఆ జీవితంలో వున్నప్పుడూ, ఏదో ఒక విషయాన్ని బోధిం చేదిగా వున్నప్పుడూ మాత్రమే గొప్పవారి జీవితాలకు విలువ వుంటుంది.

## పనిలో శ్రద్ధ

అందుచేత మనిషిగా నెహ్రూనుగురించి ఆయన మరణించే రోజున, ఆయన అగ్నిశిఖల్ని కురిపించడం మాను కున్నప్పుడు — ఆయన ఎలావుండేవారో ఒకసారి పరిశీలిద్దాం. లేకపోతే యీ విషాద వాతావరణం తొలగిపోగానే, ప్రపంచం తన యాంత్రికమైన విశ్రాంతిలేని కార్యకలాపాల మధ్య ఆలోచించడానికి తగిన వ్యవధి నీ, సమయాన్నీ యివ్వకుండా తన కబంధ హస్తాల్లో మనల్ని బంధించేసి ఆయన నుండి మరపు తెరలలోకి మనల్ని లాక్కు పోవచ్చు. ఒక మానవుడిగా నెహ్రూ క్రమబద్ధమైన వ్యక్తి. ఆయనను నిత్యజీవితంలో బద్ధకం లేనివాడు. సర్వసాధారణంగా మనం బద్ధకస్తులం. ఇవ్వాళ చేయవలసిన పనిని రేపటికి వాయిదా వేస్తుంటాం. ఆయ నకు కూడా మనందరిలాగే రోజుకు 24 గంటలే. కాని మనం రెండు రోజుల్లో చేసే పని ఆయన ఆ 24 గంటల్లోనే చేస్తాడు. ఆయన సమర్థుడు, క్రమబద్ధుడు; కాలాన్ని వృథాచేయని వ్యక్తి. ఓపికతోనూ, సామర్థ్యంతోనూ పనిచేసే వ్యక్తి. పనిచేయకుండా విశ్రాంతి కోరడం అంటే ఆయనకు చిరాకు. ఒకసారి పూర్తిగా మనసును లగ్నంచేసి చేయడంలో ఆయన తనకు తానే సాటి. ఆయనచేసేపని సామాన్యునికి అతీతమైన పని కాదు. మనం ఇప్పటికీ ఆయనను ఒకమనిషిగా చూడాలి. నెహ్రూ ఎలా విస్తృతమైన ప్రపంచ రంగంపై చేయగలుగుతున్నారో తమ పరిమితమైన జీవన పరిధుల్లో యితరులు అదే పని చేయ గలరు. తన అనుచరులకు ఆయన ఈ పాఠాన్ని వదిలి వెళ్ళారు. ఆ పాఠాన్ని వారు మనసుకు పట్టించుకోగలిగితే ఎంతో మేలు జరగగలదు.

మనిషిగా — ఆయన ఎంతో బాధ్యతగల వ్యక్తి. చెప్పినదానిని ఆయన ఎప్పుడూ ఆచరణలో పెట్టకుండా వుండలేదు — ఈ విషయంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. చేపట్టినపని చిన్నదయినా, పెద్ద దయినా ఆయన బహుశ్రద్ధతో చేసేవారు. తన మాటమీద నిలబడగలవ్యక్తి. వాగ్దానాలను

అతితేలిగ్గా మనం చేసేస్తాం. అంతే తేలిగ్గా వాటిని మర్చిపోతాం కూడా. మనం చెప్పే విషయంపై అంత తీక్షణంగా మనం ఆలోచించం. ఒక పుస్తకాన్ని ఇస్తాననిగాని, ఒక ఉత్తరాన్ని వ్రాస్తాననిగాని, సమావేశానికి వస్తాననిగాని, ఏకాలం పంపిస్తాననిగాని ఆయన అన్నారంటే తు. చ. తప్పకుండా అలా ఆచరించాల్సిందే. ఆయనకు మరొకరెవరన్నా వచ్చి ఆ విషయాన్ని ఒక సారి జ్ఞాపకం చేయాల్సిన పనిలేదు. ఒక వేళ ఆయన మర్చిపోతారని భయపడవలసినదీ అంతకన్నా లేదు. క్రమబద్ధమైన సమాజంలో నివసించే వారికి తమ బాధ్యతలను గుర్తించడం అతిముఖ్యం. ప్రతిఒక్కరూ ప్రతి అవతలి వ్యక్తినీ నమ్మగలిగితే సమాజం సక్రమంగా నడవడానికి వీలుంటుంది. ప్రతిఒక్కరూ ఏదోవిధంగా పరొకరిపై ఆధారపడక తప్పదు. అలాంటి పరిస్థితుల్లో ఏ వ్యక్తి అయినా మార్గంనుండి పక్కకు తొలిగినా అంటే జీవితమే పతనమైపోతుంది. ఈ నాడు మన సాంఘిక, ఆర్థిక జీవితాలలో మనం చూస్తున్న సందిగ్ధతకు కారణం బాధ్యతాభావం మనలో లేకపోవడమే. అదే మనల్ని ఒకరికొకరం నమ్మలేని వారంగా, ఒకరిమీద ఒకరు ఆధారపడలేని వారంగా చేస్తోంది. నెహ్రూ జీవన విధానంలోంచి గుణపాఠం నేర్చుకుందాం. ఆయన వలెనే మనంకూడా మన అనుచరులతో, మిత్రులతో కలిసి చేస్తున్న పనుల్లో ఎదుటివారికి నమ్మకాన్ని కలిగించి, బాధ్యతతో వ్యవహరిద్దాం.

## భయ మెరుగని వ్యక్తి

నిజంగా ఆయన భయ మంటే ఏమిటో ఎరుగనివ్యక్తి. శారీరకంగాగాని, సాంఘికంగాగాని, నైతికంగాగాని భయమంటే ఏమిటో ఆయనకు తెలియదు. తను ఒప్పు అనుకున్న పనిని ఆయన చేసితీరుతాడు. ఇతరులు ఏమంటారో అన్న భయంలేదు.

ఎవరికీ జడవని, దేనికీ వెరవని ధైర్య స్థైర్యాలను వ్యక్తంచేసే సంఘటనలు ఆయన జీవితంలో కోకొల్లలుగా వున్నాయి. భయంతో మనకు ఉగ్గుపాలు పట్టారు. ప్రతి విషయానికి మనం భయపడుతూవుంటాం. అందుకే మనం అభివృద్ధి చెందలేక పోతున్నాం. ఒక మనిషిగా — సామాన్యుని వలెకాదు. అయినా ఒక మనిషిగా — శ్రమ, బాధ్యత, ధైర్యం అనేగుణాలు ఆయనలో వున్నాయి. ప్రతిమనిషీ — తా నెంత అణకువగలవాడైనా — ఆయనలోని యీ సగుణాలను మనసున నాటించుకోవాలి.

జవహర్లాల్ నెహ్రూలో ఆయనను మానవునిగా ప్రేమించజేసే యితర సుగుణాలుకూడా వున్నాయి. పిల్లవాని మనస్తత్వం ఆయనది. నడక నేర్చిన పసివాడు పిచ్చిగా తిరిగినట్టు ఆయనకూడా గదిలో తిరుగుతాడు, అందుకే పిల్లలకు ఆయ నంటే యిష్టం. సంస్కారవతులైన యువతుల మధ్య గడపడానికి ఆయన ఉత్సుకత చూపిస్తారు. వారిమధ్య ఆయన ఎప్పుడూ ఇంట్లో ఉన్నట్టే ప్రవర్తిస్తారు. ఏ విందులోనైనా ఆయన అనుకోకుండానే సౌందర్యవతులైన యువతులు కూర్చున్నవైపు ఆకర్షింపబడుతూవుంటారు. వారిమధ్య ఆయనకు ఆనందం. ఆయనతో కూర్చోవడం వారికి ఆనందం.

విశ్వాసపాత్రుడయిన స్నేహితుడు ఆయన. స్నేహితుడు ఎంత దూరంలో, మూలలో వున్నా ఆయన అభిమానానికీ, మంచితనానికీ దూరమయిపోడు. ఉదార స్వభావంగలవాడు. ఆయన ధార్మికబుద్ధిగల వారు. ఆయన మంచితనంవల్ల లాభం పొందినవారు యీనాడు వేలకొలదిసంఖ్యలో వుంటారు. తాను చేసిన మంచి పనులను గురించి ఎప్పుడూ ఆయన ఎవరితోనూ చెప్పుకోలేదు. సర్వసాధారణంగా ఉన్నత స్థానంలోకి వచ్చాక తమ సహోద్యోగులను మరచిపోవడం చాలామంది స్వభావం. కాని నెహ్రూ ఎప్పుడూ తన సహోద్యోగులను మరువలేదు.

మే మిద్దరమూ వ్యక్తిగత జీవితాల్లో స్నేహితులుగాను, పబ్లిక్ జీవితాల్లో సహోద్యోగులుగానూ ఉంటూ వచ్చిన 47 సంవత్సరాల కాలంలోనూ నేను ఆయనలోని యీ గుణాన్ని — ముఖ్యంగా ఆయన స్వభావంలోని మానవ నైజాన్నిచూసే అవకాశం నాకు ఎంతో లభించింది. ఆఖరిసారి ఆయన డెహరాడూన్‌కు వచ్చేసరికి నేనుకూడా 1962 లో మహారాష్ట్ర గవర్నరు పదవినుంచి రిటైరయ్యి డెహరాడూన్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నాను. ఆయన అక్కడకు రావడానికి ముందురోజునే నాకు ఒక ఉత్తరం వ్రాశారు. తాను అక్కడకు వస్తున్నాననీ, రాగానే కలుసుకుంటాననీ వ్రాశారు. వచ్చినవెంటనే అలాగే చేశారు. ఆయన విడిదచేసిన యింటినుంచి ఎనిమిదిమైళ్ళ దూరంలోవున్న నాకు శ్రేష్ఠమైన, ఏరితెచ్చిన పళ్ళు కొన్ని నాకు బహుమతిగా వచ్చాయి. నేను యింట్లో వున్నానోలేదో తెలియ జెప్పమని అత్యంతంగా టెలిఫోను పిలుపులు ఒక దానిమీద ఒకటి వచ్చాయి. ఆ వెంటనే నేను వుంటోన్న యింటిచుట్టూ పోలీసుల హడావిడి కనిపించింది. మధ్యాహ్నం ప్రధాని వస్తున్నారని తెలుసుకున్నాను.

## అత్యంత ఆదరణ

పబ్లిక్ రోడ్డు గేటు వద్ద ఆయన్ని పలకరించగానే ఆయన నన్ను కౌగలించుకొని,

గట్టిగా చాలాసేపు హృదయానికి అదుము కొన్నారు. అలాంటి సుదీర్ఘమైన ఆలింగనాన్ని ఆయన, నాకు తెలిసినంతమట్టుకు, ఎప్పుడూ చెయ్యలేదు. ఎందుకలా చేశారో నేను ఆశ్చర్యపోయాను. నేను ఆయనకన్న తొమ్మిది నెలలు మాత్రమే చిన్న. డెబ్భయ్యో పడిలో ఆ రకమైన మనస్తత్వం ఎవరికీ వుండదు. కనీసం నలుగురిలోను అలా బైటికి అభిమానాన్ని చూపించడం ఎవరూ యిష్టపడరు. ఆయన శాశ్వతంగా వీడ్కోలు తీసుకుంటున్నారని నా కెలా అర్థమవుతుంది? మృత్యురక్కసి మూలల్లో పొంచివున్న దని నే నెలా ఊహించగలను? ఇదంతా మే 24 న జరిగింది. ఆయన మే 26 న డెహరాడూన్ నుంచి వెళ్ళిపోయారు. 27 న ఆయన యిక లేరు. నిజంగా నే నంటే ఆయనకు చాలా అభిమానం. ప్రపంచంలోని ప్రతి ఒక్కరిమీదా కూడా అంతే. భావ ప్రకటనల్లో ఆయన మామూలు మనిషే. ఆయన సహోద్యోగులు ఆయనను ఒక గొప్ప నాయకునిగా కన్న, ఒకవ్యక్తిగానే ఆయనను జ్ఞాపకం పెట్టుకుంటారు, అర్థం చేసుకుంటారు.

ఆయనలో ఒక లోపంవుంది. ఇదికూడా ఆయన మామూలు మనిషే అని వ్యక్తం చేస్తుంది. ఇతరులకు పనులు అప్పగించడం, తోటి సహోద్యోగుల మధ్య చేయవలసిన పనుల్ని విభాగించడం అంతగా ఆయనకు చేతకాదు. చిన్న పనైనా, పెద్ద పనైనా తాను చేపట్టిన ప్రతి పనినీ క్షుణ్ణంగా పరిశీలించి, యితరుల సహాయసహకారాలనుతీసుకోకుండానే పూర్తి చేసేవారు. తాను చేసినట్టుగా చెయ్యమని ఎప్పుడూ యితరులకు బోధించలేదు. గొప్ప ఆత్మవిశ్వాసం గల వ్యక్తి. తానొక్కడే ఏమయినా చేయగలనన్న భావం వున్న వ్యక్తి. తాను ఆ పని చేయక పోతే ఏ పొరపాటన్నా జరిగి పోతుందేమోనన్న ఆతృతగల మనిషి. నమ్మదగిన వ్యక్తి ఆయన. తన స్వంత పనిలో మాత్రం ఆయన ఎవరినీ నమ్మనట్టే అనిపిస్తారు. నమ్మకం అంటే సరిగ్గా తాను అనుకున్నట్టే అవతలి వ్యక్తి ఆ పనిని చెయ్యాలి అని.

ఆయన యీ బలంతో, బలహీనతలతో, సుగుణాలతో, లోపాలతో పరిపూర్ణకాలం ఉజ్జ్వలంగా జీవించి వెళ్ళిపోయారు. తనను వివిధ స్థాయిల్లో అనుసరించడానికి ప్రజలకు ఆయన ఒక ఉదాహరణను దిగవిడిచి వెళ్ళారు. ఆయన గొప్పతనాలు, లోపాలు మనిషికి సంబంధించినవి. అందుకే ఆయన ముఖ్యంగా ఒక వ్యక్తి.

# శ్రీ నెహ్రూతో విమాన దళాధికారి అనుభవాలు


ప్రధాని మంత్రి శ్రీ నెహ్రూను అనేక సందర్భాలలో విమానంమీద తీసుకువెళ్ళిన స్క్వాడ్రన్ లీడర్ ఛద్దా ఒకటివల ఆకాశవాణి ప్రసారంచేసిన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, శ్రీ నెహ్రూ దేనికీ ఆలస్యంగా వచ్చేవారుకారని చెప్పారు. "ఆఖరి అరునెలలలో ఆయన ఆరోగ్యం సరిగా లేకపోయినప్పటికి శ్రీ నెహ్రూ ఎప్పుడూ సకాలానికి వచ్చేవారు'' అని ఆయన అన్నాడు.

''చివరిసారి మేము ఆయనను మే 26 న సనవానుంచి పాలంకు విమానంమీద తీసుకువెళ్ళాము. అప్పుడు కూడా ఆయన సకాలానికి వచ్చారు'', అని స్క్వాడ్రన్ లీడర్ ఛద్దా అన్నాడు. వైమానిక సిబ్బంది సంక్షేమం విషయంలో శ్రీ నెహ్రూ నుంచి ఉత్సాహం చూపేవారు అని స్క్వాడ్రన్ లీడర్ పేర్కొనాడు.

రెండవ విషయ మేమిటంటే, ప్రకృతిశోభను చూచినపుడు శ్రీ నెహ్రూలో ఉత్సాహం పొంగిపొరలిపోయేదని స్క్వాడ్రన్ లీడర్ అన్నారు. విమానంలో కొండలమీద ప్రయాణం చేస్తున్నపుడు ఆ ఎత్తయిన కొండలను చూచి ఆయన ఆనందభరితులయ్యేవారు. వరదలు వచ్చినపుడు ఆ వరద ప్రాంతాలపైన విమానంలో వెళుతూండగా ఆ భీభత్సానికి ఆయన హృదయం తపించేది. వైమానికుడి దృష్టిలో చెప్పాలంటే శ్రీ నెహ్రూ గొప్ప మానసిక స్థిమితంగల ప్రయాణీకుడని చెప్పాలి. వాతావరణం ప్రతికూలంగావున్న స్థితిలో ఎక్కువ దూరం ప్రయాణంచేసిన తర్వాతగూడా శ్రీ నెహ్రూ విమానంనుంచి నవ్వుతూ దిగేవారు. విమానం నడిపేవారిలో శ్రీ నెహ్రూ పూర్తి నమ్మకాన్ని ప్రదర్శించేవారు. అది వైమానికులలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించేది. ఈ విధంగా శ్రీ నెహ్రూతో కలిసివుండే మహద్భాగ్యం తమకు కలిగిందనీ, అది తమకు ప్రత్యేక గౌరవాన్ని సమకూరుస్తుందని తనూ, తన సహచరులూ భావిస్తున్నట్టుగా స్క్వాడ్రన్ లీడర్ చెప్పారు. తమకు అటువంటి భావం కలగడానికి కారణం శ్రీ నెహ్రూ ప్రధానమంత్రి కావడంకాదని, ఆయన చూపేదయ, దాతృత్వం, మానవ కారుణ్యం సాటిలేనిది కావడమే అందుకు కారణమని ఆయన అన్నాడు.

# సంస్కృతి అంటే ఏమిటి?

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ



నేనిక్కడికి చాలా ఆనందంతో వచ్చాను.

భారతీయ సాంస్కృతిక సంబంధాలకు కేవలం సమీప ప్రాక్పశ్చిమ దేశాలతో మాత్రమే కాకుండా యావత్ ప్రపంచంతో కూడా పెంపొందించుకోవాలనే ఆకాంక్ష నాకు మొదటినుంచీ వుంది. అదే నేనిక్కడికి రావడంలోని ఆనందానికీ కారణం.

సాంస్కృతిక సంబంధాలను పెట్టుకోవడం ఆనందదాయకమూ, ఉత్తమ విధానమూ అనే భావనతో కాకుండా, ఈసంబంధాల విషయంలో మనం ఏదో ఒకటి చేయకపోతే పరిస్థితి ఎంతగానో దిగజారిపోగలదనే ఆందోళన నాకుంది. ఇప్పుడు రూపందాలుస్తున్న సాంస్కృతిక సంబంధాల భారతీయ పరిషత్తు మన ప్రజలకూ, ప్రపంచంలో వున్న తదితర దేశాల ప్రజలకూ మధ్య సౌహార్ద సంబంధాలను ఇతోధికంగా పెంపొందటానికి తోడ్పడగలదని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.

ప్రపంచ సమస్యలు గుర్తుకొచ్చేటప్పటికల్లా నా మనస్సు పూర్తిగా కల్లోల పూరితమై వుంటుంది. ఆ కల్లోలమేమిటో కూడా నేను నిక్కచ్చిగా చెప్పగలను. మన చుట్టూవున్న ప్రపంచంలో ఏమి జరుగుతున్నదో వాటినుంచే సహజంగా అన్నివిధాలైన సమస్యలూ ఉద్భవిస్తూ వుంటాయి. దేశాలూ, జాతులూ, వ్యక్తులూ ఒకరినొకరు అర్థంచేసుకోవాలంటూ మాట్లాడతారు. అంటే ప్రజలు ఒకరినొకరు అర్థంచేసుకోటానికి తప్పక ప్రయత్నించాలనే విషయమూ, ఒకరినుంచి ఒకరు నేర్చుకోవలసింది ఎంతైనా వుందనే విషయమూ సుస్పష్టమేకదా. అయితే వాస్తవానికి జరుగుతున్న దేమిటి? చరిత్ర పుటలను తిరగవేస్తున్నప్పుడు లేదా ప్రస్తుత సమకాలీన పరిస్థితులను పరిశీలించి చూస్తున్నపుడు ఒక్కొక్కసారి నాకు కన్పించే దేమిటంటే — ఒకరినొకరు బాగా ఎరిగివున్నవాళ్ళే తమలో తాము తరచు కలహించుకోవడం. పరస్పరం ఎంత ఎక్కువ తెలిసి వుంటే అంత ఎక్కువగా పోట్లాడుకోవడం. యూరపులో కానివ్వండి, ఆసియాలో కానివ్వండి — ఇరుగు పొరుగు దేశాలే పరస్పరం బాగా ఎరిగివున్న దేశాలే ఎక్కువగా కీచులాడు కోవడం మనం చూస్తున్నాం. దీనివల్ల పరస్పరావగాహన ఒక్కటే ఎక్కువ సహకారానికీ, స్నేహానికీ సరిపోదని నాకనిపిస్తున్నది. నా ఈ భావం కొత్తదేమీ కాదు. సుదీర్ఘమైన మానవ చరిత్ర నిండా ఇది కనిపిస్తూనే వుంది. అసలు వ్యక్తిగతంగానే మానవ జాతుల్లో ఏదైనా లోపం వున్నదా? లేక ఈ సమస్య పరిష్కార పద్ధతిలోనే ఏదైనా లోపం వున్నదా? లేక మరొకటి ఏదో తన పనిని నిర్వహించవలసిన విధంగా నిర్వహించ లేదా? మనం సాంస్కృతిక సంబంధాల గురించి మాట్లాడేటప్పుడు వెంటనే నా మనస్సులో ఒక ప్రశ్న ఉదయిస్తుంది. అదేమిటంటే ప్రజలు ఇంతగా చెప్పుకొంటున్న 'సంస్కృతి' అంటే ఏమిటా అని. నా చిన్నపుడు జర్మన్ సంస్కృతి గురించీ, విజయ యాత్రలు మొదలైన వాటిద్వారా దానిని వ్యాపింపచేయటానికి జర్మనులు చేసిన ప్రయత్నాల గురించీ నేను చాలా చదివిన జ్ఞాపకం. ఈ సంస్కృతిని వ్యాపింప చేయటానికి ఒక ప్రక్కా, దానిని ప్రతిఘటించటానికి మరొక ప్రక్కా పెద్ద యుద్ధంకూడా. కాగా ప్రతి దేశానికీ ప్రతి వ్యక్తికీ సంస్కృతి పట్ల ఎవరి భావాలు వారికి వున్నా యన్నమాట. అందువల్ల సాంస్కృతిక సంబంధాల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు, సిద్ధాంత రీత్యా అది పైకి బాగానే కన్పించినప్పటికీ వాస్తవంగా వారివారి ప్రత్యేక భావాలకు సంఘర్షణ ఏర్పడడం స్నేహానికి దారితీయడం పోయి మరింత వైషమ్యం పెరగడం జరుగుతోంది; కనుకనే 'సంస్కృతి' అంటే ఏమిటి అన్నది చాలా ప్రధానమైన ప్రశ్నగా రూపొందింది. దీనికి మాత్రం నేను ఇపుడు జవాబు ఇవ్వలేను. 'సంస్కృతి' అంటే ఏమిటో ఇంత వరకూ సరియైన నిర్వచనం

నాకే లభ్యం కాలేదు; కాబట్టి నేను ప్రస్తుతం దేనికీ సమాధానం ఇచ్చే స్థితిలో లేను.

## వికాసం

వేలాది తరాలుగా ప్రతిజాతి, ప్రతినాగరికతా తన సొంత సంస్కృతిని వికసింప చేసుకుంటూ రావడ మనేది సర్వజనవిదిత విశేషం. ఆయా నాగరికతలకు మూలభూతమైన చైతన్య శక్తితో అత్యంత సన్నిహితంగా రూపం ధరించి ఆయా జాతులు తమ తమ పథాలతో పురోగమించడం కూడా అంద రెరిగిందే. ఒక భావంతో తదితర భావాలు ఘర్షణ పడడం, ఆయాభావాల మధ్య చర్యాఅంతర్చర్యలు ఏర్పడడం కూడా చూస్తూనే వున్నాం. సంపూర్ణంగా ఆద్యమూ స్వచ్ఛమూ అయినట్టి, మరే సంస్కృతీ ప్రభావానికీ లోను కానట్టి, మూలసంస్కృతి బహుశా ప్రపంచంలో ఇప్పు డెక్కడా లేదనే నా వుద్దేశం. ఏవ్యక్తి అయినా తాను నూటికి నూరుపాళ్ళ ఫలానా జాతికే చెంది వున్నా నని ఏ విధంగా చెప్పలేడో, అదే విధంగా సంస్కృతి విషయంలో కూడా చెప్పజాలడు. వేలాది సంవత్సరాల మానవ ప్రగతి చరిత్రలో ఎన్నో మార్పులు వచ్చినవి; ఎన్నో సమ్మిశ్రణలు జరిగినవి.

ఏదైనా ఒకజాతికి సంబంధించిన సంస్కృతి విషయంలో దాని మూల చైతన్యశక్తి పైకి ప్రస్ఫుటంగా కన్పిస్తూ వున్నా, అది ఏదోకొంత మిశ్రీకరణం పొంది వుండక తప్పదు. ఈ విధమైన మిశ్రీకరణ శాంతియుతంగాను సాఫీగాను కొనసాగినంతకాలం ఏలాంటి ప్రమాదమూ వుండబోదు. కాని ఈ విధానం తరచు ఘర్షణలకు దారితీస్తూ వుంటుంది. కొన్ని సందర్భాలలో పరాయి, విదేశీ ప్రవాహం తమ సంస్కృతిని ముంచివేస్తున్నట్లుగా కొందరు ప్రజలు గగ్గోలుపడడం, భయాందోళనలు చెందడం మనం చూస్తూనే వున్నాం. సహజంగా అలాంటపుడు అట్టి ప్రజలు ఏదో ఒక మూలకు ముడుచుక పోవడం జరుగుతుంది. అంతటితో వారికి బయటి ప్రపంచంలో సంబంధం తెగిపోయి వారియోచనలకు, భావాలకు బాహ్య ప్రసరణం కరువైపోతుంది. ఇది నిజంగా చాలా దారుణస్థితే అని చెప్పాల్సి వుంటుంది. ఏ రంగంలోనైనా సరే, ముఖ్యంగా సాంస్కృతిక రంగంలో కేవల జడస్థితికంటే మరొక దుర్భర దుస్థితి వుండబోదు.

సంస్కృతికి ఏదైనా ఒక విలువ అనేది వుండాలంటే దానికి కొంత లోతుకూడా వుండక తప్పదు. అంతే కాకుండా దానికి ఒక ప్రవేశాత్మక సౌశీల్య శక్తికూడా వుండక తప్పదు. నిజానికి సంస్కృతి అనేది ఎన్నో అంశాలపై ఆధారపడి వుంటుంది. ఒక జాతి యొక్కగాని, ఒక ప్రజ యొక్కగాని అభివృద్ధికి దాని తొలి దశలలో దోహదమిచ్చిన మౌలికశక్తిఅన బడేదాన్ని మినహాయించి చూసినప్పుడు, ఆ జాతి యొక్క లేదా ఆ ప్రజ యొక్క సంస్కృతి, భౌగోళిక పరిస్థితులకు, శీతోష్ణస్థితి వగైరా అన్నివిధాలైన ప్రభావాలకు లోనుకావడమనేది తథ్యం. అరేబియా దేశానికి సంబంధించిన సంస్కృతిని, అక్కడి భౌగోళిక పరిస్థితులు అక్కడి ఎడారులు అత్యంతమూ ప్రాభావితము చేస్తవి. ఎందుకంటే ఆ సంస్కృతి అక్కడ పెరిగింది కాబట్టి. మన భారతీయ సంస్కృతికూడా తొలిరోజులలో హిమాలయాలవల్ల, అరణ్యాలవల్ల, మహానదుల వల్ల అత్యధికంగా ప్రాభావితం అయినట్టు సుస్పష్టమే. మన సంస్కృతిమీద వీటి ప్రభావం ఎంతగా వున్నదీ మన ప్రాచీన సాహిత్యం దర్పణంలాగా స్పష్టం చేస్తూనే వుంది. మన సంస్కృతి మన క్షేత్రంలో సహజంగా పుట్టి పెరిగినట్టిది.

## బహుముఖాలు

సంస్కృతికి గల శిల్పం, సంగీతం, సాహిత్యం వంటి బహు ముఖాలలో ఏరెండైనా చక్కగా కలిసిపోగలవు. ఎన్నో సందర్భాలలో అలా కలిసిపోయినవి కూడా. అట్టి కలయిక ఎంతో ఆనందప్రదంగా వుంటుంది కూడ. అయితే సహజంగా వికసించని, రూపం దాల్చని స్థితిలో దేనినైనా నిర్బంధంగాను బలవంతంగాను అభివృద్ధి చేయటానికి ప్రయత్నం చేసినపుడు సంఘర్షణ అనేది అనివార్యమవుతుంది. అట్లాంటి సందర్భంలోనే సంస్కృతికి వ్యతిరిక్తమైన భావసంపద బలపడటానికి బహుశా దోహదమిస్తుంది. అంటే దానితో మనస్సు ఇతరప్రభావాలనుండి దూరం కావడమనేది ప్రారంభమవుతుందన్న మాట. బాహ్య ప్రపంచంతో సంబంధమున్న నాడు మన సంస్కృతి వికసించడ మనేది ఎంత వాస్తవమో, బాహ్య ప్రపంచానికి దూరమైననాడు తిరిగి మన సంస్కృతి క్షీణించడమనేది కూడా అంతగానూ వాస్తవమైన విషయమే. భారత చరిత్రలో సంస్కృతికి సంబంధించినంతవరకు ఇదీ నా భావన.

భారత దేశం బాహ్య ప్రపంచానికి ఎంతగా దూరమైందో అంతగా అది జడస్థితికి ప్రతిరూపమైంది. వక్తి యొక్క, జాతి యొక్క, దేశంయొక్క, సమాజంయొక్క జీవితం అనేది విధిగా ప్రవేశాత్మకమూ, పరిణామాత్మకమూ, వికాసాత్మకమూ అయి వుంటుందని నా నమ్మకం. ఆ ప్రవేశాత్మక శక్తిని అడ్డుపనేది ఏదైనా సరే అది సంస్కృతికి ప్రమాదాన్నీ విపత్తునూ మాత్రమే తెచ్చిపెట్టగలదు.

మన దేశంలో పెద్దపెద్ద మతాలు ఎన్నో వున్నాయి. ఈ మతాలు మానవజాతిమీద

మిక్కిలి ప్రభావాన్ని కలిగి వున్నాయన డంలో సందేహ మేమీ లేదు. అయితే ఎరో వుద్దేశ మేదీ లేకుండానూ, ఎవర్నీ కించపరచే వుద్దేశ మేదీ లేకుండానూ ఈ సందర్భంలో ఒక్క విషయాన్ని మనవి చేసుకుంటాను. ఈ మతాలు మానవుని మనస్సును ఏ మేరకు జడత్వాన్నీ, భావదాస్యాన్నీ, మూఢత్వాన్నీ ఆవహింపేలా చేశాయో ఆ మేరకు అది మానవునిమీద అత్యంత దుష్ప్రభావాన్ని కలుగచేశాయనే నేను విశ్వసిస్తున్నాను. ఈ మతాలు చెప్పేవన్నీ గొప్ప గొప్ప సత్యాలే కావచ్చు. కాని మేము చెప్పిందే వేదం అంటూ ఈ మతాలు వాదన ప్రారంభిస్తే మాత్రం ఆ సమాజం నిజంగా జడసమానమై పోతుందనటంలో అతిశయోక్తి లేదు. ఒకవ్యక్తికిగాని, జాతికిగాని దేశానికిగాని ఎక్కడో ఒకచోట ఒకపునాది అంటూ వుండక తప్పదు. చిరకాల చరిత్ర అనేది వుంటేనే ఏ సంస్కృతికైనా నిలువ వుంటూ వుంటుంది. భూతకాలం కూడా అంతకు ముందు తరాలవారి విజ్ఞానానుభవ పుంజం తప్ప మరేమీ కాదు. ఈ గతానుభవాన్ని మనం స్వీకరించాల్సి వుంటుంది. అలా స్వీకరించనినాడు మనం ఒక వ్యక్తిగా గాని ఒక జాతిగా గాని ఏ మాత్రమూ గుర్తింపులేని అప్రయోజకులం మాత్రమే కాగలం.

ఇక ప్రేళ్ళవిషయానికి వస్తే అవి సజీవంగా వుండటానికి వాటికికూడా సూర్యరశ్మి, గాలీ మొదలైన వాటితో అవసరం వుంటుంది. అవి వున్ననాడే, అవి కొమ్మా రెమ్మా పెట్టడమూ, పూలూ, పండ్లూ కాయడమూ జరుగుతుంది. అయితే వీటి రెంటినీ సమన్వయించడం ఎలా అనేది ప్రశ్న? నిజానికి ఇది చాలా క్లిష్టమైన సమస్యే. చాలామంది పైకి కన్పించే పండ్లూ పూలూ మాత్రమే కోరతారు కాని అవి వేటిని ఆధారం చేసుకొని బ్రతుకుతున్నాయో ఆ విషయాన్ని విస్మరిస్తారు. పోతే మరోవర్గం వారు వున్నారు. వారు భూమిలో పాతుకుపోయిన ప్రేళ్ళనే గమనిస్తారు. తప్పించి వాటిని గాలి తడితడాలను సేకరించిపెట్టే కొమ్మా రెమ్మా మొదలైన భాగాలను గుర్తింప నిరాకరిస్తారు. మరి వీటిని సమన్వయ పరచడ మనేది సామాన్యమైన విషయమా?

సంస్కృతి అంటే ఏమిటి? మానవునిలో కలిగిన అంతర్గత వికాసమూ, ఇతరుల యెడ అతని ప్రవర్తనా, ఎదిటివారిని అర్థం చేసుకోవడంలో అతని కున్న శక్తీ, ఇతరులు అర్థం చేసుకోగల విధంగా ప్రవర్తించగలగడంలో అతనికున్న నేర్పూ — ఇలాంటి వన్నీ సమపాళ్ళలో కలిసి ఒకే వ్యక్తిలో రాశీభూతమైనప్పుడు దానినే మనం నిజమైన సంస్కృతిగా భావించవచ్చును. ఒక వ్యక్తి ఇతరుల అభిప్రాయాలను ఏ మేరకు అర్థం చేసుకోలేక పోతాడో ఆ మేరకు అతని మనో వికాసమూ, సంస్కృతీ పరిమితమై వుంటుందనే విధంగా కూడా మనం కాదనలేము. పూర్వ పురుషులు ఏ కొందరో మినహాయిస్తే మిగతావారెవరూ లోకజ్ఞానాన్ని సమగ్రంగా జీర్ణించుకున్నారని మన మేమాత్రం చెప్పలేం. ఏపాటివారికైనా లేశమాత్రమైనా వివేకమూ విజ్ఞానమూ వుండకుండా పోదు. అలాంటప్పుడు వారితో మన సంబంధాలను దూరం చేసుకోవడం అంటే పై విద్వంశమైన జ్ఞానాన్ని జారవిడుచుకున్నవారం మాత్రమే కాగలం. అంతేకాదు సంస్కృతిని మూర్తీభవింపచేసుకున్న వ్యక్తి చేయదగ్గ పని కూడా కాదు ఇది.

సంస్కృతి ప్రభావంచెందిన మనస్సు, ఎదిటివారి దృక్పథంతో మనం ఏకీభవించక పోయినప్పటికికూడా వారి దృక్పథాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోగల సామర్థ్యాన్ని ఇనుమడింప చేసుకోవలసి వుంటుంది. ఎదిటివారి అభిప్రాయాలను పూర్తిగా అవగాహనచేసుకున్నప్పుడే వారిఅభిప్రాయాలతో ఏకీభవించడమూ, ఏకీభవించకపోవడమూ అనే ప్రశ్న వుత్పన్నమవుతుంది. ఇతరుల వాదనను వినిపించుకోకుండానే వారిని నిరాకరించడం ఏ మాత్రం సంస్కృతి అనిపించుకోబోదు.

జీవిత సమస్యలను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించడమంటే ఏమిటి? ప్రతి విషయాన్నీ సమగ్రంగా పరిశీలించడం, సత్యాన్ని ప్రయోగాత్మకంద్వారాను, అవసరమనుకుంటే తప్పులు చేసి సరిదిద్దుకోవడం ద్వారాను అన్వేషించడం, ఎప్పటికీ యథాస్థితి కొనసాగాలని కోరుకోకపోవడం, ఈ స్థితి ఇలా ఎందుకున్నదో అర్థం చేసుకోవడం, హేతుబద్ధమైన రీతిలో దానిని అంగీకరించడం, ఇప్పటికంటె బలీయమైన కారణాలు లభ్యమైనప్పుడు పూర్వాభిప్రాయాలను మార్చుకోవడం, ఎక్కడి సత్యానైనా స్వీకరించటానికి అవసరమైన హృదయ వైశాల్యతను కలిగివుండడం — వాస్తవానికి ఇవేగాని సాంస్కృతిక లక్షణాలే అయితే, ఆధునిక ప్రపంచంలో ఈనాడున్న దేశాలలో ఇది ఏమాత్రం ప్రతిబింబిస్తోంది? నిజంగా ఇప్పుడున్న స్థితి కన్నా మరింతగా మనం సంస్కృతిని అలవర్చుకున్ననాడు మన జాతీయ అంతర్జాతీయ సమస్యలు మరింత సుళువుగా పరిష్కారం కాగలవనడంలో నాకేమాత్రమూ సందేహం లేదు

భగవంతుడు తమ దేశాన్ని ఒక ప్రత్యేక కారణంగా సృష్టించాడనీ, ఆ కారణంగా

మిగతా దేశాలవారికన్నా తామే అధికులమన్న భావన ప్రపంచంలోని అన్ని దేశాల వారిలోను వుంది. ఒక్క దేశమైనా పారుపోకుండా ప్రాచ్యపశ్చిమ దేశాలన్నింటా ఈ భావన వుండడం నిజంగా ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది. తూర్పు దేశాలవారికి తమ భావాలలోను, నమ్మకాలలోను, కొన్ని విషయాలలో తమ ఔన్నత్యాన్ని గురించి గాఢాభిప్రాయాలు వున్నాయి.

ఏమైతేనేం, గత రెండుమూడు శతాబ్దాలలోను ఈ మూఢ విశ్వాసాలకు పెద్ద విఘాతమే జరిగింది దానితో వారి గొప్పతనపు భ్రమ లన్నీ కూలిపోయాయి. తాము అన్ని విధాలా గొప్పవారమనే భావన వుండినాడా వారు తమ వాదస్తం. మూర్ఖత్వం కారణంగా, నాగరిక సమాజంలో ఏమాత్రమూ చెల్లబోదని అర్థం చేసుకోగలిగారుకూడా. ఇది కొంత కొంత వారు వాస్తవ ప్రపంచాన్ని చూసేట్టు చేసింది.

## పలాయన వాదం

ఆధ్యాత్మిక, నైతిక విషయంలో మనం ఎలాగూ గొప్పవార మనీ, కనుక భౌతిక సాంకేతిక రంగాలలో అభివృద్ధిని సాధించక పోయినా వచ్చిన ఊరూ రేమీ లేదనీ, పోగా ఇవి అనవశ్యక రంగాలని తృప్తి పడుతూ వాస్తవాన్ని నిరాకరించే ప్రయత్నం కూడా జరుగుతున్నది. అర్థకామములకంటే ధర్మమోక్షములే మానవుడు కోరదగ్గవనే వాదనను నేను కాదనలేను. కాని భౌతిక సంపాదనలో విఫలులై. ఆ సత్యాన్ని మరుగుపరచటంకోసం, తమకు ఏలాగూ ఆధ్యాత్మిక సంపద వుండనే వున్నదనే స్తోత్కార్షకు ఆత్మ వంచనకు పాల్పడడం నిజంగా శోచనీయమైన విషయ మనే నేను చెప్పదలచాను ఇవి మన అధోగతిని ధైర్యంగా ఎదుర్కొగల సత్తాలేక పారిపోవటానికి ప్రయత్నించే అగచాట్లు తప్ప మరేమీ కావనే నిర్ణయానికి నేను వచ్చాను.

జాతీయ భావం అనేది ఒక దేశచరిత్రలో ఆ దేశపు అభ్యుదయానికీ, వికాసానికీ, సమైక్యతకూ ఒక స్థాయివరకు తోడ్పడ గలదనడంలో సందేహం లేదు అయితే ఈ జాతీయత అనేది మిగతా ప్రపంచంతో ఏమాత్రమూ సంబంధం లేనట్టుగా నేనూ, నా దేశమూ అనే భావనను కూడా పెంపొందింపచేస్తుంది. కాబట్టి ఇది క్రమేణా చాలా ప్రమాదకరమైన పరిస్థితికి దారి తీయగలదనే నమ్మకం కూడా నాకున్నది. ఈ జాతీయత మొదట్లో ఏ ప్రజల అభ్యుదయానికైతే దోహద మిచ్చిందో అదే ప్రజల మానసిక వికాసానికి భంజకంగా కూడా తయారవుతోంది. ఈ జాతీయత స్వదేశంలో విజయవంతమై, ఆ తర్వాత విజృంభించిందంటే మొత్తం ప్రపంచానికే, ప్రాణ సంకటాన్ని తెచ్చిపెట్టగలదు కూడా. మనం ఏ ఆశయ సిద్ధి వైపు పయనిస్తున్నప్పటికీ ఎలాగో అలాగా ఒక సామరస్య విధానాన్నీ, సమన్వయ విధానాన్ని అంగీకరించక తప్పదు. అలాకాంపోతే అమృతమే విషమైపోగలదు

అభ్యుదయాంశమైన సంస్కృతి పెడదారి పట్టినపుడు విద్వేషాలకూ, సంఘర్షణలకూ దారితీస్తుం దనడంలో సందేహంలేదు. అయితే మరి దీన్ని సమన్వయం చేయడం ఎలా ? వాస్తవానికి నేనుకూడా దీనికి సమాధానం ఇవ్వలేను ఈ నాడున్న ఆర్థిక రాజకీయ సమస్యలపట్ల మనం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం సహజమైన విషయమే. పోతే మానవుడు నిత్యావసరాలకే నోచుకోకుండా మలమల మాడి చస్తూవున్న పరిస్థితులలో అతనికి సంస్కృతి అంటూను, దేవుడు అంటూను బోధనలు చేస్తా మంటూ ముందుకు రావడం మిక్కిలి దారుణంగా వుంటుంది. మానవుని నిత్యావసరాలు తీరిన తరువాతనే అతని ముందు ఏదిప్రసంగించినా. దానికి అర్థమూ పర్థమూ అనేది వుంటుంది ఇలాంటి పరిస్థితుల్లో ఆర్థిక సమస్య అనేది సహజంగా ఎదురౌతుంది. ఈ విధంగా కష్టాలను, ఋద్బాధను, విమతపు భేదాలకు సహిస్తూ వూరుకునే స్థితిలో లేదు నేటి మానవుడు. అంతే కాకుండా చేయడం ఘనవంతూ, దోచుకోవడం మరొకరివంతుగా వున్న నేటి స్థితిని అతడు అణుమాత్రం కూడా సహించబోడు.

ఈ సమస్యల విషయంలో మనం ఏదో విధంగా పరిష్కార మార్గం చూడక తప్పదు. అయితే వీటివెనుక. ప్రబలమైన మానసిక ప్రవృత్తు లున్నాయనే విషయం మనం గుర్తించక తప్పదు. కొందరు తెలిసీ కొందరు తెలియకా ఈ సమస్యలను ఎదుర్కొంటున్నారు. మొత్తంమీద ఈ విషయంలో మానవుని మనస్సు గందరగోళంగా వుందనేది వాస్తవం. ఇది ఏ విధంగా పరిష్కారం కావాలో నా కేమాత్రం తోచడం లేదు. ఒకరినొకరు బాగా అర్థంచేసుకున్న వాళ్ళు అంత త్వరగా ఒకరితో మరొకరు గిల్లికజ్జాలు ఎందుకు పెట్టుకుంటారో నేను వూహించలేక పోతున్నాను. అంతమాత్రం చేత ఒకరినొకరు అర్థం చేసుకోవడం మానుకోమని చెప్పడంకూడా నా వుద్దేశ్యం కాదు. ఒకవేళ అలా జరగాలని మనం కోరుకున్నప్పటికీ ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల మధ్య అదిసాధ్యపడే విషయంకూడా కాదు. అందుచేత మనం సరియైన పద్ధతిలో ఒకరినొకరు అర్థంచేసుకోటానికి ప్రయత్నించవలసివుంటుంది. ఇంతకీ మనం అనుసరించేపద్ధతి మంచిదై వుండాలి. ఇతరులను స్నేహభావంతో చూస్తే వారుకూడా తప్పనిసరిగా అదే భావంతో చూడకుండా పోరు.

మనపట్ల ఎదుటివారు మంచిగా ప్రవర్తించేదీ ప్రవర్తించనిదీ అది మనం చూపే వైఖరి పట్ల ఆధారపడి వుంటుంది మనం నమ్ముకున్న సిద్ధాంతాలకు తిలోదకాలు ఇవ్వ నవసరం లేకుండానే, ఇతరులను మనఃపూర్వకంగానూ, హృదయపూర్వకంగానూ అర్థం చేసుకోవటానికి మనం ప్రయత్నించినట్లయితే మన అవగాహన కూడా సక్రమమూ, సరియైనదే అయి వుంటుంది.

## నిజమైన వివేకం

పోతే సంస్కృతి అంటే ఏమిటో, వివేక మంటే ఏమిటో మీరే నిర్ణయించి చెప్పవలసి వుంటుంది. మనం ఎంతో చదువునూ, విజ్ఞానాన్నీ, అనుభవాన్నీ గడించుకున్నాం. అయినప్పటికీ మన పరిస్థితి ఏమిటోకూడా అర్థం చేసుకోగల స్థితిలోకూడా లేకుండా వున్నాం ఈవిజ్ఞానాంతా లన్నింటినీ ప్రోదిచేసుకున్నప్పటికినీ మానవజాతికి వివేకోదయం ఆవుతుందనే ఆశ నాకేమాత్రమూ లేదు. ఆధునిక జీవితంతోను, విజ్ఞానంతోను ఏమాత్రమూ పరిచయం లేనట్టి సామాన్య ప్రజానీకమే, బహుశా మనలో చాలా మందికన్నా ఎక్కువ వివేకం కల వారేమో నని నేను తరచు భావిస్తూ వుంటాను. రానున్న తరాలలో నైనా నేటి విజ్ఞానా న్నంతా వివేకవంతంగా వినియోగించుకోగలమో లేదో నేనే వూహించలేక పోతున్నాను. ఇది వివిధ శక్తుల మధ్య సాగుతున్న పరుగు పందెంలా నాకు తోస్తోంది.

ఈ సందర్భంలో ఒకానొక గ్రీకు మహాకవి అన్న సూక్తులు నాకు స్ఫురణకు వస్తున్నవి.

ఏది వివేకం?
మానవునికి కృషికి
మనోజ్ఞమూ మహత్తరమూ
అయిన పరమేశ్వరుని అపార కరుణకు.
ఏది పరమార్థం?
పిత భయంతో
స్వేచ్ఛావాయువుల్ని పీలుస్తూ
తలెత్తి నిలబడం
విద్వేషాన్ని అధిగమించి
ప్రేమ పతాకను ఎగురవేయడం
అప్పుడుగదా
సౌందర్యం నిత్య నిరంతర సమారాధ్యం!

*[ఆంగ్లం నుండి అనువాదం : శ్రావణి]*

---

న్యూఢిల్లీలో 1950 ఏప్రిలు 9 వ తేదీన సాంస్కృతిక సంబంధాల భారతీయ పరిషత్తు ప్రారంభోత్సవ సందర్భంగా పండిట్ నెహ్రూ యిచ్చిన ఉపన్యాసం.

---

భారత దేశంలో బహుశః ఇతర దేశాలలో కూడా ఆత్మస్తుతి, ఆత్మనింద అనే భిన్నమార్గాలు గోచరిస్తున్నాయి. ఈ రెండూ కూడా అవాంఛనీయములూ అపరిగణనీయములు. మనం భావోద్వేగ పూరిత మార్గాలద్వారా కాక వాస్తవాన్ని ధైర్యంగా గంభీరంగా ఎదుర్కొనడం ద్వారా జీవితాన్ని అర్థం చేసుకోవాలి.

# గొప్ప దేశనాయకుడు

— ఏ. ఎన్. కోసిగిన్

భారత ప్రజల నాయకుడు, మాతృభూమి స్వాతంత్ర్యానికై పోరాడి దేశాభివృద్ధికి కంకణబద్ధుడైన ధీరోదాత్తుడు, దేశప్రజలకు తన సమస్త జీవితాన్ని అంకితమొనర్చిన అకలంక దేశభక్తుడు అయిన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ అస్తమయం సోవియట్ ప్రజలందరికీ ఎంతో మనస్తాపాన్ని కలిగించింది. ప్రపంచ శాంతినీ, ప్రజాస్వామిక విధానాన్నీ వివిధ దేశాలమధ్య మిత్రత్వాన్నీ ఆకాంక్షించే నిఖిల ప్రపంచ పౌరులకూ ఆయన నిర్యాణం విచారం కలిగించింది. శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ ప్రజలకు ప్రియతముడు. ఎందుచేతనంటే వలసతత్వాన్ని అన్నివిధాలా రూపుమాపడానికి భారతజాతి సాగించిన కృషికి, ఆయనకూ అవినాభావ సంబంధం వుంది. అంతేకాదు, వివాదగ్రస్తమైన అంతర్జాతీయ సమస్యల పరిష్కారానికి సంప్రదింపులు, శాంతియుత పద్ధతులే ఉత్తమ మార్గాలనికూడా ఆయన విశ్వసించారు. శ్రీ నెహ్రూ శాంతికాముకుడు. వివిధ దేశాలు శాంతియుతంగా సహజీవనం నెరపాలనే సూత్రాన్ని అంతా పాటించాలన్నదే ఆయన అభిమతం. అలీన విధానానికి కర్త ఆయన. భారత ప్రభుత్వం ఇప్పుడీ పంథాను అవలంభిస్తున్నది వివేకవంతమైన ఈ విధానం భారత దేశానికి గౌరవ ప్రపత్తులను సంతరించి పెట్టింది.



ఈ కారణంగానే భారతదేశానికి అంతర్జాతీయ రంగంలో అర్హమైన సముచిత స్థానం లభించిందికూడా.

శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ 1955, 1961 వ సంవత్సరాలలో సోవియట్ రష్యాలో, గడిపిన రోజులను మా ప్రజలు కలకాలం జ్ఞప్తికుంచుకుంటారు. వలస పాలనను అంతమొందించి స్వాతంత్ర్యం పొంది అభివృద్ధికి బాటలు వేసుకుంటున్న మహత్తరమైన మీ దేశపు నాయకుడికి మా ప్రజలు ప్రత్యక్షంగా అభివాదం తెలిపి ఆనందించే అవకాశం కలిగింది.

## గుణ సంపన్నుడు

శ్రీ జహాపర్‌లాల్‌తో మేము వ్యక్తిగతంగా జరిపిన సమావేశాల అనుభవాలను ఎన్నటికీ మరువలేము. ఆయన నిరాడంబరతను, మానవతను, చిత్తశుద్ధిని దయార్ద్ర స్వభావాన్ని మేము ఎప్పటికీ మరిచిపోలేము శాంతియుత సహజీవన విధానాన్ని ఆచరణలోకి తేవడానికి తన శక్తినంతటినీ ధారపోసినీ నాయకుడాయన. ఆయన మరణంవల్ల సంభవించిన అపారనష్టానికి సోవియట్ ప్రజలు వాపోతున్నారు. మా దేశంలో ప్రతి ఒక్కరికీ, స్వర్గీయ శ్రీ నెహ్రూ భారత సోవియట్ దేశాలమధ్య సత్సంబంధాలు నెలకొనడానికీ, ప్రజలమధ్య మైత్రి వర్ధిల్లడానికి చేసిన నిరుపమానమైన సేవను గురించి తెలియడమే దీనికి హేతువు. లోగడ దాదాపుగా పరస్పరం తెలియని స్థితిలోవున్న ఈ ఉభయదేశాలు ఇప్పుడు సఖ్యత గల ఇరుగుపొరుగు దేశాలుగా, నిజమైన మిత్రులుగా మనాలన్నదే ఆయన అభిలాష. భారతజాతినేత ప్రధానమంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ గతించిన సందర్భంలో భారత ప్రభుత్వానికి, భారత పార్లమెంటుకూ, సమస్త భారత జాతికి, శ్రీమతి ఇందిరా గాంధీకి, కీ. శే. నెహ్రూ ఇతర బంధువులకూ తమ తరఫున, సోవియట్ ప్రజల తరఫున ఈ సంతాప సమయంలో ప్రగాఢ సానుభూతి తెలియజేయవలసిందిగా యు. ఎస్. ఎస్. ఆర్. మంత్రిమండలి అధ్యక్షుడు శ్రీ ఎన్. ఎస్. కృశ్చేవ్, సోవియట్ ప్రభుత్వం యు. ఎస్. ఎస్. ఆర్. సుప్రీంసోవియట్ ప్రెసిడియం అధ్యక్షుడు, ఎల్. ఐ. బ్రెజ్నేవ్, యు. ఎస్. ఎస్. ఆర్. సుప్రీం సోవియట్‌వారు నన్ను ఆదేశించారు.

"మనో కవాటాలు తెరవండి"

మన తరానికి చెందిన గొప్ప మానవతావాది అయిన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ 1960 వ సం॥ లో అన్న మాటలను ఈ సందర్భంలో నేను మీకు జ్ఞప్తి చేయదలిచాను.

ఈ మాటలలో ఆశావాదం వుట్టిపడుతుంటుంది. "మార్పు చెందుతున్న మన సమాజాన్ని సక్రమ దృక్కోణంనుంచి వీక్షించడానికీ, కారు మేఘాలను ఛేదించి సూర్యకిరణాలు ప్రసరిస్తున్న నూతన ప్రపంచాన్ని చూడడానికీ వీలుగా మన మనో కవాటాలను తెరచివుంచుదాం."

సమకాలీన శకానికి చెందిన ఈ గొప్ప రాజనీతిజ్ఞునికి, విశాలహృదయుడు, మేధాసంపన్నుడు అయిన ఈ మహా మనీషి స్మృతిచిహ్నంగా వివిధ దేశాల మధ్య శాంతి, స్నేహ సంబంధాలను పటిష్ఠం చేయడానికీ, శాంతియుత సహజీవన సూత్రాలను అవలంబింప జేయడానికి తీవ్రంగా కృషి చేయడమే ఉత్తమ విధానం. అన్ని దేశాల ఆర్థికాభివృద్ధిని సాధించడం, ప్రపంచ ప్రజల జీవన ప్రమాణాన్ని పెంపొందించడం, మొట్టమొదట, ఇటీవలే రాజకీయంగా స్వాతంత్ర్యం పొందిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రజల జీవనస్థాయిని హెచ్చించడం— ఇవి లక్ష్యంగా గల మన సంయుక్త కృషిని కొనసాగించడమే దీనికి మార్గం.

సోవియట్ ప్రభుత్వాధినేత శ్రీ ఎన్. ఎస్. కృశ్చేవ్ నుడివిన మాటలతో నేను ముగించదలచాను. "శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ అద్భుతమైనట్టి తమ జీవితాన్ని పూర్తిగా మానవతావాదం, సాంఘికాభివృద్ధి, శాంతి స్థాపనలనే గొప్ప ఆదర్శాల సాధనకు అంకితం చేశారు. ఈ లక్ష్యాలు ఫలించి సత్ఫలితాలు అందేటట్లు చేయడమే మనం ఆ మహానుభావునికి ఘటించవలసిన శ్రద్ధాంజలి" అని శ్రీ కృశ్చేవ్ అన్నారు.

---

# శ్రద్ధాంజలి

జ్ఞానానందకవి

చనెనా? విశ్వవసుంధరాస్థలి ప్రశంసల్ గొన్న ధీశాలి! చక్కని మా భారతపుత్ర రత్నము సమగ్ర శాంతి శ్యామాంతంకురాలను భూభాండము నింపినట్టి జనతాలంకారుడౌ 'జవ్హారుం' డని మేమస్థలికీవి యోగకరశోకాగ్నుల్ మమున్ వ్రేల్చెడిన్.
బ్రతుకు యెడారిలో కుమిలి క్రుగ్గుచు స్వేచ్ఛ యొకింత లేని భారతమున కుజ్జ్వలం బయిన రత్నపుదీపముగా వెలింగి శాశ్వతముగ కన్నుమూసిన ప్రపంచహితైషి! మనీషి!
మృత్యుదేవత విషగర్భగహ్వరము వ్రాలెనె! యెంతటి దుర్దినంబహో!
ఇక లేడా? మహనీయమూర్తి మఱి రానేరాడు సర్వమ్ము మాతృకపూజార్థ మొసంగి నాడు భువనశ్రీ గోరి బాపూజి శాంతికి భాష్యమ్ము వచించి జీవితము శాంతి క్రాంతికోసమ్ము నూటికి నూర్పాళ్లుగ ధారవోయు జగజెట్టీ! నీకు సాటేరికిన్.

నిఖిలభువనరాజనీతిజ్ఞులందున
నిన్ను బోలు వ్యక్తి యున్న సుమ్మి
నీ మొగమ్ములోన నేమహత్తరశక్తి
కలదొ? కాని వసుధ కొలిచె నిన్ను.

ధ్వనియింప దిక జగత్కళ్యాణ మాశించు
నిండుజవ్హారుని వాణీరవము
కనిపింప దిక త్రిలోకముల మోహింపించు
హావుసు చెన్నారు జవ్హారుని మూర్తి
వినిపింప దిక విశ్వవిశ్వమ్ము కొండాడు
నమృతమ్ము జిలుకు జవ్హారుని పలుకు
వణకింప దిక స్వార్థపైశాచములు తాండ
వం బాడు గతుల జవ్హారుని శక్తి

కునుకుదీయుచున్న కులశూర్పణఖ దర్ప
మణపలేదు జవ్హారుని ప్రచండ
దృష్టి యింక స్వీయదేశమ్మునకు నేడు
చెఱిగిపోనియట్టి చెడ్డదినము

తత గాఢోజ్జ్వల ధీమతాగరిమచేతన్ ప్రాచ్య పాశ్చాత్య ధీమతు లౌ వారల మ్రొక్కులం బడసి సన్మానమ్ములం బొంది భారతజాతీయత నిల్పి చన్న 'నెహురూ' శ్రద్ధాంజలుల్ నీకు నీ యతిలోకైకమనోజ్ఞభావనకు జోహారుల్ మహానాయకా!

# యుగపురుషుడు - మహాజాతకుడు జవహర్‌లాల్ నెహ్రూ

డి. వి. సుబ్బారావు

ఈ యుగపురుషుడు అలహాబాదు నందు 1889 సంవత్సరం నవంబరు 14 రాత్రి 11 గం. 27 ని. 30 సె. లకు కర్కాటక లగ్నమందు జననమొందెను. జననకాల లగ్నమగు కర్కాటము, రవిహోర, మీనద్రేక్కాణము, మేష చతుర్థాంశ, కర్కాట సప్తాంశ, వృశ్చిక అష్టాంశ, మీన నవాంశ, ధను దశాంశ, మిధున ద్వాదశాంశ, కర్కాట షోడశాంశ, వృశ్చిక త్రింశాంశ నొంది యుండెను. ఇందు 3 స్వాంశలు, 3 మిత్రాంశలు, 3 గుర్వంశలు, 1 బుధాంశ యున్నవి. ఇట్టి సంపత్తిగల లగ్నమున జన్మించిన మహాపురుషుని తత్కాల గ్రహస్థితి ఈ క్రింది విధముగా నున్నది. రవి 7-0-17, చంద్రుడు 3-18-12, కుజుడు 5-10-5, బుధుడు 6-17-15, గరువు 8-15-17, శుక్రుడు 6-7-29, శని 4-10-54, రాహువు 2-12-49, కేతువు 8-12-49, లగ్నము 3-28-12. రవి మిత్రగురు నక్షత్రగతుడు. చంద్రుడు మిత్రుడైన బుధ నక్షత్రగతుడు. కుజుడు మిత్రచంద్ర నక్షత్రగతుడు. బుధ, శుక్ర, రాహులు రాహు నక్షత్రగతులు. గురుడు మాత్రము శత్రువైన శుక్ర నక్షత్ర గతుడు, శనికేతులు కేతు నక్షత్రగతులు. లగ్నము బుధ నక్షత్రగతమై యుండెను. లగ్నము లగ్నాధిపతి చంద్రుడు బుధ నక్షత్ర గతులగుట, రవి హోరయందుండుట మఱియొక విశేషము. ఈ లగ్నమునకు కుజ, గురు, కేతులు శుభులు. రవి, చంద్ర, శనులు సములు. శుక్ర, బుధ, రాహులు పాపులు. చంద్రస్థితినుండి బుధ, రాహులు పాపులై యున్నారు. సప్తమాధిపతియగు శని ద్వితీయమందుండి ప్రబలమారకుడై నాడు. కాన, ఈ జాతకుని ఆయుర్భావము వ్యయమందు స్వనక్షత్ర గతుడైన రాహు మహాదశా, బుధాంతర, రాహువిదశ, శని సూక్ష్మదశ, శని ప్రాణదశా పర్యంతమని కన్పించుచున్నది. శని రాహు నక్షత్ర గతుడై యుండగా మరణము సంభవించుట స్పష్టము. ఆంధ్ర పత్రికయందు మారకత్వ విషయమై నేను వ్రాసిన ఆయుర్విభాగరీత్యా ఈ జాతకుడు పూర్ణాయుర్దాయ భాగమందు మధ్యమ విభాగమునకు చెందియుండెను. దీని ననుసరించి ఈ జాతకుని ఆయుర్దాయము 76 సం॥ల లోపని విశదమగును. లగ్నాధిపతియే ఆత్మకారకుడై, చరరాసిగతుడై నాడు. ఆయుఃస్థానాధిపతి స్థిరరాసి నొందిననూ లగ్న, ద్వితీయ, భావమధ్య సంధినుండి రెండుభాగల దూరమున మాత్రమున నున్నాడు, కాన వీరిరువురు చరరాసియందుండినట్లు భావింపవలెను. తన్మూలకముగా పూర్ణాయుర్దాయము మాత్రము కాదనుట స్పష్టము.

ఈ జాతకునిరాశి, నవాంశ, భావ, అష్టాంశ చక్రములు ఈ క్రింద చూపిన విధముగా నున్నవి. జనన కాల బుధ మహార్దశాశేషము 15 సంవత్సరముల 16 రోజులు. ఈ జాతకుడు బుధశేషము, కేతు, శుక్ర, రవి, చంద్ర, కుజదశల పూర్ణముగాను రాహు మహార్దశ బుధాంతరము వరకు ననుభవించినాడు.

| | | | |
|---|---|---|---|
| | | | రాహు |
| | రాశి | | లగ్నం చంద్ర |
| | | | శని |
| గురు కేతు | రవి | బుధ శుక్ర | కుజ |

| | | | |
|---|---|---|---|
| లగ్నం బుధ | కుజ | | |
| | నవాంశ | | కేతు శని రవి |
| రాహు | | | గురు |
| చంద్ర శుక్ర | | | |

| | | | |
|---|---|---|---|
| | | కేతు శుక్ర | |
| శని | అష్టాంశ | | |
| | | | చంద్ర బుధ |
| రవి గురు | లగ్నం రాహు | కుజ | |

| | | | |
|---|---|---|---|
| | | | రాహు |
| | భావము | | చంద్ర లగ్న శని |
| | | | కుజ |
| కేతు గురు | | బుధ రవి | శుక్ర |

లగ్నాధిపతి యగు చంద్రుడు, చతుర్థాధిపతి యగు శుక్రుడు, షష్ఠాధిపతి యగు గురువు స్వక్షేత్రములం దున్నారు. రవి రాశియందు కోణమునం దున్ననూ భావమందు కేంద్రమం దున్నాడు. కుజుడు ద్వితీయభావమం దున్నాడు. శుక్రుడు తృతీయమందు. శని లగ్నభావమందు యున్నాడు. ఈ గ్రహముల భావస్థితి మార్పు గ్రహించినగాని ఫలముల నిర్ణయము సలుపగాదు. రవి కుజక్షేత్ర మగు వృశ్చిక రాశియందు గురునక్షత్రగతుడై చతుర్థ భావ ఫలములను, కుజుడు బుధ క్షేత్ర మగు కన్యయందు చంద్ర నక్షత్ర గతుడై ద్వితీయ భావఫలములను, శని రవి క్షేత్రమగు సింహమందు కేతు నక్షత్ర గతుడై లగ్న భావస్థిత ఫలములను, చంద్రుడు స్వక్షేత్రమందు బుధనక్షత్ర గతుడై లగ్న భావ స్థిత ఫలములను, బుధుడు శుక్ర క్షేత్రమగు తులయందు రాహు నక్షత్రగతుడై చతుర్థభావ ఫలములను, గురుడు స్వక్షేత్రమందు శుక్ర నక్షత్రగతుడై షష్ఠ స్థిత ఫలములను, శుక్రుడు స్వక్షేత్రమందు రాహునక్షత్ర గతుడై తృతీయ భావ ఫలములను, రాహువు బుధక్షేత్రమగు వ్యయమందు స్వనక్షత్రగతుడై వ్యయ భావస్థిత ఫలములను, కేతువు గురుక్షేత్రమగు ధనస్సునందు స్వనక్షత్రగతుడై షష్ఠభావస్థిత ఫలముల నొసగుచున్నారు. లగ్నము, చంద్రుడుపాపార్గళమునొందియున్నారు. ఏ శుభదృష్టియు లేదు.

శని, రాహు, రవులు తప్ప ఇతర గ్రహములు శుభావస్థల నొందియున్నారు. దశాంశల విభాగమందు చంద్ర, కుజ, గురు, శుక్రులు ఉత్తమాంశములను పొంది యున్నారు లగ్న పాపకర్తరికి తోడు పంచమమందు గూడ పాపి యగు రవి యుండుటచే దీర్ఘకాలము కారాగృహమం దుండవలసివచ్చినది. లగ్న షష్ఠాధిపతియగు కుజుడు త్రింశాంశ యందు లాభస్థితి నొందుట, జనన రాశియందు తృతీయమం దుండుట ఈ జాతకుని తీవ్ర స్వభావము, ధైర్యము, పట్టుదల మొదలగు లక్షణములకు కారణమైనది. చతుర్థ కేంద్రమందున్న శుభు లగు శుక్ర, బుధులచే ప్రజాసౌఖ్యాభిలాష, తన్మూల కాత్మ సంతోషము నొందు లక్షణములు ఏర్పడినవి. శని దృష్టి ప్రజాస్వామ్య సిద్ధాంతము లందలి అపూర్వాను రాగ మొసగినది. శత్రు నక్షత్రమం దున్న గురుడు స్వక్షేత్ర స్థితి నొందుట విశేషము. ఈ గురు కటాక్షముచేత శత్రువులకుగూడ ప్రేమపాత్రుడైనాడు. కార్యనిర్వహణ యందలి దక్షత, ప్రజానురంజకము ఈ గురునిచే ప్రాప్తించినవి. కారకాంశ లగ్నమందు జలతత్వ గ్రహము లున్నందున, ఆ లగ్నమును శుభు డగు గురువు వీక్షించినందున దూరదేశ ప్రయాణములు, ఆకర్షణీయ మగు రూపలావణ్యములు, అపారమగు శక్తి కలిగినవి. గ్రంథ రచనాశక్తికి బుధ, శుక్రులు కారకులు. చంద్ర, గురు మధ్యస్థు లగు సర్వగ్రహములు మాలికా యోగము నొందిన, త్యాగిమూర్తు లగు మహాపురుషులు జన్మింపగలరు లగ్నాధిపతి ఆత్మకారకు డగుట, ఆత్మకారక లగ్నము గురుక్షేత్రమై, అందున్న జనన లగ్నాధిపతిని మిత్రక్షేత్ర వర్తి యగు గురుడు పంచమదృష్టిచే వీక్షించుట, వీరిరువురూ శుభు లగుట, ఆత్మకారక లగ్నము రాజ్యభావ మగుట విశేష లక్షణములు. ఇట్టి జాతకు లతిసామాన్య కుటుంబములందు జన్మించిననూ మహారాజ యోగ మనుభవింతు రని శాస్త్రము దెల్పుచున్నది. ఆగర్భశ్రీమంతు డగు ఈ మహాపురుషునకు పైనుదహరింపబడిన అధి రాజయోగము ప్రాప్తించుట, తత్ఫలముల ననుభవించుటయం దాశ్చర్యము లేదు.

త్రింశాంశయందలి లగ్నము మిత్ర క్షేత్రమందుండి లగ్నాధిపతి ఏకాదశమం దున్నాడు. ఈ లగ్నమును రాజ్యాధిపతి యగు రవి వీక్షించుచున్నాడు. లగ్నాధిపతి లాభమందు, లాభాధిపతి ధనభావమందు, ధనకారకునితో సంయోగ మంది లగ్నాధిపతిచే చూడబడుచున్నాడు. ఈ గ్రహసంబంధముచే ఈ జాతకుని కోర్కెలు పూర్ణ ఫలము నొందునని విశద మగుచున్నది. శుభుడగు లగ్నాధిపతి చంద్రుడు లగ్నభావమం దుండుటచే అత్యుత్తము మగు, ఆదర్శప్రాయ మగు కోర్కె లుద్భవించుచున్నవి. ఊహోద్రేక కారకు డగు చంద్రునికి పాపసంబంధము లేనందున ఈ కారకత్వములు జాతకుని కీర్తిప్రతిష్ఠలకు తోడ్పడినవి. నవాంశమందు నీచ భంగ మొందిన బుధుడు లగ్నగతుడైనందున, ఆ లగ్నమునకు పాపవీక్షణ లేనందున, లగ్నాత్తు పాపి యగు శుక్రుడు ఉత్తమ కేంద్రగతుడై గురుదృష్టినొంది బుధ నీచ భంగమునకు కారకుడైనందున ఈ జాతకుని రాజనీతి ప్రఖ్యాతి ఇనుమడించినది. గురు, శుక్రుల స్వక్షేత్రస్థితి ఈ జాతకునికి తల్లిదండ్రులయం దుండు ప్రేమ అపారమని చూపుచున్నది. దశాంశయందు 3 కేంద్రములందు పూర్ణశుభు లున్నారు. షష్ఠమం దున్న గురుని శని చూచుచున్నాడు. ఏకాదశమందు రాహు వున్నాడు. ఈ గ్రహ సంపద ప్రభావముచే నీ జాతకుడు ప్రపంచప్రఖ్యాతి పురుషుడై

శత్రువు లున్ననూ వారిని జయించు శక్తి సామర్థ్యముల నొందు-యేగాక ప్రపంచ ప్రజల ఆదరాభిమానముల నొందు అఖండ ప్రతిభాశాంతుడై నాడు మహాపురుష యోగ ములలో నొకటగు మాలవ్య యోగము నందు జన్మించిన ఈ జాతకుడు భాగ్య, భోగములు, ఛత్ర, చామరాదులు, సత్యవాక్కు, కీర్తి, సౌఖ్యసౌందర్య ములు, సంపూర్ణ రాజయోగము, చాతుర్యము మొదలగు సర్వలక్షణ సంప న్నుడై, ఋషులచే చెప్పబడిన రీతిని ఫలప్రదమగు పూర్ణాయుర్దాయకుడై, ప్రజానురంజకుడై, భారతరత్న మైనాడు. ఇట్టి మహాపురుషు డుద్భవించుటరుదు. ఈ మహాపురుషుని బొందగలిగిన మన దేశము, మనము అత్యంత అదృష్టవంతు లము గదా! మాలవ్య యోగ ఫలము లీ క్రింది విధముగా చెప్పబడినవి.

నష్ఠావోష్ఠో నవిషమతనుర్నాతి
రక్తాంగ సంధిః
మధ్యేక్షామః శశధర రుచి
ర్హాస్తినాదః సుగంధః
సందీప్తాక్షః సమసిత రదోజాను
దేశాప్తపాణిః
మాలవ్యోయం విలసతినృపః
సప్తతిర్వత్సరాణామ్.
మాలవ్యోనాగనాసః సమభుజయుగళః
జాను సంప్రాప్త హస్తాః।
మాంసైః పూర్ణాంగసంధిః సమరుచిరతనుః
మధ్యభాగే కృశశ్చ।
పంచాష్ట్రౌ వక్త్రమాస్యం శ్రుతి వివరమపి
త్ర్యంగుళోనం చ తిర్యక్
దీప్తాక్షం సత్కపోలం సమసిత దశనం
నాతి మాంసాధరోష్ఠమ్.
మాలవాన్ సభరుకచ్ఛ సురాష్ట్రాన్
లాటసింధు విషయ ప్రభృతీంశ్చ
విక్రమార్జిత ధనోపతి రాజా
పారియాత్ర నిలయాన్ కృతబుద్ధిః.
శ్రీ చేష్టా లలితాంగ సంధినయనః
సౌందర్యశాలీగుణీ
తేజస్వీ సుతదార వాహనధనీ
శాస్త్రార్థ విద్పండితః
ఉత్సాహ ప్రభుశక్తిమంత్రి చతు
స్త్యాగ పరస్త్రీ రతః
సప్తత్యబ్ద సమైతి సప్తసహితం
మాళవ్య యోగోద్భవః॥

*ఈ జాతకునికి ప్రాప్తించిన యోగములు:*
(1) శుభ ఉభయాచారి యోగము, (2) రాజలక్షణ యోగము, (3) శంఖా యోగము, (4) పారిజాత యోగము, (5) దామినీ యోగము, (6) శ్రీకంఠ యోగము, (7) చామర, అంబుధి యోగములు, (8) గురు చండాల యోగము, (9) సునఫా యోగము, (10) వసుమతీ యోగము.

(1) శుభ ఉభయాచారి యోగము గురు, బుధ, శుక్రులచేతను, (2) రాజ లక్షణ యోగము చంద్ర, బుధ, శుక్రుల చేతను, (3) శంఖ యోగము కుజ,గురుల చేతను, (4) మాలవ్య యోగము శుక్రుని చేతను, (5) పారిజాత యోగము చంద్రుని చేతను, (6) శ్రీకంఠ యోగము రవి, చంద్రుల చేతను, (7) చామర యోగము చంద్రుని చేతను, (8) అంబుధి యోగము శుక్రుని చేతను, (9) సునఫా యోగము శని చేతను, (10) వసుమతి యోగముసు, గురుల చేతను ప్రాప్తించి నవి. ఇందుచంద్ర, శుక్రులు 6 యోగము లకు, గురు, బుధులు 3 యోగములకు, కుజుడు రెండింటికి, శని ఒక యోగము నకు కారణభూతు లైనారు. గురుక్షేత్ర గతుడగు కేతువు గురు ఫలమును, బుధ క్షేత్రగతుడగు రాహువు బుధఫలములను, ఇత్తురనుట విశదము. ఈ జాతకుడు ఈ మహాయోగ కారకులగు గ్రహములతో బుధ, శుక్ర, రవి, చంద్ర, కుజ, రాహు దశల ననుభవించెను రవిదశ మాత్ర మీ జాతకుని ఉపయోగింపలేదు. ఈ మహా గ్రహముల జీవితాశయములు జగత్ప్రఖ్యాత ములగాన పదశాభక్తులలో యోగ మెట్లు ప్రాప్తించినది తెలుప నవసరములేదు. శుభ ఉభయాచారి యోగముచే ప్రజా రంజకుడై, భారాశమగు వాగ్ధాటి గలవాడై, ఖ్యాతి గడించెను. రాజలక్షణ యోగముచే సుగుణశాలియై సుందరరూపి యయ్యెను. శంఖ యోగముచే కష్టజీవుల పాలిటి కల్పతరువై పూర్ణాయుర్దాయ వంతుడైనాడు మాలవ్య యోగ ఫలములు పైన చెప్పబడినవి. పారిజాత యోగముచే ఉదారస్వభావుడై ఖ్యాతి గడించి జీవిత ద్వితీయ భాగమందు మహారాజయోగ మనుభవించినాడు. దామినీ యోగముచే ఉదార స్వభావు డైనాడు. శ్రీకంఠ యోగముచే ఉన్నతాదర్శప్రాయుడైనాడు చామర, అంబుధి యోగములచే ప్రజానాయకుడై ప్రపంచఖ్యాతి నొందినాడు. సునఫా, వసుమతీ యోగములచే ధన, రాజ యోగముల నొందిఆచంద్రార్కమగుకీర్తి గడించినాడు. ఇన్ని మహాయోగములు ఆ గ్రహములచే ప్రాప్తించిన జాతకు డుద్భవించుట, మనకు నాయకుడై దుఃఖ దారిద్ర్యముం గుండిన మన దేశమును, ప్రజ లను, పలుకష్టముల ననుభవించి, దాస్య విముక్తిగావించి రక్షించుట భారతీయుల పూర్వజన్మ సుకృత మని చెప్పుటలో లేశమైన నతిశయోక్తి లేదు.

ఈ జాతకుని ప్రతిభా విశేషములు పలువురిచే వ్రాయబడి యున్నవి.

పరాశర, జైమిన్యాది మహర్షుల సాంప్రదాయమగు మన జ్యోతిష శాస్త్రరీత్యా ఈ జాతకుని వివిధ ప్రతిభా విశేషములు సహేతుకముగా అనేకులు పలుమారులు ప్రాసియున్నారు. కాన జ్యోతిషశాస్త్రమందు చెప్పబడిన ఈ హంశములు పునరుద్ఘాటింప నగత్యములేదు. ప్రస్తుతాంశమగు ఈ మహోన్నతుని నిర్యాణ కాల నిర్ణయము పరిశీలించుట జ్యోతిష శాస్త్ర రహస్యముల నెఱుగుట కుపకరించును గాన ఈ విషయమును పరిశీలింపవలెను. 1964సం॥ మే 27 వ తేదీన మధ్యాహ్నము గం. 2-00 లకు సింహ లగ్నమందీ జాతకుడు పరమపదించినాడు. తత్కాల గ్రహస్థితి ఇట్లున్నది.

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | కుజ బుధ గురు | రవి | శుక్ర రాహు | | రవి | | కేతు | | బుధ | కేతు | లగ్నం గురు |
| శని | రాశి | | | శుక్ర | నవాంశ | | లగ్న | చంద్ర | జననకాల ద్వాదశాంశ | | |
| | | | లగ్న | చంద్ర శని | | | | కుజ | | | |
| కేతు | చంద్ర | | | రాహు | | కుజ | బుధ గురు | శని శుక్ర | రాహు రవి | | |

తత్కాలమునకు రాహు మహర్దశా, బుధాంతరము, రాహు భుక్తి, శని సూక్ష్మదశ, శని ప్రాణదశ సంప్రాప్తించినవి. చంద్రుడు బుధనక్షత్ర గతుడై, బుధునకు స్థానాధిపతికి, షష్ఠాష్టక స్థితి నొందినాడు. శని రాహునక్షత్రగతుడై లగ్నమును సప్తమ దృష్టితో చూచుచున్నాడు. రాహు శనులకు నక్షత్ర పరివర్తన గల్గినది. జన్మలగ్నము బుధనక్షత్రమై, అందు జననకాల బుధ, రాహులు నైధనతారయందున్నారు. ఇట్టి స్థితి జననకాల చంద్రునకుగూడ సంభవించినది. కాన రాహు మహర్దశా, బుధాంతరమందు, రాహు విదశయందు మారకము సూచింపబడుచున్నది. అష్టాంశ చక్రము పరిశీలించిన లగ్నమునకు దశమ భావమందు బుధుడు చంద్ర యుతి నొందియున్నాడు. చంద్రుడు బుధ నక్షత్రగతుడైనాడు. వీరలను కేతు నక్షత్రగతుడగు శని సప్తమ దృష్టిచే చూచుచున్నాడు. చంద్రునకు రాహువు నైధనతారయందున్నాడని చెప్పియున్నాను. పై హంశముల ననుసరించి రాహు విదశయందు చంద్రుడు బుధ నక్షత్రగతుడై యుండు బుధవారమునాడు మరణము సంభవింపవలెనని శాస్త్రము తెల్పుచున్నది. మరణ కాలమునకు శని రాహునక్షత్రగతుడైనాడు. రాహువు మరణకాలమునకు బుధ క్షేత్రమందుండి తృతీయ రాజ్యాధిపత్యములు గల్గి, రాహునక్షత్రగతుడై మారక లక్షణము లొందిన శుక్రునితో గలసి యున్నాడు. తత్కాలమునకు నక్షత్ర దశాక్రమమున రాహు దశాశన్యంతరము ప్రాప్తించినది. (ఫలభాగమందలి తత్కాల గోచార గ్రహముల నక్షత్ర దశాభుక్తులు అందు ప్రాప్తించు ఫలములు, ఆంధ్ర పత్రికయందు జులై నెలనుండి 'దివాకర సిద్ధాంత' మను వ్యాసములందు ప్రచురింపబడును.) రాహుదశా శన్యంతరమందు శని కుంభమందు 10-24-40 నుండి 12-33-20 భాగలమధ్య సంచారము చేయునపుడు ఆరోగ్యమునకు ప్రమాదకరమగు భంగము వాటిల్లునని సూచింపబడుచున్నది. అందు ముఖ్యముగా కర్కాటక లగ్నమందు 27-53-20 నుండి 30 భాగలవరకు జనన మొందినవారు 3-20 నుండి 5-26-40 భాగల మధ్య జనన మొందినవారు ఆకస్మిక ప్రమాదములకు లోనై, అట్టి కాలమునకు జనన దశ క్రమరీత్యా మారకదశ, అంతర్దశ, విదశాదులు ప్రాప్తించిన మరణ మొందుట సిద్ధాంతము చేయబడినది. పైన చెప్పబడిన హంశముల పరిశీలించిన కర్కాటక లగ్నమునకు జననకాలమందు సప్తమాధిపతి యగు శని మారకస్థానగతుడైనపుడు ఆ శని అష్టమాంశమందు మారకులైన బుధ, రాహుల వీక్షించినపుడు అష్టమాంశమందు మారకస్థానమగు ద్వితీయమందున్న గ్రహక్షేత్రములు లగ్నములు కాగా అందు మరణము సంభవించునని శాస్త్రము తెల్పుచున్నది. ఈ శాస్త్ర ప్రామాణ్యరీత్యా ద్వితీయమందున్న రవి గురుల రాశులందు మరణము సంభవింపవలెను. ఈ రెండు గ్రహరాశులలో రవి రాశియందు సింహమును మాత్రము శని

సప్తమ దృష్టిచే వీక్షించుటచే సింహరాశి యందు మరణము ప్రాప్తించుట విశదము. గురునకుగాని, గురుక్షేత్రములకుగాని శని దృష్టి లేనందున ఆనాటి ధనుర్మీనరాశు లందు మరణము ప్రాప్తించదు. శని సింహ రాశిని చూచుచుండగా, తదధి పతి మారకు లగు దశ, అంతర్దశ, విదశా నాథులకు ద్విద్వాదశస్థితి నొందిన ఈ లగ్న మందు మరణము సంభవించుట శాస్త్ర ప్రమాణము.

నవమ భావము కర్మానుభవమును సూచించునని శాస్త్రము తెల్పుచున్నది. కాన మరణకాల నవమభావ విచారణచే ఈ జాతకుని కర్మానుఫల మగు ఉత్తర జన్మస్థితి విచారింపనగును. ఈ భావము నందు బుధ, కుజ, గురు లున్నారు. మేష లగ్నమునకు లగ్నస్థితినొందిన బుధ, కుజ, గురులు శుభులు. వీరిని లాభమం దున్న శని వీక్షించుచున్నాడు. కాన ఈ జాతకుడు శని, గురు కారకత్వములచే మూలత్రికోణ గతుడగు రుచకయోగ మందున్న కుజహంశలతో జననమొంది మహా రాజయోగము ననుభవించుచూ పూర్ణ శుభుడగు గురుని కటాక్షముచే యుత్తమలక్షణయుతుడై శనిచే సూచింప బడు దీనజనుల నుద్ధరించు ప్రభువై, ప్రజా రంజకుడై, జన్మరాహిత్యమునకుపకరించు సర్వోత్కృష్టమగు త్యాగముల జేయుచు జన్మసాఫల్యము నొందును. జననకాల ద్వాదశాంశ ననుసరించికూడ ఉత్తరజన్మ స్థితి తెలుపవచ్చు నని హోరాశాస్త్రము నందు చెప్పబడియున్నది. ఈ శాస్త్ర పరిచయముగలవారు ఈ మహా పురుషుని ద్వాదశాంశ చక్రమును పరిశీలించిన పై జెప్పబడిన ఇంటిలి యదార్థము తెలియ గలదు. మహా తేజస్వియగు రవికి ఉదయా స్తమయము లేనట్లు తేజోరూపులగు మహ నీయులుగూడ జనన మరణాద్యవస్థలు లేని చిరంజీవులని శాస్త్ర ప్రమాణము. మరణము శరీరమునకు గాని ఆత్మకు గాదనురహస్యముగ్రహించిన కర్మానుభవ ఫలితమును ఉత్తరజన్మ ఫలములందలి యదార్థము నెరుగుట నిస్సందేహము. పేరున నుత్తరజన్మమైననూ యదార్థ దృష్టితో అది మరొక జన్మయనుటకు వీలులేదు. పూర్వజన్మమనెడు శరీరమందు అసంపూర్ణమగు జన్మరాహిత్య సాధన క్రియ పూర్తిగావించు స్థానముగాన మహ నీయులగు తేజోరూపులు నా రుద్భవించి సంకల్పించిన క్రియా పరిపూర్తి నొందు వరకూ చిరంజీవులై వ్యవహరింతురు. అట్టి సాంప్రదాయమునకు జెందిన ఉత్తమ తేజో రూపుడగు శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ అమరుడై భారతావనియందు చిరంజీవి

# విధి బలీయము

హీరాలాల్ మోరియా

చన్నాడా ! మహానేత
భారత భాగ్యవిధాత !
సుమకోమల మృదు హృదయము
మహితాశా మధుకలశము.

అఖండ భూవలయానికి
మకుటరహిత సమ్రాట్టై.
విలసిల్లిన మా జవ్హరు
మిన్ను తొలచి చన్నాడా !

మానవాళి రక్షణకై
మనుగడను సాగించి
శత్రువులతో కరస్పర్శ
చేసిన నవ బుద్ధమూర్తి !

కన్ను మూసి, చన్నాడా !
మిన్ను, మన్ను కలచివై చి.

అమృతమూర్తి, త్యాగశీలి
అనాథులకు రక్షకుడై
మహానాయకోత్తముడై
మసలిన మా శాంతినేత
మరలిపోయెనా యిటుపై
మహానిర్మాణ పథము నంటి.
ఆశా గీతాలతో ని
రాశాంకిత హృదయాలకి
ప్రాణం పోసిన భారత
ఘన విపంచి తెగిపోయెన !
అస్తమించెనా ! ప్రపంచ
గగన పరిథిపై వెలిగే
రెండవ సూర్యుడు, జవ్హరు
పండితు డకటా, విధి బలీయము.

అనువాదం : 'కొలిపాక'



# పోరాటం - నాయకత్వం

'భారతజాతి కొనసాగించిన స్వేచ్ఛా సమరంలో జవహర్లాల్ నెహ్రూ ధీరయోధుడు. తన ఆశయం సిద్ధించిన అనంతరం బ్రిటిష్ ప్రజలతో సుహృద్భావ సత్సంబంధాలను కొనసాగించడానికి ముందుకొచ్చిన మహామనీషి' అంటూ జవహర్లాల్ నెహ్రూకు తమ శ్రద్ధాంజలి ఘటిస్తూ అన్నారు లార్డ్ ఎరల్ మౌంటుబాటన్.

ఆ విధంగా మౌంట్‌బాటన్ జవహర్లాల్ స్వభావంలో, జీవితంలో అత్యంత రమణీయమూ, అర్థవంతమూ, అతిప్రధానమూ అయిన వ్యక్తిత్వాన్ని నొక్కిచెప్పారు.

కోటీశ్వరుడుగా జన్మించినా ఐశ్వర్యాన్ని అనుభవించడానికీ, నిశ్చింతగా జీవితాన్ని గడపడానికీ ఆయన నోచుకోలేదు. ఒకసారి నెహ్రూను మాతృవాత్సల్యంతో ఆశీర్వదిస్తూ స్వర్గీయ డా॥ సరోజినీనాయుడు అతిసామాన్యమైన ప్రాపంచిక సుఖాలమధ్య చూడదలచుకోలేదనీ, బాధలూ, త్యాగాలూ, శ్రమా, స్వేదకణాలూ — వీటిమధ్యనే అతని జీవితం పరివేష్టించి వుండాలనీ తాను ఆశిస్తున్నానని అన్నారు.

రాజకీయ విభేదాలు దట్టంగా ఆకాశాన్ని కారుచీకట్లుగా కమ్ముకున్నప్పుడు, ప్రజలను ఉద్దేశిస్తూ 'మనం మన బలాన్ని పటిష్ఠవంతం చేసుకోవాలి' అని ఆయన ఉత్తేజపూరిత హృదయంతో ప్రబోధిస్తే, ఆతని రాజకీయ ప్రత్యర్థులు దానికి తప్పుడు వ్యాఖ్యానాలు చేసి, యిది మన అలీన విధానానికే వ్యతిరేకంగా వున్నదని అన్నప్పుడు నెహ్రూ దానికి సరియైన సమాధానాన్ని యిచ్చారు. "అవును మనకు బలం కావాలి. మన ప్రజల్లోగల దారిద్ర్యాన్ని, అశుచిని, బలహీనతను సమూలంగా నిర్మూలించడానికి మనకు బలంకావాలి. క్రూరప్రభుత్వానికి భరతవాక్యం పలికి, తమ హక్కులకై తలల్ని నిటారుగా పైకెత్తగలిగే ధైర్యవంతులైన ప్రజలుగల దేశాన్ని రూపొందించడానికి బలం కావాలి. ఇందుకు ఎవరయినా అడ్డు చెప్పగలరా?"

అవును. ఆయన బలాన్ని ప్రేమిస్తారు మంచికొరకు, ఒప్పుకొరకు సాగించే సమరానికి కావలసిన బలాన్ని ప్రేమిస్తారు. అయితే యీ సమరం ఎల్లప్పుడూ స్వచ్ఛందంగా వుండాలి. ఈ విషయంలో యీయన గాంధీజీతో ఏకీభవిస్తారు. ఆశయం ఎంత పవిత్రంగా వుంటుందో ఆ ఆశయసాధనకు చేసే ప్రయత్నంకూడా అంతే పవిత్రంగా వుండాలి. అందుచేతనే సుభాస్ చంద్రబోస్ నిస్వార్థగరిమకు నెహ్రూ కైమోడ్పు చేసినా యుద్ధకాలంలో జర్మనీ, ఇటలీలలోని ఫాసిస్టుల పరిపాలనలపై సుభాస్‌చంద్రబోసుకు అభిమానం వుండడాన్ని నెహ్రూ హర్షించలేక పోయారు. సంగ్రామం ముగిసిన తరువాత, విజయం లభించాక పగ, ద్వేషం యిక వుండకూడదు. క్షమించగలిగే విశాలమైన హృదయం ఉండాలి. మానవ కళ్యాణానికి పూర్వపు శత్రువుతోనైనా చెయ్యీ చెయ్యీ కలుపుకుని నలుగురూ వెళ్ళే మార్గంపై ముందుకు వెళ్ళగలిగే నిష్కల్మష హృదయం వుండాలి. సంసిద్ధులు కావాలి — అనునిత్యం ఇవే యీయన ఆశయాలు. దీనికి సంబంధించినంతవరకు యీయన నిజమైన మతవిశ్వాసం కలవాడు. జవహర్లాల్ వైజ్ఞానిక విధానాన్నే కోరతారని, మతాన్ని గౌరవించరని ఒక ప్రబలమైన అభిప్రాయం ప్రజల్లో పాతుకొనిపోయి వుంది. ఆచారాల్నీ కర్మల్నీ ఆయన గౌరవించకపోవచ్చు. కాని మతంయొక్క నిజమైన ధ్యేయాన్ని, మతం జీవితాన్ని దరిజేర్చే మార్గాన్ని ఆయన గౌరవిస్తారు. ఆపద్ధర్మ ప్రభుత్వానికి ఉపరాష్ట్రపతిగా నియమింపబడిన తరువాత దేశప్రజల్ని ఉద్దేశిస్తూ ఆకాశవాణిలో ప్రసంగిస్తూ అనుకోకుండా ఆయన తాను "ఆరాధనాస్థితి"లో ప్రసంగిస్తున్నాను — అని అన్నారు. సర్వసాధారణంగా గాంధీజీ తన ప్రార్థనా సమావేశాల్లో చెప్పేటట్టుగామాత్రం నెహ్రూ హిందూ మతధర్మాలను గురించిగాని, బౌద్ధ మత ధర్మాల గురించిగాని, మరి ఏ యితర మతాల గురించిగాని ఎక్కువగా చెప్పేవారుకాదు. అయితే బౌద్ధవిగ్రహంముందు నెహ్రూ ఎప్పుడూ గౌరవంతో తల వంచేవారు. తన కుటుంబంతో జరిపిన సింహళ పర్యటనను గురించివ్రాస్తూ —

"అనురాధ పురంలో కూర్చుని వున్న పురాతన బుద్ధవిగ్రహం నన్నెంతగానో ఆకర్షించింది. ఒక్క ఏడాదితరువాత నేను డెహరాడూన్ జైలులో వున్నప్పుడు సింహళంలోని ఒక స్నేహితుడు ఆ బుద్ధవిగ్రహపు ఫోటోను పంపించాడు. దాన్ని నేను నాజైలు గదిలోని చిన్నటేబిలుపై వుంచాను. ఈ

ఫోటో నాకెంతో ఆత్మీయుడిగా అయిపోయింది. గంభీరమైన, నిశ్చలమైన బుద్ధ విగ్రహంలోని భావాలు నాలో మానసిక శక్తిని కలిగించాయి. నైరాశ్యాన్ని పారద్రోలాయి.

"బుద్ధుడంటే నాకు మొదటినుంచీ ఎంతో అభిమానం. ఈ అభిమానానికి కారణమేమిటో వివరంగా నేను నిర్వచించలేను. అయితే యిది మత సంబంధమైనది మాత్రం కాదు. బౌద్ధమతం చుట్టూ అల్లుకున్న సిద్ధాంతాలపై నాకెలాంటి అభిరుచీలేదు. ఆయన వ్యక్తిత్వమే నన్ను ముగ్ధుణ్ణి చేస్తున్నది. అదే విధంగా క్రీస్తు వ్యక్తిత్వం కూడా నన్నెంతో ఆకర్షించింది."

నిజం. బుద్ధుడూ, క్రీస్తులనుండి వచ్చిన బలమే అది. మరొకసారి, బుద్ధుని ప్రవచనాలు, భగవద్గీత ఉపదేశాలు తన జీవితంపై, ఆలోచనలపై ఎంతగానో ప్రభావం చూపించాయని అన్నారు. అటువంటి పవిత్రమైన మార్గాలలో నుండివచ్చిన బలం పవిత్రమైన కార్యాలకే వెచ్చించాలి. జవహర్లాల్ నెహ్రూ ఎల్లప్పుడూ పవిత్రమైన కార్యానికే అంకితమైన మనిషి.

నెహ్రూలోని ధీరగుణం చాలవరకు ఆయన తండ్రివద్దనుండే లభించింది ఆయన గురించి నెహ్రూ యీ విధంగా అన్నారు: "ఆయన చిన్నతనంలోని తిరుగుబాటు స్వభావం ఒక కొత్త స్వరూపాన్ని సంతరించుకుంది. వృత్తిలో విజయాన్ని కురిపించింది. గౌరవాన్ని, ఆత్మస్థైర్యాన్ని వృద్ధి చేసింది.

"ధైర్యానికీ, బలానికీ, తెలివితేటలకూ వారు ప్రతిరూపం అనిపిస్తారు. నాకు ఎదురుపడిన వారందరిలోకీ ఉన్నతమయినవ్యక్తి. నేను పెరిగి పెద్దవాడినైన తరువాత వారిలాగే వుండాలనుకున్నాను."

గతంలోని యోధులకు, భావుకులకు సంబంధించిన పుస్తకాలనుండి కొంత ధైర్యస్థైర్యాల సంగ్రహించారు. ఆదిలో రష్యా-జపాను యుద్ధ ప్రభావం ఆయనపై ప్రసరించి, జపానుపై అనేక గ్రంథాలను సేకరించారు జపాను చరిత్రను చదివారు. 'పురాతన జపాను దేశపు వీరగాథలు' ఆకర్షించాయి జాతీయ భావాలు మనసులో మొలకెత్తాయి.

"యూరపు దేశీయులు బిగించిన దాస్య శృంఖలాలనుండి భారతదేశం, ఆసియాదేశాలు విముక్తులను చేసేవిషయంపై నేను దీర్ఘంగా ఆలోచించాను. ఎన్నో వీరోచిత కల్పనలు — చేతిలో కృపాణంతో పోరాడి భారత దాస్యశృంఖలాలను విచ్ఛిత్తి చేసి స్వేచ్ఛను ప్రసాదించినట్లు — కలలు గనేవాడిని."

గారిబాల్డీ జీవిత పుస్తకాలు బాగా ఆకర్షించాయి. "భారతదేశంలో కూడా అదే మాదిరిగా జరిగినట్లు, స్వేచ్ఛకై పోరాటం జరిపినట్లు కలలు కనేవాడిని. నా దృష్టిలో భారతదేశమూ, ఇటలీ — రెండూ ఒకదానితో ఒకటి కలిసిపోయినట్లు అనిపించేవి."

ఆయన కల నిజమైంది. స్వేచ్ఛకై అన్ని విధాలా వీరోచితంగా జవహర్లాల్ నెహ్రూ పోరాటం కొనసాగించారు. మొదట తన మాతృదేశం స్వేచ్ఛావాయువులు పీల్చటానికి ఆతర్వాత ప్రపంచమంతటా స్వేచ్ఛావాయువులు వీచడానికి సుదీర్ఘమైన పోరాటం సాగించారు. ప్రపంచమంతటా అణచివేయబడుతున్న ప్రజలకు ఆయన కంఠం ఆశాజనకంగా వినిపించింది భారతదేశాన్ని ఆదర్శంగా పట్టుకుని మిగతా బానిసదేశాలు స్వాతంత్ర్య శాంతి సమరాన్ని సాగించాయి. భారతదేశపు విజయం వాటికి ఎంతో ప్రోత్సాహాన్నిచ్చింది ఈనాడు ఆసియా, ఆఫ్రికా దేశాలలో కొత్తగా స్వతంత్రమయినదేశాల నాయకులు గాంధీ, నెహ్రూలకు ఎంతగానో ఋణపడివున్నారు

స్వాతంత్ర్యం సంపాదించడంతోనే సంగ్రామం ముగియలేదు. నిజానికి ఆతర్వాతనే అసలుయుద్ధం ప్రారంభమైంది. బ్రిటిషువారి ఆధిపత్యం నుండి తప్పుకోవడంతో సరిపోలేదు. ప్రజల దారిద్ర్యాన్ని, అజ్ఞానాన్ని, బాధలను తొలగించడమే అసలైన యుద్ధం. రాజకీయ స్వేచ్ఛ కేవలం మార్గాన్ని మాత్రమే సుగమం చేస్తుంది. దేశం విడిచి వెళ్ళబోయే స్వాతంత్ర్యానికి ముందే [illegible] బ్రిటిషువారు సాంఘిక సంస్కరణలకు కొన్ని అవకాశాలను కల్పించారు. ఆతర్వాత వచ్చే భారతీయ ప్రభుత్వాలు వాటిని అనుసరించటానికి వీలుగా బ్రిటిషువారు ఆ చర్యలను తీసుకున్నారు కాని యీ సంస్కరణలు అంతగా విజయం కాలేదు. దీనికి కారణం అన్నట్టు, "మనం జాతీయభావం అనే జబ్బుతో బాధపడుతున్నాం అది మన శ్రద్ధను లాక్కుంది. మనం మన రాజకీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించినా యిది మాత్రం అలానే వుండిపోయింది. ఈ సమయంలో నెహ్రూ బెర్నార్డ్‌షా వాక్యాలను ప్రస్తావించారు. "జయింపబడినదేశం కేన్సరు వ్యాధిగల మనిషివంటిది తన గురించి తను ఆలోచించుకోడంతప్ప మరేమీ వుండదు... ఏదేశానికైనా జాతీయోద్యమం తప్ప అంతకన్న ముఖ్యమైన కార్యం మరొకటిలేదు. జయింపబడినదేశాలు ప్రపంచ గమనంలో తమ స్థానాన్ని కోల్పోతాయి.

ఈ విధమైన శాపాన్నికూడా మనం అధిగమించం సాంఘిక, ఆర్థిక సమస్యలను సమూలంగా త్రుంచివేసే నిజమైన సంగ్రా

మానికి నెహ్రూ ప్రారంభోత్సవం చేశారు. ప్రణాళికాబద్ధమైన దేశ పునర్నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. స్వేచ్ఛా భారతావనికి తొలి ప్రధానిగా పనిచేసిన పదిహేడు సంవత్సరాలూ ఆయన దేశ పునర్నిర్మాణానికి కొనసాగించిన సుదీర్ఘమైన కృషికీ, సంగ్రామానికీ చిహ్నం. మనపై చైనావారు కొనసాగించిన దురాక్రమణ ఛాయలు మన యుద్ధ ప్రయత్నాలూ కూడా దేశ నిర్మాణానికి కొనసాగించవలసిన ప్రాథమిక సంగ్రామ కృషికి అంతరాయాన్ని కలిగించ లేదు. ఈ సమయంలో పార్లమెంటులో ప్రధాని గంభీరోపన్యాసం గుర్తుంచుకోవాలి."

"ప్రజల స్థితిగతులను బాగుపరచడం, వారి స్థాయిని పెంచడం, దేశం ఏ సమస్యనైనా ఎదుర్కోగల విధంగా పటిష్టవంతంగా చేయడమే పంచవర్ష ప్రణాళికల అసలు లక్ష్యం. పది పన్నెండేళ్ళకంటే యీనాడు మనం యీ సమస్యలు ధైర్యంగా ఎదుర్కోగలిగే స్థితిలో కొచ్చామనే విషయంలో తిరుగులేదు. దీనికి కారణం పబ్లిక్, ప్రయివేటు రంగాలు రెండింటా మనం మన పారిశ్రామికోత్పత్తిని పెంపుదల చేసుకోవడమే. ఈసమస్యను మనం పది, పన్నెండేళ్ళ కిందటేగాని ఎదుర్కోవలసివస్తే, నిజానికి మన సైన్యం యీనాటంత ధైర్యంగా బలీయంగా వుందో అంతే ధైర్యంగా బలీయంగా అనాడుకూడా వున్నప్పటికీ, ఈ సమస్యను ఎదుర్కోవడం అనాడు మనకు కష్టసాధ్యమయి వుండేది. అందుచేత మనం పంచవర్ష ప్రణాళికలతో ముందుకు నడవాలా లేక రక్షణ కృషివైపు మన ప్రయత్నాలను మళ్ళించాలా అన్న విషయంలో ఎవరి మనసుల్లోనూ సందేహాస్పదాలు వుండకూడదు. ప్రణాళికలు మన రక్షణ కృషిలో అంతర్భాగాలు.

నెహ్రూ తరచుగా అంటూవుండే కలలుగన్న భారతదేశం, నిర్మింపబడేవరకూ యీ రక్షణకృషి, ప్రణాళికలు అలా నిర్వహిస్తునే వుండాలి. కొత్తగా జన్మించిన భారతదేశ మది. తన సాంఘిక, ఆర్థిక సమస్యలపై విజయాన్ని సాధించిన గర్వపడదగ్గ ప్రగతి పథంలోని భారతదేశ మది. దురాక్రమణలను ప్రతిఘటించగల బలీయమైన, బ్రహ్మాండమైన భారతదేశం అది. ప్రపంచంలోని దేశాలకు దివ్య జ్యోతి వెలుగు నివ్వగల మార్గదర్శి. ఈ శ్రేయోరాజ్య నిర్మాణానికే జవహర్ తన జీవితాన్ని అంకితంచేశారు. అదే స్థైర్యంతో, విశ్వాసంతో యీ సంగ్రామాన్ని మనం కొనసాగించాలి. అనాడే మనకు నిజమైన విజయం సిద్ధించగలదు.

---

# అమరజీవి

వి. వి. వి. సత్యనారాయణ

నమ్మలేని నిజం
నిజంగా నమ్మలేని నిజం
యీరోజు భారత జన హృదయాల్లో
కలకాలం నిలిచే విషాద రేఖ
ఉదయించిన సూర్యుడు
అరికి అస్తమిస్తున్నాడు
అస్తమించిన సూర్యుడు
తిరిగి ఉదయిస్తున్నాడు
కాని కాని........
మన నవభారత నిర్మాత
విశ్వ శాంతిదూత
తిరిగి రాడు మరలి రాడు
యీ యిరుల గుంపు విడుగబోదు
మనస్సుల్ని దుఃఖాంబుధిలో ముంచి
దుర్విధికి తల వంచి
దవు దవ్వులకు వెళ్ళిపోయావా
సత్యలోకంలోకి వెళ్ళిపోయావా తాతా
నిత్య నవయౌవనపు నేతా
నీకోసం లోకం రోదిస్తోంది
ప్రకృతి పరితపిస్తోంది
నిత్యసత్యంలా నిండుగుండెలతో
నిత్యమూ నీ గుండెల్ని తియ్యగా పిండిన
ఎదిగే ఎర్రని ఎర్రగులాబీలు
ఎలా ఎండిపోతున్నాయో చూడు
ఎలా మండిపోతున్నాయో చూడు
వాడి ఎలా నేలకి తలవాల్చుతున్నాయో
చూడు
అవును వది ఏమైతేనేం ?
ఎవరు ఏమైతేనేం ?
నీవు మరణించీ
మరణించని
అమరజీవివి
నీకై పరితపిస్తున్న మేము
మరణించక బ్రతికుండి కూడా
మరణ వేదన పొందుతున్న
మర జీవులం
మేమే మరణించడం సంభవిస్తే
ఎర్రని ఎర్ర గులాబీలమై మళ్ళీ పుట్టి
పువుగా పెరిగి
యింతంతై వికసించి
నీ నిండు గుండెల్ని
పండించాలని
పండు వెన్నెల్ని
నిండించాలని
ఉంది జవహర్
అవును మరి
మాకా అవకాశం
ఎప్పుడు ఆ విధి
అనుగ్రహిస్తాడో జవహర్
అవును వది ఏమైతేనేం ?
ఎవరు ఏమైతేనేం ?
నువ్వు అమర జీవివి.
మరణించీ మరణించని
అమరజీవివి.

# అజాతశత్రుడు - నెహ్రూ

అత డజాతశత్రుడు - ప్రి
　యమ్ము నయ మ్మనయమ్ము చూపులం
జేతల చూపువాడు - కయి
　సేసిన నవ్వుల పూలమోముతో
వాతెఱ విప్పువాడు - పసి
　బాలురపై నెనరుంచువాడు లే
డీతఁడి - దైవమా! తగున
　టే యిది మమ్ముల వేసు చేతువా?

భారత భావి సౌధమున
　బంగరుమెట్లు నమర్చినావు సిం
గారము గూర్చినావు చెలి
　కాంధ్ర సమైక్యము చేసినావు సై
వారము లందినావు తెల
　వారలచే అకటా! హఠాత్తుగా
చేరితి స్వర్గధామమును
　చిన్నల పెద్దల కేమి చెప్పితో?

　　జారిపోయెనుగద నేడు భారతాంబ
　　ముకుటమందలి చిన్నారి ముత్తియంబు
　　ఆరిపోయెను గద నేడనంతజగతి
　　దీప్తిమంతమ్ము చేసెడి దీపకళిక.

నిజమా? జవ్వారులాలు శాంతినిధి క్రాం
　తిం జూపు ధీశాలి యీ
ప్రజలన్ ఱెక్కలురానివారలను తీ
　రా కన్నులే విప్పన
ట్టి జనమ్మున్ విడిపోయినావుగద తం
　డ్రీ! మాకు దిక్కెవ్వరో?
విజయా! లోకము శోకఘూర్ణమయి కా
　వించెన్ మహారావముల్.

　　కూలెరా! పసివాంధ్ర గుండెకాయలు మండి
　　　　బాలబంధువు లేని బ్రదుకు దలచి!
　　కరగెరా! నాయకాగ్రణుల బంగరుకలల్
　　　　సవ్యసాచియె లేని జన్మ దలచి!

వ్రాలెరా! భావిభారత సౌధపటలమ్ము
　　　　మంత్రివర్యుడు లేని మాట దలచి!
కుమిలెరా! భరతాంబ గుణరాశి సచ్ఛీలి
　　　　కనులముందర లేని గడియ దలచి!

కోటయేగాదు సుమ్ము భూగోళ మెల్ల
అవురంచును తుకతుక లాడిపోయె!
జవహరా! కన్నుమూసిన క్షణమునందె
బళిర! కన్నీరు గార్చని ప్రాణి లేదు.

రచియించినాడు! సద్గ్రంథముల్ కవికోటి
　　　　నందెవేసిన చేయి యనగ నితడు!
సూత్రించినాడు! విస్తుపడ విదేశులు
　　　　చిన్నిమాటల 'పంచశీల' నితడు!
అందించినాడు! నెయ్యము తియ్యమును జేర్చి
　　　　జగము మెచ్చగ నీతిసార మితడు!
త్రాగించినాడు! నల్వదికోట్ల జనులచే
　　　　సరససాహిత్యవాగ్ధార నితడు!

జవ్వారుడు సార్థకముగ వజ్రమ్ముగాగ
అరుల కేనాడు దుర్భేద్య మగుచు నితడు
భారతాంబను రేబవల్ పాపవోలె
కాచి రక్షించి ఈనాడు కన్ను మూసె!

'చైనా' దాడి యొనర్చిన
గానీ! దరిచేరదీసి కర్తవ్యమ్మున్
పీనులవిందుగ నేర్పిన
వానికిరా! యిట్టి చావు - పాపము గాదే?

కోటపై నిల్చి వింతసయ్యాట లాడు
చిన్నిరోజాకుమారి విషణ్ణ యయ్యె -
బాలబంధుడు లేడన్న బాలు రెల్ల
రావు రనుచున్నవారు! మహానుభావ!

'శాంతిదూత' ప్రాణజాలమ్ము గొనిపోవ
దమ్ము లెట్లు వచ్చె ధర్మజునకు -
వాని లోక మాఱ - వాని వంశము కూల -
వాని బ్రతుకు మాడి వట్టిపోవ.

# జవహరుకు గర్వకారకులైన ఆంధ్ర ప్రజలు

"ఆంధ్ర ప్రజలు నాకు గర్వకారకులు,'' అని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1959 అక్టోబరులో రాష్ట్రంలో పర్యటించిన సందర్భంలో తిరుపతిలో, చేసిన తమ ప్రసంగాన్ని ముగింప జేస్తూ అన్నారు. రాష్ట్రంలో ఆయన జరిపిన పర్యటనలో ఇదే చివరి మజిలీ.

ఈ పర్యటన సందర్భంలో శ్రీ నెహ్రూ షాద్‌నగర్‌లో పంచాయతీ సమితికి ప్రారంభోత్సవం జరిపి, ప్రజాస్వామిక వికేంద్రీకరణ సూత్రాన్ని చట్టబద్ధంగా ఆచరణలోకి తెచ్చారు. 13 సంవత్సరాల క్రితం మనకు స్వరాజ్యం వచ్చిన పిమ్మట అంతటి ప్రాముఖ్యత గల సంఘటన ఇదేనని ఆయన అన్నారు. ప్రజాస్వామిక వికేంద్రీకరణ జరగడ మంటే గ్రామీణులకు యదార్థంగా స్వరాజ్యం లభించడ మన్నమాట. ఈ నూతన వ్యవస్థలో గ్రామస్థులకు తమ అభివృద్ధికి తామే మార్గాలను రూపొందించు కోవడానికి అవకాశం వుండడమే దీనికి కారణం. ఇంతేకాక తమ నిర్ణయాలను అమలు పరిచే వారు కూడా వారే. ప్రభుత్వం సలహాలు మాత్రమే ఇస్తూ, సహాయం అందజేస్తూ వుంటుంది. అభ్యుదయ కరమైన ఈ చర్య రాజస్తాన్, ఆంధ్రప్రదేశ్‌లలో మాత్రమే అమలులోనికి వచ్చింది. ప్రజలు తమకు నూతనంగా సంక్రమించిన అధికారాలను వివేకవంతంగా వినియోగించుకొని సఫలం జెందినట్లయితే ఇతర రాష్ట్రాలవారు దానికి హర్షిస్తారు. వారి అడుగు జాడలలో నడుస్తారు.

## ఆయన వెలిగించిన దీపం

ఈ పర్యటన సందర్భంలోనే, నాగార్జున సాగర్‌వద్ద మేస్త్రీగా పనిచేస్తున్న బత్తుల రామయ్య అనే ఒకవడ్డెర తనను ఉద్దేశించి అనిన మాటలకు పండిట్‌జీ ఎంతో ముగ్ధులయ్యారు. ప్రధాన మంత్రి నాగార్జున సాగర్‌ను సందర్శించ వచ్చినప్పుడు ఈ మేస్త్రీ ఆయనను సమీపించి "ఇది మీరు వెలిగించిన దీపం" అని అన్నాడు.

శ్రీ రామయ్య తెలుగులో అనన మాటలను పండిట్‌జీ జాగ్రత్తగా మననం చేసుకొని, కంఠస్థం చేసి తరువాత విజయవాడలో బహిరంగసభలో ఉపన్యసించిన సందర్భంలో వినిపించారు. ఈ మాటలు విన్నప్పుడు తానెంతో గర్వించా నని ఆయన చెప్పారు. తన జీవితకాలంలో అచ్చటచ్చటా ఒక్కొక్క దివ్వెను తాను వెలిగించగలిగి నట్లయితే తన జన్మ సార్థక మైనట్లుగా భావిస్తానని ఆయన అన్నారు.

1955 డిశంబరులో ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ నాగార్జునసాగర్‌కు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ విషయాన్నే వడ్డెర రామయ్య ప్రధానితో అన్న మాటలలో సూచించాడు. ''ఇచ్చట నాగార్జున సాగర్‌కు శంకుస్థాపన చేయడాన్ని నేను ఒక పవిత్రకార్యంగా భావిస్తున్నాను. భారత మానవతా మందిరానికి ఇది పునాది. దేశ వ్యాప్తంగా మనం నిర్మిస్తున్న నూత్న దేవాలయాలకు ఇది ఒక చిహ్నం. నాగార్జున సాగర్ ఆనకట్ట, భారత ప్రజలు అభిలషిస్తున్న భావి అభ్యున్నతికి మాత్రమే చిహ్నం కాదు. గతాన్నికూడా అది జ్ఞప్తి చేస్తూ వుంటుంది.

"భారత దేశం విజ్ఞానంతో విలసిల్లుతూ తన పొరుగు దేశాలకూ, మిత్రులకూ జ్ఞాన భిక్షను ప్రసాదించినప్పటి మన మహోజ్వల చరిత్ర ఘట్టాన్ని స్ఫురణకు తెచ్చుకోవాలి. సుమారు రెండు వేల సంవత్సరాల తరువాత ఇప్పుడు మనం స్వతంత్రుల మయ్యాం. పొరుగుదేశాలతో సత్సంబంధాలను పునః స్థాపించుకున్నాం. మానవాళి ప్రగతికి, శాంతి సంస్థాపనకు అందరూ కలిసికట్టుగా కృషి చేస్తారని నేను విశ్వసిస్తున్నాను. ఇప్పుడు మనం దేశవ్యాప్తంగా ప్రారంభిస్తున్న బృహత్తరమైన ఈ కృషికి శ్రమజీవులైన మన పూర్వీకుల ఆశీస్సులు లభిస్తున్నట్లుగా నాకు గోచరిస్తున్నది. బృహత్తరమైన ఈ కృషికి నాగార్జునసాగర్ ఒక చిహ్నం. ఈనాడు మనం జరపవలసిన ప్రార్థన ఏమిటి? మనం నిర్మించగల ఉత్తమ మందిరం ఏది? మన సోదరీ, సోదరుల యశస్సుకై నిర్మిత మవుతున్న దేవాలయ మిది. అందుచేత, మన ప్రజలు సుభిక్షంతో తులతూగాలనీ వారి దారిద్ర్యం, ఇబ్బందులు పటాపంచలు కావాలనీ ప్రార్థిద్దాం," అని ఆ శంకుస్థాపన సందర్భంలో శ్రీ నెహ్రూ అన్నారు.

## సక్రమ దృక్పథం

గతసంవత్సరం పండిట్‌జీ మన రాష్ట్రానికి దయచేసి వేంచేసినపుడు, శ్రీశైలం ప్రాజెక్టులకు లాంఛన ప్రాయంగా శంకుస్థాపన చేశారు. 1963 జులై 24 వ తేదీన ప్రధాన మంత్రి శ్రీశైలంలో ప్రసంగిస్తూ, మహారాష్ట్ర, కర్నాటక రైతులకు ఆంధ్రవల్ల నష్టం కలగదంటూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి లోగడ ఇచ్చిన హామీని ప్రస్తావించి దానిని కొనియాడారు. ''ఇది సక్రమమైన దృక్పథ మని'' ఆయన అన్నారు.

శ్రీశైలం వద్ద విద్యుచ్ఛక్తి ఉత్పత్తి జరగడం వల్ల భారతదేశ బలసంపద పెంపొందుతుందన్నారు. "వ్యవసాయం బాగా అభివృద్ధి జెందిన రాష్ట్రాలలో ఆంధ్ర ఒకటి. అయితే ఈ అభివృద్ధి ఇతోధికంగా జరగాలి. ఈ ప్రాజెక్టుకు నా శుభాకాంక్షలు. ప్రజానీకానికి ఇది అభ్యుదయాన్ని చేకూర్చగల దని నేను ఆశిస్తున్నాను," అన్నారు శ్రీ నెహ్రూ

# నెహ్రూ దర్శనం

(ఇవి నెహ్రూ గ్రంథాలనుండి సేకరించబడినవి.)

"ఇప్పటికీ, ఇప్పుడుకూడా కర్తవ్యపాలన పిలుపు నా అంతరాంతరాలలో వింత భావాలను రేపుతుంది. తరచుగా ఆలోచనా పూర్వకమైన చిన్న ఒడుదుడుకులనూ రేకెత్తిస్తూ వుంటుందికూడా. సాహసోపేతమూ, అపాయకరమూ అయిన ఆ సమయంలో మృత్యుగహ్వర సమీపంలోవున్న ఆ ఏకాంత ఉద్వేగ ప్రేరేపణావేగాన్ని ఒకసారి మరలా అనుభవించాలని నా కోరిక. మృత్యువునన్ను అంతగా కలవరపెట్టదని నేను అనుకోను. దానిపట్ల నాకు అంత అభిలాష, భయమూ, కుతూహలమూ లేవు. అయినప్పటికీ ఈ జీవితాన్నుండి విముక్తి కోరడంగాని జీవితాన్ని కాదనడంగాని నేను అంగీకరించను. నేను జీవితాన్ని ప్రేమించాను. దానిపట్ల నాకు ఇప్పటికీ ఆకర్షణ వున్నది. అగోచరమైన అగణ్యమైన అడ్డంకులు నా చుట్టూ నిలచి నన్నావరించినా నా మార్గంలో నేను ఇంకా జీవితానుభూతుల నన్వేషిస్తూనే వుంటాను. ఈ ఒక్క కోరిక నన్ను జీవితగమ్యం వైపు నడిపిస్తున్నది. జీవన ధ్రువాలవైపు పరికించటానికి, దానికి బానిసగా పడివుండటానికీ కాదు, నా యాత్ర. నా జీవితాన్వేషణ— ఆసక్తి— ఇది మనం ఒకరినొకరు గౌరవించుకొనడానికే, నేను విమానచోదకుణ్ణి అయి వుండవలసింది. అలా అయితే జీవిత మాంద్యమూ విసుగుదలా నన్నావరించినపుడు ఆ మేఘాల గుంపులోనికిదూకిపోయి "నేను అన్నింటినీ చవిచూశాను. జీవస్మరణాల సమన్వయంలో నాకు గతంతో నిమిత్తంలేదు. భవిష్యత్తుతోనూ లేదు" అని నాతోనేను చెప్పుకొని వుండేవాడిని."

* * *

"భారతదేశం నా రక్తంలోనిండివున్నది. నన్ను సహజంగా ఝల్లుమనిపించి ఆకట్టుకొనే దేదో ఆమెలో వున్నది. అయినప్పటికీ వర్తమానంపైనా, గతానికిచెందినకొన్ని విశేషాంశాలపైనాగల ఏహ్యతతో పూర్తి అపరిచితుడనైన విమర్శకుడిగా నేనామెను సమీపించాను. కొంతవరకు పశ్చిమంనుండి, ఆ దృక్పథంతో నేనామెను పరికించానుకోవచ్చు. పాశ్చాత్య మిత్రునివలె నేనామెను సమీపించాను. ఆమె సహజమూర్తినీ, స్వరూపాన్నీ మార్చి ఆధునాతన రూపాన్నివ్వడానికి నేనెంతో కుతూహలాయత్తచిత్తుడ నయ్యాను. అయితే పరంపరాగత వారసత్వాన్ని విధ్వంసం చేయదలచిన నేను ముందు భారతదేశాన్ని సంపూర్ణంగా అవగతం చేసుకొన్నాను. ఇక్కడ ఖండ ఖండాలు చేయవలసినది ఎంతో వున్నది. అది నిర్మూలించవలసిందే. అయితేఅప్పుడు భారతదేశం తన సహజత్వాన్నీ, తన ప్రత్యేకతను కోల్పోయివుండేది. వేలాది సంవత్సరాల సంస్కృతీ చిహ్నంగా వర్ధిల్లుతూ ప్రత్యేకత బడసిన భారతదేశం అమూల్యమూ అనన్యమూ అయిన తన ఔన్నత్యానికి ప్రాణప్రదమైనదానిని కోల్పోయివుండేది. ఇంతప్రత్యేకతకూ కారణమైన ఈ 'అది' అనేదేమిటి?"

* * *

"ప్రపంచమంతటా ఇటీవల జరుగుతున్న సంఘటనలు అంతర్జాతీయవాదమూ, సామాన్య జనతోద్యమములముందు జాతీయ వాదం అస్తమిస్తున్నదనే అభిప్రాయం కొంతవరకు సత్యమని మనకు ఋజువు చేశాయి. జన సందోహశక్తిని ప్రేరేపించే వాటిలో ఇదొకటి. దీని చుట్టూ సామాన్య జీవనము, లక్ష్యసిద్ధి పరంపరాగత సంప్రదాయకభావాలూ పరిభ్రమిస్తూ వుంటాయి."

"మధ్యతరగతి జనుల మేధావిసంపత్తి అంతస్థు ఈ జాతీయతా వాదంనుండిదూరం అవుతున్నకొద్దీ, అంతర్జాతీయ వాదంపై యోచనాపూర్వకంగా ఆధారపడిన లేక అలా అనుకుంటున్న, కార్మిక, జనతోద్యమాలు జాతీయతావాదంవైపు కొట్టుకునిపోతున్నవి. యుద్ధం అందరినీ సమూలాలనుండీ జాతీయ వాదంలోనికి సమ్మిశ్రపరచింది. జాతీయతా వాదపు ఈ ఆకస్మిక పునరుజ్జీవన, లేక వినూత్న స్వరూపం, పాతసమస్యల తీరు తెన్నులను తల్లక్రిందులు చేసి కొన్నినూతన సమస్యలను లేవనెత్తింది. ప్రాచీన ప్రతిష్ఠితములైన సంప్రదాయాలు సులభంగా విడిచివేస్తే తుడిచిపెట్టుకుపోయేవికావు. సందిగ్ధ సమయాలలో మానవ మస్తిష్కాలలో తల చూపి వానిని ప్రబలంగా ఆక్రమించుకొంటాయి. ప్రజలను పరిశ్రమ త్యాగబుద్ధులకు ఉన్ముఖులనుగా చేయడానికి ఈ సంప్రదాయాలను ఉపయోగించి పని జరుపుకోవడానికి ప్రయత్నించడం మనం చూస్తున్నదే.

నూతన పరిస్థితులనూ యోచనా పద్ధతులనూ ఎదుర్కొనేటప్పుడు ఈ సంప్రదాయాలను యథాతథంగానో, లేక కొన్ని అవశ్యకమైన మార్పులతోనో అవలంబించవచ్చును. అదే కాలంలో నూతన సంప్రదాయాలను కూడా నెలకొల్పడం జరగాలి. జాతీయతా దర్శం బలమైనది, అగాధమైనదిన్నీ. భవిష్యత్ప్రయోజనం ఏమీలేనిగతం మాత్రం కాజాలదు. నేటి అస్పష్టసంఘటనలపై ఎక్కువగా ఆధారపడి బయలుదేరిన ఉద్యమవాదాలు చాలావున్నాయి. ఈ వివిధ ఉద్యమాలమధ్య సంఘర్షణను తగ్గించి సమైక్య సాధనకు కృషిచేయాలంటే అంతర్జాతీయవాద, జనతోద్యమవాదాలమధ్య ఒక విధమైన సామరస్యం, సమ్మేళనంఉండాలి. జాతీయతావాదం మానవుని ఆత్మకు చేసే శాశ్వతమైన వినతిగుర్తింపబడి ఆచరణ యోగ్యం కావాలి. దీని అధికారం కొన్ని పరిమిత ప్రాంతాలకు మాత్రంచెంది వుండటం విచారణీయం,"

* * *

"భారతదేశపు టౌన్నత్యానికీ, దాని బలహీనతకూ, వినాశనానికీ కారణభూతాలైన సమస్యలు క్లిష్టములు, దీర్ఘతరములున్నూ. అయినా ఆ వినాశ హేతువులైన కొన్ని కారణాలు ఇటీవల ప్రత్యక్షంగా గోచరమవుతున్నాయి. సాంకేతిక ప్రమాణంలో భారతదేశం వెనుకబడివుంది. అనేక విషయాలలో వెనుక బడివున్న యూరప్ నేడు సాంకేతికాభివృద్ధిలో పురోగామి అయింది. ఈ సాంకేతికాభివృద్ధికి వెనుక, శాస్త్ర విజ్ఞానం, సాహస పరిశోధనలు – నవజీవనోత్సాహ శక్తి స్థైర్యములు దోహదం చేసి వుండవచ్చును. ఈ అధునాతన విధానాలు పశ్చిమ యూరప్ దేశాల కన్నింటికీ సమర్థవంతమైన సైనిక శక్తిని చేకూర్చాయి. ప్రాచ్యరాజ్యాలపై విస్తరించితమప్రాబల్యాన్నీ, అధికారాన్నీ వారిపై చలాయించటం నేడు వారికి సులభతరం. ఇది భారతదేశానికి సంబంధించినంతవరకు మాత్రమే కాక ఆసియా అంతటికీ వర్తిస్తుంది.''

* * *

''గ్రంథాలు, ప్రాచీన శిథిలాలు, అవశేషాలు, గతవైభవ సంస్కృతిచిహ్నాలు ఇవన్నీ భారత దేశాన్నిఅర్థంచేసుకోవడానికి కొంతవరకు ఉపయోగపడినా, అవి నేనెదురు చూస్తున్న సమాధానం ఇవ్వడం గాని నన్ను సంతృప్తి పరచడం గాని చేయలేవు. బహుశః గతించిన కాలానికి చెందినవవడం చేతనేమో. గతానికి ప్రస్తుతానికి ఏదైనా వాస్తవిక సంబంధం ఉన్నదా ? అని నేను తెలుసుకో గోరుతున్నాను. నాకూ, నావంటి అనేకులకూ వర్తమానం త్రిశంకు స్వర్గంవలె, మధ్యతరగతి ప్రజల పైపై ఆడంబర నవీనతలతో, బీదరికంతో, దైన్యంతో, విషణ్ణంగా, భయంకరంగాగోచరిస్తున్నది. నేనునాజాతినీ నాతరగతినీ పొగుడుకునేవాణ్ణి కాదు. అయినప్పటికీ భారతదేశ విముక్తి కోసమైన పోరాటంలో నాయకత్వం వహించడం కోసం ఎదురుచూడడం అనివార్యమైంది. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు బంధింపబడ్డారు. వీరు ఆపరిధి నతిగమించి పురోగమించాలని ప్రయత్నించారు. అయితే బ్రిటిష్ ప్రభుత్వపాలనలో ఆ యత్నం సాగని కారణంగా ఆ పాలనపై ద్వేషం ప్రబలింది. అయినా మనల్ని నలిపివేస్తున్న పాలనా యంత్రాంగంపై వీరు ధ్వజ మెత్తలేదు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని అధికారచ్యుతం చేయడం ద్వారా వీరు తమ ధ్యేయాన్ని సాధించవలసివుంది. ఆ పాలనా యంత్రాంగాన్ని సవాలు చేయడానికీ, దాన్ని కూకటివ్రేళ్ళతో పెల్లగించడానికీ సమాజభాగమైన మధ్యతరగతి ప్రజలే బాగా సమర్థులు.''

* * *

"పాశ్చాత్యాధికారం క్రింద మ్రగ్గుతున్న ఒకదేశం, అదృశ్యమైపోయిన గతకాలపు స్వప్నాలలోగతవైభవస్మృతులలోసాంత్వన పొందుతూ వర్తమానాన్నుండి రక్షించుకొంటూ వుంటుంది. మనలో చాలామంది ఈ వర్గంలో చెందుతారు. ఇది ప్రమాదకరమూ, అవివేక పూరితమూ అయిన అలవాటు. ఇదే విధంగా భారతీయులమైన మనం ప్రశ్నించుకోవలసిన అలవాటు ఇంకొకటి వున్నది. అదేమిటంటే ఈ ప్రపంచంలో కొన్ని విధాలుగా మనం హీనపరుపబడినా మనం ఇంకా పారలౌకికంగా ఆముష్మికంగా గొప్పవార మేనని ఊహించుకోవడం.

స్వాతంత్ర్యమూ, అవకాశమూ లేని కారణంగానూ, దుర్భర క్షుద్బాధ, దుఃఖాల వలననూ ఈ ఆముష్మికమైన లేక తదితరమైన గొప్పతనం కానరావడం లేదు. అనేక పాశ్చాత్య రచయితలు భారతీయులు పారలౌకికులుగా వుంటా రనే అభిప్రాయాన్ని బలపరచారు. ప్రతిదేశంలోనూ వున్న అదృష్టహీనులు, ధనహీనులు, వారు విప్లవవాదులుగా మారితేనే తప్ప. (ఎందుకంటే ఈ ప్రపంచం వారికొరకై నిర్దేశించబడలేదు) కొంతవరకు పారలౌకికులుగానే వుంటా రని నేను అనుకుంటాను.

# జవాహర్‌లాల్ నెహ్రూ జీవితంలో ముఖ్యమైన కొన్ని తేదీలు

| | | |
|---|---|---|
| జననం (అలహాబాదులో) | ... | నవంబరు 14,1889. |
| విద్య (హారో పాఠశాల) | ... | 1905 |
| ట్రినిటీ కళాశాల కేంబ్రిడ్జి (యం. ఏ.) | ... | 1910 |
| ఇన్నర్ టెంపిల్‌లో బారిష్టర్ – ఎట్‌లా. విద్యాభ్యాసం: అలహాబాదు హైకోర్టులో అడ్వకేట్ | ... | 1912 |
| కమలాకౌల్‌తో వివాహం | ... | 1916 |
| లక్నో కాంగ్రెస్‌లో తొలిసారిగా గాంధీజీతో పరిచయం | ... | 1916 |
| ప్రతాప్‌ఘర్‌లో ప్రప్రథమ కిసాన్‌యాత్ర నిర్వహణ | ... | 1920 |
| భారత జాతీయ కాంగ్రెసు కమిటీ గౌరవ కార్యదర్శిపదవీ స్వీకరణ | ... | 1923 |
| బ్రస్సెల్స్‌లో జరిగిన పీడితజాతుల సమావేశానికి భారతదేశం నుండి కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా హాజరుకావడం | ... | ఫిబ్రవరి 1926 |
| మాస్కోలో జరిగిన పదవ విప్లవ వార్షికోత్సవాలకు హాజరుకావడం | ... | నవంబరు 1927 |
| మద్రాసు కాంగ్రెస్‌లో, స్వాతంత్ర్య సముపార్జనా ధ్యేయానికి ప్రేరేపణ సాధనంగా ప్రముఖపాత్ర వహించడం | ... | 1927 |
| అఖిలపక్ష సమావేశానికి హాజరై భారతరాజ్యాంగ సవరణలపై నెహ్రూ రిపోర్టును సమర్పణ ; బ్రిటన్‌తో సంబంధాలను, పూర్తిగా విచ్ఛేదం చేసి, ఇండియా లీగ్‌కు స్వాతంత్ర్యం సంపాదించి దానికి గౌరవ కార్యదర్శిగా వుండటం | ... | 1928 |
| లాహోరు కాంగ్రెస్ సమావేశాలు: సంపూర్ణ స్వాతంత్ర్య సముపార్జనకై నిర్ణయం మార్పు | ... | డిసెంబరు 29,1929 |
| ఉప్పుసత్యాగ్రహోద్యమం అరెస్టు...ఆరునెలల నిర్బంధం | ... | ఏప్రిల్ 14— అక్టోబరు 11,1930 |
| కమలానెహ్రూ మరణం | ... | 1936 |
| ప్రజాప్రభుత్వవాదిగా స్పెయిను సందర్శనం | ... | 1938 |
| చైనా సందర్శనం | ... | 1939 |
| వ్యక్తి సత్యాగ్రహంలో అరెస్టు, నాల్గు సంవత్సరాలజైలుశిక్ష | ... | అక్టోబరు 31,1940 |
| తక్కిన నాయకులతోబాటు విడుదల | ... | డిసెంబరు 1941 |
| బొంబాయిలో జరిగిన ఎ. ఐ. సి. సి. సమావేశంలో క్విట్ ఇండియా తీర్మానాన్ని ప్రతిపాదన | ... | అగస్టు 7,1942 |
| అహమ్మదు నగర్ కోటలో నిర్బంధం | ... | అగస్టు 8,1942 |
| సుదీర్ఘమూ, అంతిమమూ అయిన నిర్బంధంలోనుండి విడుదల, ఐ. యన్. ఏ. సిబ్బందిని సమర్థించడం | ... | 1945 |
| ఇండియా విభజనపట్ల వ్యతిరేకత, ఆగ్నేయాసియా పర్యటన | ... | మార్చి 1946 |
| నాల్గవసారి కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నిక | ... | జులై 6,1946 |
| తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు; ఉపాధ్యక్షుడుగా, విదేశ వ్యవహారాల శాఖ ఇంఛార్జిసభ్యుడుగా ఎన్నిక కావడం | ... | సెప్టెంబరు 2,1946 |

| | |
|---|---|
| స్వతంత్ర భారత్ తొలి ప్రధానమంత్రిగా ఎన్నికకావడం ... | అగస్టు 15,1947 |
| లండన్‌లో జరిగిన కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశానికి హాజరుకావడం ... | అక్టోబరు 6,1948 |
| పారిస్‌లో యు. యన్. జనరల్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ప్రసంగం ... | నవంబరు 3,1948 |
| అధ్యక్షుడు ట్రూమన్ ఆహ్వానంపై యు. యస్. ఎ. సందర్శనం ... | అక్టోబరు 1949 |
| మైనారిటీలపై నెహ్రూ – లియాకాత్ ఆలీ ఒడంబడికపై సంతకం ... | ఏప్రిల్ 2,1950 |
| లండన్‌లో రెండవ ఎలిజబెత్‌రాణి పట్టాభిషేక మహోత్సవానికి హాజరుకావడం ... | మే 1953 |
| పంచశీలపై సంయుక్త ప్రకటన చేయడం ... | జూన్ 25,1954 |
| భారతరత్న బిరుదప్రదానం ... | 1954 |
| బాండుంగ్‌లో జరిగిన ఆఫ్రో - ఆసియన్ సమావేశాలకు హాజరుకావడం పంచశీలను విస్తృతపరచి, దశసూత్రాలను నిర్వచించడం ... | ఏప్రిల్ 1955 |
| సహజీవన విధానాన్ని గూర్చి బల్గేరియన్ ప్రధానితో కలసి సంయుక్త ప్రకటనపై సంతకాలు చేయడం ... | డిసెంబరు 13,1955 |
| ఈజిప్టుపై బ్రిటన్ - ఫ్రాన్సు ఇజ్రాయెల్‌ల దురాక్రమణను నిరసిస్తూ, సత్వర చర్యలను గైకొనవలసిందిగా యు. యన్. కార్యదర్శికి సందేశం పంపడం ... | అక్టోబరు 31,1956 |
| టిబెట్‌లో చైనీయుల చర్యలనుగూర్చి పార్లమెంటుకు నివేదించడం ... | మార్చి 23,1959 |
| ముస్సోరీలో దలైలామాతో సమావేశం ... | ఏప్రిల్ 24,1959 |
| ఇండో చైనా సరిహద్దు పటాల విషయంలో చైనావారి పటాలనుగూర్చి భారతదేశ ఆక్షేపణలకు చైనా మౌనం వహించిన ఉదంతంపై విలేఖరులతో గోష్ఠి ... | ఆగస్టు 7,1959 |
| మక్‌మోహన్‌రేఖను గూర్చిన ఇండియా తుదినిర్ణయాన్ని పార్లమెంటులో ప్రకటించడం ... | సెప్టెంబరు 1959 |
| శాంతియుత విధానాలతో వివాద పరిష్కారావశ్యకతపై ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్‌తో కలసి సంయుక్త ప్రకటన ... | సెప్టెంబరు 1959 |
| చౌ - ఎన్ - లై రంగూన్‌లోని ఒక సమావేశానికి ఆహ్వానించగా తిరస్కరించడం ... | డిసెంబరు 21,1959 |
| లండన్‌లో జరిగిన కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశానికి హాజరుకావడం ... | మే 1960 |
| పాకిస్తాన్ సందర్శనం ... | సెప్టెంబరు 19–23,1960 |
| సింధునదీ జలాల ఒప్పందంపై సంతకం చేయడం ... | సెప్టెంబరు 19,1960 |
| భారత ప్రతినిధివర్గ నాయకుడుగా యు. ఎన్. జనరల్ అసెంబ్లీ శిఖరాగ్ర సమావేశాలకు హాజరుకావడం ... | సెప్టెం–అక్టోబరు 1960 |
| కృశ్చేవ్, ఐసెన్‌హోవర్‌లు తమ స్నేహసంబంధాలను పునరుజ్జీవింప జేయాలని త్వరపెడుతూ సమితిసమావేశంలో తీర్మానం ప్రతిపాదించటం ... | అక్టోబరు 1,1960 |
| ప్రపంచశాంతి ఆవశ్యకతనుఉద్ఘాటిస్తూ యు.ఎన్ జనరల్‌అసెంబ్లీలో ప్రసంగించటం ... | అక్టోబరు 3,1960 |
| కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశానికి హాజరుకావడం ... | మార్చి 1961 |
| బెల్గ్రేడ్‌లో జరిగిన తటస్థరాజ్యాల శిఖరాగ్ర సమావేశానికి హాజరుకావడం ... | సెప్టెంబరు 1961 |
| కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశానికి హాజరుకావడం ... | సెప్టెంబరు 1962 |
| మరణం ... | 27 మే 1964 |

# కల్లోలజగతికి కాంతి కిరణం శ్రీ నెహ్రూ

కె. ఈశ్వరదత్

"నా జీవితకాలం ఇంత త్వరగా పరిసమాప్తం కాబోదు," అన్నారు శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ కొన్ని రోజుల క్రితం భారత రాజధానీ నగరంలో జరిగిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో. ఆయన ప్రసంగించిన పత్రికా ప్రతినిధుల చివరి సమావేశం అదే. తరువాత డెహరాడూన్‌లో కొద్ది రోజులు విశ్రాంతి తీసుకొని నవోత్సాహంతో, ఉత్తేజంతో ఆయన ఢిల్లీకి తిరిగి వచ్చారు. కాని విధి బలీయం. ఎవ్వరూ ఊహించనంత త్వరలోనే ఆయన జీవితం పరిసమాప్తమైంది. దైవేచ్ఛ ఎంత అనూహ్యమైందో మరోమారు నిరూపితమైంది.

శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ లేని భారతావనిని దేశప్రజలు ఊహించలేరు. కల్లోల పరిస్థితుల్లో ప్రశాంతిని నెలకొల్పిన ఆ మహానేత అమృతవాణి ఇక మనకు వినిపించదనీ, భారత ఖండాన్ని ప్రకాశమానం చేసిన తేజోవంతమైన ఆయన మూర్తి ఇంక మనకు కనుపించదనీ అంటే నమ్మటం కష్టం. మన జాతీయ కవి శ్రీ రవీంద్రనాథ్ టాగూర్ శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూను భారతదేశపు ఋతురాజుగా అభివర్ణించారు. మరో నెహ్రూ ఎప్పుడు ఉద్భవిస్తాడు ?

శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ 1889 నవంబరు 14 వ తేదీన అలహాబాద్ నగరంలో శ్రీమంతులైన కాశ్మీర్ పండిత కుటుంబంలో జన్మించారు. ఈ వంశస్థులు పూర్వం ఆ ప్రాంతం నుంచి ఇచ్చటికి ఐశ్వర్యాన్నీ, కీర్తినీ పొందడానికి వచ్చారు. శ్రీ నెహ్రూ జనకుడు శ్రీ మోతీలాల్ నెహ్రూకు ఇవి రెండూ లభ్యమయ్యాయి. శ్రీ మోతీలాల్‌కు పుత్ర సంతానం శ్రీ నెహ్రూ ఒక్కరే. శ్రీ మోతీలాల్ పూర్వ సంయుక్త రాష్ట్రాలలో ప్రముఖ న్యాయవాదిగా, రాజకీయ నాయకుడుగా పేరుపొందారు. ఆయనకు సనాతన అలవాట్లు నచ్చేవికావు. కనుకనే తమ కుమారుడు జవాహర్‌లాల్ విద్యాభ్యాసానికి ఆంగ్లేయ ఉపాధ్యాయురాలిని నియోగించారు. తరువాత విదేశాలలో ఇంగ్లీషు చదువులు చెప్పించారు. తన పదకొండవ యేట శ్రీ నెహ్రూ ఐర్లాండు ప్రాంతీయుడైన ఒక ఉపాధ్యాయుని వద్ద విద్యాభ్యాసం చేశారు. దివ్యజ్ఞాన సమాజం అభిమాని ఐన ఆయన శుశ్రూష వల్లనే శ్రీ నెహ్రూకు పుస్తక పఠనంలో అభిలాష పెరిగింది. కవితపట్ల అభిరుచి కలిగింది. శ్రీమతి బీసెంట్ అద్భుత వక్తృత్వానికి ప్రభావితులైన శ్రీ నెహ్రూ బాల్యంలోనే దివ్యజ్ఞాన సమాజంలో చేరారు. కాని తరువాత 13 వ యేట దానిలోనుంచి బయటికి వచ్చారు. ఈ శతాబ్దం తొలి అర్ధ దశాబ్దిలో రష్యాపై జపాను విజయం సాధించినప్పుడు ఆయన ఎంతో అస్పష్టమైన అనుభూతిని పొందారు. ఆ ప్రాయంలో అంతటి ప్రభావాన్ని గురించి ఆయన లోను కాలేదు. జపాను చరిత్ర, దాని ప్రాచీన సాహసగాథలను పఠనం చేసుకుంటూ వాటిలోనే గాఢంగా లీనమైపోయారు.

1905 వ సంవత్సరంలో ఆయన హారోకు వెళ్ళారు. ఇంగ్లండు వాళ్ళ పిల్లలు కూడా తనలాగే బుద్ధిస్థులైనట్లు ఆయనకు కనిపించింది. 1906 వ సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఆయనను ఆకర్షించాయి. తన తరగతి పిల్లలందరిలోనూ ఒక్క శ్రీ నెహ్రూయే కాంబెల్ బెనర్‌మన్ మంత్రి మండలి సభ్యుల పేర్లన్నింటినీ సమగ్రంగా చెప్పగలిగేవారు. తన తరగతిలో ఉత్తమ కృషికిగాను ఆయన ట్రావెలియన్ విరచితమైన 'గారిబల్డి' సంపుటాలలో ఒకదానిని బహుమతిగా పొందారు. మిగతా రెండు భాగాలను కూడా ఆయన సేకరించి పఠించారు. ఫలితంగా ఇటలీ వలెనే భారతదేశం వర్ధిల్లాలనే ఆశయం ఆయనకు కలిగింది.

ఉన్నతమైన తన భావాలకు అల్పమైన హారో అనువైన ప్రదేశం కాదని తలంచడం వల్ల శ్రీ నెహ్రూజీ కేంబ్రిడ్జికి వెళ్లారు. అక్కడ అండర్ గ్రాడ్యుయేటుగా మూడు సంవత్సరాలపాటు

ప్రశాంతంగా, ఆహ్లాదంగా గడిపారు. సాహిత్యం, రాజకీయ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం — ఇవన్నీ ఆయనను ఆకర్షించాయి. అయితే ఆయన పట్టా పుచ్చుకున్నది మాత్రం శాస్త్ర విజ్ఞానంలోనే. ఆయన 1910 వ సంవత్సరంలో శాస్త్ర విజ్ఞాన పరిశోధనలో ద్వితీయ శ్రేణి ఆనర్స్ డిగ్రీ పొందారు.

ఆ తరువాత రెండు సంవత్సరాల పాటు లండన్‌లో వుండి న్యాయశాస్త్రం, అభ్యసించారు. ఏడు సంవత్సరాలు విదేశంలో గడిపిన అనంతరం 1912 శరదృతువులో ఆయన స్వదేశానికి తిరిగి వచ్చారు.

సుపరిచితమైన పాతపరిసరాల మధ్య గడుపుతున్న ఆయనలో ఎన్నో నూతన భావాలు కలుగ నారంభించాయి. ఆ సంవత్సరం బంకిపూర్‌లో శ్రీ ఆర్. ఎస్. మధోల్కర్ అధ్యక్షతన జరిగిన కాంగ్రెసు వార్షిక సభకు ఆయన హాజరయ్యారు. "ఆంగ్ల భాషా విజ్ఞానులైన ఉన్నతవర్గాల వారి తంతు"గా ఆయనకు ఆ సభ గోచరించింది. మార్నింగ్ కోట్లు, ట్రౌజర్లు ధరించిన వ్యక్తులే ఆయన కా సభలో ఎక్కువగా కనిపించారు. ఈ పరిస్థితి ఆయనకు విభ్రాంతి కలిగించింది. రాజకీయమైన ఉద్రేకాలు లేని ఒక సాంఘిక సమావేశంగా మాత్రమే ఆయన కది కనిపించింది. ప్రజా వ్యవహారాల పట్ల ధ్యానం చూపడంలోనూ రాజకీయాల అధ్యయనంలోనూ ఆసక్తిగల వ్యక్తిగా శ్రీ గోఖలే ఆయన దృష్టిని ఆకర్షించారు. యువకుడైన శ్రీ నెహ్రూ బారిష్టర్‌గా తమ పెద్దల అడుగుజాడలలో నడవవలసి వుండెను. కాని ఆ వృత్తిలో ఆయన ఎంతో ప్రజ్ఞాశాలి అయినప్పటికీ అలా జరగలేదు.

కొంతకాలం ఆయన సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీపట్ల ఆసక్తి చూపారు. జాతిసేవకు అర్పితులు కావడానికై పిలుపు నిచ్చిన సంస్థ యిది. తరువాత తిలక్, అనిబిసెంట్‌లు స్థాపించిన హోంరూల్ లీగ్ ఆయన దృష్టిని అమితంగా ఆకర్షించింది. తన తండ్రి క్రమంగా డాక్టర్ బిసెంట్‌కు సన్నిహితుడవుతూ కాంగ్రెసులోని మితవాద ధోరణికి దూరమవడం శ్రీ నెహ్రూకు ఆనందం కలిగించింది. శ్రీ నెహ్రూ అతివాదం వైపుకు మ్రొగ్గుతుండడం మోతీలాల్ జాగ్రత్తగా గమనిస్తూవచ్చారు.

1916 వ సంవత్సరంలో లక్నోలో జరిగిన కాంగ్రెసు మహాసభల సందర్భంలో శ్రీ నెహ్రూ గాంధీజీని మొదటిసారిగా కలుసుకున్నారు. శ్రీ నెహ్రూ జీవితంలో 1916 వ సంవత్సరం మరొకందుకు కూడా ప్రాముఖ్యం వహిస్తుంది. ఆయనకు కమలతో వివాహం జరిగింది ఆ యేడే. శ్రీమతి కమల, 1936 వ సం. లో అకాల మృత్యువు వాతబడేవరకూ అన్ని రాజకీయ పోరాటాలలోనూ తన భర్తకు చేదోడు వాదోడుగా వుంది. శక్తినీ, ధైర్యాన్నీ ఇచ్చింది. ఈ పుణ్య దంపతులకు 1917 వ సంవత్సరంలో ఇందిర జన్మించింది.

1917 వ సంవత్సరాంతంనుంచి 1931వ సంవత్సరారంభం వరకు భారతదేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల పట్ల శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ ఎంతో ఆందోళన చెందారు. ఆయన భారత దేశాన్ని నగ్నాకారంలో ఆకలిబాధ ననుభవిస్తూ అత్యంత దీనావస్థలోనున్నట్టుగా తలపోశారు. దేశాన్ని వ్యక్తులుగా, వర్గాలుగా కాక ఒకే ఒక సమాజంగా భావించా రాయన. భారత దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి హింసల ననుభవిస్తున్న ఈ ప్రాచీన దేశపు ఆత్మ వేదనను అభివ్యక్తం చేయడానికి గాంధీజీ ఏతెంచారనీ, తాను ఆయనకు సహాయపడాలనీ అనుకున్నారు.

1921—1934 వ సంవత్సరాల మధ్య ఆయన ఏడు పర్యాయాలు 5½ సంవత్సరాలపాటు కారాగార వాసం చేశారు. ఐశ్వర్యవంతుల ఇంట పుట్టి అల్లారు ముద్దుగా పెరిగినవారికి జైలు జీవితం ఎంత దుర్భరంగా వుంటుందో వేరే చెప్ప నవసరం లేదు. అయితే శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ తమ జైలు జీవితాన్ని, స్వంత రాజకీయ సిద్ధాంతాన్ని అభివృద్ధి పరచుకోవడానికి గ్రంథ పఠనకూ, యోచనలకూ చక్కగా వినియోగించుకున్నారు. ఆయన రాజకీయ సిద్ధాంతం భావనలో గాంధీతత్వం వంటిదే అయినప్పటికీ అది పూర్తిగా గాంధేయం కాదు. ఆయన చిత్తశుద్ధిలో గాంధీ తత్వాన్ని అవలంబించారు. గాంధీజీపట్ల తమకు గల సంపూర్ణమైన భక్తివిశ్వాసాలవిషయంలో ఆయన తన హృదయాన్ని ఎప్పుడూ సంశయించలేదు. అయినప్పటికీ ఆత్మార్పణకు ఆయన సిద్ధపడలేదు. గాంధీజీ కాంగ్రెసు అనే సైన్యానికి దళవాయిగా వున్నంతకాలం ఆయనదానిలో ఒక సైనికుడుగా వున్నారు.

శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్ సంస్థలో క్రమంగా ప్రఖ్యాతిలోకొచ్చారు. గాంధీజీ తరువాత అంతటి ప్రముఖ వ్యక్తిగా ఆయన పరిగణించబడ్డారు. గాంధిజీ శ్రీ నెహ్రూను తన రాజకీయ వారసుడుగా ప్రకటించారు.

శ్రీ నెహ్రూకు తనయెడల పరిపూర్ణమైన భక్తి విశ్వాసాలు వున్నప్పటికీ ఆయన స్వంత అభిప్రాయాలు వున్న వ్యక్తి అనే విషయం గాంధీజీకి తెలుసు. అయినప్పటికీ ఆయనను తన వారసుడుగా చేసుకోవడానికి ఇది గాంధీజీకి అడ్డురాలేదు. కాని వారసుని ప్రకటన జరగక పూర్వమే శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీ కంటే కూడా ముందుచూపుగల గాంధేయుడుగా నిరూపించుకున్నారు.

సహాయనిరాకరణోద్యమపు తొలి సంవత్సరాలలో గాంధీజీ కాంగ్రెసు సంస్థనంతటినీ తన అడుగు అజ్ఞలలో నడిపిస్తూ శాసనోల్లంఘనం చేస్తున్న తరుణంలో శ్రీ నెహ్రూ, ఏకోన్ముఖమైన తన సహచరుల ధోరణిపట్ల ఆతురత చెందారు. మన సరిహద్దులు, తీరాలకు ఆవలకూడ ఆధిపత్యానికై పోరాడుతున్న గొప్ప చారిత్రకదళాలను వారు లెక్క చేయకపోవడం ఆయనకు ఆందోళన కలిగించింది. ఆయన బయటి వారితో సమాలోచనలు జరిపారు. విస్తృతంగా పర్యటనలు సలిపారు. 1927 వ సంవత్సరంలో ఆయన సోవియట్ రష్యాను సందర్శించారు.

ఆ సంవత్సరాంతంలో మద్రాసులో జరిగిన కాంగ్రెసు వార్షిక మహాసభలో శ్రీ నెహ్రూ భారతదేశ స్వాతంత్ర్యానికై ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. తరువాత ఒక సంవత్సరానికి ఇండిపెండెంట్స్ అఫ్ ఇండియా లీగ్‌ను స్థాపించారు. అయితే ఆయనతండ్రిగారితో సహా కొందరు పెద్దలు డొమినియన్ ప్రతిపత్తినే వాంఛించారు.

1929 వ సంవత్సరంలో శ్రీ నెహ్రూ లాహోరులో జరిగిన కాంగ్రెసు మహాసభలకు తొలిసారిగా అధ్యక్షు లయ్యారు. ఆ సందర్భంలో ఆయన సంపూర్ణ స్వాతంత్ర్యానికి కాంగ్రెసు మహాసంస్థను సమ్మతింపజేశారు. అదేసమయంలో సామ్యవాదాన్ని అవలంబించారు. 1931 వ సంవత్సరంలో కరాచీలో జరిగిన కాంగ్రెసు మహాసభలలో ఆయన ప్రాథమిక హక్కులపై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తరువాత అయిదు సంవత్సరాలకు లక్నో కాంగ్రెసు మహాసభలకు అధ్యక్షత వహిస్తూ సామ్యవాదపు పతాకాన్ని కూడా ఎగురవేశారు. ఈ విధంగా, అప్పటివరకూ కేవలం ఒక రాజకీయ సిద్ధాంతంగా వున్న అంశానికి ఆర్థికమైన స్వరూపాన్నిచ్చిన తొలి కాంగ్రెసువాది ఆయన. దేశంలోని పెద్ద రాజకీయ సంస్థ అయిన కాంగ్రెసు ప్రముఖ ప్రజా సంస్థగా మనగలడానికి ఇది దోహదకారి అయింది.

శ్రీ నెహ్రూ భౌతికవాదం వైపుకు మొగ్గడం కాంగ్రెసు వాదుల్లో కలవరం కలిగించింది. శ్రీ నెహ్రూలో వచ్చిన పరిణామాన్ని గూర్చి ముఖ్యంగా 1931 వ సంవత్సరంలో శ్రీ మోతీలాల్ నెహ్రూ దివంగతులైన పిమ్మట వచ్చిన మార్పును గురించి గాంధీజీకి తెలిసినప్పటికీ తన స్వంత సిద్ధాంతాలను అనుసరించడానికి ఆయన కొంత తటపటాయిస్తున్నారనీ అయితే ఆయన అనుసరించగోరే విధానం తన మార్గానికి ఏమంత భిన్నమైనది కాదని గాంధీజీ గ్రహించినప్పటికీ ఆయన ముభావం వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ గుణగణాలన్నింటిలోకీ ఆయన నిష్కపట ప్రవర్తన గాంధీజీని అమితంగా ఆకర్షించింది. ప్రపంచంలో ఎక్కడ ఏ మూలలో ఎటువంటి రాజకీయ పరిణామాలు సంభవించినా — అది లక్నోలో లాఠీ చార్జి జరగడం కావచ్చు లేదా చుంకింగ్‌లో బాంబులు పడటం కావచ్చు— వెంటనే వాటికి ప్రభావితమయ్యే శ్రీ నెహ్రూ నైజాన్ని ఆయన అవగాహన చేసుకున్నారు. స్పెయినులో తలెత్తిన అల్లర్లు జవహర్‌లాల్ నెహ్రూను బాగా కదిలించివేశాయనవచ్చు. అదే ఆయనను స్వేచ్ఛాపోరాటంలో ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రాణాలొడ్డి నిలుచునేందుకు ప్రపంచ పౌరునిగా తనను తాను భావించుకోవడానికి కారణమయ్యాయి.

ఆ తర్వాత ముప్ఫయిల్లో యించుమించుగా జవహర్‌లాల్ ఒంటరివారుగా అయిపోయారనవచ్చు. 1931 లో తండ్రి చనిపోయారు. 1936 లో భార్య, 1938 లో తల్లి మరణించారు. ఆయనకు స్నేహితులు కొద్దిమంది మాత్రమే. అయితే వారంతా యీ దేశంలో వారే కారు. 1939 లో మార్షల్, మేడమ్ షాంగ్ కైషేక్‌తో స్నేహం చేశారు.

ప్రపంచం ద్వితీయ ప్రపంచ సంగ్రామంవైపు మొగ్గుతూ వుండగా యీయన చైనానుండి స్వదేశానికి తిరిగి వచ్చేశారు. అక్కడనుండి రాగానే అత్యంత సంక్లిష్టమైన యీలాంటి సమయంలో భారతదేశం తన పాత్రను కడుసమర్థతతో, శక్తితో నిర్వహించడానికి వీలుగా-అందులోనూ సమిష్టిసేనల తరపున పోరాడడానికి వీలుగా — భారత దేశానికి పూర్తి స్వాతంత్ర్యం కావాలని పదేపదే నొక్కి వక్కాణించారు.

పాపం! గాంధీగారు ప్రారంభించిన ద్వితీయ సత్యాగ్రహ ఉద్యమం ఆరంభం కావడం ఆయన స్వేచ్ఛకు ఆటకట్టు అయినట్టయింది. 1940 అక్టోబరు 31 వ

తేదీన ఆయన అరెస్టు చేయబడ్డారు. 4 ఏళ్ళు కఠినమైన జైలు శిక్ష విధించబడింది. అది ఆయన ఎనిమిదోసారి జైలుకు వెళ్ళడం 1941లో పెరల్ హార్బరు సంఘటన జరిగేవరకు ఆయన్ను విడుదల చెయ్యలేదు. తర్వాత క్రిప్స్ రాయబారం జరిగింది. అయితే అది విజయం కాలేదు. నెహ్రూను బ్రిటిష్ సామ్రాజ్య తత్వ వ్యతిరేకి అన్నారు. 1942 లో క్విట్ ఇండియా ఉద్యమం ఆరంభం కావడంతో ఆయన తిరిగి జైలుకు వెళ్ళారు. అదే ఆయనను ఎక్కువకాలం పాటు ఉంచినదీ, ఆఖరిసారిగా వుంచినదీనూ. 1945 లో రాజకీయ బాధితులు అందర్నీ విడుదల చేసేటప్పుడు ఆయన కూడా విడుదలయ్యారు.

కాంగ్రెసు ముస్లింలీగుల మధ్య సామరస్యాన్ని కలిగించడానికి లార్డ్ వేవెల్ సిమ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మౌలానా అజాద్ నాయకత్వంక్రింద నెహ్రూ ముఖ్యమైన పాత్ర వహించారు. పాకిస్థాను విడిపోవడాన్ని ఆయన వ్యతిరేకించి, సాధారణ, ప్రాంతీయ, కేంద్ర చట్టాలకొరకు ఉద్యమాన్ని లేవనెత్తారు. అదే ఏడాది ఎర్రకోటలో జరిగిన ఐ.ఎన్.ఎ. విచారణకు ఆయన ముప్ఫయి సంవత్సరాల క్రిందట విడచిపెట్టిన బారిష్టరు గౌనును ధరించి తిరిగి వచ్చారు.

1946 మార్చిలో ఆయన ఆగ్నేయాసియా దేశాల్లో పర్యటించారు, అప్పుడే ఆయనకులార్డ్ మౌంటుబాటన్‌తో స్నేహం ఏర్పడింది. మూడేళ్ళ అనంతరం, (నాలుగవసారి) కాంగ్రెసు అధ్యక్షుడుగా వైస్రాయితో బ్రిటిషు మంత్రిమండలి రాయబారం యొక్క ఉద్దేశాన్ని గూర్చి చర్చించి, ఆపద్ధర్మప్రభుత్వాన్ని ఏర్పాటు చేయుమనే అతని ఆహ్వానాన్ని అంగీకరించారు. సెప్టెంబరు రెండవ తేదీన (1946) ఉపరాష్ట్రపతిగా, విదేశ వ్యవహారాల అజమాయిషీ సభ్యుడుగా పదవి స్వీకారం చేశారు. ఆనాటినుండి — ముఖ్యంగా పాకిస్థానుతో విడివడి 1947 ఆగష్టు 15 న స్వతంత్ర దేశంగా రూపొందిన భారతావనికి — 1964 మే 27 నమరణించిన నాటివరకూ ప్రధానిగా ఆయన నిరాఘాటంగా రథ సారథ్యాన్ని వహించి సమకాలీనులలో సుదీర్ఘమైన రాజకీయ నాయకత్వంలో కొత్త ప్రమాణాన్ని స్థాపించారు.

చరిత్రప్రసిద్ధమైన 1947 ఆగష్టు 15 వ తేదీన దేశం యావత్తూ ఒక కొత్తపుంత తొక్కింది. ఈ సమయంలో నెహ్రూ అన్నమాటలు నిత్యం మననం చేసుకోదగ్గవి. "సుడిగాలీ, పెనుగాలీ, తుఫానులూ ఎంత భీకరంగా వీచినా స్వాతంత్ర్య జ్యోతిని మనం ఆరిపోనివ్వరాదు." ఈ సందర్భంలో రాజ్యాంగసభలో ఆయన చెప్పిన విలువైనమాటల్ని కూడా జ్ఞాపకం చేసుకుందాం. "ఈ ఏక ప్రపంచంలో శాంతి అవిభాజ్యమైనది. అలానే స్వేచ్ఛ, సౌభాగ్యం, విపత్తులు కూడా, ఏమాత్రమూ వీటిని విడివిడిగా విడదీయరాదు."

ఇక్కడే ఆయన అత్యద్భుతమైన రాజకీయ సిద్ధాంతం-మొత్తం తనపరిపాలనా విధానాన్ని స్పష్టీకరించే సిద్ధాంతం — మనకు కనిపిస్తుంది. దేశంస్వాతంత్ర్యాన్ని పొందినా, రెండుగా దేశంచీల్చబడడంవల్ల ఏమంతగా ఆనందం కలగలేదు. ఆనాటి గాయాలు యింకా మానలేదుకూడా. అంతిమక్షణంవరకూ తన భుజస్కంధాల పైబడిన ప్రతిభారతీయుని బరువు. బాధ్యతలనూ మోస్తున్న నెహ్రూకు యిది ఉత్సాహంతో గంతులు వేయాల్సినసమయంగా అనిపించలేదు. బహుశా భారతదేశం తన బరువుతో ఆయన బ్రహ్మాండమైన భుజస్కంధాలను అణగద్రొక్కేసి వుండాలి. స్వాతంత్ర్యం వచ్చిన ఆరునెలలకే దారుణమైన హత్యకులోనై గాంధీజీ మన బాహ్య చక్షువులకు దూరమైపోయారు. మిగిలినవారందరికన్నా జవహర్లాల్ నెహ్రూ రాజకీయంగాను, వ్యక్తిగతంగాను దిక్కులేని వారైపోయారు.

భారతదేశపు ప్రధానమంత్రిగా జవహర్లాల్ నెహ్రూ స్థానం ప్రపంచ ప్రముఖ రాజకీయవేత్తల సరసన వున్నది. కాని ఆయన కేవలం భారత ప్రధాని మాత్రమే కాదు. గాంధీఅనంతరం భారతావనికి ప్రధాన నిర్మాత ఆయన. ఇటీవలి చరిత్రను తిరగేసిచూస్తే – సర్వసత్తాక ప్రజా ప్రభుత్వానికి ప్రారంభోత్సవం చేయడంలో, ప్రజాప్రభుత్వాన్ని కొత్త పుంతతొక్కించడంలోసంక్షేమరాజ్యానికి సామ్యవాద సహకార రాజ్యానికి శంకుస్థాపన చేయడంలో, దేశసౌభాగ్యానికై బ్రహ్మాండమైన ప్రణాళికలద్వారా దేశాన్ని నడిపించడంలో, మతరహిత దృక్పథాన్ని ప్రజలకు కలిగించడంలో విరుద్ధమైన సిద్ధాంతాలమధ్య కొట్టుమిట్టాడుతున్న ప్రపంచంలో అంతర్జాతీయ రంగంలో పేరుకునిపోయిన విపత్తును అభినవవిధానంద్వారా తొలగించడంలో, భువిలో శాంతిని ప్రతిష్ఠించేందుకు గురుతర బాధ్యతతో కృషిచేయడంలో – ఇదంతా చరిత్రలోనే అపూర్వమైన ఒకే ఒక వ్యక్తి కృషి, ప్రయత్నం, విజయం. ప్రాక్పశ్చిమ దేశాలమధ్య:

డెమొక్రేట్లు, కమ్యూనిస్టుల ప్రభుత్వాల మధ్య సామరస్యాన్ని కలిగించడానికి తన జీవిత కాలంలో విశేషకృషి చేసిన వ్యక్తిగా ఆయన చనిపోయినా, చిర కాలం ఆయన పేరు కృతజ్ఞతతో సంస్మరింపబడుతూనే వుంటుంది. కామన్వెల్తులో వుంటూ భారతదేశం రిపబ్లిక్‌గా వుండడం అది జవహర్లాల్ వ్యక్తిగతమైన విజయం అనవచ్చు. ఆయన తనదృష్టిని విస్తృతమైన ప్రజాస్వామ్య విధానం వైపు కేంద్రీకరించి, ప్రజలను సాధ్యమైనంత సన్నిహితంగా ఒకరికొకరిని తీసుకురావడానికి ప్రయత్నించారు. అణుయుద్ధం విశ్వప్రమాణం తలెత్తినప్పుడు ఆవ్యవస్థతకు జగతికి మధ్య ఆయనలా అతి ధైర్యంగా మరొకరెవరూ నిలబడలేదనే సత్యం బహుశా చరిత్రపుటల్లో కూడా లిఖించబడేవుంటుంది.

ప్రధానమంత్రిగా ఆయనకు, చైనా దురాక్రమణ ఒక పెద్ద అశనిపాతమైంది. కమ్యూనిస్టు చైనాకు ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వాన్ని కల్పించడానికి నిజానికి ఆయనే సమకాలీను లందరికన్న ఎక్కువగా కృషిచేశారు. భారతదేశంపై చైనా దురాక్రమణ ఆయన ఆశల్ని వమ్ము చేసింది. అయినా ఆయన కమ్యూనిజంపై పగ పూనలేదు. సోవియట్ రష్యా స్నేహాన్ని వదులుకోలేదు. వదులుకోవడం ఆయన స్వభావానికే, ఆశయానికే విరుద్ధం.

అన్ని అనర్థాలకూ హేతు వయిన చైనా సామ్రాజ్య విస్తరణ విధానం నుండి చైనా కమ్యూనిజాన్ని తొలగించడానికి ఆయన గాయాన్ని వేలెత్తి చూపారు. తూర్పు సరిహద్దులో చైనా వారు కొనసాగించిన దురాక్రమణ ఆయన అహింస విధానానికి ఒక పరీక్ష. అలాంటి పరీక్ష యింతకుపూర్వం ఎప్పుడూ ఆయన ఎదుర్కొలేదు. పాకిస్తాను చైనాతో చేతులు కలిపినా కూడా పాకిస్తానుతో కాశ్మీరు విషయమై చర్చించడానికి ఆయన ఎల్లప్పుడూ సంసిద్ధుడై వుండేవారు. ఆయన ఉత్తమ తరగతికి చెందిన రాజకీయ వేత్త అనడానికి అదే నిదర్శనం.

ఎలాంటి మనిషి ఆయన? ఈ గొప్పతనం ఆయనకు ఎక్కడనుండి వచ్చింది? ఆ రహస్యం ఏమిటి? ఈ నాడు ఆయన గతించిపోయారు గనుక యీ ప్రశ్నలన్నీ తల ఎత్తుతున్నాయి. తాను ముగ్గురు వ్యక్తులవల్ల ప్రభావితుడైనట్టు ఆయనే చెప్పుకున్నారు. వారు- ఆయన తండ్రి, గాంధీజీ, రవీంద్రనాథ టాగూరు. మోతీలాల్ కొడుకుగా ఆయన సంప్రదాయమంతా నెహ్రూకు సంక్రమించింది. గాంధీజీ పర్యవేక్షణలో విమర్శనా దృక్పథమూ, నిర్భయమైన శక్తి, స్థిరధ్యేయం గల "సాహసవంతమైన కొత్త ప్రపంచం" వైపు మొగ్గాడు. టాగూరు నుంచి అంతర్జాతీయ దృక్పథం, సంస్కారవంతమైన అభిరుచులు సంక్రమించాయి. వీటికి తన అభిరుచులను, గుణాలను — చంటిపిల్లవాని మాదిరి ఉత్సుకత, ఒక విధమైనసునాసౌన్నత్యము, మానవతా దృష్టులను - జోడించారు

భారత ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ కృషిని యింతవరకూ పూర్తిగా మదింపు వేయకపోయినప్పటికీ ఆయన భారతదేశాన్ని ప్రణాళికా బద్ధమైన ప్రగతి పథంలో పెట్టారనీ, కొన్ని విలువలను ఆపాదించారనీ, తద్వారా అనుకోకుండానే అంతర్జాతీయ రుజుత్వానికి ఒక విధమైన బారోమీటరుగా రూపొందారనీ చెప్పవచ్చు. సిద్ధాంతము, దాని ఆచరణలను సమన్వయించడంలో నెహ్రూ గ్లాడ్‌స్టన్‌ను మరపిస్తారు. నిజానికి రాజకీయ అధికారాన్ని సమర్థవంతంగా నిర్వహించడంలోనూ, పిత్రౌన్నత్యపు వారసత్వాన్ని పుణికి పుచ్చుకోవడంలోనూ ఆయన యంగర్ పిట్‌కు సమఉజ్జీగా వుంటారు. ఆయనలో "ఏకాంతపు స్వేచ్ఛా వాయువులు—గొప్పతనమూ, మానసిక ఔన్నత్యమూ, శక్తి, సత్ప్రవర్తనలతో కూడిన స్వేచ్ఛా వాయువులు—" వున్నాయి.

1964 మే 27 వ తేదీన ఆయన పరమపదించడంతో చరిత్రలో ఒక శకం ముగిసింది. తరువాత ఏమిటి?— ఈ ప్రశ్నను జవహర్లాల్ నెహ్రూ ఎప్పుడూ అంతగా పట్టించుకోలేదు. బహుశా తన ప్రజలు స్వతంత్రభారత నిర్మాతల స్మృతి చిహ్నాంగా వారి ఆశయాలపై ప్రగాఢ విశ్వాసాన్ని చూపించగలరని ఆయన నమ్మివుండవచ్చు.

2వ ప్రకరణం

# ఇవి నా భావాలు

(శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ రచనలనుండి
జ్ఞప్తికుంచుకో దగిన కొన్ని భాగాలు.)

# తాత్త్వికత

వర్తమానానికి పునాదులు గతంలో వేయబడ్డాయి. ఇందువల్లనే వర్తమానాన్నర్థం చేసుకొనడానికుపకరించేటట్టుకు (ఒకవేళ వుంటే) ఏదైనా లభ్యమౌతుందేమోనని గతంలోనికి అన్వేషిస్తూ వుంటాను. నేనెవరినో ఎక్కడ వున్నానో కూడా విస్మరించి సుదూరాన వున్న చిరకాలపు వ్యక్తులను గతించిన సంఘటలననూ గూర్చిన స్మృతులలో లీనమైపోయినప్పుడు కూడా వర్తమానపు ప్రాబల్యం నన్ను వీడనే లేదు. నేను గతకాలానికి చెందినవాడననే భావం అప్పుడప్పుడూ కలిగినప్పటికీ గతమంతా వర్తమానంలో నాకు చెందినదే నన్న అభిప్రాయం కూడా కల్గుతూంటుంది. గత చరిత్ర సమకాలీన చరిత్రలో మిళితమై వేదనానందభావనల సమిశ్రిత బంధాలలో బంధింపబడి మూర్తీభవించిన వాస్తవికతగా రూపొందింది.

* * *

సత్వర కార్యాచరణ విషయంలో ప్రధాన విషయాలను గూర్చిన భయ సందేహాలు ఆ చర్యల సునిశితత్వాన్ని కొంత మొద్దుబార జేయడం తప్ప నామార్గానికెన్నడూ ఆటంకములు కాలేదు. నేను పెట్టుకొన్న లక్ష్యం తప్ప సర్వమూ విస్మరించి లక్ష్యం వైపు దూసుకొనిపోయే బాణంవలె నా బాల్యంలో పనిచేసిన నేను ఇంక ఎంతో కాలం ఆ విధంగా నా విధులను నిర్వహించలేను. అయినప్పటికీ నేను విధి నిర్వహణ చేస్తున్నానంటే అది విధినిర్వాహణావశ్యకతను బట్టీ నా ఆదర్శాలకూ దానికీ గల (వాస్తవికమే కానీ, ఊహా కల్పితమే కానీ) సమన్వయతను బట్టీ మాత్రమే. అయితే రాజకీయాల పట్ల నాలో పెరుగుతున్న విముఖత నాలో క్రమంగా ఆవరించుకొని నా జీవిత గమనమైమార్పుకు లోనవుతున్నట్లు తోస్తున్నది.

* * *

నాకుముఖ్యంగా ప్రపంచంలోనేఈజీవితంలోనే ఆసక్తి. ఏదో మరో లోకంలో గాని, భవిష్యజ్జీవితంలో కాని నా కాసక్తి లేదు. ఆత్మ అనేది ఉన్నదా? మరణానంతరం పునర్జన్మ వున్నదా? లేదా? అన్నసంగతి నాకు తెలియదు. ప్రశ్నలు ముఖ్యమైనవే కాని నన్ను కొంచెం కూడా బాధించవు. ఆత్మ భవిష్య జ్జీవితం, కార్య కారణ కర్మ సిద్ధాంతములను విశ్వసించే వాతావరణంలో నేను పుట్టి పెరిగాను. వీని ప్రభావం నామీద వున్నది. అందువల్ల ఒకవిధంగా ఈ సిద్ధాంతాలకు నేను అనుకూలుడననే చెప్పాలి. చిట్ట చివరికి మిగిలేదాని గురించి ఆలోచిస్తే అనేక చిక్కులకు దారితీసినప్పటికీ జీవి భౌతిక దేహము మరణించిన తర్వాత కూడా ఆత్మ నశించకుండా వుంటుందనీ, జీవిత చర్యలు కార్యకారణ సిద్ధాంతానికి లోబడేవుంటాయనీ అనడం సహేతుకంగానే కనిపిస్తుంది. ఆత్మను విశ్వసిస్తే పునర్జన్మ సిద్ధాంతంలో కొంత న్యాయం వున్నట్లు కనిపిస్తుంది.

* * *

ఈ ప్రపంచాన్ని పరికిస్తూవుంటే అనూహ్యమూ, అగాధమూ అయిన నిగూఢభావం కలుగుతూ వుంటుంది. దీనిని అర్థం చేసుకోవలసిన ఆవశ్యకతతోబాటు దీనిని సంపూర్ణంగా అవగాహన అనుభూతిని పొందాలనే ఆకాంక్ష కూడా నాలో మిళితమై వుంటుంది. ఈ అర్థం చేసుకొనే ఏకైక ముఖ్యమార్గం విజ్ఞానశాస్త్రం అని నా కనిపిస్తుంది. నిజమైన పదార్థం అంటూ సృష్టిలో ఏమీ లేదని నాకుతెలిసినప్పటికి ఈ పదార్థ విజ్ఞాన పరిశోధనా మార్గమే దానిని చేరడానికి సరియైన మార్గం అని నా ఉద్దేశ్యం. ఆలాకాక అగోచరమైన ఈ ఆముష్మిక, చింతనా మార్గం అనివార్యం అయినట్టయితే అదితప్పక శాస్త్రీయ పద్ధతులద్వారానే సాధింపబడాలి.

ఈ పరమ రహస్యం ఏమిటో నాకు తెలియదు. దీనిని భగవంతుడని నేను అనలేను. ఎందుకంటే నాకు భగవంతునిపై విశ్వాసం లేదు కాబట్టి, ఒక దేవతనుగాని, అతీత శక్తిని గాని నేను విశ్వసించలేను. ఇలా విశ్వసించేవారిని చూస్తే నాకు ఆశ్చర్యంగా వుంటుంది. మనిషి కొక దైవం వుండటాన్ని గూర్చిన భావన నాకు అసహజంగా తోస్తుంది. అద్వైత వేదాంత తత్వాన్ని నేను కూలంకషంగా అర్థం చేసుకొన లేక పోయినప్పటికీ ఆ వాదపు బుద్ధి నైశిత్యాన్ని నేను మెచ్చుకుంటాను. కేవలం ఈ బుద్ధినైశిత్యపు పొగడ్త మానవుని

సుదూరాలకు గొంపోలే దని నాకు తెలుసు. అయితే అనంతత్వంలోనికి గల ఇతర మార్గాలవలెనే వేదాంతం కూడా తన విరాకార, సందిగ్ధ సిద్ధాంతాలతో నన్ను భయపెట్టింది. పకృతిలో గల భిన్నత్వమూ, పరిపూర్ణతా నన్ను కదల్చి నాలో ఉత్సాహ చైతన్యాలను సృజించాయి. విగ్రహారాధనా మయములు, విశ్వమే దైవమంటి సిద్ధాంత భరితములూ అయిన పురాతన భారతీయ గ్రీకు వాతావరణంలో దేవుడూ తదితర దైవగణాల ప్రమేయం విలుప్తం చేసినా కూడా నేను దాన్ని సహజంగా నే భావించగలను.

* * *

నా వారసత్వం ఏమిటి? నేను దేనికి వారసుణ్ణి? వేలాది సంవత్సరాలుగా మానవ జాతి సాధించినదానికి, దాని ఆలోచనలు, అనుభూతులు, కష్టసుఖాలు, విజయోత్సాహానందాలు, పరాజయాక్రందనలు — మొదలైన అనుక్రమతంగా వస్తున్న ఈ చరిత్రకూ మానవాళి ప్రగతికీ వారసుణ్ణా నేను? ఇదే నేటికీ పరంపరాగతంగా సాగుతూ మన వెన్నంటి వున్నంది. ఇది మానవుల కందరకూ వర్తిస్తుంది. కాని భారతీయుల కొక ప్రత్యేక వారసత్వం వున్నది. ఇది మినహాయింపబడేది కాదు. అందరూ మానవ జాతికి చెందినవారే. వీరిలో భేదమేమీ ఉండదు. అయినా, మన భారతీయుల ప్రత్యేకత ఏమిటి? ఈ ప్రత్యేకత మన నరనరాల్లోనూ, రక్త మాంసాలలో జీర్ణించుకొని వున్నది. ఇదే మనలను మనంగా భారతీయులుగా ప్రత్యేకించి చూపుతున్నది.

సత్య సాధనకొరకైన ప్రగతిని ఆమోద యోగ్యమైన మార్గంతో మిళితంచేసే అనుభవసిద్ధమైన ఆచరణ యోగ్యమైన మార్గమేదైనా వున్నదా? ఈ సమస్యా సాధనకు మధ్యా సూత్రాలఉల్లంఘన అనే ఉపాయం సూచితమైంది. ఒక పనిని లేక పదార్థాన్ని తదనుగుణమైన విధంగా మలచడం, పరిస్థితుల నాలంబనం చేసుకొని ఒక పద్ధతిలో నడిపించడం అనే వాని ప్రాముఖ్యాన్ని ఇది సూచిస్తుంది. సత్యానికి ఎప్పుడూ ప్రతిస్పర్థ అనివార్యంగా వుంటూనే వుంటుంది. ఇది ఒక వినూత్న భావంగా పరిణమిస్తే ప్రతిస్పర్థ మరింత ప్రబలమౌతుంది. ధ్యేయాన్ని గురించి మాత్రమే గాక లక్ష్య సాధనా మార్గానికికూడా కొంత ప్రాముఖ్యం ఇస్తే నిరోధకశక్తి కొంత తగ్గవచ్చు. తరతరాలుగా చిరకాలంగా పాదుకొనిపోయినవానిని సూటిగా ఎదుర్కొనడం విరమించండి దీనిని పార్శ్వంనుండి సాధించడానికి ప్రయత్నించండి ఇందుమూలంగా ప్రస్ఫుటమైన భాగం సత్యాన్వేషణకు గురి అవుతుంది. అయితే ఇలాంటి వేరు మార్గాలలో సత్యపథంనుంచి తొలగిపోకుండా జాగ్రత్త పడుతూండాలి. ఎందుకంటే ఈ మార్గం అసత్యంలోనికి జారిపోవడం కంటె ప్రాణాంతకం ఇంకొకటి లేదు. ఈ మార్గంలో అంగీకృతాలైన వివిధ నూత్న కార్యఘట్టాలను వెనుదిరిగి చూసుకొంటూ అనువైన విధంగా ఋజుమార్గంలో ఎప్పటికప్పుడు దిద్దుకొంటూ పయనించవలసి వుంటుంది. పూర్తి నూతనమైన పద్ధతిగా కాకుండా, పూర్వం మరచిపోయిన పాత సిద్ధాంతాలనే, పాతమార్గాలనే నవీనరూపంలో తీర్చిదిద్ది కాలగతిలో గౌరవింపబడే విధంగా మనం దీనిని సమర్పించాలి. దీనిని "అనంతమైన యీవిశాల విశ్వంలో నూతనమైన దేదీలేదు" అన్న నిజాన్ని నేర్పుగా వెలికి తీసి ప్రదర్శించగల శ్రద్ధా, ఓరిమీ కావాలి.

ఏదైనా ఒక ప్రచండమైన ఒత్తిడి ఆపనిని విధిగా చేయిస్తేతప్ప, ఒక ప్రబలమైన సామ్రాజ్యం ఒక దేశంపై తనఅధికారాన్ని వదులు కుంటుందనీ, ఒక ఉన్నతజాతి తన గౌరవాధికారాలను వదులు కుంటు దని భావించడం భ్రమయే కాగలదు.

# తాత్త్వికత

వర్తమానానికి పునాదులు గతంలో వేయబడ్డాయి. ఇందువల్లనే వర్తమానాన్నర్థం చేసుకొనడానికుపకరించే కిటుకు (ఒకవేళ వుంటే) ఏదైనా లభ్యమౌతుందేమోనని గతంలోనికి అన్వేషిస్తూ వుంటాను. నేనెవరినో ఎక్కడ వున్నానో కూడా విస్మరించి సుదూరాన వున్న చిరకాలపు వ్యక్తులను గతించిన సంఘటలననూ గూర్చిన స్మృతులలో లీనమైపోయినప్పుడు కూడా వర్తమానపు ప్రాబల్యం నన్ను వీడనే లేదు. నేను గతకాలానికి చెందినవాడ ననే భావం అప్పుడప్పుడూ కలిగినప్పటికీ గతమంతా వర్తమానంలో నాకు చెందినదే నన్న అభిప్రాయం కూడా కల్గుతూంటుంది. గత చరిత్ర సమకాలీన చరిత్రలో మిళితమై వేదనానందభావనల సమ్మిశ్రిత బంధాలలో బంధింపబడి మూర్తీభవించిన వాస్తవికతగా రూపొందింది.

* * *

సత్వర కార్యాచరణ విషయంలో ప్రధాన విషయాలను గూర్చిన భయ సందేహాలు ఆ చర్యల సునిశితత్వాన్ని కొంత మొద్దుబార జేయడం తప్ప నామార్గానికెన్నడూ ఆటంకములు కాలేదు. నేను పెట్టుకొన్న లక్ష్యం తప్ప సర్వమూ విస్మరించి లక్ష్యం వైపు దూసుకొనిపోయే బాణంవలె నా బాల్యంలో పనిచేసిన నేను ఇంక ఎంతో కాలం ఆ విధంగా నా విధులను నిర్వహించలేను. అయినప్పటికీ నేను విధి నిర్వహణ చేస్తున్నానంటే అది విధినిర్వాహణావశ్యకతను బట్టీ నా ఆదర్శాలకూ దానికీ గల (వాస్తవికమే కానీ, ఊహా కల్పితమే కానీ) సమన్వయతను బట్టీ మాత్రమే. అయితే రాజకీయాల పట్ల నాలో పెరుగుతున్న విముఖత నాలో క్రమంగా ఆపరించుకొని నా జీవిత గమనమై మార్పును లోనవుతున్నట్లు తోస్తున్నది.

* * *

నాకుముఖ్యంగా ప్రపంచంలోనే ఈజీవితంలోనే ఆసక్తి. ఏదో మరో లోకంలో గాని, భవిష్యజ్జీవితంలో కాని నా కాసక్తి లేదు. ఆత్మ అనేది ఉన్నదా? మరణానంతరం పునర్జన్మ వున్నదా? లేదా? అన్న సంగతి నాకు తెలియదు. ప్రశ్నలు ముఖ్యమైనవే కాని నన్ను కొంచెం కూడా బాధించవు. ఆత్మ భవిష్య జ్జీవితం, కార్య కారణ కర్మ సిద్ధాంతములను విశ్వసించే వాతావరణంలో నేను పుట్టి పెరిగాను. వీని ప్రభావం నామీద వున్నది. అందువల్ల ఒకవిధంగా ఈ సిద్ధాంతాలకు నేను అనుకూలుడననే చెప్పాలి. చిట్టచివరికి మిగిలేదాని గురించి ఆలోచిస్తే అనేక చిక్కులకు దారితీసినప్పటికీ జీవి భౌతిక దేహము మరణించిన తర్వాత కూడా ఆత్మ నశించకుండా వుంటుందనీ, జీవిత చర్యలు కార్యకారణ సిద్ధాంతానికి లోబడేవుంటాయనీ అనడం సహేతుకంగానే కనిపిస్తుంది. ఆత్మను విశ్వసిస్తే పునర్జన్మ సిద్ధాంతంలో కొంత న్యాయం వున్నట్లు కనిపిస్తుంది.

* * *

ఈ ప్రపంచాన్ని పరికిస్తూవుంటే అసూహ్యమూ, అగాధమూ అయిన నిగూఢ భావం కలుగుతూ వుంటుంది. దీనిని అర్థం చేసుకోవలసిన ఆవశ్యకతతోబాటు దీనిని సంపూర్ణంగా అవగాహన అనుభూతిని పొందాలనే ఆకాంక్ష కూడా నాలో మిళితమై వుంటుంది. ఈ అర్థం చేసుకొనే ఏకైక ముఖ్యమార్గం విజ్ఞానశాస్త్రం అని నా కనిపిస్తుంది. నిజమైన పదార్థం అంటూ సృష్టిలో ఏమీ లేదని నాకుతెలిసినప్పటికీ ఈ పదార్థ విజ్ఞాన పరిశోధనా మార్గమే దానిని చేరడానికి సరియైన మార్గం అని నా ఉద్దేశ్యం. అలాకాక అగోచరమైన ఈ ఆముష్మిక, చింతనా మార్గం అనివార్యం అయినట్టయితే అదితప్పక శాస్త్రీయ పద్ధతులద్వారానే సాధింపబడాలి.

ఈ పరమ రహస్యం ఏమిటో నాకు తెలియదు. దీనిని భగవంతుడని నేను అనలేను. ఎందుకంటే నాకు భగవంతునిపై విశ్వాసం లేదు కాబట్టి. ఒక దేవతనుగాని, అతీత శక్తిని గాని నేను విశ్వసించలేను. ఇలా విశ్వసించేవారిని చూస్తే నాకు ఆశ్చర్యంగా వుంటుంది. మనిషి కొక దైవం వుండటాన్ని గూర్చిన భావన నాకు అసహజంగా తోస్తుంది. అద్వైత వేదాంత తత్వాన్ని నేను కూలంకషంగా అర్థం చేసుకొనలేక పోయినప్పటికీ ఆ వాదపు బుద్ధినైశిత్యాన్ని నేను మెచ్చుకుంటాను. కేవలం ఈ బుద్ధినైశిత్యపు పొగడ్త మానవుని

సుదూరాలకు గొంపోలే దని నాకు తెలుసు. అయితే అనంతత్వంలోనికి గల ఇతర మార్గాలవలెనే వేదాంతం కూడా తన నిరాకార, సందిగ్ధ సిద్ధాంతాలతో నన్ను భయపెట్టింది. ప్రకృతిలో గల భిన్నత్వమూ, పరిపూర్ణతా నన్ను కదల్చి నాలో ఉత్సాహ చైతన్యాలను సృజించాయి. విగ్రహారాధనామయములు, విశ్వమే దైవమంటి సిద్ధాంత భరితములూ అయిన పురాతన భారతీయ గ్రీకు వాతావరణంలో దేవుడూ తదితర దైవగణాల ప్రమేయం విలుప్తం చేసినా కూడా నేను దాన్ని సహజంగానే భావించగలను.

* * *

నా వారసత్వం ఏమిటి? నేను దేనికి వారసుణ్ణి? వేలాది సంవత్సరాలుగా మానవ జాతి సాధించినదానికి, దాని ఆలోచనలు, అనుభూతులు, కష్టసుఖాలు, విజయోత్సాహానందాలు, పరాజయాక్రందనలు — మొదలైన అనుశ్రుతంగా వస్తున్న ఈ చరిత్రకూ మానవాళి ప్రగతికీవారసుణ్ణా నేను? ఇదే నేటికీ పరంపరాగతంగా సాగుతూ మన వెన్నంటి వున్నంది. ఇది మానవుల కందరకూ వర్తిస్తుంది. కాని భారతీయుల కొక ప్రత్యేక వారసత్వం వున్నది. ఇది మినహాయింపబడేది కాదు. ఆందరూ మానవ జాతికి చెందినవారే. వీరిలో భేదమేమీ ఉండదు. అయినా, మన భారతీయుల ప్రత్యేకత ఏమిటి? ఈ ప్రత్యేకత మన నరనరాల్లోనూ, రక్తమాంసాలలో జీర్ణించుకొని వున్నది. ఇదే మనలను మనంగా భారతీయులుగా ప్రత్యేకించి చూపుతున్నది.

సత్య సాధనకొరకైన ప్రగతిని ఆమోదయోగ్యమైన మార్గంతో మిళితంచేసే అనుభవసిద్ధమైన ఆచరణ యోగ్యమైన మార్గమేదైనా వున్నదా? ఈ సమస్యా సాధనకు మధ్యసూత్రాలఉల్లంఘన అనే ఉపాయం సూచితమైంది. ఒక పనిని లేక పదార్థాన్ని తదనుగుణమైన విధంగా మలచడం, పరిస్థితుల నాలంబనం చేసుకొని ఒక పద్ధతిలో నడిపించడం అనే వాని ప్రాముఖ్యాన్ని ఇది సూచిస్తుంది. సత్యానికి ఎప్పుడూ ప్రతిస్పర్థ అనివార్యంగా వుంటూనే వుంటుంది. ఇది ఒక విసూత్న భావంగా పరిణమిస్తే ప్రతిస్పర్థ మరింత ప్రబలమౌతుంది. ధ్యేయాన్ని గురించి మాత్రామే గాక లక్ష్యసాధనా మార్గానికికూడా కొంత ప్రాముఖ్యం ఇస్తే నిరోధఃశక్తి కొంత తగ్గవచ్చు. తరతరాలుగా చిరకాలంగా పాదుకొనిపోయినవానిని సూటిగా ఎదుర్కొనడం విరమించండి. దీనిని పార్శ్వంనుండి సాధించడానికి ప్రయత్నించండి ఇందుమూలంగా ప్రస్ఫుటమైన భాగం సత్యాన్వేషణకు గురి అవుతుంది. అయితే ఇలాంటి వేరు మార్గాలలో సత్యపథంనుంచి తొలగిపోకుండా జాగ్రత్త పడుతూండాలి. ఎందుకంటే ఈ మార్గం అసత్యంలోనికి జారిపోవడంకంటె ప్రాణాంతకం ఇంకొకటి లేదు. ఈ మార్గంలో అంగీకృతాలైన వివిధ నూత్న కార్యఘట్టాలను వెనుదిరిగి చూసుకొంటూ అనువైన విధంగా ఋజుమార్గంలో ఎప్పటికప్పుడు దిద్దుకొంటూ పయనించవలసి వుంటుంది. పూర్తి నూతనమైన పద్ధతిగా కాకుండా, పూర్వం మరచిపోయిన పాత సిద్ధాంతాలనే, పాతమార్గాలనే నవీనరూపంలో తీర్చిదిద్ది కాలగతిలో గౌరవింపబడే విధంగా మనం దీనిని సమర్పించాలి. దీనిని "అనంతమైన యావికాల విశ్వంలో నూతనమైన దేదీలేదు" అన్న నిజాన్ని నేర్పుగా వెలికి దీసి ప్రదర్శించగల శ్రద్ధా, ఓరిమీ కావాలి.

---

ఏదైనా ఒక ప్రచండమైన ఒత్తిడి ఆ పనిని విధిగా చేయిస్తేతప్ప, ఒక ప్రబలమైన సామ్రాజ్యం ఒక దేశంపై తనఅధికారాన్ని వదులు కుంటుందనీ, ఒక ఉన్నతజాతి తనగౌరవాధికారాలను వదులు కొంటుందని భావించడం భ్రమయే కాగలదు.

# దృక్పథం

## 'భారతీయుడు' - 'హింద్'

భారతీయుడు అనే పదానికంటె దేశానికి గాని సంస్కృతికిగాని మన విభిన్న సంప్రదాయాల చారిత్రక సంకలనానికిగాని సరిగా వర్తించే సరియైన పదం 'హిందీ'. హిందుస్థాన్‌కు సంక్షిప్త రూపమైన 'హింద్' నుండి ఈ పదం ఆవిర్భవించింది. ఈ 'హింద్' అనేది భారతదేశానికి పర్యాయ పదంగా నేడుకూడా వాడుకలో వున్నది. పశ్చిమ ఆసియా, ఇరాన్, టర్కీ, ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్, ఈజిప్టు, ప్రభృతి దేశాలన్నిటా భారతదేశం ఎప్పుడూ, నేడుకూడా హిందూదేశమనే వ్యవహరింపబడుతున్నది. ఈ దేశానికి చెందిన సమస్తమూ 'హింద్' అనబడేది. ఈ పదానికి మతంతో నిమిత్తంలేదు. భారతదేశంలోని ముస్లిము, క్రైస్తవు లెవరయినా సరే హిందూ మతావలంబులైన ఇతరులవలె హింద్ అనే అనబడుతారన్న మాట. భారతీయు లందర్నీ హిందువులని వ్యవహరించే అమెరికన్లు ఈ విషయంలో పొరపాటు పడ్డారనే చెప్పాలి. నిజానికి 'హిందీ' అని వారు ఉపయోగించిన పదం సరి అయినదే. కాని దురదృష్టవశాత్తు ఆ పదం భారతదేశంలోని ఒక ప్రత్యేకమైన భాషకు, లిపికి (సంస్కృతపు దేవనాగరి లిపి) సంబంధించినది కావడంవలన దీనిని విపులమైన సహజార్థంలో వాడడానికి వీలు లేకపోయింది. నేటి ఈ విభిన్నాభిప్రాయాలు తొలగిపోయిన అనంతరం ఈ పదాన్ని దాని సహజ విస్తృతార్థంలోనికి మార్చి సంతృప్తికరంగా ఉపయోగించడం సాధ్యం కావచ్చును. నేడు 'హిందూస్థానీ' అనేపదం భారతీయుడు అనే అర్థంలో వినియోగింపబడుతున్నది. ఇది హిందూస్థాన్‌నుండి జనించినదే అనుకోండి. అయితే ఇది ఆ అర్థాన్ని విస్పష్టం చేయడానికి అశక్తమనే అనిపిస్తుంది. 'హిందీ' అనే పదానికున్నంత చారిత్రక సాంస్కృతిక స్పష్టత దీనికిలేదు. ప్రాచీన భారతీయ సంస్కృతీవైభవాన్ని 'హిందుస్థానీ' అని పేర్కొనడం సహజమే ననక తప్పదు.

మన సాంస్కృతిక సంప్రదాయాన్ని మనం, 'హిందీ' అనిగాని, 'హిందుస్థానీ' అనిగాని, ఏ పేరుతో పిలిచినా, గతంలో సంకలనంపట్ల ఒక విధమైన అంతరంగిక ప్రేరణ, బహుశః భారతీయ వేదాంత తత్త్వంనుండి సంక్రమించినదే కావచ్చును, భారతీయ సంస్కృతిలోనూ జాతి అభివృద్ధిలోనూ కూడా ప్రబలంగా ఆవహించి వుండడం మనం చూస్తున్నాం. విదేశీ సంపర్క ఫలితమైన అనేక దండయాత్రలు ఈ సంస్కృతిపై సవాలుగా పరిణమించాయి. అయితే ఈ అవరోధాల నన్నింటినీ ఇది విజయవంతంగా ఎదుర్కొని తనలో విలీనం చేసుకొన్నది. ఇది ఒక విధమైన నూతన సంస్కృతీ పునరుజ్జీవనం అనవచ్చును. మూలభూత సిద్ధాంతాలకు భంగం వాటిల్లకుండా నూతన సంస్కృతీ విలసనం వెల్లివిరిసే వినూత్న మార్గ మిది.

## ఆశావాదం

నేను ఆశావాదిని. సృష్టిలోనిసమస్తమూ ఆశాజనకమే అని భావిస్తాను. అయితే ఈ వాదం మనచుట్టూ వున్న సత్యాసత్యాలను గుర్తించడంలో మనలను అంధులను చేయకూడదు. ఆలోచనా రహితమైన ఆశావాదం తప్పుదారి పట్టే ప్రమాదం వున్నది. ఈ ప్రపంచం మొదటినుండీ, ప్రస్తుతంకూడా ఈ ఆశావాదానికి కొద్ది అవకాశాన్నిమాత్రమే వుంచింది. ఆదార్శవాదికి ఇదే క్లిష్టమైన సమయం. స్వయంగా చూస్తేగాని నమ్మని ఈ ఆదర్శవాదులకు, సూటి సమాధానం లభ్యంకాని ప్రశ్నలు, సులభంగా అంతరించని సందేహాలు అనేకం ఉత్పన్నమౌతూ వుంటాయి. ఈ విశాలవిశ్వంలో ఇంత దుఃఖమూ, అవివేకమూ, ఎందుకున్నాయి? రెండువేల అయిదువందల వత్సరాలకు పూర్వం మన ఇదే దేశంలో సిద్ధార్థకుమారుణ్ణి బాధించిన పాత ప్రశ్న ఇదే. ఆయనకు జ్ఞానోదయం అయి బుద్ధుడుగా పరివర్తన పొందేముందు ఆయన ఇదేప్రశ్న, తనను తాను ప్రశ్నించుకొన్నట్లు చెప్తారు.

## గౌరవార్హం కాని కళ

ఒక దేశపు భౌతిక కార్యకలాపాలకంటె ఆదేశపు కళల సారస్వతము ఎక్కువగా ఆ దేశపు ఆత్మోన్నత్యాన్ని గూర్చిన పరిజ్ఞానాన్ని విశదంచేస్తాయి. ఇవి మనలను ఆక్షణంలో, క్షణికావేశాలకూ, అసూయలకూ అతీతమైన సుప్రశాంత, వినిర్మల ఊహాలోకాలలోనికి తీసుకొని పోతాయి. కాని ఈనాడు కవీ, కళాకారుడూ కూడాభవిష్యత్తునుగూర్చిన భాష్యకారులుగామాత్రమే చూడబడుతూ, తగినంత గౌరవంపొందటం లేదు. ఒకవేళ ఎక్కడైనా వారు గౌరవింపబడితే అది సాధారణంగా వారి మరణానంతరమే అయివుంటుంది.

## గతమూ - భవిష్యత్తూ

గతం మనకు అనేక వరాలను ప్రసాదించింది. నేటి మన సంస్కృతీ, నాగరికతా, శాస్త్ర విజ్ఞానం, సత్యాన్ని గురించిన కొన్ని దృక్పథాల పరిజ్ఞానం — ఇవన్నీ కూడా మనకు సుదీర్ఘమూ లేక సన్నిహితమూ అయిన గతం ప్రసాదించిన వరాలే. ఇందుకుగాను మనం గతకాలానికి కృతజ్ఞులుగా వుండాలి. అయితే గతం మన కృతజ్ఞతాపూర్వకమైన కర్తవ్య పాలన గాని ఉపకారబద్ధతనుగాని తనలో ఇముడ్చుకొనలేదు. భవిష్యత్తుపట్ల కూడా మన కొక కర్తవ్యం వున్నది, గతంపట్ల మన కున్న

ఉపకార బద్ధతకంటె కూడా ఈ కర్తవ్య పాలనం అత్యధికస్థానాన్నభిలషిస్తుందనటం నిజం. ఎందుకంటే గతం ఎలానూ గతించి పోయినది. దాని నిక మనం మార్చలేము; భవిష్యత్తు ఇంకా రానున్నది; ఒకవేళమనం దాన్ని ఏ కొంచెమైనా తీర్చిదిద్దగలమేమో. ఒకవేళ గతం మనకు సత్యాన్నిగూర్చిన ఏ కొద్దిమాత్రపు జ్ఞానాన్నో మాత్రమే ప్రసాదించినట్లయితే భవిష్యత్తు కూడా సత్యాన్ని గూర్చిన దృక్పధాలను కొంత దాచివుంచుతుందనీ, దాని అన్వేషణకై మనలను ఆహ్వానిస్తుందనీ మనం భావించాలి. కాని సాధారణంగా గతం భవిష్యత్తుపట్ల అసూయపూరితమై వుండటంచేత అది మనలను భయంకరమైన తన పట్టులోబిగించివుంచి పీడిస్తుంది. దానినుండి విముక్తులమై భవిష్యత్తువైపు పురోగమించడానికై మనం తీవ్ర ప్రయత్నం చేయవలసివుంటుంది."

చరిత్రలో మనం నేర్చుకోవలసిన పాఠాలనేకం నిబిడీకృతమై వున్నాయి. చరిత్రతానుగాపునరావృతంకాదనేఒకనానుడి కూడా వున్నది. ఈ రెండూ నిజమే కావచ్చును. ఎందుచేతనంటే శ్రమ-డి చరిత్రను అనుకరించడం ద్వారా గాని, అది పునరావృతం అవుతుందనీ లేక చలన రహితంగా వుంటుందనీ ఎదురుచూస్తూ గాని కర్తవ్యతా విమూఢులమై ఏమీ చేయకుండా మనం దానిని అలా వదిలివేయలేము కదా. ఈ చరిత్రను పరిశోధించి, దానిని కదిలించే శక్తులను కనుగొన ప్రయత్నించడంద్వారా మనం కొంత నేర్చుకొనవచ్చును. ఈ ప్రయత్నాల వల్లనూ మనకు తరచుగా సూటి సమాధానం లభ్యమవుతుంది. "పాత ప్రశ్నలకు సమాధాన మివ్వడానికి క్రొత్త ప్రశ్నలు వేయడంకంటె చరిత్రకు మరో మార్గమేమీలేదు" అంటాడు కార్ల్‌మార్క్స్.

## తప్పు - ఒప్పు

ఏది తప్పు. ఏది ఒప్పు ? ఏది చెయ్యవచ్చును, ఏది చెయ్యరాదు? అనే విషయాన్ని నిర్ణయించుకోవడానికి బుద్ధివాదము సరియైన పద్ధతి కాదని నే నెప్పుడూ అనుకొంటూ వుంటాను. దానిని గూర్చి మనం వాద వివాదాలు చేసి తర్కించాలి. ఈ చర్చలలో ఒక్కొక్కప్పుడు కొంచెం నిజం బయటపడే అవకాశం వున్నది.

* * *

మనం పూర్తి తెలివైన వారముకాక పోవడం మంచిదైంది. ఒకవేళ అటువంటి వారు ఎవరైనా వుంటే ఇక నేర్చుకోవడానికేమీ లేదే అని వారు అప్పుడప్పుడు విచారపడక తప్పదు.

* * *

రహస్యమైన పని గాని రహస్యంగా వుంచాలని అనుకొనే పనిగాని ఎన్నడూ చేయకు. ఏదైనా దాచాలనే కోరిక నీ భీరుత్వాన్ని వెల్లడి చేస్తుంది. ఈ భయం అనేది చాలా చెడ్డది. అది నీవు సిగ్గిలవలసిన విషయం.

* * *

ఈ రోజులలో మన నాగరికతౌన్నత్యాన్ని, విజ్ఞానశాస్త్ర వింతలను గూర్చి డంబాలు పలికేవారు చాలా మంది కనిపిస్తున్నారు.

విజ్ఞాన శాస్త్రం అద్భుతాలను సాధించింది; నిజమే. మహనీయులైన విజ్ఞాన శాస్త్రవేత్త లందరూ అన్ని విధాలా గౌరవనీయులే.

ఇతర జంతువులకంటె కూడా మానవుడంతగా గణనీయమైన అభివృద్ధిని సాధించలేదని మనం గుర్తుపెట్టుకొనడం మంచిది.

* * *

మనం దారిద్ర్యాన్ని, క్లేశాన్ని మన దేశం నుండి నిర్మూలించాలి. మన ముందున్న మహత్తర కార్యసాధనలో మనతో సహకరించకుండానూ, ఆలోచించకుండానూ చేస్తున్న అనేకుల మెదళ్ళలోని బూజును కూడా సాధ్యమైనంతవరకు తొలగించి వేయాలి.

ఇది చాలా గొప్ప నిర్మాణ కార్యక్రమం. దీనికి సమయం పట్టవచ్చును. అంచేత మనం దీనికి మంచి ప్రేరణనైనా ఇద్దాం.

* * *

మనుష్యులు పుడుతూవుంటారు. గిడుతూ వుంటారు. సామ్రాజ్యాలు, ప్రభుత్వాలు కొంత కాలం ప్రభావంగా వెలిగి గతంలోనికి అదృశ్యమైపోతూవుంటాయి. కాని ప్రాచీన సంప్రదాయం మాత్రం కొనసాగుతూనే వుంటుంది. తరం వెనుక తరం దీని ముందు మోకరిల్లుతూనే వుంటుంది.

మనం గతంతో సంబంధాలు ఉంచుకోవటం ఎంత అవశ్యకమో మన ప్రగతిని నిరోధించే సనాతన దురాచార శృంఖలాలను త్రెంచుకొనడం కూడా అంత అవశ్యకం.

ఏ పని చేయ యత్నించనైనా ఆలోచించని తరగతుల ప్రజలు సమాజంలో ఉన్నతులుగా పరిగణింపబడటం ఇంకా ఎంత. అయినప్పటికీ ఇతరుల భాగంలో వీరు అత్యధిక భాగం తీసుకొంటారు. మీరు దీనిని నమ్మగలరా ? ఈ ప్రజలే సమాజపు అత్యున్నత సోపానాలపై అధిష్ఠించి గౌరవింపబడుతూ వుంటారు. తమకై తాము కష్టించి పాటు పడటం తమ గౌరవానికి భంగకరమని కొందరు మూర్ఖులు తలపోస్తారు. నేటి ప్రపంచపు తారుమారు విధానం అలాంటిది. పొలంలోని కర్షకుడూ, ఫ్యాక్టరీలోని కార్మికుడూ, ప్రపంచంలో ఆహారాన్ని, ధనాన్ని తామే ఉత్పత్తి చేస్తున్నప్పటికీ వారు బీదవారుగా వుండటం ఆశ్చర్యజనకం. మనదేశ స్వాతంత్ర్య సాధనను గూర్చి మనం ఎన్నో మాట్లాడుతున్నాం. అయితే ఈ తారుమారు విధానం నశించనంతకాలం, ఎవరి శ్రమ ఫలితం వారే అనుభవించే పద్ధతి రానంతకాలం ఏ స్వాతంత్ర్యమైనా సాధించి ఏం లాభం ?

## ఈ తరం కర్తవ్యం

"విశ్రాంతి లేకుండా కష్టపడి పని చేయడం మనతరం కర్తవ్యం. ఈ కాయ కష్టం నిర్మాణాత్మకమైనదిగా వుండాలి. ఇది విషమంగా వున్నప్పటికీ దేశం, జాతి స్థాయిని పెంపొందిస్తుంది. కనుక ఈ దినకష్టాన్ని నిర్మాణాత్మక, సృజనాత్మక మార్గంలో పెట్టి ముందుతరాలవారు సుఖించడానికి వీలుగా దేశాన్ని పటిష్ఠంతం చేయడానికి ఈ తరం శాయశక్తులా తోడ్పడిందనే పేరు తెచ్చుకోవాలి..." (–1948)

## పిలుపు

మనం తప్పనిసరిగా సాగించవలసి వచ్చిన బ్రహ్మాండమైన ఈ పోరాటంలో మనందరం – ఏ మతానికి చెందినవారమైనా, ఏ వర్గానికి చెందినవారమైనా, ఏ పార్టీకి చెందినవారిమైనా – చేయిచేయి కలిపి సోదరులుగా వ్యవహరించాలని కోరుతున్నాను. మన ప్రజలలో, లక్ష్యంలో, మనదేశ భవిష్యత్తులో నాకు పరిపూర్ణ విశ్వాసం వుంది. బహుశా ఆ భవిష్యత్తుకై మనం ఇలాంటి కొన్ని పరీక్షలను, బాధలను ఎదుర్కోవడం తప్పదేమో. మనకు భావిలో ఎలాంటి ఇబ్బందులు సంభవించినప్పటికీ వాటిని ధైర్యంగా ఎదిరించాలనీ, మనదేశ ఉజ్వల భవితవ్యం పట్ల సంపూర్ణ విశ్వాసం వుంచాలనీ, నమ్మలను కోరుతున్నారు.

(22 అక్టోబరు, 1962)

## ఆసియా మేల్కొంది

"గత కొన్ని తరాలుగా ప్రపంచ రాజకీయాల్లో జోక్యం కలిగించుకోని దేశాలు ప్రపంచంలో అనేకం వున్నాయి. కాని అవన్నీ యీనాడు మేల్కొన్నాయి. ఆ ప్రజల్లో చైతన్యం వచ్చింది. ఇంతవరకూ అలక్షింపబడిన వాటినీ, చూసీ చూడనట్టు దాటుకునిపోయిన వాటినీ యిటుపై ఏమాత్రం ఉపేక్షించరాదని వారు భావిస్తున్నారు. ప్రపంచ స్వరూపం వివరంగా మీకు తెలిస్తేనే కాని అసలు సమస్యనే అర్థంచేసుకోలేరనే యీ చిన్న సత్యాన్ని మీరు మర్చిపోకూడదు. ఏ ఒక్క సమస్యనూ ప్రపంచంలోని ఇతర సమస్యలకు సంబంధం లేకుండా విడిగా తీసుకొని ఆలోచిస్తే అసలు మీకా సమస్యే అర్థంకాదు. ఆసియా యీనాడు ప్రపంచ విషయాల్లో ఎంతో ముందడుగు వేసిందని ఘంటాపథంగా చెప్పగలను. భవిష్యత్తులో మరింతగా యిది ముందుకు పోగలదు.

(ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో 1948 నవంబరులో చేసిన ప్రసంగంనుంచి)

# విశ్వాసం

## శాంతి కాముకత

ఆయన అన్నారు – అమెరికానుగూర్చి భారతదేశపు మూలమూలల్లో కూడా తెలియని వారంటూ వుండరు. ఆ దేశాన్ని ఉన్నతస్థానంలో ప్రతిష్ఠించిన ఆ దేశపు ఆశయాలు, ఉద్దేశ్యాలు అంటే మనమంతో గౌరవిస్తాం, అభినందిస్తాం. అయినా మనం ఆయా దేశాల చరిత్రలను, సంస్కృతులను తెలుసుకున్నప్పటికీ మనంమన ఆశయాలతో ఏకీభవించని దేశాలవారిని సయితం సహృదయంతో అర్థం చేసుకోవడం వారిని అభినందించగలిగే హృదయముండడం మనకు అవసరం. ఆ విధంగా పరస్పరం ఒకరి నొకరు సహృదయంతో అర్థం చేసుకోవడంవల్ల సమిష్టి ధ్యేయాన్ని ఏర్పరచుకోవడానికి చక్కటిబాట ఏర్పడుతుంది.

ఈనాడు ప్రపంచంలో దేశాలమధ్య, ప్రజలమధ్య పరస్పరావగాహన, అభినందన లోపించిందనవచ్చు. అందువల్ల అమెరికా అంతరంగాన్ని అర్థంచేసుకోవడానికీ, మీ ఎదుట మా హృదయాన్ని బయట పెట్టడానికీ నేను యిక్కడికి యీ యాత్ర సలిపి వచ్చాను. ఈ రకమైనపరస్పరావగాహనను, సహకారాన్ని మనం పెంపొందించుకోగలమని నేను గాఢంగా నమ్ముతున్నాను.

"రెండు దురదృష్టకరమైన సంగ్రామాలు" యుద్ధం యొక్క భయంకర నగ్న రూపాన్ని చూపించాయి. శాంతి ధ్యేయంగా లేని విజయం శాశ్వత సత్ఫలితాలనుయివ్వలేదు. జితులు, పరాజితులు – యిరువురూ కూడా భయంకరమైన గతంలోని గాయాల బాధలతో, భవిష్యత్తుపై నెలకొన్న భయంతో ఒకే విధంగా బాధ పడతారు. ఈనాడు ప్రపంచం యీస్థితిలోనే వున్నదని అంటే యిందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. మనిషి కర్కశశక్తినిగాని, మనందరి మానవత్వాన్నిగాని గొప్పచేసి చెప్పడం కాదిది. ఈ దురదృష్టకరమైన వాతావరణం యిలానే వుండిపోతుందా? ఈ శాస్త్రజ్ఞానము సంపదవినాశనానికే యింకాతలవొగ్గుతాయా? పెద్దా, చిన్నా అన్నతేడా లేకుండా ప్రతి దేశమూ యీ ప్రశ్నకు సమాధానం యివ్వాలి. దేశం ఎంత పెద్దదయితే యీ ప్రశ్నకు సరియైన సమాధానం యివ్వడంలో, అందుకు కృషి చేయడంలో దాని బాధ్యత అంత ఎక్కువగా వుంది..."

(1949 అక్టోబరు 13 న అమెరికా కాంగ్రెసును ఉద్దేశిస్తూ చేసిన ప్రసంగం)

## స్వేచ్ఛా జ్యోతి

భారతదేశ స్వాతంత్ర్యంకొరకై ఏళ్ళతరబడి మేము పోరాటం సాగిస్తున్నాం. కాని యీనాటి పరిక్లిష్టమైన పరిస్థితిని చూస్తే వీటన్నిటికీ అతీతంగా; యీ దురాక్రమణ దారుణ్ని, దేశాన్ని కొల్లగొట్ట నేతెంచిన వాడ్ని నిజమైన జాతీయ శక్తితో అడ్డగించేందుకు ఒక అవకాశం మాకు యిస్తే మంచిదని మేము భావించాం. ఇందుకు సరియైన మార్గం మా దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదించి, దానిని పరిరక్షించుకోమని కోరడమే అని మా అభిప్రాయం. అలాచేస్తే లక్షలాది ప్రజల హృదయాలలో జ్యోతులు వెలిగి, అవన్నీ కలిసి మహా కార్చిచ్చు అయి, ఏ దురాక్రమణ దారుడ్నీ ఎదుటికి రానీయకుండా తరిమేయగలవు".

(రూజ్వెల్టుకు వ్రాసిన వుత్తరం 1942)

# 'నా చితాభస్మాన్ని సస్యక్షేత్రాలపై వెదజల్లాలి'

## నెహ్రూ వీలునామా వివరాలు

దాదాపు అర్ధ శతాబ్దంపాటు మాతృదేశంకోసం రక్తం ధారపోసిన శ్రీ జవహర్లాల్ నెహ్రూ తన మరణానంతరం తన చితాభస్మాన్ని భారత సస్య క్షేత్రాలలో కలుపవలసిందిగా కోరుతూ మరణశాసనం వ్రాశారు. భారత భూమిలో భూమిగా మారి, ఆ పుణ్యభూమితో విడదీయరానంతగా పెనవేసుకుపోవాలని ఆయన ప్రగాఢ కాంక్ష.

1954 జూన్ 21వ తేదీన శ్రీ నెహ్రూ వ్రాసిన విల్లులో యీ క్రింది విషయాలు పేర్కొనబడిఉన్నవి :

''నా చితాభస్మంలో కొంత భాగాన్ని అలహాబాదు నందలి త్రివేణి సంగమంలో కలపాలి. కాని ఎక్కువ భాగాన్ని విమానాల ద్వారా రైతులు కష్టించి సేద్యంచేసే పంట పొలాలలో వెదజల్లాలి. అలా చేయడంవల్ల నా చితాభస్మం భారత భూమిలో భూమియై, ధూళిలో ధూళియై భారతభూమితో విడదీయరానంతగా పెనవేసుకునిపోగలదు.''

వీలునామాలోని భాగాలను ఆలిండియా రేడియో వారు ప్రసారం చేశారు. శ్రీమతి విజయలక్ష్మీ పండిట్ వీలునామా భాగాలను చదివి వినిపించారు.

భారతప్రజలు తనయందు ప్రకటించిన అఖండ ప్రేమానురాగవాహినిని ప్రస్తావిస్తూ తాను భారతప్రజలకు యెంతో ఋణపడి ఉన్నానని ఆయన పేర్కొన్నారు. అట్లే సహచరులకు సైతం తానెంతో ఋణపడి ఉన్నానని ఆయన అన్నారు.

మతవిశ్వాసంవల్ల కాకపోయినా గంగానదియందు తనకు గల మక్కువవల్ల తన చితాభస్మాన్ని గంగలో కలుపవలసిందిగా ఆయన కోరారు.

తన మరణానంతరం ఎట్టి శాస్త్ర విహితమైన శ్రాద్ధకర్మకాండ జరుపవలదని కూడ ఆయన ఆదేశించారు. "ఇట్టి కర్మకాండలలో నాకు నమ్మకం లేదు. లాంఛనంగా నైనాసరే వాటికి తల ఒగ్గడం ఆత్మవంచనా, పరవంచనా కాగలదు."

తాను విదేశాలలో మరణించినప్పటికీ తన చితాభస్మాన్ని భారతదేశానికి కొనిరావలసిందిగా ఆయన కోరారు. ''భారతదేశం అన్ని సంకెళ్ళను త్రెంచుకోవాలి. తన ప్రజలను తాను విభజించి, కులాది ప్రజలను అణగద్రొక్కే పద్ధతులకు స్వస్తి చెప్పాలి. దేహమూ, ఆత్మా—రెండూ సమంగా వికసించడానికి ఆటంకభూతములైన సంకెళ్ళనన్నిటినీ త్రెంచుకోవాలి.''

చివరకు యిలా అన్నారు :

''గతంనుండి పూర్తిగా తెగతెంపులు చేసికోవడం నా అభిమతం కాదు. భారతదేశం నాకు అందచేసిన వారసత్వానికి నేను గర్విస్తున్నాను. దానిని సర్వథా రక్షించాలని కూడ నేను కాంక్షిస్తున్నాను.''

ప్రధాని నెహ్రూ మరణశాసనంలోని కొన్ని భాగాలు యివి :

''భారత ప్రజలనుండి నేను స్వీకరించిన ఆదరాభిమాన స్నేహానురాగములు అనంతములు. తిరిగి వారికి నేను ఏమియిచ్చి అందులో సహస్రాంశం కూడ తీర్చుకోలేను. నిజానికి అట్టి అకలుషమైన అచ్చపు ప్రేమకు తిరిగి మూల్యం చెల్లించడం అంటూ ఉండదు. ప్రజలు చాలమందిని గౌరవించారు. మరికొంతమందినీ పూజించారు; ఆరాధించారు. కాని నా విషయంలో వారు ప్రకటించిన అఖండ స్నేహ ప్రేమామృతరసం నన్ను ముంచియెత్తింది. నాకల్లా ఒకటేకోరిక. నా శేషించిన జీవితకాలంలో వారి ప్రేమను అపాత్రదత్తంగా చేసే పనిని ఏదీ చేయకుండా ఉండగలనని ఆశిస్తున్నాను.''

''నా మిత్రులకు, సహచరులకు నేను యింతకన్న యెక్కువ ఋణపడి ఉన్నాను. నేను తలపెట్టిన ఎన్నో బృహత్ప్రణాళికల సాఫల్యంలోనూ వారు నాతోపాటు కష్టంలో, సుఖంలో, లాభంలో, నష్టంలో సమాన భాగస్వాములు.''

# మహారచయిత కాగలిగిన పండిత నెహ్రూ

— పెరల్ బక్

ప్రతి శతాబ్దంలోనూ మానవకోటి జీవితంపై తమ ప్రభావాన్ని ప్రసరింపచేసే మహా పురుషులు ఏ కొద్దిమందో వుంటారు. అట్టి వారిలో శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ ఒకరు. కడచిన కొలది దశాబ్దాలలో ప్రాక్పశ్చిమ దేశాల ప్రజల జీవితాలపై, వారి శ్రేయస్సు కోసం, తమ ప్రభావాన్ని చూపిన ఏకైక వ్యక్తి శ్రీ నెహ్రూ. ఆయన్ను సరిగా అర్థం చేసుకోలేనివారు ఆయన్ను అడపాదడపా అన్యాయంగా అడిపోసినా, ప్రజాజీవితంపై ఆయన ప్రభావం ఏమాత్రం చెక్కుచెదరలేదు. ఆయన స్వతంత్రభావాలనూ, నిజాయితీనీ మహోన్నతమైన ఆయన వ్యక్తిత్వాన్నీ ప్రశంసించనివారు మచ్చుకైనా లేరు. సకల ప్రపంచం ఆయనకు నివాళులెత్తింది.

నాయకత్వం ఆయన సొమ్ము. ఆయన చిన్న వయస్సులోనే, మహాత్మా గాంధీ అనుచరుడుగా వున్న సమయంలోనే ఆయన పట్ల నాకు అభిమానం ఏర్పడింది. మహాత్ముని పట్ల నాకు పూర్తి భక్తి గౌరవాలున్నాయి. మహాత్మా గాంధీ శక్తి సామర్థ్యాలు నాకు తెలుసు. యువకుడైన శ్రీ నెహ్రూ తన స్వంత అభిప్రాయాలకు భంగం రాకుండా మహాత్ముని ప్రశంసలకు పాత్రుడు కాగలగడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. గాంధీజీ అభిప్రాయాలతో ఏకీభవించకుండా, ఆయనకు లొంగిపోకుండా, ఆయన ప్రశంసలకు పాత్రుడు కావడం శ్రీ నెహ్రూ యొక్క గొప్పతనానికి చిహ్నం. మా దేశ నాయకులు ప్రధానమంత్రి శ్రీ నెహ్రూను సరిగా అర్థం చేసుకోకుండా, అడపాదడపా శ్రీ నెహ్రూను విమర్శించినందుకు నేను ఎంతగానో, ఎన్నోసార్లు నొచ్చుకున్నాను. ప్రతీకార వాంఛగాని ద్వేషభావంగాని ఎన్నడూ ఎరుగని మహనీయుడు శ్రీ నెహ్రూ. ఆయన అనుసరించిన రాజకీయ విధానాలు సక్రమమైనవని కాలమే ఋజువు చేసింది. శ్రీ నెహ్రూ నాయకత్వం క్రింద భారత దేశం ప్రాక్పశ్చిమ దేశాలతోనే శకటానికి ఇరుసుగా కీలక స్థానం ఆక్రమించింది. భారతీయులు ప్రాక్పశ్చిమ దేశాల భాషలు తెలిసినవారు. మానవజాతి చరిత్రలో క్లిష్టాతి క్లిష్టమైన ప్రస్తుత ఘట్టంలో, శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ తన ప్రజ లందరినీ ఒక్క త్రాటిమీద నడిపించి, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించి కొన్ని శతాబ్దాలపాటు స్థిరంగా నిలబడగలిగిన శక్తియుక్తులు వారికి చేకూర్చారు.

ఆయనలో యితర సల్లక్షణాలు, ఆయన స్ఫురద్రూపం, మేధస్సు, హుందాతనం, నే నెన్నటికీ మరువజాలను. ఒడుదుడుకులు లేకుండా కాలం ప్రశాంతంగా సాగినట్లయితే తమ సృజనాత్మక శక్తితో, మహా రచయితగా ఆయన భాసిల్లేవారు. ఆయన శైలి అద్భుతమైనది. ఆయన భావనాపటిమ మహా గంభీరమైనది. దేశ రాజకీయాలకు తన జీవితాన్ని అంకితం చేయడంవల్ల, తీరిక లేక, అనేక ఉద్గ్రంథాలు రచించలేక పోయారు. అది మన దురదృష్టం. ఆయన అనేక ప్రముఖ గ్రంథాలు రచించారు. అందుకు నా కృతజ్ఞత. ఒక సంతృప్తి ఏమిటంటే, ఆయన నాయకత్వం భారత దేశానికి అనుక్షణమూ అవసరమైనది. ఆవిద్యుక్తధర్మాన్ని ఆయన ప్రశంసనీయంగా నిర్వహించారు.

జవహర్‌లాల్ నెహ్రూను మనకు ఎన్నటికీ మరువజాలం. మహాత్మా గాంధీ నాయకత్వ ఛాయలక్రింద ఆయన జీవితాన్ని ప్రారంభించారు. అతిత్వరలోనే ఆయన మహానాయకుడు కాగలిగారు. నవభారత నిర్మాతగానేగాక ప్రపంచ మహా పురుషులలో ఒకరుగా ఆయన కీర్తిప్రతిష్ఠలు చిరస్థాయిగా వుండిపోతాయి. ఆయన్ను దర్శించి, ఆయన అమృతవాణిని వినే మహదావకాశం నాకు లభించినందుకు నేను ఎంతో ఆనందిస్తూవుంటాను.

3వ ప్రకరణం

# కవుల కన్నీటి తర్పణం

(పండిట్‌జీకి కవిత అంటే ఎంతో ప్రీతి. ఆయన రచనలు, ప్రసంగాలు కవితా సౌరభాన్ని వెదజల్లుతాయి. ఆయనకు శ్రద్ధాంజలి అర్పిస్తున్న కొన్ని కవితా ఖండికలు.)

# నివాపాంజలిః

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

''ముక్తాగర్భాత్ మణీనాం జనిరిహ జగతి హ్యప్రసాధారణీ నో
మోతీలాల్ పుత్ర ''జౌహర్'' జగదతులమసాధారణం జన్మ లేభే।
భాసా కీర్త్యా ప్రతాపైః అఖిలమపి చమత్కృత్య లోకం సమన్తాత్
నిర్యాతః శోకపూరే సకలమపి జగత్ మజ్జయిత్వా నితాన్తమ్''
''సౌజన్యం, సుఖదుఃఖయో రనుభవః సర్వైస్సమం భూతలే,
దాక్షిణ్యం, ప్రభుతా, దయా, దృఢతరా దీక్షా చ దీనావనే,
శాన్తిస్థాపన - మాత్మశక్తి - రమలం స్వాన్తం, ప్రజారంజనం
ఏతేష్వాద్య నిరాశ్రయాస్సమభవన్ నెహ్రౌ గతే ద్యోస్థలీమ్''
''హాహాకార స్వవాన్తాదుదభవదఖిలేష్వద్య భూమండలేషు
తేజోనాశశ్చ జాతః సకలజనమనోవ్యోమసీమ్నో జగత్యామ్
నెహ్రూదేహావశేషో లయమభజత సత్పుణ్యతోయే నదీనామ్
ఆత్మా సర్వప్రజానాం నయననిచుళకే హ్యశ్రుతోయే విలీనః''
నేతారస్సంతి సద్యో బహవ ఇహజగత్యన్యదత్తావధానాః
భ్రాత్యాన్ మాత్రంకసుప్తాః సుఖతరశయనే లాలయంతో హి మృగ్యాః
శ్రీమన్నెహ్రూసదృక్షాః భరతభువి తథా విశ్వవిశ్వంభరాయామ్
నేతారో మార్గణీయా ఇతి హి జనగణాః దుఃఖదుఃఖం రుదంతి''
''నిష్ణాతాస్సంతి శాస్త్రేష్వనితరధిషణాస్సంతి రాజ్యైకతంత్రే
నిర్నిద్రాస్సంతి రక్షావిధిషు చ నితరాం నిస్సమాస్సంతి శక్త్యా
నిస్సీమాస్సంతి కీర్త్యా; జగతి జనమనో మోదలోకప్రియాస్తే
నేతారో నెహ్రూతుల్యాః నహి నహి భగణౌ సంతి మానుష్యపూర్ణాః''
''ఆత్మనశ్శాన్తిమాప్నోతు జనతాఽఽత్మసు నిష్ఠితః
పండితో ''జవహర్ నెహ్రూః'' తేజసా రోచయన్ భువమ్''
''అంధకారాఽవృతే దేశే హ్యంధకారిత చేతసా
తేజోమయాయ వితరామ్యంజలిం కర్మయోగినే''
సర్వస్మిన్ చతురబ్ధివేష్టితమహీచక్రే యశః కౌముదీ
సంవ్యాప్తే పరిపూర్ణమండలయుతో యోఽభాచ్చ రాత్రిందివమ్
తస్మై జవ్వారు యోగినే భరతభూమంత్రిప్రధానాయ నః
శ్రద్ధాభక్తిసమగ్రశోకభరితః కుర్వే నివాపాంజలిమ్

# శోకజ్వాల

వాఙ్మయమహాధ్యక్షు
శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య

సత్యంగా నిత్య సత్యాన్వేషణలో
అహరహం పరిశ్రమించిన నువ్వు
అసత్యం అయిపోయావా జవహర్ !
అనిత్యం అయిపోయావా జవహర్ !
అయితే నేం ? నువ్వు అసత్యం అయితే నేం ?
అయితే నేం ? నువ్వు అనిత్యం అయితేనేం ?
సర్వతోముఖమైన యీ స్వతంత్ర భారత
ప్రగతి ముకురంలో
విశ్వవిరాట్ శాంతి సౌభాగ్య
మణిమయ మకుటంలో
నిత్యసత్యంగా ప్రతిబింబిస్తూ నివ్వు కలకాలం
నిగుడొందుతావ్ జవహర్ !
నెగడొందుతావ్ జవహర్ !
హింసను ధ్వంసం చెయ్యడానికి
అహింసాయుతమైన పోరాటం
అవిశ్రాంతం చేసిన నీ నిండుగుండె
క్రూర మృత్యుదేవత హింసకు
గురై పోయిందా నెహ్రూ !
బలై పోయిందా నెహ్రూ !
అయితేనేం? నీ నిండు గుండె హింసకు గురైతే నేం?
అయితేనేం? నీ నిండు గుండె హింసకు బలైతే నేం?
పరమధర్మమైన అహింసా సిద్ధాంతానికి
అచంచల నిలయంగా వెలసిన నీ గుండె
తరతరానికీ — నరుడు నరుడుకీ
ఒకే ఒక్కబడిగా — ఒకే ఒక్కగుడిగా
మంచి నడవడిగా — మించు మనుగడగా
నెలవొందుతుంది నెహ్రూ !
వెలుగొందుతుంది నెహ్రూ !
నిఖిల ప్రపంచశాంతికై నిండుగుండెతో
నిర్విరామంగా కృషిచేసిన నువ్వు
నవభారత భాగ్యేందిర గర్భకోశంలో
ప్రశాంత జగదిందిర హృదయ మందిరంలో
అశాంతి రేపావా నెహ్రూ !
అశనిపాతంగా తరలి వెళ్ళిపోయావా నెహ్రూ!
అయితే నేం ? నువ్వు అశాంతి రేపితే నేం ?
అయితే నేం ? నువ్వు తరలి వెళ్ళిపోతే నేం ?
సహనతైలం పోసి నీవై వెలిగించిన దివ్యజ్యోతి
ఆ ఆశాజ్యోతి - శాంతిజ్యోతి - అహర్నిశలు
ప్రశాంతంగా - ఆశాంతంగా
పరపీడన నిశాంతంగా
నవ్యదీధితుల్ని
దివ్యదీధితుల్ని
ప్రసరిస్తుంది నెహ్రూ !
ప్రసాదిస్తుంది నెహ్రూ !
అందుకే ఒకప్పు డమృతపదార్థాలతో అన్నాను నేను
అందుకో ఎప్పుడూఅనృతపదార్థంకానివిన్నాణివైననువ్వు
నిత్యసత్యంలో నిండినిబిడీకృతమై ఉంది అసత్యం
అసత్యంలో అంతర్భూతమై ఉంది నిత్యసత్యం
హింసలో లీనమై ఉంది అహింస
అహింసలో తానైయై ఉంది హింస
శాంతిలో దాంతిగా ఉంది అశాంతి
అశాంతిలో వేదాంతిగా ఉంది శాంతి
సత్యాసత్యాల్లో సత్యాన్ని
హింసాహింసల్లో అహింసను
శాంత్యశాంతుల్లో శాంతిని
గుర్తించి ప్రవక్తగా ప్రవర్తించిన దివ్యనవ్య మూర్తీ !
ప్రేమమయ విశాలప్రపంచ చక్రవర్తీ !
అదిగో ! కన్నెరగా వికసించి గుభాళిస్తున్న
అందమైన యెర్రని గులాబీలమాల
ఇదిగో ! కిన్నెరగా విలపించి ప్రవహిస్తున్న
పవిత్ర జనత గంగా ప్రేమేందిర హృదయశోకజ్వాల.

# దివ్యస్మృతి

గడియారము వెంకటశాస్త్రి

''పదునేడేండ్లకు మున్ను భారతధరన్ భావించి, యానాఁటిసం
పదతోఁ బోల్చిన, మాఘఫాల్గునపరిమ్లానప్రభాహీనదీ
నదశల్వోవ, స్వతస్స్ఫురన్నవవసంతశ్రీయుతోద్యానభా
గ్యదశల్ గన్పడు; నీ మహోదయకరుం డామాధవుం డెవ్వఁడో!
యవధుల్ దాటి విదేశనేతలు ప్రపంచైకాధిపత్యార్థులై
దివియందున్ భువియందు నెందు నణుశక్తిన్ బెంచి, సంగ్రామవి
ప్లవముల్ రేఁపఁగఁ, దద్విషాగ్ను లోకలీలన్ బుక్కిటన్ మ్రింగుమా
నవతారశుక శాంతిదూత యెవఁ డన్నా! యీతఁ డాభర్గుఁడా!
ఒకబుద్ధుం డొకశంకరుండు నిటు పుణ్యుల్ భారతాధ్యాత్మనా
యకు లొక్కొక్క రొకొక్కసత్పథము నీయంజాలి; రీతండు భౌ
తిక మాధ్యాత్మిక మొక్కమూస నరునందే దైవమున్ జూచుధ
ర్మకళాక్షేత్రము కర్మయోగపరమార్థం బిచ్చెఁ దా నెవ్వఁడో!''
అనుచున్ దేశవిదేశవిజ్ఞులు నిరూఢాశ్చర్యనిష్కంపలో
చను లై కన్గొన, భిన్నజాతిమతవాంఛాద్వేషఝంఝాప్రభం
జనఘాతాంబుధిలో సురక్షితముగా జాతీయతానౌక నే
ర్పున సాగించినధీరనావికుఁడు నెహ్రూ గాక యొండే అగున్!
గాంధియే లేనిచో - లే దఖండ మౌ స్వ
తంత్రతాజ్యోతి భారతధరణి కపుడు!
లేనిచో జవ్హారుఁడు - గాంధి లేనియిపుడు
లేదు మనుగడ - నేఁటి భాగ్యోదయంబు.
పరదాస్యంబు తొలంచి, భారతమహీప్రాచీనశోభాపరి
ష్కరణంబుల్ వెలయింప దీక్ష గొనుచున్, స్వాతంత్ర్యయోధాగ్రత
స్సరుఁ డై పోరి జయంబు దెచ్చినయహింసాధర్మవీరుం, డభం
గురసత్యాగ్రహజవ్హారుం డనుచు లోకుల్ నెమ్మిఁ గీర్తింపరే!
''సేవాధర్మము రాజధర్మము దయాస్నేహాదులున్ పాలన
ప్రావీణ్యంబున సామ్య మందగఁ, బ్రజాస్వామ్యప్రభుత్వవ్యవ
స్థావైశిష్ట్యముఁ బెంచి, యెల్లయెడలన్ దా సర్వమై నిల్చి, యీ
శావాస్యం బొనరించె భారతము జవ్హర్లాలు సామాన్యుఁడే!
నవసంకల్పము, నూతనోద్యమము, నూత్నప్రత్నవిజ్ఞానవై
భవమై, భారత మన్నిరంగముల శోభావంతమై, నేఁటికిన్
''నవనెహ్రూయుగ'' కీర్తి నిల్పుకొనె, నీ నవ్యప్రభామండలిన్
జవహర్లాలు వెలుంగు నంతట సహస్రద్యోతసప్తాశ్వుఁ డై.

(ఇంది యంతయు క్రోధి ఉగాదికి ముందుమాట)

సర్వధారితో మొలకెత్తి, సర్వగతుల
శోభకృతుతో ఫలపుష్పశోభితముగ
నెదిగి వచ్చినభారతాభ్యుదయమునకు
క్రోధి యెదురయ్యె; రాహు నర్కు దిగమ్రింగె.

భారతీయార్కబింబంబు పట్టపగలె,
యస్తమించెఁ, దమిస్రంబు లలముకొనియె
దిక్కు దోఁపనికాళరాత్రి యిది; రాత్రి
గాని యీ రాత్రి దీప మెందైనఁ గలదె!

ఒడలిలో స్తబ్ధచైతన్య మున్న దొకటి
కంటిలో పాప యున్నది కదల లేక
ఉన్నవానిలో శక్తి యే మున్న దయ్య!
'జవహరుఁ'డ వోచు మాయ మైతివి గదయ్య!

భారతీయులజీవనపథము లెల్ల
అంధకారావృతము లయ్యె; నసురసంధ్య,
దాపురం బయ్యె; మందేహదైత్యు లదిగో
తారసిలుచుండి రపుడె శస్త్రములఁ బూని.

ఓ యహర్పతీ! యివిగొ నేత్రోద్ధృతములు!
సాయమర్ఘ్యంబు; లివి దైత్యచయమునడఁప
చంద్రమండలమందుండి చలువ లొలయ
జాడ దెలియ మమ్మిటు తొంగిచూఁడవయ్య!

చంద్రుఁడే తమ దైవ మజ్ఞజనులజాడ
వేఱు; లోకమ్ములకు నెల్ల వెలుఁగు వోయు
నీవె మాదేవత వుషస్సు నెలకొనంగ;
వేయివెలుఁగుల మణుల వేంచేయవయ్య!

పంచభూతముల్ నీమేను పంచికొనఁగ
నిలిచి యున్నాఁడ వర్కమండలమునందు
నిన్నుఁ గన లేక వాపోవు నీదుజనత
హృదయములనిండ సాక్షాత్కరింపవయ్య!

ఆవరించియే యుంటి వీ వన్నియెడల
అవతరించిన దపుడె నిన్ననుసరించు
మంత్రిమండలి; వారికి మాకుఁ గూడ
వెన్నుబల మిచ్చి త్రోవఁ జూపింపవయ్య!

భారతశ్రేయమున కింక భయము లేదు
లాలుబహాదురు జహ్వారులాలుఁ డయ్యెఁ
జెలఁగె నిందిరానందసంజీవశక్తు;
లెందు కామరాజోద్యమంబె జయించె.

స్వర్గమేలుచునున్న దైవతములార!
విపుల పుణ్యతీర్థక్షేత్రవిబుధులార!
పరమమునులార! నాయక ప్రవరులార!
విజయశుభశాంతు లిచ్చి దీవింపరయ్య!

---

తొలుత దేశ పరిధుల్లోనూ క్రమంగా ప్రపంచమంతటా సోషలిస్టు ప్రభుత్వస్థాపనకు నిర్దేశింపబడిన ఏకై[illegible]ర్గాన్ని మనం తప్పనిసరిగా అవలంబించాము.

# బిందుమాల

వెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి

జవహరుభాయీ! అహో
తిన! హరి హరి! విధివశమృత్యుదేవత ఉద్ధతితో
శివమూర్తి నిన్ను మ్రింగెనె!
భువి దివి యగునస్పృ యాశ పోయెనె నీతో !!

ఏ మని చెప్పుదుమో! హిమనగేంద్ర శిఖావళి కూలె నంచునా!
సౌమనసంపుదీపము నిశాన్ దివికొండను నెక్కె నంచునా!
భ్రామితదీనమానవజగం బిటు కాలము జేసె నంచునా!
స్వామివి నీవు పోయితివి శాశ్వతరీతిని రా వటంచునా!!

లాభము లేని యేడుపులు లక్షలు నేడ్చిన నీవురావు; దే
వా! భరతాంబికామధురభాగ్యనిధానమ! జాతినేత వై
మా భవితవ్యముల్ మలచుమానవలోకపుశాంతిదూత వై
ప్రాభవ మెంత యో వలచి పండిత జవ్హరులాలు పోతివా!

ఓ మహనీయసుందరతనూ! రసమోహనవాగ్మి! ఆర్ద్రభా
వామృత ప్రేమసాగర హృదంతర! బంధితభారతాత్మభా
రామిత మోక్షణోద్యమమహారథి! బాధితమానవప్రపం
చామరసారథీ! చిరయశస్స్థిర శేషవిశేషసత్ప్రధీ!!

ఇది మా యేడుపు! ఎంత ఏడిచిన నింతే! నీవికన్ వత్తువా!
పదివేలేండ్లకు రావు! మాహృదయసంబాధంబు నీదివ్యరూ
పదిదృక్షామతి నేగతిన్ గనక నీపాదాబ్జపర్యంత మై
నదులన్ బారు! ఋణానుబంధ మిది శాంత్యర్థంబు నీకోసమై.

'ఆరాం హరాంహై' అని
ధీరోదాత్తముగ బల్కి తీవు ప్రధానీ!
లేరోయి నిన్ను బోలిన
వారీజగమునను! నీవు పాసితి; వెట్లో !!

# నెహ్రూ ప్రభాకరుడు

టూయూరి హనుమంతరావు

ధ్యాత్వా ప్రాగరుణోదయమ్ పులకితః స్పృష్ట్వాపి
మిత్రాగమమ్
ఔత్సుక్యేన సహస్రపత్రరుచిరం తత్ ప్రాప్త మున్మీలనమ్
ధృత్వా మిత్రసమాగమే విలసనమ్ నైర్మల్యసంభావనమ్
నెహ్రూర్మిత్ర మణోరదృశ్యవశతో మ్లానం హి గీర్ణీరజమ్.

ఉదయగిరిఁ బుట్టి యస్తాద్రి నొదిగి జాఱు
ననలమును గ్రక్కు రవిబింబ మనుదినంబు
హృదయములఁ బుట్టి హృదయాల నేలు సుధలఁ
జిలికి జవహరు కీర్తిమండలము సతము.

కువలయమ్మును బాధించి కుతుక మందుఁ
బగలు గలిగించు చుండుఁ బ్రభాకరుండు
కువలయమ్మును మురిపించి కుతుక మందుఁ
బగలు తొలఁగించు నెహ్రూప్రభాకరుండు.

ఆరవి పంచభూతములయందు చరించును కర్మసాక్షి వై
ఈరవి పంచశీలముల కేలిక వై చను ధర్మసాక్షి వై
ఏ రథిక ప్రధాను లని యెంచిన ధర్మము కర్మకన్న వి
న్నైన రహియించు నన్నుఁ దెలియన్ సుకరంబె కదా
ప్రధానసిన్!

విశ్వచక్రమ్ము చుట్టెడు విభుఁ డతండు
విశ్వచక్రమ్ము త్రిప్పెడు విభుఁ డితండు
కాంతిరేఖలు పఱచుభాస్కరుఁ డతండు
శాంతిరేఖలు పఱచుభాస్కరుఁ డితండు.

తొలఁగన్ గాఢతమఃప్రతాపములు తోడ్తో రంగ
సంతోషముల్
కలుగన్ — జాగృతనీరజాతసుమనఃకల్యాణవిన్యాసముల్
చెలఁగన్ — విశ్వసమస్తజీవహిత సుశ్రీకమ్ము చేకూర్పఁగాఁ
గల ప్రాగ్భాస్కరభానుభామతుల శక్యంబే నుతుల్ సేయగా?

# జాతికి ప్రబోధ

తిమ్మరాజు వెంకటశివరావు

రాజఘాట్ ఉయ్యాలలోన
పండితుడు నెహ్రూ పవళించినాడు
కదలండి కదలండి కాంచివద్దాం
పవళించె పండితుని తనువు
తనువులో ఏముంది తరలిపోయెను కాంతి
కాంతి కాంతేకాదు భారతీయజ్యోతి
జ్యోతి జ్యోతేకాదు భారతీయుల ఆత్మ
భారతీయజ్యోతి ఆరిపోయింది
భారతీయుల ఆత్మ ఎగిరిపోయింది
అంధకారమ్మంత ఆవరించింది
దిక్కెవరు మన కింక? వెలుగు నిచ్చే దెవరు?

నెహ్రూవేసిన బాట చూడవలె నింక
నెహ్రూచేసిన బోధ వినగవలె నింక
కళ్లుండి చూడక చెవులుండి వినక
పిరికితనమున మీరు క్రుంగగానేల
లేవండి నెహ్రూను తలపండియింక
హృదిలోన నిలపండి మనసార కొలవండి
ఆత్మశక్తిని చూపి జాతి ఖ్యాతిని చాటి
అడుగుజాడను మీరు అనుసరించండి

ప్రజలందరుకు నేత జవహరుం డైతే,
ప్రతివ్యక్తి జవహరై ప్రగతిచూపండి
మాతృదేశం భరతదేశం
మార్గదర్శిగ నిలిచిపోయి
విశ్వజగతిని వీణ మీటి
ఆలపించును శాంతిగీతం

స్వర్గసీమను కలిసికొన్న
గాంధితాతా నెహ్రునేతా
అభయ మిచ్చి ప్రజను మెచ్చి
కురియజేతురు పూలవాన

భారతీయ జ్ఞానజ్యోతి ప్రజ్వరిల్లాలి
భారతీయుల ఆత్మ లెల్లా విస్ఫురించాలి.

# చితిమంటలు

సి. నారాయణరెడ్డి

మరువలేము తండ్రీ! నీ మధుర కాంతి రూపమ్మును
మరువలేము జవహర్! నీ మహిత స్మృతి దీపమ్మును.

గంధపు చెక్కలలో నీ కనక ప్రభలే తోచెను
చితిమంటలలోపల నీ చిరునవ్వులు విరబూచెను.

ఆలపించు వైదిక మంత్రాక్షరములలో; నీ వి
న్నాళ్ళు మ్రింగుకొన్న వేదనాస్వరములె వినిపించెను.

కన్ను మూసినావు నీవు కన్నుమూయలేము మేము.
చుక్కలలో చోటు నీకు రెక్కలు తెగిపోయె మాకు

మనిషి మనిషి గుండెలోన తొణకెను కన్నీటిజాలు;
ఇంటింటా గగనవాణి ఏడ్చెనయా పగలురేలు.

అటు జాన్సన్ విలపించెను ఇటు కృశ్చెవ్ విలపించెను
విశ్వమంత ఇందిరయై విలపించెను విలపించెను.

ఎందరు నాయకులు లేరు? ఎందరు పాలకులు లేరు?
ఐనా, నీవలె మనిషిని అర్చించినవా రెందరు?

నీవు బ్రతికియున్నప్పుడు నిను పొడిచిన కాకిమూక
మకరాశ్రులు విడిచె నేడు మా రక్తం రగిలె చూడు

ఆ పడమర ఈ తూరుపు నీ పలుకులపందిరిలో
కొంగులు ముడివేసుకున్న బంగరుకాలమ్ము మాది

పశుతత్వం మెడవంచిన శిశువెవ్వరు నీవుతప్ప
నీవున్న యుగమ్మున జన్మించుటయే మాకు గొప్ప.

# ప్రధాని నెహ్రూకు స్మృత్యంజలి

'రాజగోపాల్'

నీవులేని యీ వనమ్ము
చూచుటకే దుర్భరమ్ము
తోటమాలి! తోటమాలి!!
జాలిలేని! తోటమాలి!!

ఎందుకు నీ వీ తోటను
విడచి వెడలినావోయీ—!
ఎచటి కీవు నీ తోటను
విడచి వెడలినావోయీ—!!

దీని విడచి నీ వొనర్చి
నావు మహా ప్రస్థానము—!
నీవులేని యీవనమ్ము
చూచుటకే దుర్భరమ్ము—!!

ఈకొమ్మల పై చివురులు
ఏడ్చి యేడ్చి యెఱ్ఱనయిన
పాప కనులవోలెనుండె
నీ కది కనిపించకుండె-!

నీకు ప్రియమ్మగు గులాబి
తాపుట్టిన రెమ్మ విడక
నీ లేమిని తెలుపుచుండె
నీ కది వినిపించకుండె—!!

వాసంతమ్మందు పికము
''కూకూ''యని పాడకుండ
''మాలీ''యని మేడ్చుచుండె
జాలి నీకు రాకయుండె!!!

సాధువులగు గోగణములు
స్వేచ్ఛగ తిరిగెడు పశులు
ఆహారముకొర కేగక
భావి యెట్టులని మనమున
బాధపడుచు నున్నవయ్యా—!

తమ నీడను నీవులేక
తోటలోని భూరుహములు
కొమ్మలు గాలికి కదులగ
రాలిన ఆకులు మెదలగ
భూతగృహములుగ దోచును-!!

నీ సవ్వడి యున్న చాలు
వెన్నెల చీకటు లనియెడు
సంశయ మింతేనిలేక
బహువిధ నీడోద్భవములు
ఒక శాఖను నిదురించును
కలవరమను మా సెరుగక
కలత లనెడు మా సెరుగక
తల్లి యొడిని నున్న భాతి-!!!

నీ పోసెడు నీటిధార
నే డింకసు పార కునికి
తోటలోని చిన్నితరులు
కూ డెరుగని పేదలవలె
ఎత్తలేక శిరము లెత్తి
దీనముగా నిలుచున్నవి-!

నీ విడిచెడు పావురములు
నే డింకను ఎగుర కునికి
విశాలమగు ఆకాశము
నిక్కముగా శూన్య మగును.
ఆశాజీవుల - కెల్లను
నైరాశ్యము కలిగించును-!!

నీ తెచ్చెడి దివ్వె వెలుగు
నేడింకను వెలుగ కునికి
నేటిసాంద్ర నిశావేళ
వేలకొలది మిణుంగురులు
వనమునందు వెలుగు నింప
ఘనతరమగు యత్నమ్మును
విడువక సల్పుచునున్నవి-!!!

నీవులేని తరుణ మరసి
చోరులు కొంపోయెద రని
భీతావహములునైనవి
మాతృ పరిత్యక్తులవలె
ఇచ్చటి ఫలపుష్పమ్ములు-!

నీవులేని వేళజూచి
వేటకాండ్రు బాణమ్ముల
ప్రాణమ్ముల దీసెదరని
కీరములును శారికలును
పరస్పరము జూచికొనుచు
పరివేదన పడుచున్నవి-!!

నీవులేని యదనుజూచి
తోటగట్ల నుండు నాగు
పొరుగునుండి వచ్చు పిల్లి
నింగినెగరు రాబందుపు
తమ్ము మ్రింగివైచు ననుచు
రెక్కరాని పక్షులన్ని
బిక్క మొగము వేసిన వదో-!!!

తోటమాలి తోటమాలి
నీ తోటను ఈరీతిగ
విడచి యెటకు వెళ్ళినావు
ఇన్ని చరాచరజీవుల
సాంగత్యము జేసి చేసి
ఇట్టు లొక్కసారి విడచి
నీ వెచ్చటి కేగినావు !!
జాలిలేని తోటమాలి !!!

# హా! దుర్విధీ!

అంత ప్రాణప్రదంగా
ప్రేమించిన నీ దేశాన్ని
అంత నిశ్చింతగా ఎలా
వదల గలుగుతున్నావు ?
అంత శాంతికోసం
అంగలార్చినవాడవు
సుంతైనా వెనుకంజ వేయక
సుఖంగా వెడలిపోతున్నావా ?
చింతలు పడిపోతున్న నీ
విశ్వశాంతి లక్ష్యం
నీకే చెందకుండా ఇలా
వదలి పోయావా ?
అంతగా తల్లి లేని పిల్లలవలె
దురపిల్లుతున్నవారిని
సంతమసంలో ముంచి
చక్కాపోయావా ?
ఎంత నిర్దయమైనది విధి ! నెహ్రూ
ఎంతని ఏం లాభం ఎవరైనా ?
ఇంత దుఃఖాన్ని ఎవరితో పంచుకోను ?
ఇంత వేదన నెలా నేను త్రుంచివేసుకోను?
ఇంతేనా ఈ లోకగతి ?
ఇంతేనా ఈ శోకశ్రుతి ?

-- విశ్వం

# చిన్నబోయినది

పవలు చిన్నబోయినది
వేడి వెలుగు వాడినది
తెమ్మెర పిరగిలినది-రోదసి పిగిలినది
తొలిసంజె అసురసంజె కాగా —
వేయిందాల వెన్నుకాచే
వేలుపులే వెనుకంజ వేయగా
దిక్కరి బాసట మాలిన భరతావని
దిక్కరి —
నేల కూలిన కన్నీటి మున్నీట మునిగిపోగా—
నలుదిక్కుల పిక్కటిలే శాంతి గొల్లుమన్నది.
కలనైనా కనుమూయని కరుణ
కామితమ్ము నేరని మమత
పసిపాపల చిరునవ్వులలో
కలసి మెలసి పలకాలమైనది.
వదనున్న గులాబీ వాడదు
చిగురులెత్తు నగసిర తనవారిని ఏమారదు
చిరమేశ్వరు పదసన్నిధినైనా
ఆ [illegible] కతీయుడె!

- - పల్లావి రామకృష్ణశాస్త్రి

# అశ్రుతర్పణం

నమ్ముము నమ్ముము హృదయము
ఇమ్మాటికి నమ్మపోదు పుణ్యజనుల చం
దమ్మున నవాచ్య వాక్కుం
తమ్ముల నొప్పింప మీకు ధర్మం బగునే?
భారతదేశ ప్రత్యక్ష పరి
పాలకు అశాంతి విత్తధాత్రికిం
వారిధర ఘన పరిమ్మత వి
వాద విదారిత జాతికిన్ నవో
దార రసాయనమ్ము, బహు
ధా ప్రతిపన్న విపన్న కోటికిన్
శ్రీ రమణీయ భవ్య సహ
జీవన బోధన మంతరించెనే?
కటకటా యే మహాపాతకమ్ము జరిగె?
దారుణతర మే విషమారుతమ్ము వీచె?
భయదు దేదైత్యు డుద్యత బాహు డయ్యె?
అట్టి రాకాసి చీకట్లు పట్టి మెసవె?
ప్రాజ్య భారతం బెవ్వాడు భద్రపరుచు
బడుగు దేశాల కెవ్వాడు బాట చూపు
శాంతిమార్గమ్ము నెవ్వాడు చాట నోపు
పీడిత ప్రజావళి కేది యేడుగడయొ ?

— జి. వి. కృష్ణరావు

# శ్రద్ధాంజలి

స్వతంత్ర భారత రథసారథి
నితాంత దీక్షా గుణ నిధి
నిర్మల దయారసవారిధి
నీకిదె నా శ్రద్ధాంజలి.
దేశసేవయే జీవిత లక్ష్యమ్ముగా
నిరంతర కృషియే పరమాదర్శముగా
జీవయాత్ర సాగించిన ఓ
నవభారత నిర్మాత! ఖ్యాతచరిత్ర!
సాధించిన నవభారతము
జాతిమతాతీత భారతము
సామ్యవాద సంశోభిత భారతము
నవ్య విజ్ఞాన కలిత భారతము.
నిస్స్వార్థ సేవానిరతికి
నిదర్శనము నీ జీవితము
సత్య ప్రియత్వమునకు — ప్రబల
సాక్ష్యములు నీ రసప్రచనలు
శాంతి దూతవు, జాతి నేతవు
రాజనీతి విశారదుండవు;
త్యాగమూర్తివి, స్వార్థరహితుడవు
తరతరాల మా నోము పంటవు.
భారతదేశపు తపః ఫలము!
నీకిదె నా శ్రద్ధాంజలి.
జవాహర్ భారతరత్నమ!
నీకిదె నా బాష్పాంజలి.

— రాధాకృష్ణశర్మ

# బాష్పాంజలి

నాపాలి పరమదైవము
బాపూ మది కెక్కినట్టి బంటుగదా! నె
హ్రూపండితుం డిమ్మేటియు
లోపడెనే విధికి నఖిలలోకము కుందన్.
రాజసరేఖ లోకమధు
రమ్ముగ సాగి తనర్చి సాత్త్వికా

శ్రీ జనయిత్రియై భువన
సేవ్యునిగాఁ దనుఁ జేయ భారత
స్వారాజ్య కేతువై వెలయు
జవహరుఁ డక్కట! కన్నుమూసెనా
యే జగదేక వీరమణి
నిచ్చెద వీశ్వర! మాకు వెండియున్.

— తుమ్మల సీతారామమూర్తి

## సూక్ష్మశరీరి

ఎంత విశాలం ధరిత్రి!!
అంత బృహన్మూర్తివీవు!
ఎంత ఎత్తు ఆకాశం!!
అంత ఎత్తు మనిషి వీవు!
నా దృష్టిక ఈ ధరిత్రి
కాంచించుకొని క్రుంగింది.
గురదృష్టం ఆకాశం
విరిగి నేల కొరిగింది.

ఘూర్ణిల్లెను జన సముద్ర
బడబాగ్ని సమాన దుఃఖ
ఘూర్ణితమై ఈలోకం
నిరాధారమై పావం!!
మానవ హృదయాలంతా
ఒక్క పెద్ద చితి అయ్యెను
దుఃఖ జ్వాలాదగ్ధం
నీ శుభ భౌతిక కాయం?
ఇంక ఏమి మిగిలింది?
వట్టి బూడిదే మాకు?
మృత్యువులోనుండి జీవ
ముద్భవిల్లు నంటారు,
వినాశనంనుండి పునః
సృష్టి జరుగునంటారు.
అట్లాగే మృతి జెందిన
నీదు స్థూలశరీరమున
సూక్ష్మమైన నెహ్రూ సం
సృష్టిని జెందునుగావుత.

— అంతటి నరసింహం

## క్షేత్రపాలకుడు

జవహరు జ్యోతిని
చైతన్యముగ తమో
నివహమున తారాడి
నిలిచె భారతగృహిణి —
జవహరు తరుస్కంధ
మురలిబోవగ నేడ్చె
కువకువధ్వని దిగులు
గొని మా భరతపక్షి —
జలధి జవ్హరు నౌక
తలమున్కలుగ రసా
తల మంటిపోయినది
కలగి భారతజాతి —
తూలె నెహ్రూ క్షేత్ర
పాలకుడు పై రెల్ల
పాలిపోయినది మా
భరత కర్షక భూమి!

— బెళ్లూరి శ్రీనివాసమూర్తి

## అయ్యో! హతవిధీ!

అయ్యో! అయ్యయ్యో!
హతవిధీ! హతవిధీ!
భారత మాతా
ఆసేతు హిమవన్నగం
ముక్తకంఠంతో
భరింపలేని శోక వేదనలో
మునిగి మునిగి
విలపిస్తోంది; కన్నీరు కారుస్తోంది
భారత నేత
స్వతంత్ర నవభారత నిర్మాత
భారత జనత ప్రేమచిహ్నం
బాధాపీడిత ప్రజాళి ఆశాజ్యోతి
బాలబాలికల ప్రేమించే తాత
విశ్వశాంతికై వసుధైక
కుటుంబం స్థాపించాలని
శ్రమించి, విశ్రమించలేక
చివరి క్షణం దాక
భారత భవిష్యత్తుకై
మహనోర దివ్య
హార్మ్య నిర్మాణానికి
పునాదులు త్రవ్వి త్రవ్వి
అలసిపోయి
తాను కన్న పసిడి కలలు
చివరంటా చూడకుండానే
కన్నుమూసెను జవాహరు

* * *

భారత యువతా
లే! లే! నడుం కట్టు
నడుం కట్టి ముందుకు సాగు
మన ప్రియనేత
పండిత జవహరు
పెట్టిన వరవడిలో
భారత జాతిని
నడిపించుకు పోర్చు గమ్యం
అప్పటిదాకా విశ్రమించకు
శ్రమించు శ్రమించు భారత యువతా
నడుం కట్టు, మన ప్రియనేతకు
స్మృతి చిహ్నం, నీ కృషి ఫలితం

— విశ్వాత్మ

## శోకగీతిక

ఎన్ని కవుల కలాల్లోంచి
కన్నీటి సిరా వొలికిననూ!
ఎన్ని గుండెలలోనుంచి
నెత్తురు చిలికించిననూ!!
ఎన్ని కన్నులలోనుంచి,
కన్నీర్ను చిందించిననూ!!
వాడని నీ చిరునవ్వు
చాయ మేను యికపైన,
వాడని రోజాపువ్వు,
వాడిపోయె శాశ్వతముగ
ఎన్ని ఆక్రందనలయినా
ఎన్ని శోక భాషలయిన
తిరిగిరాని నీ రూపం
తలపులోనే యికపయిన!
జాతిభాష మూగవోయె
జగతి తల్లడిల్లి పోయె,
జయము, శాంతి, నిచ్చుగాత
జగత్ప్రభువు నీ ఆత్మకు.

— మనోహన్ దత్

# తెల్లటోపీ - ఎర్రగులాబి!

పురాణం సూర్యప్రకాశరావు

ఈ ధవళిమ స్వచ్ఛతకు, అంతశ్శుద్ధికి,
కొత్తని ఇముడ్చుకోగలిగే దురహంకార
రహితమైన నిర్మల తత్వానికి సంకేతము!
ఈ రక్తిమ కార్యదీక్షకు,
ఆత్మ విశ్వాసానికి, అనురాగానికి,
సౌందర్యానికి సంకేతము!
ఎక్కడ స్వచ్ఛమైనబుద్ధి, నిరంతరమైన
జ్ఞానదాహము, నిర్భయము, ఆత్మవిశ్వాసం,
కార్యదీక్ష, సత్యదృష్టి నెలకొని వుంటాయో -
తండ్రీ - ఆ స్వేచ్ఛాస్వర్గానికి
ఈ దేశరథాన్ని చేర్చాలని నీవు
కలలు కన్నావు!
ఈ మహాజాతి చరితార్థమైంది!
వివేకానందుడు, గోఖలే, తిలక్,
గాంధీలవంటి మహామహు లెందరో
ఉద్భవించి ఈ జాతిని మేల్కొలిపారు.
మేల్కొన్న జాతి నంతా ఒక్క త్రాటిపైన
నడపగలిగినది నీ ప్రేమబంధం!
ప్రపంచానికి నువ్వు అందించిన
అలీన విధానం, పంచశీల సూత్రావళి -
శాంతియుత సహజీవనానికి, యుద్ధ
రహితమైన విశ్వైక వ్యవస్థవైపుకు
ప్రపంచశాంతి కాముక శక్తుల్ని,
అభ్యుదయ శక్తుల్ని - మళ్ళిస్తున్నాయి!
నలభై కోట్ల దీపాలను
నీ చేతులతో వెలిగించావు!
దారిమధ్యంలో నీవు వదలిన
రథసూత్రాలను అంది పుచ్చుకుని
ఎవరు రథసారధ్యం వహిస్తారనే
భయం నీకూలేదు. నీకు తెలుసు
నీవు నిర్మించిన దృఢమైన
ప్రజాస్వామిక పార్లమెంటరీ వ్యవస్థ
బాటపైన యీ యాత్ర నిరాటంకంగా
సాగిపోతుం దని. ఎవరెన్ని
ఊహాగానాలు చేసినా, నిలదీసి
ప్రశ్నించినా, నీ వారసుని గురించి
నీవిచ్చిన సమాధానం
ఆత్మవిశ్వాసంతో కూడిన చిరునవ్వు!
నీవు లేని వెలితిని చూసి బేజారెత్తిపోయి
బిక్కు బిక్కుమని దిక్కులు చూస్తూ
కూర్చునే అసహాయస్థితిలో మమ్మల్ని
వదిలి పోలేదునువ్వు.
భయాన్ని ద్వేషాన్ని జయించటం
నీవద్దనే నేర్చుకున్నాం.
వెయ్యి కాలాలపాటు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో
జాతి సుస్థిరమైన మనుగడకు
ఏ ప్రమాదమూ లేని భద్రతను చేకూర్చి
అమరుడ వయ్యావు!
శుభవార్త!
నీ వారసుడు లాల్ బహాదూర్
నీవు వదలిన రథసూత్రాలను అందుకుని
నవభారత రథసారధ్యానికి పూనుకున్నాడు!
శహాభాష్! బహాదూర్ జీ!
నీ వెనక నలుబదికోట్ల
మహాజాతి జనుల అండ వున్నది!
నీలో వెలుగుతుంది
పండిట్జీ ఆత్మజ్యోతి!
నడిపించు దేశాన్ని
నెహ్రూజీ కలలు కన్న
స్వేచ్ఛా స్వర్గానికి!

# అమృతమూర్తి పండిట్జీ

గులాబి రాలిపోయింది
భారతావని మూగవోయింది!
మే 27 వ తేదీ మిట్టమధ్యాహ్నం
భారత ప్రజల పాలిటి దుర్దినం
డెబ్బైనాలుగు వత్సరాల కాలం
కాలంతో పోటీపడి పనిచేసి
అలసిన హృదయం
కాలపు కళ్ళాన్ని తెంపుకొని
కళ్ళు మూసింది
ఆ హృదయం పండిట్జీది
దేశానికే హృదయం పండిట్జీ.
ఆ వార్తవిన్న మరుక్షణం
ఆసేతు హిమాచలం కంపించింది.
నేల నాలుగు చెరగులా
కన్నీళ్ళు కాలువలై పారేయి.
అనుక్షణం యుద్ధపు సరిహద్దులపై
సర్కసు చేస్తున్న ప్రపంచానికి
ఆయన పెట్టేరు శాంతిభిక్ష
ప్రపంచ నాగరికతకే అది శ్రీరామరక్ష.
సాంఘిక సమానత్వం ఆలంబనగా
సోషలిస్టు నవసమాజ నిర్మాణం
మత సౌభ్రాత్రం; మానవ సౌభాగ్యం
ఆ మహోన్నత వ్యక్తి జీవిత సర్వస్వం
లేడు మహోన్నత పవిత్రమూర్తి
పండిట్ జవహర్‌లాల్ మనకిక లేడు
ఆ ఎర్ర గులాబీ రాలిపోయినది!
దేశప్రగతికి ఆయన వేసినబాట
పూలబాటై మనముందు వుంది
ఆయన ఆశలూ, ఆశయాలూ
అద్దంలో ప్రతిబింబాల్లా
కళ్ళముందు తళుక్కున
మెరుస్తూనే వున్నాయ్ యింకా
"చనిపోయేది దేహం
నశింపులేనిది ఆత్మ''
అనాదిగా యిది
మనం నమ్ముతున్న సత్యం
ఆ బాటలో మనం నడచినంత కాలం
ఆ అద్దం తళ తళ మెరిసినంతకాలం
ఆ సత్యం నిత్యమై తీరుతుంది
ఆయన ఆత్మ ఆనందిస్తుంది
విశ్రమించిన పండిట్జీ
అమృతమూర్తిగా మారి
మనమధ్యే మనటం తథ్యం
అదే భారతీయుల ధ్యేయం.

—కె. మల్లికార్జునరావు

# చిరంజీవి శ్రీ నెహ్రూ

దాశరథి

చనిపోయావని యెల్లరు
జలజల కన్నీ రొలికిరి
చిరంజీవివే నీవు!
మరణం నీ కెక్కడిది?
అరుణార్ణ రంజితమై
అలరారే గులాబిలో,
శ్వేతపట కిరీటధారి
శీతాచల శిఖరంలో
గంగాయమునా సంగమ
కమనీయ జలాలలో
మా రైతుల పొలాలలో
మా కవుల కలాలలో
అంతట నీవేనయ్యా!
అన్నిట నీవేనయ్యా!
మా గుండెల కదలికలో
మా పదాల పొందికలో
శారద నవ చంద్రికలో
జనగణమన గీతికలో
దేవాలయ దీపికలో
దీనునుంటి తిల్లికలో
పసందైన బాలికలో
మందార మాలికలో
అంతట నీవేనయ్యా!
అన్నిట నీవేనయ్యా!
ఉత్తరదిక్ పూరములో
దక్షిణదిక్ తీరములో
ప్రాచీనాకాశములో
పశ్చిమ ప్రదేశములో
పలువైపుల నీవయ్యా!
పలుతావుల నీవయ్యా!
ఉదయకాల భానుడవై
హృదయ భాసమానుడవై
నవభారత పౌరుడవై
విజయోత్సవ వీరుడవై
నవనారీ మారుడవై
విజ్ఞాన విచారుడవై
అంతట నీవేనయ్యా
అన్నిట నీవేనయ్యా!
కిరస్తానులకు ఈసా!
ముసల్మానులకు మూసా!
హిందూజనులకు ఈశ!
నిను తలచేము హమేషా?
హిమవద్గిరివై మమ్మిల
ఎల్లప్పుడు కాచేవు
సముద్రమై ముమ్మోపుల
మము చల్లగ చూచేవు
మలయానిల వీచికవై
మా మదిలో వీచేవు
మృదులోజ్జ్వల హాసముతో
హృదయాలను దోచేవు.
మరణ మెరుగనట్టి నీకు
మా జోహార్! మా జోహార్!

# స్వర్గీయ శ్రీ పండిట్ జవహరులాల్ నెహ్రూ

సున్నం వీరరాజు

నవభారత నిర్మాతవు,
ప్రవిమల గుణసాగరుడవు, పరపీడితమా-
నవశ్రేయోదాయకుడవు,
జవహరులాల్ నెహ్రూ! నీకు సరివారెగ ?

నీవు హఠాత్తుగా నె మర
ణించితివన్న విషాదవార్త ధా -
త్రీపటియాన నిట్టె ప్రస
రింపగ గోట్లకొలంది భూజనుల్
బాపురుమంచు రోదిలిచు
ప్రస్తుతి జేసిరటన్న నిన్ను; నీ
జనన మెంత ధన్యతను
జెందెనొ జెప్పగ జెప్పుచుండెదున్.

వక్కగవిచ్చి తావి వెద
చల్లెడు పూవుకు రాలిపోవు, నీ
వెక్కిన సాటిలేనివట
పృథుమసైతము నేల గూలు, న
ల్లిక వ్రాల గీర్తికెక్కిన సు
ధీమణివైనను గన్ను మూయుటే
నిక్కమటంచెరింగియును
నీ మృతికై విలపించి రెల్లరున్.

బాపుజీ హత్యావార్త విని
భారతదేశ నివాసు లెంత నిం
తాపరితప్తచిత్తులయి
తల్లడమందిరో యావిధాన, నిన్
బాపుమిత్తి గ్రమింగెనను
వార్తను వీనుల విన్నయంతనే
బాపురె! సన్నుతంద్రీ నెడ
బాసినరీతిగ నేడ్చి రంగనన్.

ఇరువుర స్మృతి ఘటిల్లిన
నాయింట విషాదభారము లగపడుగాని,
నీయింట నీవు స్మృతి గన,
నీయిల బ్రతియింటను దుఃఖమే యలవడ
గానెన్.

క్రమముగ రాజ్యవిస్తరణ
కాంక్షనె సైనికశక్తి నగ్ర రా
జ్యాలు అభివృద్ధి చేసుకొను
టారసి, నాశనహేతువైన యు
ద్ధము నరికట్టగలిగితివి
తావక బుద్ధిబలంబుచేవి, సా
ధ్యమె యిటు లాచరింప గల
నైనను నేరికిగాని కెప్రభుతి!

భారతి గన్నబిడ్డల ని
ధాన జనావళికెల్ల నీకికన్
భారతదేశపాలన మొ
నర్చుట మాన్పి, త్రిలోకపాలనా
భారము నంటగట్ట భగ
వంతుడు నిన్ బిలిపించెనేమొ ? నీ
వీరున నేలగాగల సు
ధీమణి మాకు లభింపగల్గునే ?

జవహరుజీ ! భవత్ పదవి
శాస్త్రి వహించెనటంచు విన్న యి
య్యవనిని మేటిరాజ్యములు
హర్షము దెల్పె; నఖండుగూడ వా
స్తవముగ నింక నీ యడుగు
జాడల సాగునటంచు నమ్మె. నీ
దవు ప్రతిభా విశేషము న
దా సనుకూర్పుము శాస్త్రి కర్మిలిన్.

ఏ రాజ్యకూటాన జేరలేని తటస్థ
దేశమ్ము మాదని తెల్పినావు,
భారతదేశ సంపద పెంప, పెక్కు "ప్రా
జక్టు"ల నిర్మింప జాలినావు,
అగ్రరాజ్యాలలో సైనికమత్యము గొల్పి
గురుతర శాంతి చేకూర్చినావు,
భారతభూమిని ప్రజాస్వామ్యమ్ము నెలకొల్ప
జీవితాంతము సేవ చేసినావు.

చేసినావెన్నొ ప్రజల సుశ్రేయమెంచి
తనువు చాలించుదనుక ప్రధాని వగుచు;
భువిని నినుబోలు దేవతా మూర్తి మాకు
నెన్ని జన్మలకైన లభింపగలడె!

# మన నెహ్రూ

ఆత్మకూరి గోవిందాచార్యులు

విలయతాండవ నిలయానఁ దలుపు లేదో?
కాలరాక్షసి కండ్లకు గంత లేదో
ఉత్తములఁగూడ గబళించు నొప్పు–తప్పు
మంచిచెడ్డల నెంచి వర్తించ దెపుడు.

లోకమాన్యుండు దివి కేగ లోటుఁ దీర్ప
గాంధి లభియింప సమ్మోద మందినాము
ఆ మహాత్ముని, యవతార మంతరింప
జవహరు లభించె, నతఁడును జనియె దివికి.

బాలును, పాలు లాలును ద
వంగతులైరి మహాత్మగాంధిని
గేల వహించినావు; దివి
కింగొనిపోవవె దాని బోసులన్;
నేలను గూలవేసితివి
నేడహ భారతనేత జవహరున్
జాలిక జాలు నీ తెఱఁగు
వంపెదొ మేటులఁ గాలరాక్షసీ!

దొరకడొ నీదు చేతులకు
దుష్టుఁడు చంపఁగ నెవ్వఁడేనియున్
దొరికెనొ సర్వసద్గుణ వి
దుండును మానవ లోక శాంతి నే
అరసెడి శాంతిదూతయు మ
హాత్ముఁడు మానవజాతి నేతయే!
పరచితె నీదు కోరలను
భారతిపై నిటు కాలరాక్షసీ!

కట్టడితాత, ఎట్టి కడ
గండ్లను గూర్చెను నీకు భారతీ
పట్టెడు కూడు పెట్ట కడు
పారగ బీదలకున్ ప్రణాళికల్
పెట్టి పరిశ్రమల్ పెనిచి,
పెంపొనరింపగ భాగ భోగ్యము
ద్దిట్టరియైన నేతను హ
రించితివే తృటిఁ గాలరాక్షసీ!

జీవితమెల్ల నొక్కగతి
దేశమహోత్తమ సేవచే చిరం
జీవిగనైనవాడు మన
శ్రేష్ఠుఁడు నెహ్రు జగత్ప్రసిద్ధుఁడై
దేవగణంబుతో గలిసె,
దేహము డస్సి వయస్సు మీఱుటన్;
చావిల తథ్యమంచనెడి
చాటువు నీయది కాలరాక్షసి!

తొల్లిటినాటి మిత్రులను
దోడును బిడ్డను బిడ్డ బిడ్డలన్
సల్లలితాంబ భారతిని
జయ్యన వీడితొ నాకమేలగాఁ
గొల్లకొనంగ భారతిని
కుంఠితశక్తిని వైరివర్గముల్
పల్లదనంబుఁ జూపుతఱి,
బాసితివా మము నాయకాగ్రణీ!

చైనా ద్రోహముఁ జేసియుండినను నీ
శాంతంబు లక్ష్యంబులన్
శ్రీనాడన్ దలపెట్ట వీవు బలగ
ర్వోపేత సంరంభముం
బూనన్ వెన్కకులాగుచుంటివి మహా
త్మున్ గాంధిదేవున్ మదిన్
ధ్యానంబూని, అహింసయే పరమక
ర్తవ్యంబుగా ధీమణీ!

గురునకుఁదగ్గ శిష్యుఁడవు
కోపముబూనవు శాంతిమార్గమున్
స్థిరమొనరించినావు నిజ
దేశబలస్థితిఁ దూచి తూచుచున్
బరుగున ముందు కేగు మదిఁ
భద్రముగాఁ బిగపట్టిపట్టి, ప
మఱవు స్వదేశరక్షణము
మాన్య తముండవు రాజనీతిలో.

ఆరయ శాంతినే, తలఁచి
యప్పుడు నిప్పుడు నెల్ల వేళ కా
శ్మీరసమస్య నీహృదిని
జిందరవందర చేయుచుండినన్
ధీరుఁడ వౌచు నొక్కగతిఁ
దెల్పుచు, దాని పరిష్కరింపనౌ
దారినిఁ గాంచనున్నతఱి
దైవము నిన్గొనిపోయె జవహరా!

పులియు సింగంబు సిథిలు మేకలును నొకట
గలియు రీతి, వివిధ దేశములు గలట్టి
యైక్యరాజ్య సమితి స్నేహ మందినావు
నీ తటస్థ విధంబున నిరుపమ గతి.

తనయుఁడు, తనపెలెయ శమును
గనపలెనని తహతహఁబడి కాంక్ష్య దిపికన్
జనె నీజనకుండహా, ఆ
తని మించినకీర్తిని దివి తండ్రిన్ గనితో.

కాంగ్రెస సధినేత మాత్రమే కన్నతండ్రి
పదియునారేండ్లు వరుసగా ప్రథిత భరత
ధాత్రి నేలతే నీవు ప్రధానివౌచు
ఎలి కాంగ్రెసు, రాజ్యంబు నేలి తీవు
నీకు సరి, రాజ్య మేలిన నేత లేడు.

అఖిలభారత కాంగ్రెసునందు నిన్న
కలియగా లేము మునువలె గాంచలేము
అఖిల బ్రహ్మాదిలో కాలయందుమాత్ర
కలియనగు నేమొ; కలియఁగాగలుగు వారు.

ఎంతటి ధీరునిన్ గనితి
వే మహనీయు, త్వదీయకీర్తి సృ
ష్ట్యంతము నిల్పగల్గిన మ
హాత్మ; మహాత్ముని వారసున్ యశో

(బాలు = బాలగంగాధరతిలక్; పాలు = బిపిన చంద్రపాల్; లాలు = లాలా లజపతిరాయి. బాల్ – పాల్ – లాల్)

వంతుని, మార్గదర్శకుని
బాంధవులన్ హితులన్ జనావళిన్
వంతకుఁ జిక్కఁజేసి, దివి
పాలనకేగిన వాని భారతీ!

అమ్మరో! కంటి వీవు సు
మహాత్ముల నెందఱినో త్వదీయ పా
దమ్ములచెంత నిల్చి, బలి
దానముగా తమ సర్వ మిచ్చి? ప్రా
ణమ్ములఁగూడ నీకిడిన;
నాయకులన్ జవహార్ సమానులే
రమ్మ! సమస్త ధర్మములు
సంకేత మిచ్చినవారు భారతీ!

దేవుఁడు వేరులేఁడు భవ
దీయ పదాబ్జ నితాంత సేవయే
దేవుఁడు జీవితాంతము, ప
దింబదిగా జెఱసాల యున్కియున్
ధీవరుఁడై సమస్త జగ
తిన్ నుతిఁగన్న స్వరాజ్యపాలనన్
భావమునం దలంచె నొక
ఫక్కిని పండిత నెహ్రు భారతీ!

అలఘు స్వాంతుఁడు భారతీయ జనతే
మార్థంబుగా, త్యాగియై
తలపోసెన్ గద నిన్ బ్రతిక్షణము నీ
దారిద్ర్య భారం బహో
తొలగింపన్ గృషిఁజేసి చేయుచుఁగదా
త్రోసెన్ మెయిన్ వహ్నిలోఁ
గలఁడే యింతటి దేశభక్తు డిల నే
ఖండాననేన్ భారతీ!

కట్ట! స్వరాజ్యముం బడయఁ
గష్టములన్ బడి రాజ్యతంత్రమున్
దిట్టరియై లిఖించికడు
ధీరత భారత రాజ్యలక్ష్మిఁ, జే
పట్టి, నవోదయార్ధిక, వి
భాసుర రేఖలఁ దీర్చిదిద్ది నీ
పట్టి, విరామముం గనఁడు
ప్రాణము వీడినదాక భారతీ.

భారతజాతి నేత యని
భారతసంతతి విశ్వమంతకుం
జే రుఁడుశాంతిదూత యని
మానవలోక సమస్త మిట్లు, ప
న్నేరినిఁగూర్చి పల్కె మహా
నీయుని నెహ్రునిగూర్చి గాక సం
స్కారపరుండు లోకనుత
కర్ముఁడు పూజ్యుఁడు నెహ్రు భారతీ!

అన్నను గోలుపోయితి మ
టంచని యేడ్వరెసాటిత్యాగులో
యన్న? ప్రజల్ గురూత్తముని
యంతయు నెంచితపించరొక్కొ! దా
నున్న తరాల వారల ప్ర
యోజన మెంచిన దీర్ఘదృష్టి సం
పన్నుని జూడఁజాల పని
బాధను బొందరె వారు భారతీ!

చచ్చినవాడె పండితుఁడు
చావఁడు చావడు లోక మెల్లయున్
జచ్చిన పైనిగూడ; ధర
శాశ్వతుఁడై మృతజీవియే నికన్
వచ్చు యుగంబులందునను
వర్ధిలు నీతిని కీర్తిచంద్రికల్
హెచ్చుగ మానవాభ్యుదయ
మే తలపోయుట నెహ్రు భారతీ!


పుట్టినవారు గిట్టరొకో
పుట్టుట గిట్టుట లోకరీతి, యి
ప్పట్టున, గాంధీ సద్గురుని
వారసుఁ డేడిక? లేడటంచు గి
పెట్టుట మాని ధైర్యమునఁ
బెద్దల పోకడ వీడకుండఁ జే
పట్టి కృతార్థతన్ గనుట
భారతజాతికి మేలు భారతీ!

నిన్ను నుతింప శబ్దములు
నేర వవాచ్యుఁడ నంచు [illegible] జే
తిన్నని మాట, పరికగు
తీయక వారల నెమ్మనంబులన్
సన్నుతి సేసికొన్న నిను;
శాంతినిఁ దృప్తినిఁ బొందుచుండు రో
యన్న; కృపార్ద్రదృష్టిఁ గను
మా? దివి నుండియు నీదు భారతిన్.

గంగా యమునా సంగమ
రంగంబునఁ బుట్టి సకల రమ్యతమగు నో
త్తుంగ తరంగాల బ్రతికి
భంగము గాకుండ యశము స్వర్గము
గనియెన్.

స్వార్థ రహితకర్మ సలిపిన మన నెహ్రు
స్వర్గధామమందె వరలుచుండు
గాంధి గురునిఁ గూడి కన్నతండ్రినిఁ జేరి
ఆత్మశాంతి గాంచి అమరుఁ డగుత.

దేశభక్తి మూర్తి దేశికుండగు నెహ్రు
దీవన లిడి మనలఁ దీర్చుగాత
అతని యడుగుజాడ లందుండి భక్తిమై
భరతజాతి సుఖము బడయుగాత.



The woods are lovely, dark and deep,
But I have promises to keep,
And miles to go before I sleep
And miles to go before I sleep.
Robert Frost

"మైళ్ళదూరం వెళ్ళాలి......"
అమెరికన్ కవి ఫ్రాస్ట్ వ్రాసిన యీ పద్యపంక్తులను పండిట్ నెహ్రూ ఒక నోటుపుస్తకంలో వ్రాసుకొని తన బల్లపై పెట్టుకున్నారు.

4వ ప్రకరణం

# "మకుటం లేని మహారాజు"


(ఆయనను 'మకుటం లేని మహారాజు' అంటారు. యవ్వనదశనుండి మరణించేవరకూ ఆయన, నాయకత్వ ప్రధానమంత్రిత్వ మకుటాలను ధరించారు. ప్రజల హృదయాలపై అధికారం వహించారు. కనుకనే తలపై మకుటం ధరించే సామ్రాట్టులకు వుండే వ్యాకులత ఆయనకు లేదు... )




హారోలో వాలంటీర్‌గా




న్యాయవాదిగా




ప్రేమపాత్రుడైన 'చాచా'........



పిల్లలతో పరిహాసమాడుతున్న 'చాచా'....



ఉపన్యాసానికి ముందు....




జన బాహుళ్యానికి ప్రియతముడు : వనపర్తిలో అశేషప్రజానీకం తమ నాయకుని ప్రసంగాన్ని వింటున్న దృశ్యం (1959).



గ్రామస్థులకు పూలమాలలు ఇస్తున్న దృశ్యం.




పులిపిల్లలను లాలిస్తున్న దృశ్యం.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణోత్సవంలో తమ శుభాశీస్సులు అందజేశారు (1-11-56).



నిజాం నవాబుతో




గురి చూస్తున్నారు.




నాగార్జునసాగర్ వద్ద ప్రాచీన సంస్కృతిని చాటే అవశేషాలను పరిశీలిస్తున్నారు.






ఢిల్లీనుంచి హైద్రాబాదుకు తమవెంట తీసుకొని వచ్చిన కీ. శే. నెహ్రూ అస్థికల కలశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి గవర్నరుకు అందిస్తున్న దృశ్యం.



స్వర్గీయ శ్రీ నెహ్రూ అస్థికల కలశాన్ని బేగంపేట విమానాశ్రయం నుంచి హైద్రాబాదు జూబిలీహాలుకు ఊరేగింపులో తీసుకొనివెళ్ళిన సందర్భంలో దారిపొడవునా రోడ్డుకు ఇరువైపులా కనీ వినీ ఎరుగనంతమంది ప్రజలు నుంచొని తమ ప్రియతమ నాయకునికి అంతిమ శ్రద్ధాంజలి ఘటించారు.



స్వర్గీయ శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ అస్థికలను జూన్ 8 వ తేదీన 'సంగం'లో నిమజ్జనం చేసిన సందర్భంలో, కీర్తిశేషుడైన తమ ప్రియతమ నాయకునికి కడసారిగా శ్రద్ధాంజలి సమర్పించడానికి రెండు లక్షలమంది ప్రజలు అక్కడ చేరారు. మూసీ, ఈసా నదుల పవిత్ర సంగమస్థానం 'సంగం.'



పవిత్ర అస్థికలను సంగంలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం.

5వ ప్రకరణం

# ప్రపంచ ప్రముఖుల జోహార్లు

(నెహ్రూ విశిష్ట వ్యక్తిత్వానికి, సేవలకు
ప్రపంచ ప్రముఖులంతా జోహార్లర్పించారు.)

# ఉన్నతాదర్శాలకు అంకితుడైన నాయకుడు

ప్రపంచప్రముఖు లంతా పండిత్ జవహర్ లాల్ నెహ్రూ ప్రఖ్యాత ప్రపంచ రాజనీతిజ్ఞుడనీ వలసప్రజల స్వాతంత్ర్యానికీ వారికి న్యాయం జరగడానికి పోరాడిన గొప్ప యోధుడనీ శ్లాఘించారు.

రాష్ట్రపతి డాక్టర్
ఎస్. రాధాకృష్ణన్

"శ్రీ నెహ్రూ స్వయంగా నిర్మించిన ఆధునిక భారతదేశం ఆయన అనుపమానమైన కృషికి గొప్ప స్మృతిచిహ్నం. అణు రంగంలో సాధించిన అద్భుతమైన విజయాలకు ముగ్ధుడైన శ్రీ నెహ్రూ, మానవుడు పోరాటం సాగించవలసిన ప్రబలశత్రువు. ఏ దేశమూ కాదనీ యుద్ధాన్నే అతడు ఎదిరించవలసి వుందని అభిప్రాయపడ్డారు. కనుకనే ఆయన శాంతియుత సహజీవనం, సహకారం, అలీన సిద్ధాంతాల ద్వారా వివిధ దేశాల మధ్య అవగాహనను పెంపొందించడానికి శాయశక్తులా కృషి చేశారు."

గుల్జారీలాల్ నందా

"శ్రీ నెహ్రూ నిఖిల ప్రపంచానికీ ఆప్తుడు. భారతదేశం ద్వారా ఆయన మానవాళికి సేవ చేశారు. జాతిపిత అందించిన స్వాతంత్ర్యజ్యోతిని ప్రకాశింపజేశారు. గాంధీజీ ప్రబోధించిన సత్య మార్గాన్ని అన్ని ఇబ్బందులనూ అధిగమిస్తూ అనుసరించి జాతీయ లక్ష్యానికి ఆయన నూతనత్వాన్ని చేకూర్చారు."

ఉపరాష్ట్రపతి డాక్టర్
జాకిర్ హుసేన్

"గత 17 సంవత్సరాల నుంచి మన ప్రజాస్వామిక రిపబ్లిక్‌కు మార్గగామిగా వున్న ఆ మహా మేధావి ఇక మనకు లేరు."

రష్యా ప్రధాని నికితా కృశ్చేవ్

"తన జీవితంలో చివరి క్షణం వరకు కూడా మానవతావాదపు ఉన్నతాదర్శాలను పరిపోషించడానికీ, శాంతి, అభ్యుదయాలను సాధించడానికి కృషి చేసిన మానవోత్తముడు శ్రీ నెహ్రూ."

అమెరికా అధ్యక్షుడు లిండన్
బి. జాన్సన్

"తమ ప్రజలపట్ల, మానవాళిపట్ల ఆయనకు పరిపూర్ణమైన విశ్వాసం వుండేది. ఇదే ఆయన మనకు విడిచిపెట్టిన అమూల్య వారసత్వం. ఆయన ఆదర్శాలకు కార్యరూపమివ్వడానికి మనముభయులం కలిసికట్టుగా కృషిచేస్తాము. కాబట్టి ఇది మనకు ఆలంబనగా వుంటుందని నేను భావిస్తున్నాను. గాంధీజీ వలెనే శ్రీ నెహ్రూ లక్ష్యంకూడా శాంతి సంస్థాపనే. ఆయన ప్రపంచానికి ఆ దివ్య సందేశాన్ని ఇచ్చారు. యుద్ధరహితమైన ప్రపంచమే ఆయనకు సముచితమైన స్మృతి చిహ్నం."

బ్రిటిష్ ప్రధాని సర్ ఎలెక్ డగ్లస్ హ్యూమ్:

"ఆయన దృష్టి, హృదయం ఎంతో విశాలమైనవి. ఆయన ప్రభావం స్వదేశాన్ని దాటి ఎంతో దూరతీరాలకు ప్రసరిల్లింది."

ఫ్రాన్సు అధ్యక్షుడు చార్లెస్ డిగాల్

"ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడు. ప్రజాస్వామ్యపరిపోషణ, సాంఘికాభివృద్ధి, శాంతి—వీటి సాధనకు ఆయన అమూల్య సేవలు అంకితమయ్యాయి. ఇక భారతదేశ భవితవ్యానికి, ప్రపంచ భవిష్యత్తుకు కూడా రూపురేఖలు దిద్దాయి."

లార్డ్ మౌంట్ బ్యాటన్:

"గొప్ప చారిత్రక పురుషులలో ఆయన ఒకరు. ఆయన మరణంవల్ల ప్రపంచానికి తీరని లోటు ఏర్పడింది."

హెరాల్డ్ విల్సన్:

"శాంతి యోధుడైన ఆ నాయకుడు తమ దేశాన్ని ఏ కూటమిలోకూడా చేర్చలేదు. తటస్థ మార్గాన్ని ఆయన అవలంబించారు."

పాట్రిక్ గార్డెన్ వాకర్:

"శ్రీ నెహ్రూ ప్రాక్ పశ్చిమ దేశాలకు వారధిగా నిలిచారు."

పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్:

"శ్రీ నెహ్రూవంటి గొప్ప వ్యక్తులు ఎప్పుడో కాని జన్మించరు. భారత దేశానికి కలిగిన నష్టం ఎంతో విషాదిమైనది. ఇది జాతికి విపత్కరమైన స్థితి."

బ్రిటిష్ మాజీ ప్రధాని ఎర్ల్ అట్లీ:

"ప్రాక్-పశ్చిమ దేశాల మధ్య ఐక్యతను సాధించడంలో శ్రీ నెహ్రూ కంటే దక్షులైనవారు మరొకరు లేరు."

ఐసెన్ హోవర్:

"ప్రపంచ శాంతి అశేషమైన భారత ప్రజలపట్ల శ్రీ నెహ్రూ ప్రదర్శించిన అకుంఠిత దీక్షాసక్తులను ఎవ్వరూ, ఎప్పుడూ సంశయించలేదు."

పశ్చిమ జర్మనీ చాన్స్‌లర్ లడ్విగ్ ఎర్‌హార్డ్ :

"ప్రపంచ పరిగణన పొందిన రాజనీతి జ్ఞుడుగా శ్రీ నెహ్రూ తన వ్యక్తిత్వపు ఛాయలను ప్రపంచమంతటా పడవేశారు."

ఆస్ట్రేలియా ప్రధాని సర్ రాబర్ట్ మెంజీస్ :

"ప్రపంచ చరిత్రలో ఒక ముఖ్యమైన తేదీ ఇది. మన తరానికి చెందిన ఒక గొప్ప వ్యక్తి జీవితం ముగింపుకు ఇది సూచిక."

లార్డ్ బెట్రెండ్ రస్సెల్ :

"ఆయన రూపొందించిన అలీన విధానం యుద్ధ ప్రమాదాన్ని అనేక పర్యాయాలు నివారించగలిగింది.''

డాక్టర్ కొన్రాడ్ ఎడ్నవెర్ :

కీర్తిశేషుడైన ప్రధానమంత్రి రాజనీతి జ్ఞుడుగా, శాంతిదూతగా మహాత్మా గాంధీ తుది వాంఛితాన్ని నెరవేర్చి మనందరికీ గొప్పమేలు చేకూర్చారు."

ఐ. రా. స. ప్రధాన కార్యదర్శి ఉథాంట్

''తమ దేశ చరిత్రలో ఆయనవలె ప్రముఖ స్థానాన్ని పొందిన వ్యక్తులు మన తరంలో చాలా తక్కువ. ప్రపంచంలోని పెద్ద దేశాలలో ఒకదాని విధానాలకు ఆయన కర్త. ప్రపంచ సంఘటనలపై ఆయన ప్రభావం చాలా వుంది."

ఎడ్లాయ్ స్టీవెన్సన్ ·

"ప్రశాంత పరిస్థితిలో కాక క్లిష్ట పరిస్థితుల మధ్య ఆయన మరణించారు. ఆయన దేశం, మానవాళి శ్రేయోభివృద్ధి, స్వాతంత్ర్యాలకై ఆయన కన్న కలలే ఆయన స్మృతి చిహ్నాలు."

అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ డీన్‌రస్క్ :

"శాంతియుత పద్ధతుల ద్వారా వివాదాలు పరిష్కరించుకోవడానికి తరుణం మించిపోలే దనే విషయాన్ని ఆయన స్ఫురణకు తెచ్చారు. మానవుని మనుగడకై, ఒక ప్పుడు రాజనీతిజ్ఞతకు సూత్రంగా భావించ బడిన వైఖరి ఇప్పుడు అత్యవసరమైన ప్రత్యక్ష ఆవశ్యకంగా రూపొందింది."

జాన్ షెర్మన్ కూపర్ :

"ఆయన మన తరంలోని గొప్ప ప్రపంచ నాయకుడు, మేధావి."

యుగోస్లావియా అధ్యక్షుడు జె. బి. టిటో:

"ప్రపంచం ఒక విఖ్యాత శాంతి యోధుడిని కోల్పోయింది. అంతర్జాతీయ పరిస్థితులు ఆయనకు కరతలామలకం. ప్రపంచానికి విపత్తు జరగకుండా వుండడానికి ఆయన శాయశక్తులా కృషిచేశారు."

సంయుక్త అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు జి. ఏ. నాసర్ :

"భారత ప్రజలకేకాక సమస్త మానవాళికే శ్రీ నెహ్రూ ఆశాజ్యోతి. ఆయన నిర్యాణంవల్ల యావత్ప్రపంచానికి నష్టం వాటిల్లింది. కీర్తిశేషుని ఆత్మకు మా ప్రణామాలు."

మలయేషియా ప్రధాని టుంకు అబ్దుల్ రహ్మాన్ :

"భారతమాత తన పుత్రరత్నాన్నీ, ప్రపంచం ఈ తరానికి చెందిన ఒక గొప్ప రాజనీతిజ్ఞుడినీ కోల్పోయాయి."

సింహళ ప్రధానమంత్రిణి శ్రీమతి సిరిమావో బండార్‌నాయకె :

"శాంతిప్రియత్వం, మానవాళి సంక్షేమం — ఆయనయొక్క ఈ జీవితాదర్శాలకై పాటుబడటమే ఆయనకు మనం అర్పించగల శ్రద్ధాంజలి."

ఇండోనీషియా అధ్యక్షుడు సుకర్ణో :

"ఉత్తమ ప్రపంచ సంస్థాపనలో ఇక ఆయన తోడ్పాటు లభించదుకాబట్టి ప్రపంచ మంతటా ప్రజానీకం ఆయన అస్తమయానికి దుఃఖిస్తున్నది."

ప్రిన్స్ నరోదంసిహానౌక్ కంబోడియా :

"అపూర్వమైన తాత్వికుడుగా శ్రీనెహ్రూ ఆయనకు ఆయనే సాటి. ఆయన క్లిష్టమైన ప్రభుత్వ బాధ్యతలను స్వీకరించారు. మేధావిగా, కార్యవాదిగాకూడా గుణుతికెక్కారు."

కీన్యా ప్రధాని జోమె కెన్యట్టా:

"ఆయన గొప్ప దేశభక్తుడు. ఎంతో భారాన్ని ఒక్కరే నేర్పుగా, ఓర్పుగావహించారు. ప్రపంచమంతటా ఆయనపేరును ఎల్లప్పుడూ స్మరించుకుంటారు."

న్యాసాలాండ్ ప్రధాని డాక్టర్ హేస్టింగ్స్ బాండా :

"ఈనాడు ఆఫ్రికా, ఆసియా దేశాలలో స్వాతంత్రోద్యమమేమైనా సాగుతుందంటే అది గాంధీ, నెహ్రూల చలవవల్లనే."

ఘనాఅధ్యక్షుడు క్వామే ఎంక్రూమా:

"భారతప్రజలు ఒక గొప్పనాయకుడినీ, ప్రపంచం ఒక గొప్ప రాజనీతిజ్ఞుడినీ కోల్పోయింది."

టాంగానికా అధ్యక్షుడు జూలియస్ నైయెరేన్ :

"ఆయన సేవలు యావత్ప్రపంచానికీ లభ్యమయ్యాయి. కనుక ఆయన మృతికి ప్రపంచమంతా విచారిస్తున్నది."

ఇథియోపియా చక్రవర్తి హైలెసెలాసీ:

"ఆయన నాయకత్వం, రాజనీతిజ్ఞత చిర కాలంవరకు స్మరించబడతాయి."

నైజీరియా అధ్యక్షుడు డాక్టర్ నొమ్డి అజికివీ :

"శ్రీ జవహర్లాల్ నెహూర్ భారత దేశంలో వెలిగించిన స్వాతంత్ర్యజ్యోతి, నిరంకుశమైన వలసపాలనలో మ్రగ్గుతున్న లక్షలాది ప్రజలకు ఆశాజ్యోతిగా రూపొం దింది. అది వారికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల వైపుకు దారిజూపింది."

ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు డిమెస్డాడో మకపగల్ :

"శాంతికాముకుడు, హేతువాది, రాజనీతి జ్ఞుడు అయిన గొప్పవ్యక్తిని ఆసియా కోల్పోయింది."

ఫిలిప్పైన్స్ ఉపాధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ పెలేజ్ :

"శ్రీ నెహూర్ మహోన్నత వ్యక్తిగా కలకాలం స్మరించబడతారు."

జోర్డాన్ రాజు హుస్సేన్ :

"శ్రీ నెహూర్ మేధావి, నీతిమంతుడు, దయాళువు, జనప్రియుడు అయిన మహా నాయకుడు."

ఇరాన్ రాజు :

"శాంతి, పరస్పర విశ్వాసాన్ని పెంపొం దించిన మహానాయకుడు మన కిక లేరు."

నేపాల్ రాజు మహేంద్ర :

"శ్రీ నెహూర్ నిర్యాణంలో నేపాల్ ఒక గొప్ప ఆప్తమిత్రుణ్ణి కోల్పోయింది."

దక్షిణకొరియా అధ్యక్షుడు చుంగ్ హీపార్క్ :

"పండిట్ నెహూర్ ప్రపంచ ప్రఖ్యాత రాజనీతిజ్ఞుడు, శాంతిప్రియుడు."

మెక్సికో అధ్యక్షుడు లోపెజ్ మటెయోస్ :

"ఆయన మృతివల్ల భారతదేశానికే కాక సమస్త ప్రపంచానికే తీరనిలోటువాటిల్లింది"

చకోస్లవేకియా అధ్యక్షుడు నొవోట్నీ:

"ఆయన మరణంతో శాంతిప్రియులైన మానవులంతా, వివిధ దేశాల మధ్య సహ కారం, శాంతియుత సహజీవనం, శాంతిని నెలకొల్పడానికి అనవరతం కృషి సల్పిన ఒక మహోన్నతమైన రాజనీతిజ్ఞుడిని కోల్పోయినట్లయింది."

జనరల్ నేవిన్ (బర్మా):

"శ్రీ నెహ్రూ, తమ ప్రజల ప్రేమాభి మానాలను విశేషంగా చూరగొన్న గొప్ప దేశభక్తుడు. ఆయన తమ దేశానికి నిస్వార్థ సేవ చేశారు. అంతేకాదు ఆయన విశాల దృక్పథంగల ప్రపంచ నాయకుడు కూడా. అంతర్జాతీయ అవగాహనానికీ, విశ్వ శాంతికీ ఆయన ఎనలేని కృషి చేశారు."

సోవియట్ రచయిత ఇల్యా ఎహ్రెన్‌బర్గ్

"స్వతస్సిద్ధమైన అఖండ ప్రతిభ విశాల భావాలుకల మానవోత్తముడు."

అమెరికా రాయబారి చెస్టర్ బౌల్స్

"భారతదేశం ఒక గొప్పనాయకుడిని కోల్పోయింది. మానవాళి గౌరవ ప్రపత్తుల కొరకు, న్యాయంకొరకు, శాంతికొరకు కృషి చేసిన ఒకగొప్ప ఆదర్శనాయకుడిని ప్రపంచం పోగొట్టుకున్నది."

ఆంధ్రప్రదేశ్ గవర్నరు పట్టం థానుపిళ్లై

"ఇండియా ఒక విఖ్యాత జాతీయ నాయ కుడిని కోల్పోయింది. అన్ని దేశాలు అన్ని తరాలకు చెందిన గొప్ప రాజనీతిజ్ఞులలో ఆయన ఒకరు."

జమ్మూ – కాశ్మీర్ సదరెరియాసత్ డాక్టర్ కరణ్‌సింగ్ :

"భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించిన నాయకాగ్రేసరులలో ఆయన ఒకరు. అంతేకాదు, గత 17 సంవత్సరా లుగా ఆయన దేశానికి ఏకైకనాయకుడు."

మద్రాసు గవర్నరు జయచామ రాజవడయార్ :

"ఆయన మరణంవల్ల భారతావని ఒక గొప్పదేశ భక్తుడిని, నాయకుడిని కోల్పో యింది. ప్రపంచం ఒక రాజనీతిజ్ఞుడిని పోగొట్టుకున్నది."

గుజరాత్ గవర్నరు మెహ్దీనవాజ్‌జంగ్

"జవహర్‌లాల్జీమృతితో దేశంలోవలెనే మనహృదయాలలో కూడా శూన్యత ఏర్ప డింది. ఆయన మార్గదర్శకత్వం అత్యవసర మైన ఈతరుణంలో ఈదారుణం జరగడం మన దురదృష్టం."

ఒరిస్సా గవర్నరు డా. ఏ. ఎన్. ఖోస్లా

"భారతమాత ప్రకాశమానమైన తన పుత్రరత్నాన్ని కోల్పోయింది."

పాండిచెరీ లెఫ్టినెంట్ గవర్నరు ఎస్. యల్. శీలం

"పండిట్ నెహూర్ మరణ వార్త ఒక పెద్ద విఘాతం"

కాశ్మీర్ ప్రధాని జి. ఎం. సాదిక్

"భారతదేశానికే కాక యావత్ప్రపంచా నికే తీరని లోటు."

మహారాష్ట్ర ముఖ్యమంత్రి వి.పి. నాయక్

"దేశం ఈ విషాదాన్ని ఎలా తట్టుకుం టుందో ఊహించలేకుండా వున్నాను."

మద్రాసు ముఖ్యమంత్రి
ఎం. భక్తవత్సలం:
"దేశానికి మహా విపత్తు సంభవించింది."

గుజరాత్ ముఖ్యమంత్రి
శ్రీ బలవంతరాయ్ మెహతా:
"భారతదేశం జాతి నేతను కోల్పోయింది."

రాజస్థాన్ ముఖ్యమంత్రి
మోహన్‌లాల్ సుఖాడియా:
"భారతావని ప్రకాశవంతమైన తన రత్నాన్ని, ప్రపంచం గొప్ప రాజనీతిజ్ఞుడినీ, శాంతి దూతనూ పోగొట్టుకున్నాయి."

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
కాసు బ్రహ్మానందరెడ్డి:
''మానవకోటి శ్రేయస్సుకూ, శాంతికీ నిరంతరం పాటుబడిన ప్రపంచ ప్రఖ్యాత నాయకులలో ఆయన ఒకరు. ఆయన నవ భారత నిర్మాత "

ఆచార్య వినోబాభావే
"ప్రపంచం, మానవాళియొక్క గొప్ప ఆరాధకుడినీ, మన దేశం అసమానమైన నాయకుడినీ కోల్పోయాయి. ద్వేష, క్రోధాలకు అతీతుడైన ఇలాంటి రాజకీయవేత్తను నేను ఎరుగను."

షేక్ అబ్దుల్లా
"దేశ స్వాతంత్ర్యానికి పండిట్‌జీ పోరాడిన విధానం, నవభారతాన్ని పటిష్ఠం చేయడానికి ఆయన పరిశ్రమించిన తీరు మన అందరం అనుసరించవల్సిన ఆదర్శ మార్గాలు."

మొరార్జీ దేశాయ్
"ఇంతటి విఘాతం దేశాని కెప్పుడూ తగలేదు."

ఏ. బి. వాజ్పాయ్
"చరిత్రలో దీర్ఘకాలం వరకు స్మరించబడగల గొప్ప వ్యక్తిని భారత దేశం కోల్పోయింది.''

యస్. యస్. ద్వివేది
"మానవాళి గొప్ప శాంతి ప్రియుడిని కోల్పోయింది."

కె. యం. మున్షీ
"మన జాతికి జీవితం, ఆత్మ అయిన మన నాయకాగ్రేసరుడు రాలిపోయారు."

ప్రొఫెసర్ యన్. జి. రంగా
"ఆయన అస్తమయంతో ఒక శకం ముగిసింది, నూతన శకం ప్రారంభమైంది."

యస్. ఎ. డాంగే
"శ్రీ నెహ్రూ నిర్యాణం చెందడంతో మన జాతీయ చరిత్రయొక్క ఒక ఉజ్వల ఘట్టం పరిసమాప్తమైంది. కొత్త అధ్యాయం ప్రారంభమవుతుంది.''

యు. యన్. ఢేబర్
"రాజకీయ నాయకులెవ్వరూ కూడా ఇవ్వలేని శాశ్వత విలువలను గాంధీజీ పండిట్‌జీలు మనకు ప్రసాదించారు."

మధు లిమాయె
"దేశ స్వాతంత్రోద్యమంలో ఆయన అనుపమానమైన పాత్ర వహించారు."

సి. యన్. అన్నాదురై
"సంఘర్షణలు, కలతలవల్ల దేశానికి హాని కలగకుండా కాపాడి దాని సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేశాడు."

శ్రీప్రకాశ
''ఆయన లక్షలాది ప్రజలకు శక్తి, ఉత్సాహాల నిచ్చిన ధీరోదాత్తుడు."

బికనీర్ మహారాజా:
"మనం ప్రపంచానికి బుద్ధుడినీ, గాంధీని ప్రసాదించాము. ఇప్పుడు జగతికి ఒక నెహ్రూనుకూడా సమర్పిస్తున్నాము."

సభాపతి సర్దార్ హుకుమ్ సింగ్:
''ప్రపంచంలోని ఐశ్వర్యాలన్నింటిలోకీ జనసంపదే శ్రీ నెహ్రూకు అత్యంత ప్రియమైనది. ప్రజానీకపు గౌరవ ప్రపత్తుల ఉన్నతికే ఆయన సర్వదా కృషి సల్పారు. పరాధీనతలో మ్రగ్గేవారు ప్రపంచంలో ఎక్కడ ఏ ప్రాంతంలో వున్నా వారికొరకు ఆయన హృదయం పరితపించేది. ఆర్థిక రాజకీయ ఇత్యాది విలసతత్వా లన్నింటి నిర్మూలనకూ ఆయన ఎల్లప్పుడూ అగ్రగాముగా వుండి పోరాడారు."

యం. సి. చాగ్లా:
''నౌక తన నావికుడిని కోల్పోయింది. సాగరం ఎంత అల్లకల్లోలంగా వున్నా సరే నౌకాయానం కొనసాగవలసిందే."

భూపేష్ గుప్త:
"మానవాళి జీవించి వున్నంతవరకు శ్రీ జవహర్‌లాల్ పేరుకూడా నిలిచివుంటుంది "

కాంగ్రెసు అధ్యక్షుడు కామరాజ్
''సహనభావంతో ఇచ్చి పుచ్చుకునే వైఖరిని అవలంబించాలని శ్రీ జవహర్ నెహ్రూ మాకు నేర్పారు.''

వి. కె. కృష్ణమీనన్
"మనదేశంలోనే కాదు ప్రపంచంలోనే జ్యోతి ఆరిపోయింది. నేటి ప్రపంచ విఖ్యాత పురుషులలో ఆయన ఒకరు. మన జ్యోతి అనాథ అయింది." ★

6వ ప్రకరణం

# పత్రికా ప్రపంచం నివాళులు

(నెహ్రూవలె ప్రపంచ పత్రికల ప్రశంసలు
పొందిన రాజనీతిజ్ఞుడు మరొకరు లేరు.)

# స్వతస్సిద్ధ ప్రజానాయకుడు: అనివార్య మనిషి

ప్రావడా

"శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ రష్యాను మూడుసార్లు — 1927, 1955, 1961వ సంవత్సరాలలో — సందర్శించారు. సోవియట్ ప్రధాని శ్రీ కృశ్చేవ్‌కు ఆయన తమ దేశంలో రెండుపర్యాయాలు — 1955 1960వసంవత్సరాలలో— స్వాగతమిచ్చారు. ఈ వ్యక్తిగత సన్నిహిత సంబంధాలు ఈ ఉభయ దేశాల ప్రజలమధ్య పెంపొందు తున్న, పటిష్ఠమవుతున్న సహకారసంబంధా లకు చిహ్నం. వీరి మధ్య మైత్రి వర్ధిల్ల డానికి హిమాలయాల యొక్క ఉత్తుంగ శిఖరాలు కానీ, వాతావరణం లేక సాంఘిక పరిస్థితుల తారతమ్యాలు కానీ అడ్డంకులు కాలేదు.

"శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ, భారతీ యుల స్వాతంత్రోద్యమ యోధుడుగా చరిత్రలో కీర్తించబడతారు. భారతప్రభుత్వ విధానమైన అలీన సిద్ధాతాన్ని రూపొందించే గౌరవం ఆయనకు దక్కింది. ప్రపంచం లోని శాంతి కాముక దేశాలన్నీ ఈ విధా నాన్ని అమితంగా కొనియాడాయి.

"మన తరంలోని గొప్ప రాజనీతిజ్ఞు డుగా, శాంతి కాముకుడుగా సోవియట్ దేశపు గాఢ స్నేహితుడుగా శ్రీ జవహర్ లాల్ నెహ్రూను సోవియట్ ప్రజలు స్మరించుకుంటారు."

లౌస్విలె, కెంటుకి, కోరియర్ జర్నల్

"శ్రీ నెహ్రూ నిర్యాణంవల్ల ప్రపంచం స్వతస్సిద్ధమైన కొద్దిమంది ప్రజానాయకు లలో ఒకరిని కోల్పోయింది."

చికాగో ట్రిబ్యూన్

"అనివార్య మనదగిన వ్యక్తులలో శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ ఒకరు. శ్రీ నెహ్రూ తన దేశస్థుల దృష్టిలో నవభారత నిర్మాత. ఆయనకు ప్రత్యామ్నాయమైన వ్యక్తి లేరు."

శాన్‌ఫ్రాన్సిస్కో క్రానికల్

"నెహ్రూవలె అశేష ప్రజల గౌరవ విశ్వాసాలను చూరగొన్న వ్యక్తి రాజకీయ చరిత్రలో మరొకరు లేరు. ఆయన మర ణంతో ప్రాచ్యఖండానికి అండ పడి పోయింది."

శాన్‌ఫ్రాన్సిస్కో కాల్ బులెటిన్

"నెహ్రూ మృతివల్ల జాతీయ నాయ కత్వానికి లోటు ఏర్పడింది.

వాషింగ్టన్ పోస్ట్

"భారతదేశం గొప్ప నాయకుడిని కోల్పో యింది. ఈ ఉపఖండంలో ఉద్భవించిన గొప్ప నాయకులతో పాటుగా ఈయన పేరుకూడా చరిత్రలో లిఖింపబడుతుంది."

క్రిస్టియన్ సైన్స్ మానిటర్

"ఆధునిక భారతదేశం నెహ్రూ స్మృతి చిహ్నం...కోట్లాది ప్రజలను ఏకజాతిగా నడిపించిన నాయకశిఖామణి ఆయన. జనులకు ఆయన వారికి సారధ్యం వహిం చారు. ఏమి చేయాలో చెప్పారు. వారు ప్రక్కకు తొలగినప్పుడు కోపగించారు వారు హఠం చేసినప్పుడు దానిని అధిగ మించి ఆధిపత్యం వహించారు. ఐనప్పటికీ వారికి స్వేచ్ఛ నిచ్చారు. ప్రజాస్వామ్య "పటిష్ఠతకు దోహదం చేశారు.

చికాగో సన్‌టైమ్స్

"పరాధీనంలో వున్న ప్రజలకు విమో చనం కలిగించడం, జాతీయ, వ్యక్తిగత స్వాతంత్ర్యాలను పరిపోషించడం, వర్ణ విచ క్షణ, అజ్ఞానం, లేమిడి వ్యాధులను నిర్మూ లించడం — ఇవీ నెహ్రూ లక్ష్యాలు. ఈ ఆశయాలు అమెరికన్లందరికీ అంగీకార యోగ్యాలు. 20 వ శతాబ్దిలో ఉద్భవించిన అత్యంత ప్రేమ పాత్రుడు. ముఖ్యుడు అయిన వ్యక్తి ఆయన. క్లిష్టమైనవ్యక్తికూడా. ప్రపంచంలోకల్లా శక్తిమంతుడైన నాయ కుడుగా రూపొందగలిగిన వ్యక్తి ఆయన."

అట్లాంటా జార్జియా కాన్స్టిట్యూషన్

"దేశ ఆర్థికస్థితిని అభివృద్ధి పరచడంలో ఆయన వారసులకు సహాయపడడం, తోడ్ప డడం ద్వారా అమెరికా ఆయనకు శ్రద్ధాం జలి ఘటించాలి."

"న్యూయార్కు టైమ్స్"

"శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ తమ మాతృదేశాన్ని తనకంటే మిన్నగా ప్రేమిం చారు. అంతకంటె ఎక్కువగా దేశ ప్రజలు ఆయనను ప్రేమించారు. ఈ అగాధమైన ప్రేమయే ఆయనను యావద్భారత జాతికి ఏకైక హృదయాధినేతగా చేసింది. ఒక్క క్షణమైనా ప్రజల ప్రేమను చూరగొనక మనలేని వ్యక్తి. చీమ చిటుక్కు మన్నా మనస్సు గాయపడే స్నిగ్ధ హృదయుడు, ఎప్పుడూ దేనికోసమో నిరంతరం అన్వే షించే స్వభావం గల వ్యక్తి, ప్రజలతో కలసి మెలసి వారి సుఖ దుఃఖాలలో పాలు పంచుకుంటూ, వారితో మునిగి తేలుతూ,

మరొకప్పుడు వారికి దూరంగా వుంటూ, ఒకప్పుడు సంతోషంతో తృప్తిపడుతూ, వేరొకప్పుడు ఆలోచనా వినువీధులలో విహరిస్తూ, వివిధ విచిత్ర వర్ణన సమ్మేళనా స్వభావంగల ఈ వ్యక్తిని అశేష ప్రజానీకం ఆత్మీయునిగా అభిమానించి ఆరాధించింది. ఈ అభిమానంవల్లనే ఆయన భారత హృదయ సామ్రాజ్యానికి ఎదురులేని ఏలిక కాగలిగారు."

"ప్రజలపై అధికారం చెలాయించడానికి శ్రీ నెహ్రూకన్నా చిన్న నాయకులు ప్రజల ప్రేమాభిమానాలను దుర్వినియోగం చేశారు. కాని శ్రీ నెహ్రూ అధికారాన్ని అలా దుర్వినియోగం చేయలేదు. భారత ప్రజానీకం ఆయనపై పూర్తి విశ్వాసం వుంచింది. భారత స్వాతంత్ర్యం ఆయన ప్రసాదించిన అమూల్యమైన కానుక...తన మాతృదేశ ప్రేమాంబుధిలో ఉద్భవించిన కానుక అది."

"ఎంతటి భయంకరమైన బాధ్యతనైనా భారతదేశపు అమూల్య రత్నంగా నీరాజనాలందుకున్న నెహ్రూ ఎన్నడూ విడనాడలేదు. ఆయిన భారత దేశాన్ని ప్రాణాధికంగా ప్రేమించారు "

"అంతకంటే ఎక్కువగా ప్రజలచే ప్రేమింపబడి ఆయన అమరుడయ్యారు!!"

## న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్

"భారత ప్రజలపై ఆయనకు గల అధికారం దాదాపుగా పరిపూర్ణమైనది...ఆయన మృతివల్ల భారతదేశం, ప్రపంచంకూడా నిర్భాగ్యరాండ్రయ్యాయి."

## న్యూయార్క్ డెయిలీ న్యూస్

"కష్ట పరిస్థితులలోకూడాఆయన క్రిమస్థితిని నిలిపారు,"

# లండన్ పత్రికలు

## టైమ్స్

"జనవరిలో ప్రధానినెహ్రూ అనారోగ్యం కామన్వెల్తు దేశాలకు ఒక హెచ్చరికఅయినా, నేటి మరణవార్త కలచివేసింది. శ్రీ నెహ్రూ ప్రపంచమేధావి. ఆసియా దేశాలనుండి ప్రపంచరంగంలో ప్రవేశించిన తొలి నాయకుడు. భారత స్వాతంత్ర్య పోరాటంలో యోధుడుగా, స్వతంత్ర భారత ప్రధానిగా ఆయన ప్రపంచఖ్యాతి పొందారు. కేవలం జాతీయనాయకుడుగానేకాక వారిఅంతర్జాతీయ ఆదర్శాలకు ప్రపంచం అంజలి ఘటిస్తున్నది. పాలకులకు, పాలితులకు మధ్య వైషమ్యాన్ని తొలగించడంలో, ఒక యుగం మరొక యుగంగా మారడంలో ఎంత ఉన్నతి పంథా అవలంభించవచ్చునో శ్రీ నెహ్రూ నిరూపించారు."

## గార్డియన్

"శ్రీ నెహ్రూ ఈ తరం మహానాయకులలో ఒకరు. కామన్వెల్తుకు కొత్తరూపాన్ని అర్థాన్ని కల్పించింది ఆయన. భారతీయులకు ఇష్టం లేకపోయినా, కామన్వెల్త్ భారతదేశం సభ్యత్వం నిల్పడానికి ఆయన కృషి చేశారు. తమ తొలి ప్రధానలక్ష్యాలను ఆచరణలో పెట్టడానికి భారతదేశంలోసమర్థులైనవారు, ఆసక్తిగలవారు అనేకులున్నారు. శ్రీ నెహ్రూ అంతటి నాయక ప్రతిభ శ్రీ లాల్ బహదూర్ శాస్త్రిలో ఇంకా లేకపోవచ్చు. కాని, ఆయనలో మరికొన్ని సుగుణాలు ఉన్నాయి. ఓర్పు, ప్రతికూల శక్తులను కూడదీసుకు రావడం, వారిలోని ప్రత్యేక లక్షణాలు."

## డెయిలీ టెలిగ్రాఫ్

"కొత్త దేశాలనాయకులవలెకాక, శ్రీ జవహర్‌లాల్‌లో నాయకునికి మించిన ప్రతిభ ఉన్నది. శ్రీ నెహ్రూ తన జీవితకాలంలో వ్యక్తిగాకాక, జాతిగా జీవించారు. ఆయన స్వతంత్రానికి పర్యాయపదంగా ప్రపంచానికి దర్శనమిచ్చారు. మహా మేధాసంపన్నులలో శ్రీ నెహ్రూది అగ్రతాంబూలం. శ్రీ నెహ్రూ మరణంతో భారత చరిత్ర, అభివృద్ధిచెందని దేశాల చరిత్రలో నూతన అధ్యాయాలు ప్రారంభం కానున్నాయి."

## డెయిలీ మెయిల్

"జాతీయ నాయకుల ప్రత్యేకతలు వారిలోనే ఉద్భవిస్తుంటాయి. భారత తారాపథంలో అగ్ర తారగా ప్రకాశించిన పండిట్ నెహ్రూకూడా అటువంటివారే. "నాలో ప్రాక్పశ్చిమాల మేలి కలయిక ఉన్నది." అని శ్రీ నెహ్రూ చెప్పేవారు. అదే వారిని ప్రపంచ నాయకునిగా తీర్చి దిద్దింది. కమ్యూనిస్టు చైనా, ప్రజాస్వామ్య భారతదేశం తాత్త్విక పోరాటంలో ఉన్న క్లిష్ట సమయంలో, ఆసియా భవితవ్యం నిర్ణయం కావలసిన సమయంలో శ్రీ నెహ్రూ మరణించారు. నేడు భారతదేశం సర్వ సమృద్ధమై, ఈ భిన్న లక్ష్యాలతో ఒక పక్షానికి నాయకత్వం వహించేశక్తి శ్రీ నెహ్రూ ఒనగూర్చిందే. శ్రీ నెహ్రూ ఉన్నత వ్యక్తి. వారి మరణంతో ప్రపంచం గొప్ప సంపదను కోల్పోయింది."

## డెయిలీ హెరాల్డ్

"నెహ్రూ తర్వాత ఎవరు భారత నాయకత్వం వహించినా, 43 కోట్ల మందిని నడిపించవలసి ఉన్నది. వారిలో చాలా మంది నెలకు రెండు పౌనుల ఆదాయంతో బ్రతికేవారే. ఎవరు నాయకత్వం వహించినా, జీవితాంతం ఆకలితో అలమటించే కోట్లాది స్త్రీ పురుషులు, బాలబాలికలకు నాయకత్వం వహించవలసిందే. ఇన్ని ఇక్కట్లు,

ఇడమలు ఉన్న, ఆ దేశంలో ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం ఏదో ఒక రూపంలో ఉన్నది.

నేడు నెహ్రూ మరణానికి ప్రపంచం నిజంగా విలపిస్తే, ఇప్పటికన్నా ఇంకా ఎక్కువగా ఇదే ప్రపంచం భారతదేశానికి సహాయం చేయాలి."

డెయిలీ స్కెచ్

"ప్రపంచ వ్యవహారాలలో గాక, భారత జాతి ఐక్యతలోనే శ్రీ నెహ్రూ ఔన్నత్యం ఇమిడిఉన్నదని చరిత్ర నిరూపించవలసిన సమయం ఇది."

డెయిలీ వర్కర్

"ఆయన మరణవార్తవిని కోట్లాది ప్రజలు విచారంజెందారు. స్వాతంత్ర్యానికై భారత ప్రజలు సాగించిన పోరాటంలో ఆయన తాదాత్మ్యం పొందారు. కనుక వలస పాలితులు తమవిమోచనానికై సాగించిన పోరాటాలతో ఆయనకు సంబంధం వుండేది.''

ఇత్తెఫాక్ : (తూర్పు పాకిస్తాన్)

"సమకాలీన చరిత్రపైగల ఈ మహాపురుషుని ప్రభావాన్ని విశదీకరించడానికి మాటలు చాలవు.

శ్రీ నెహ్రూ ఏ ఒక్క దేశానికి కానీ, యుగానికి గానీ చెందరు. ఆయన చరిత్రను సృష్టించారు. ఎల్లప్పటికీ చరిత్రలో ఆయన పేరు నిలిచివుంటుంది.

వివాదగ్రస్తమైన అనేక అంతర్జాతీయ సమస్యల పరిష్కారానికి ఆయన దోహదం చేశారు. తటస్థ విధానానికి నెహ్రూ కర్త. అణు యుద్ధ ప్రమాదంతో కూడుకొని కూటాలుగా విభాజితమైవున్న ప్రపంచంలో శాంతి సంస్థాపనకు ఆయన పోరాడారు. సామ్రాజ్యవాదం, వలస పాలనలకు వ్యతిరేకంగా పోరాటం సాగించినయోధుడు కూడా. ఆఫ్రికా ఆసియా దేశాల ఐక్యతకై ఆయన చాలా కృషిచేశారు."

పాకిస్తాను అబ్జర్వర్

"ఆయన సౌమ్యవైఖరి కనబరచనట్లయితే భారత, పాకిస్తాన్ దేశాలమధ్య సంబంధాలు పరింతగా చెడిపోయుండేవేమో. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆయన దివంగతులు కావడం దుఃఖాన్నీ, భయాన్నీ కలిగిస్తున్నది."

టైమ్స్ ఆఫ్ సిలోను

"మానవాళి స్వాతంత్ర్యానికీ, వివిధదేశాల మధ్య గౌరవ ప్రతిష్ఠలతో కూడిన సత్సంబంధాలను నెలకొల్పడానికీ, వ్యక్తిగతంగా అందరికీ న్యాయం కలగడానికీ, గౌరవ మర్యాదలు లభించడానికీ పోరాడిన యోధుడుగా, గొప్పవ్యక్తిగా ఆయనపేరు చరిత్రలో నిలిచిపోతుంది."

సిలోను అబ్జర్వర్

"భారత స్వాతంత్ర్యోద్యమపు మహా యోధులలో చివరివాడుగా ఆయన కన్ను మూశారు. ఆయన నిర్యాణంతో నవభారతావని పురోభివృద్ధి భారం ఆయన కంటే చాలా తక్కువ వారైన రాజకీయ వేత్తలపై బడింది. దారిద్ర్యంతో బాధపడుతున్న లక్షలాది భారతీయులపట్ల దయార్ద్ర భావాన్ని కనబరచడాన్ని అలవర్చుకోవడమే ఆయన వారసుడు చేయవలసింది."

వర్కింగ్ పీపుల్స్ డెయిలీ (రంగూను)

"ప్రపంచాన్ని వివేకవంతమైన రాజనీతిజ్ఞత, జ్ఞాన తేజస్సులతో ప్రకాశమానం చేసిన జ్యోతి ఆరిపోయింది. ప్రధాని నెహ్రూ నిర్యాణంతో ప్రపంచంలోనే చాలా అరుదైనటువంటి గొప్ప వ్యక్తులలో ఒకరు అంతరించి నట్లయింది."

గార్డియన్ (రంగూన్)

"భారత స్వాతంత్ర్య సాధనకు శ్రీ నెహ్రూ చేసిన త్యాగాలు అనుభవించిన బాధలు బర్మాలోని తోటి స్వాతంత్ర్య యోధులకు ప్రేరణ కలిగించాయి. ఈ విధంగా ప్రభావితులైన వారిలో జనరల్ ఆంగ్‌సాన్ అగ్రగణ్యులు. సరిహద్దు తగాదాపై కమ్యూనిస్టు చైనా తన దేశంపై రక్తపాతం జరిపినప్పుడు శ్రీ నెహ్రూ భారతదేశ సారథిగా నిర్వర్తించిన ఉదాత్తమైన పాత్రకు ఆగ్నేయాసియా ఇరుగు పేశాలు ఆయనను అభినందించాయి."

లెఫిగారో (ఫ్రాన్సు)

"నెహ్రూ అసాధారణమైన వ్యక్తి, జాతీయ యోధుడు. జనసామాన్యం ఆయన్ను ప్రేమాదరణలతో గౌరవించింది. మేధావివర్గం శ్లాఘించింది "

అరోర్ (ఫ్రాన్స్)

"నెహ్రూ తమ దేశానికి ఆత్మగా రూపొందారు. కమ్యూనిజం నిరోధనకు దేశానికి పెట్టని కోటగా నిలిచారు. ఇప్పుడు ఆ అండ తొలగిపోయింది. ఆయన మరణంతో హిమాలయంకృంగిందనడంలోఅతిశయోక్తి లేదు.''

కంబాట్ (ఫ్రాన్స్)

''నెహ్రూ మరణంవల్ల భారత స్థిరత్వానికి విఘాతం ఏర్పడింది. అలీన ప్రపంచానికి పెద్ద అండ పడిపోయింది."

లీపాప్యులేర్

''నెహ్రూ భారత జాతిగా మూర్తీభవించారు, ఇప్పుడు ఇంతటి భారాన్ని వహించగల సమర్థత ఎవరికి వుంది? వారసుడు ఎచ్చట వున్నాడు?"

లీహ్యూమనైట్

"యుద్ధాలులేని ప్రపంచాన్ని నెహ్రూకోరారు. కష్టతమమైన ఈ పథంలో మానవాళి పురోగతికి ఆయన సర్వశక్తులను ధారపోశారు.''

అంక్ మౌధా (ఎడెన్)

"శ్రీ నెహ్రూ మరో క్రైస్తువంటివారు."

అల్ అయ్యాయ్మ్ (ఎడెన్)

"మానవకోటి ఒక అద్వితీయమైన వ్యక్తిని కోల్పోయింది."

అర్బె ఇదెర్బ్లాడెట్ (నార్వే)

"దివంగతుడైన తమ నాయకుని స్మృతి సాహసస్యాన్ని పెంపొందించుకొని కలతను నివారించుకోవడానికి భారతదేశస్థులకు దీప్తి కాగలదని ఆశిద్దాం."

నెయూస్ ఆస్ట్రేచ్ (ఆస్ట్రేలియా)

"శ్రీ నెహ్రూ నిరాయుధుడైన శాంతి ప్రవక్త. ప్రపంచ రంగస్థలంలోని ప్రముఖులలో ఒకరు."

అర్బైటెర్ జీటంగ్ (ఆస్ట్రియా)

"ఆయన మహాత్మాగాంధీ ఆదర్శాలను ఖచ్చితంగా పాటించారు. చైనా దురాక్రమణదార్లను వారి అసలు స్థావరాలకు తిరగగొట్టడానికి అవసరమైన దానికంటే ఎక్కువ శక్తివంతంగా వారి దాడిని ప్రతిఘటించడానికి అంగీకరించనప్పుడు ఆయన్ను అపార్థం చేసుకోవడంకూడా జరిగింది. మహాత్మా గాంధీవలెనే ఆయన దృఢ సంకల్పంగల వ్యక్తి."

డాగెన్స్ సైట్టెర్ (స్వీడన్)

"తటస్థ వాదానికి ఆయన ప్రవక్త."

స్టాల్ హోమ్స్ టిడ్నింజెన్ (స్వీడన్)

"ప్రజాస్వామ్యం మనగలుగుతుం దని నెహ్రూ నాయకత్వాన భారతదేశం నిరూపించింది."

రాండ్ డెయిలీ మెయిల్

(దక్షిణాఫ్రికా)

"ఆధునిక ఆశియా మహాపురుషులలో పండిట్ నెహ్రూ ఒకరు ఆయన. ప్రత్యక్ష ఆదర్శవాది."

కేప్ టైమ్స్ (దక్షిణాఫ్రికా)

"శ్రీ నెహ్రూ గొప్ప రాజనీతిజ్ఞుడు. ఆయన దృక్పథం విశాలమైనది. ఆయన చరిత్ర పరిజ్ఞానం అపారమైనది, అణుబాంబులు లేని దేశంలోకూడా నైతిక ప్రభావం శక్తివంతంగా వుంటుందని ఆయన చాటగలిగారు.

శ్రీ నెహ్రూ మరణవార్తను ఈజిప్టు పత్రికలు నల్లని అంచులతో ప్రముఖంగా ప్రచురించాయి. భారతదేశం అభివృద్ధి కృషిలో ఆయన వహించిన పాత్రను శ్లాఘిస్తూ, అలీన విధానానికి అరబ్ దేశాలకు ఆయన ఇచ్చిన మద్దతును కొనియాడుతూ సంపాదకీయాలు వ్రాశాయి.

ఈ వార్తాపత్రికలు స్వర్గీయ ప్రధాన మంత్రి జీవిత చరిత్ర ఆయనను గురించిన ఇతర వ్యాసాలకొరకు అనేక పుటలు కేటాయించాయి."

టునీషియా పాలకపక్షం అధికారిక పత్రిక

"ఆయన మేధాసంపన్నుడైన రాజకీయవేత్త. తన సిద్ధాంతాలకు కట్టుబడి వున్న వ్యక్తి. శాంతి, స్వాతంత్ర్యం, సహజీవనం—ఇవీ ఆయన మూల సిద్ధాంతాలు. ఆయన మరణం సమస్త మానవాళికి తీరని లోటు."

అసాహీషింబున్ (జపాను)

"అభివృద్ధి జెందుతున్న దేశాలు ఇటీవల అంతర్జాతీయ రాజకీయాలలో పరిగణనలోకి రావడానికి శ్రీ నెహ్రూ రాజనీతిజ్ఞతే కారణం. అందుకు అవి ఆయనకు ఋణపడి వున్నాయి."

టోక్యోషింబున్

"1951 శాన్‌ఫ్రాన్సిస్కో ఒప్పందంపై సంతకం చేయడానికి శ్రీ నెహ్రూ నిరాకరించారు. కనుక జపాను ఇండియాకు సర్వదా కృతజ్ఞురాలు. ఈ ఒప్పందం మేరకు జపాను కొంత భూభాగాన్ని కోల్పోవలసివచ్చింది."

లాసున్నే (జనీవా)

"శ్రీనెహ్రూ నిర్యాణంతో ప్రపంచం ఒక ప్రముఖ స్వాతంత్ర్య యోధుడిని కోల్పోయింది. ఆయన పాశ్చాత్య దేశాలకు గొప్ప మిత్రుడు."

బార్బా (యుగోస్లావియా)

"శ్రీ నెహ్రూ లేకుండా జీవించడం భారతదేశానికి, ప్రపంచానికికూడా దుర్లభమే. ఆయన వ్యక్తిత్వం భారత చరిత్రలో ఒక అసాధారణమైన యుగాన్ని నిర్మించింది. ఆయన ఈ విశిష్ట వ్యక్తిత్వం, శాంతి ప్రియత్వం భావిభారతావనికి అమూల్య వారసత్వాలు."

బాల్టిమోర్ సన్ (అమెరికా)

"చరిత్రను మలచే మహాపురుషులు కొందరు ప్రతి శతాబ్దిలోనూ ఉద్భవిస్తుంటారు. మహామేధావులుగా, కార్యశూరులుగా వారు బాసిల్లుతారు. ఇలాంటి అసాధారణమైన వ్యక్తులలో మన తరానికిచెందిన ఇద్దరు భారతీయు లున్నారు. ఈ ఇద్దరిలో రెండవవారు ఇప్పుడు పరమపదించారు. గాంధీజీ దివంగతులైననాటిరాత్రి శ్రీ నెహ్రూ అన్నట్లుగా భారతీయుల జీవితాలలో మళ్ళీ అంధకారం అలుముకున్నది. జ్యోతి ఆరిపోయింది."

ఎకానమిస్ట్ (లండన్)

"తన దేశస్థులకు ఆఫ్రికా, ఆసియా దేశాలకు, తదితరులకు ఆయన చేసిన అమోఘమైన సేవలను గుర్తించడంలో ప్రపంచానికి అరమరికలేమీ లేవు.

శ్రీ నెహ్రూకు అన్నివిధాలా వారసుడైన వ్యక్తి వుండడు. 17 సంవత్సరాల క్రితం భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని లభింపజేసి

నప్పుడే ఆయన అద్వితీయమైన ఖ్యాతిలో వున్నారు.

కాంగ్రెసుకు 25 సంవత్సరాలపాటు నిర్విరామంగా ఆయన చేసిన అమోఘమైన సేవలు ఆయనను గాంధీజీకి ప్రధానసహచరునిగానేగాక వారసునిగా కూడా చేశాయి. ప్రధాని పదవిని నిర్వహించినంతకాలం ఆయన అశేష ప్రజానీకాన్ని తన మాటమీద నిలబెట్టగలిగారు."

డెయిలీ మిర్రర్ (సిలోన్)

"శ్రీ నెహ్రూ ప్రపంచమంతటికీ సౌజన్యమూర్తి. ఆయన మరణం విశ్వమంతటికీ దుఃఖకారణం."

డెయిలీ న్యూస్ (సిలోన్)

''శ్రీ నెహ్రూ అకలంకనాయకుడు; రాజనీతిజ్ఞుడు, మానవతావాది. ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతీ విశేషాలు ఆయనలో మూర్తీభవించి వున్నాయి.

భవిష్యత్తులో భారదేశపు రాజకీయాలు ఏరూపు దాల్చుతాయో ప్రపంచం వేచిచూస్తున్నది. అయితే హితైషులంతా కోరుకునేది ఒక్కటే: నెహ్రూ రూపొందించిన విధానాలు పరిపోషించబడాలనే వారు వాంఛిస్తున్నారు.''

టంజుగ్, యుగోస్లావియా అధికారిక వార్తాసంస్థ

"శ్రీ నెహ్రూ పరమపదించడంతో ఆధునిక భారతదేశం గొప్ప నాయకుడిని కోల్పోయింది. ప్రపంచ రాజకీయ రంగంనుంచి శాంతిస్థాపనకు, అంతర్జాతీయ సహకారానికి పాటుబడిన గొప్పవ్యక్తి నిష్క్రమించారు.

శ్రీ నెహ్రూ అలీనవిధానం, నిరాయుధీకరణ సమస్యాపరిష్కారానికి ఆయన చేసిన కృషి, బెల్గ్రేడ్‌లో జరిగిన అలీనదేశాల మహాసభలో ఆయన వహించినపాత్ర, వలస విధానం, వర్గవివక్షణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి ఆయన ఇచ్చినప్రోత్సాహం నూతన్నంగా స్వతంత్రం పొందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆయన ఇచ్చినమద్దతు భారదేశ స్వాతంత్ర్యానంతరం ఆయన జీవితంలోని ఉజ్జ్వల ఘట్టాలు.

భారతదేశం సామ్యవాద మార్గాన్ని అనుసరించాలని చెప్పిన మొట్ట మొదటివ్యక్తి ఆయనే.

శ్రీ నెహ్రూ, యుగోస్లావియా ప్రజల స్మృతిపథంలో తమ గొప్ప మిత్రుడుగా నిలచిపోతారు.

ప్రెసిడెంట్ టిటో, శ్రీ నెహ్రూలమధ్య జరిగిన ప్రతి చారిత్రక సమావేశమూ, యుగోస్లావియా, ఇండియాల మధ్య సహకారపు నూతన విజయవంతమైన అధ్యాయానికీ, అంతర్జాతీయ సమస్యల శాంతియుత పరిష్కారానికై వారి సమిష్టిచర్యకూ నాంది అయింది.

"శ్రీ నెహ్రూ నిర్యాణంవల్ల భారతదేశం గొప్పనాయకుడినీ, ప్రపంచం సమానత్వం, శాంతియుత సహజీవనాలకై పాటుబడిన గొప్పవ్యక్తినీ, యుగోస్లావియా ఒక గొప్ప మిత్రుడినీ కోల్పోయాయి.''

హెట్ వ్రిజీ ఓక్ (ఆమ్స్టెర్‌డమ్)

"శ్రీ నెహ్రూ మరణం భారతదేశ చరిత్రలో ఒక యుగాన్ని ముగింపజేసింది. ఆయన భారతదేశం అభివృద్ధికృషికి సారథ్యం వహించారు. దేశానికి స్వకీయమైన ఆకృతిని కలిగించారు.''

అల్ అరబ్

''ఒక గొప్ప దేశనాయకుని హృదయచలనం ఆగిపోయింది. సహాయ నిరాకరణ, శాంతియుత విప్లవం పోరాటాలను ఆయన ప్రజలకు నేర్పారు. అవి సామ్రాజ్య వాదానికి బాధాకరమైనవి. దాస్యవిమోచన జాతీయోద్యమాలకు ఆలంబనలు. ఆయన చరిత్రలో మహోజ్వలమైన నూతనఘట్టాన్ని ప్రారంభింప జేశాయి. శ్రీ నెహ్రూ సహనశీలి. మహమ్మదీయులకు, క్రైస్తవులకు, హిందువులకు, సిక్కులకు అందరికీ ప్రేమపాత్రుడు."

నార్తర్న్ న్యూస్ (మధ్య ఆఫ్రికా)

''శ్రీ నెహ్రూ మృతితో అంతర్జాతీయ రంగంనుంచి గొప్ప ప్రపంచ నాయకుడు నిష్క్రమించారు."

సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్

"ఈ శతాబ్దపు మహా పురుషుడు ఒకరు అస్తమించారు. నిఖిల ప్రపంచం ఆయనకు నివాళు లర్పిస్తున్నది.''

ఆంధ్ర పత్రిక

"స్వాతంత్ర్యాన్ని సాధించడం, సోషలిస్టు సమాజ నిర్మాణం లక్ష్యంగా ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి కృషి కొనసాగించడం ఒకఎత్తు; ఎన్ని ఉపద్రవాలు వచ్చిపడినా, ఎన్ని సంక్షోభాలు ఎదుర్కోవలసి వచ్చినా బహుభాషా, మతవర్గాల ప్రజలను ఏకంగా ఉంచుతూ భారత సమైక్యతను చెక్కు చెదరకుండా నిలుపగలగడం ఒక్కటీ ఒక ఎత్తు; కేవలం ప్రేమానురాగాలతోనే ప్రజారంజకంగా ఈ సువిశాల భారత దేశాన్ని ఇన్నేళ్ళు ఏలిన మహావ్యక్తి అశోకుని తరువాత నెహ్రూయే. ఉత్తమ ఆదర్శాలను ప్రకటించడమే గాక ఆ ఆదర్శాలను ఆచరణలో సమన్వయించగల దక్షత; ఇతరులలో దోషాలను నిస్సంకోచంగా ఖండించడమే గాక, తనలోగల దౌర్బల్యాలను ఒప్పుకోగల ధైర్యం ఉండబట్టే ఇంతటి మహానాయకులు కాగలిగారు.''

ఆంధ్ర ప్రభ

"ఎంతమాట! ఎంతమాట! మన ప్రధాని మనకులేడు! మన జవహర్ మనకులేడు! మన భారత భాగ్యవిధాత మన కిక లేడు! విధి బలీయం! దైవ సంకల్పం ఇదే కాబోలు.

ఇంతకంటె ఇప్పుడు మాకు మాటలు పెగలడంలేదు! కలం ఆడడంలేదు!

'మన సారథి, మన సచివుడు
మన వియ్యము, మనసఖుండు
మన బాంధవుడున్......
మన విభుడు, గురుడు, దేవర
మనలను దిగనాడి చనియె......'
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః!"

ఆంధ్రజ్యోతి

"గాంధీజీ మనకు స్వాతంత్ర్యం ప్రసాదించి వెళ్ళగా నెహ్రూ దాన్ని సుస్థిరం చేశారు. దానికి పునాదులుగా ఐకమత్యం, ప్రజాస్వామ్యం, సెక్యూలరిజం, సోషలిజం మొదలైన వాటిని నిర్మించారు. ప్రజాశికా బద్ధమైన ఆర్థిక విధానాలను, ప్రపంచ శాంతినే ధ్యేయంగా పెట్టుకున్న అలీన విధానాన్ని ఆయన రూపొందించారు. ఇవే నెహ్రూకు వారసులు."

విశాలాంధ్ర

"తటస్థ వైదేశిక నీతి, ప్రభుత్వ రంగ విస్తరణ, మత ప్రమేయంలేని లౌకిక రాజ్యాంగ వ్యవస్థ ఈ మూడు పునాదులపై నవభారత నిర్మాణం ఆధారపడి వుంది. ఈ పునాదులను దృఢతరం చేయడానికి వాటిపై నవభారత సౌధాన్ని నిర్మించటానికి తన ఆఖరి రక్త బిందువును సైతం వెచ్చించిన మహావ్యక్తి జవహర్‌లాల్ నెహ్రూ.

భారత ప్రభుత్వంపై చైనా జరిపిన దాడి తటస్థ విధానాన్ని దారుణమైన అగ్ని పరీక్షకు గురిచేసింది. ఐనా ఈ క్లిష్ట సమయంతో భారత ప్రభుత్వం మొత్తం మీద తటస్థ విధానానికే అట్టిపెట్టుటకు నిలిచింది. ఈ ఘనత యావత్తు ప్రధాని నెహ్రూకే దక్కుతుంది."

ఆంధ్ర భూమి

"జవహర్‌లాల్ నెహ్రూ లేని భారత దేశాన్ని ఊహించడమే కష్టంగా ఉంది. సుమారు అర్ధ శతాబ్దం పాటు జాతీయ జీవన స్రవంతిలో ఒక ముఖ్యమైన భాగంగా నెహ్రూ జీవన స్రవంతి కలసి మెలసి ప్రవహించింది. స్వాతంత్ర్య పోరాట సమయంలో పండిత నెహ్రూగా, స్వాతంత్ర్యపు ఉషఃకాలంనుండి ప్రధాని నెహ్రూగా భారతదేశం అంటే నెహ్రూ, నెహ్రూ అంటే భారతదేశం అన్నంతగా చరిత్ర సృష్టించిన మహోన్నత వ్యక్తి శాశ్వతంగా కన్నుమూశారంటే ఆది జాతికి ఎంతటి ఘోర విపత్తో మాటలతో వివరించ గల్గడం అసాధ్యం. భారతీయుల మౌన వేదనను వ్యక్తీకరించడానికి యీ తరుణంలో భాషకు శక్తిలేదు. బుద్ధుడూ, అశోకుడూ, ఆచార్య శంకరుడూ, గాంధీజీ — ఆ పరంపరకు చెందిన అమృతమూర్తి జవహర్‌లాల్ నెహ్రూ."

గోలకొండ పత్రిక

"ప్రజాస్వామికము, సామ్యవాదము, సర్వతోముఖమైన దేశాభ్యున్నతి, జగత్కల్యాణము అను నాలుగు ఆశయాల సాధనలో శ్రీ నెహ్రూ తమ అస్తమయము వరకు నిమగ్నులై యుండిరి.

ఆయన అడుగు జాడలలో ఆయనవేసిన బాటలలో పురోగమించి దేశీయులు ఆయన స్వప్నాలను సత్యములు కావించవలసి యున్నది. అదియే ఆయన ఆత్మకు శాంతి. అదియే నేడు మనము చేయవలసిన కర్తవ్య పాలనము."

ఆంధ్రజనత

"గాంధీజీ, నెహ్రూ స్వాతంత్ర్యోద్యమ సందర్భంగా ఉద్భవించిన యిద్దరు మహాపురుషులు.

నవభారతావనికి గాంధీ దివ్యజ్యోతి, నెహ్రూ ఆశాజ్యోతి.

గాంధీజీ తత్వవేత్త; నెహ్రూ తత్వ ప్రచారకుడు.

గాంధీజీ బుద్ధ దేవుడనుకుంటే, నెహ్రూ అశోక చక్రవర్తి.

గాంధీజీ మహాత్ముడు; నెహ్రూ మహానాయకుడు.

గాంధీజీ మహా ప్రస్థానం: నెహ్రూ ఆకర్షితుడైన యాత్రికుడు.

గాంధీజీ ఆధ్యాత్మిక శక్తి నిచ్చిన అవతార పురుషుడు; నెహ్రూ ఆర్థిక, సామాజిక శక్తిని పెంచిన యుగపురుషుడు. ఒకరు పునాది; రెండవవారలు సౌధం. అది అపూర్వమైన, అద్వితీయమైన సంఘటన...

1928 లో కాంగ్రెస్ అధ్యక్ష పదవిని జవహర్లాల్‌కు అప్పగిస్తూ, స్వర్గీయ శ్రీ మోతీలాల్ నెహ్రూ ఉదహరించిన పర్షియన్ పద్యం ఈ సందర్భంలో పేర్కొనదగినది.

హర్చే కెఫిదద్ నతవనక్
పేనర్ తమామ్ కునద్
తండ్రి సాధించలేని మాహాత్కార్యాన్ని
పుత్రుడు సాధిస్తాడని దాని అర్థం."

హిందూ

"తనకు అత్యంత ప్రియతమమైన పుత్రుడు ఆకస్మికంగా నేడు తనను వీడి వెళ్ళినందుకు దేశం అపరిమితమైన బాధతో

విలపిస్తున్నది. భారతదేశ స్వాతంత్ర్య సాధనకొరకై తత్పూర్వమూ, స్వాతంత్ర్య సముపార్జనానంతరం పదిహేడు వర్షాలు అవిరామంగా దేశంకోసం ఎలుగెత్తి ధ్వనించిన ఆయన వాణి నేడు మూగవోయింది. హిందూమహాసముద్రపు కవోష్ణ జలాల నుండి లధక్‌లోని హిమసానువుల పర్యంతం కోటానుకోట్ల ప్రజకు ఈ విషాదవార్తాలహరి అత్యంత ఆత్మీయులను కోల్పోయినంత తీవ్రాఘాతంవలె పరిణమించింది. ఈనాడు ఏ నాయకుడూ కూడా కోటానుకోట్ల జనావళి హృదయాలకు జవహర్‌లాల్ నెహ్రూ అంత సన్నిహితంగా రాకపోవడమే అందుకు కారణం.

దేశ విభజన, జాత్యహంకార ఉద్వేగాలు, వివిధ భాషోద్యమాలూ, మొదలైన వీటన్నింటినీ లక్ష్యపెట్టకుండా ఆయన భారతదేశాన్ని మత వివక్షతలేని ప్రజాస్వామ్య విధానపు కట్టుదిట్టాలలో వుంచి సంఘీభావం పాదుకొల్పి దేశాన్ని ఆర్థికాభివృద్ధి వైపు, వినూత్నపథంపై నడిపించడం ఆయన సాధించిన మహత్తర నిర్మాణ కార్యం అనడం నిస్సందేహం. సామాన్య జీవన సిద్ధాంతాలనుచేపట్టి విశుద్ధ ధర్మపథంలో నడిచిన గాంధీజీవలె కాక, విస్తృతపురోభివృద్ధిని సాధిస్తున్న శాస్త్ర విజ్ఞానంపై ఆధారపడిన సాంకేతిక నవసమాజపు అనివార్యతపైనా తన పరిసరాలపై మానవుని విజయంపైనా నెహ్రూ ప్రగాఢంగా విశ్వసించారు. గత పదిహేను సంవత్సరాలుగా ఆయన సాంకేతిక, విజ్ఞాన శాస్త్రిలకిచ్చిన ప్రోత్సాహం ఆయన సాధించిన తదితర విజయాలనలావుంచి ప్రధానమంత్రిగా ఆయన సాధించిన మహత్తరాభివృద్ధికి శాశ్వతమైన స్మారకచిహ్నంగా వుండిపోతుంది. నెహ్రూ వ్యక్తి స్వాతంత్ర్యంలోనూ. సాంఘిక న్యాయంలోనూ కూడా అత్యాపేశపూరితమైన విశ్వాసం వుంచారు. నవ పారిశ్రామిక సమాజ నిర్మాణకార్యంలో మనం అతి ముఖ్యమైన మానవ విలువలను బలిపెట్టరాదని ఆతురత పడేవారు."

## టైమ్స్ ఆఫ్ ఇండియా

"నెహ్రూ సాధించిన మహత్తర విజయాలను ఇప్పుడే దర్శించడానికి మనం తొందర పడరాదు. అందుకు సమయం చాలదు. నెహ్రూకెంతగా ఋణపడి వున్నారో భవిష్యత్తు మాత్రమే చూపగలుగుతుంది. చరిత్ర ఏ విధంగా తీర్మానించినా భారత ప్రజల ప్రేమాదరణలలో ఆయనకు శాశ్వతమైన స్థానం వుంటుంది. ఆయన భారత ప్రభుత్వ నాయకుడుగా వున్న పదిహేడు దుర్భర సంవత్సరాలలోనూ జాతీయ జీవన విధానపు ప్రతి దృక్పథాన్నీ తీర్చి దిద్దారు. అత్యంత క్లిష్టపరిస్థితులలోకూడా ఆయన అధికారానికి సవాలు అనేది రాలేదంటే ప్రజలలో ఆయనపై వున్న అచంచల విశ్వాసానికీ ప్రజలపై ఆయనకున్న అతీత శక్త్యాధికారాలకూ అది తార్కాణం. నూతనంగా స్వాతంత్ర్యం సాధించి దేశాల చరిత్రలో అరుదైన రాజకీయ స్థిరత్వాన్ని ఆయన మనకు అతి క్లిష్ట పరిస్థితులలో కూడా సాధించగలిగారంటే అందుకు ప్రజలకు ఆయనపైగల నైతిక బలమే కారణం. నెహ్రూ ఇక లేని ఈ పరిస్థితులలో, ఈ రాజకీయ స్థిరత ఏ విధంగానూ నశించకుండా చూడటం మన దేశపు ప్రథమ కర్తవ్యం."

''అయిదు ఖండాల మూలనుండే ఢిల్లీపై కురిసిన సంతాప, నివాళులు శ్రద్ధాంజలులన్నింటిలో సామాన్యంగా స్పష్టంగా గాని అస్పష్టంగా గాని ఆచరించే విషయం ఏమిటంటే — నెహ్రూ ప్రపంచ పౌరునిగా అంతర్జాతీయ అభివృద్ధి కార్యకలాపాలలో కొంత కాలం పాటు ఆయన నిర్వహించిన పాత్ర. ఇందులోని మరియొక విశేషం ఏమిటంటే ఈ నివాళులలో ఏ కొన్నికూడా నెహ్రూకు అతి సన్నిహితంగా మెలగుతూ ఆయనను అర్థంచేసుకొనే భాగ్యం లభించిన ఆయన దేశీయులవి కాకుండా, కొన్ని వేలమైళ్ళ దూరంలో వుండి ఆయన వ్యక్తిత్వానికి జోహారు అర్పిస్తూ వచ్చినవే కావడం. ఆయన అంతిమ యాత్ర అవధులు దాటిన దుఃఖోద్వేగ భరిత ఘట్టమే అయినప్పటికీ, ఒక మహోజ్వల సంఘటన, ఒక భక్త్యంజలి. అత్యంత సమర్థుడూ, కార్య నిర్వాహకుడూ అయిన ఆయన సామర్థ్యం ఆయనను నానా దేశవాసులకు ఖండ ఖండాంతరాలవారికి సన్నిహితుని చేసి అద్భుతమైన సానుభూతిని సాధించింది; అందువల్లనే విషాద సమయంలో భారతీయుల దుఃఖాన్ని విషాదాన్ని పంచుకొంటూ సుదూరాలనుండి మాటలకందని విషాద గీతికలు వినవస్తున్నవి. ఇవి మన జాతీయ విషాద దినానికి కొంత ప్రత్యేకతను చేకూర్చడమేకాక తద్వారా మనకు కొంత ఉపశమనమూ, ప్రేరణా కలుగజేయడానికి తప్పక సహకరిస్తాయి. ప్రపంచ శాంతికి అంకితమైన ఒక ఉత్తమ ప్రపంచ పౌరునిగా నెహ్రూ సంస్మరణం, విభిన్న దేశాలకు చెందిన ప్రభుత్వాలనూ, వ్యక్తులనూ ఏకోన్ముఖులనుగా చేసి, తాను నివసించి, కృషిచేసిన దేశ సరిహద్దులకు అతీతమైన విజ్ఞతను చూపిన ఆ మహావ్యక్తి అంతిమయాత్రకు, అందరూ సహకరించేటట్లు ప్రేరేపించింది.''

## హిందుస్థాన్ టైమ్స్

"భారతదేశ రంగస్థలంనుండి ఆస్థానాన్ని పూరింప శక్యంకాని ఒక మహా వ్యక్తి

నిష్క్రమించాడు. నెహ్రూకూ ప్రజలకూ మధ్య ఉన్న ఆత్మీయ బంధం అతని ప్రధాన మంత్రి హోదాను పురస్కరించు కొని ఏర్పడినది కానేకాదు. తన సర్వ స్వాన్ని దేశానికి సమర్పణ చేసి ఆఖరి శ్వాసవరకూ దేశసేవకే జీవితం అంకితం చేసి మానవోత్తముడుగా గుర్తింపబడిన ఆ మహావ్యక్తికీ ప్రజలకూ మధ్య ఆత్మీయతాబంధం వుండేది. ఆయనను ఎన్నడూ చూడనైనా చూడని కోట్లకొలది ప్రజలకు ఆయన మరణవార్త తాముతమ స్వకీయమైన దేదో కోల్పోయామనే భావనను కలుగ జేసింది. ఏ ప్రజలూ ఏ పాలకునికీ ఇంత నిండు హృదయంతో ప్రజాపాలనకు అంగీ కారం ఇచ్చివుండలేదేమో. నెహ్రూకు రాజ కీయ ప్రతిస్పర్థులు లేరని దీని అర్థం కాదు. ఆయన జీవితచరమాంకంలో ఆయన రాజనీతి విధానాలు, మరింతబహిరంగంగానూ, నిర్మాణ యుతంగానూ ప్రతిఘటింపబడ్డాయి. అయితే ఏ రాజకీయ ప్రత్యర్థికూడా, దేశ క్షేమం కోసం ఆయన ప్రగాఢంగా ఆలోచించి దూర దృష్టితో అనుసరించిన విధానాలనూ ఆయన లక్ష్యశుద్ధినీ ఇంతవరకూ ప్రశ్నించలేదు. అలాగే నెహ్రూ జీవించివుండగా దేశా నికి మరొకరు ప్రధానమంత్రి అయ్యే అవ కాశాన్ని గూర్చికూడా ఏ రాజకీయ ప్రత్యర్థీ తలొంచలేదు. ఒక ప్రజాస్వామ్య దేశపు పూర్వోత్తర సంబంధాలలో ఇదొక కుతూ హల జనకమైన సంబంధం. ఈ పూర్వో త్తర సంబంధాల నిశ్చలత ప్రజాపాలకుడుగా నెహ్రూ సాధించిన విజయం అనకతప్పదు"

## ట్రిబ్యూన్

"అప్పుడప్పుడే వెలికివస్తున్న దేశాల నాయకులు అనేకులు నియంతలుగా మారే దురాకర్షణకు లోనయ్యే అవకాశం ఎక్కువగా వుంటుంది. ఆయన ఒకానొకప్పుడు వ్రాసిన ఒక అనామక వ్యాసంలో ఆయన ఇలా ప్రశ్నించారు: "విప్లవాత్మకమైన ఈ శకంలో సీజరు తత్త్వం ఎప్పుడూ అతి సమీపంలో (తలుపు దగ్గరే) వుంటుంది. జవహర్‌లాల్ తానుకూడా సీజరులాగే భావించటం సంభవంకాదా? అక్కడే ఆయ నకూ, భారతదేశానికీ, ఘోర ప్రమాదం పొంచియున్నది."

## స్టేట్స్‌మన్

"ఇంకా ఏమి మిగిలింది? ఇంచుమించు భారతదేశంలోని ప్రజలందరకూ — విదేశా లలో కొందరకూ — స్వకీయమైన నష్టం వాటిల్లినట్లుగా భావన కలిగింది.

ఉత్సాహమూ, విశ్వాసమూ ఆయన సొత్తుగా నెహ్రూ దైవస్వరూపాన్ని కలిగి వుండేవారు. ఆశాపూరితమూ, అణగద్రొక్క బడినదీ అయిన జనావళి మరింకెందుకు ఆయన సహకారం కోసం ఆయనచుట్టూ మూగుతుంది? ఆయన ప్రధానమంత్రిగా వున్న పదహారు సంవత్సరాలూ ఇదే విశ్వాసం కొనసాగుతూ వచ్చింది. నిశ్చం ధంగా ఆయన సహాయాన్నపేక్షించేవారనే కులు నిరాశులైనారు. కాని ఎంతోమంది అలాకాలేదు. ఆయన దర్శనాపేక్ష ఏనాడూ క్షీణించలేదు. ఆయన వ్యక్తిత్వాకర్షణ అత్యంత బలీయమైనది. అయితే ఆ ఆకర్ష ణనుమించిన దేదో ఆయనలో వున్నమాట నిజం. ఆయన నిజంగా చాలా గొప్పనాయ కుడు."

## ఇండియన్ ఎక్స్‌ప్రెస్

"స్వాతంత్ర్యం సిద్ధించిన కొద్దినెలలలోనే మహాత్ముడు అస్తమించడంచేత దుష్కరమైన ఆ మొదటి దశాబ్దకాలంలోనూ తర్వాతా సుమారు ఏడుసంవత్సరాలు కూడా భారతదేశాన్ని నడిపించవలసిన బాధ్యత నెహ్రూ భుజస్కంధాలపై పడింది. ఈ దేశ స్వాతంత్ర్య సాధనా సమరంలో వారు నిర్వ హించిన పాత్రను — వారిరువురూ కలసి, వేర్వేరుగానూ వారుచేసిన సేవను చరిత్ర తప్పకుండా పోల్చి విలువకట్టడం జరుగు తుంది. జవహర్‌లాల్ విషయంలో ఇది ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరకాలంపై కేంద్రీకరింపబడుతుంది.

భారతదేశం వున్నపరిస్థితుల దృష్ట్యా చూస్తే నెహ్రూ తన మూల ఆదర్శాలలో కూడా సరియైన మార్గమే అనుసరించారనీ చరిత్ర తప్పక తీర్పుఇచ్చి తీరుతుంది ఆయన అనుసరించిన తటస్థ విధానంలోనూ, చైనాతో సుహృత్సంబంధాలు నెలకొల్పడం లోనూ, ప్రజాస్వామ్య పద్ధతులను మత నిరపేక్షతలేని వివాదాలను ఉత్తమ ఆదర్శాలుగా గైకొనడంలోనూ, భారతదేశం వంటి అప్పుడప్పుడే అభివృద్ధి చెందుతున్న దేశంయొక్క ప్రగతికి ఒక విధమైన ఆర్థిక ప్రణాళిక ముఖ్యావశ్యకమని నొక్కి వక్కా ణించడంలోనూ ఆయన సరియైన మార్గాన్నే అనుసరించారు.

జవహర్‌లాల్ మరణం భారతదేశంలో ఒక పెద్ద శూన్యతను సృష్టించింది. కాల ప్రవాహంలో ఏ ఒక్క సమర్థుడైన వ్యక్తి వలనకూడా ఆ ఖాళీ పూరింపబడదు. తన వంటి ఉత్తమదేశభక్తీ, అచంచల విశ్వా సమూ గల వ్యక్తిచేతప్ప ఆ ఖాళీ పూరింప బడడానికి ఆయన అంగీకరించేవారు కాదేమో. సుమారు 50 కోట్ల జనాభాగల భారతదేశంవంటి దేశం, తగినంతమంది నాయకులు తమ శక్తి సామర్థ్యాలను సంఘ

టిత పరచి ఆ దేశాభివృద్ధికి దోహదం చేస్తేనేతప్ప. స్పష్టంగా చెప్పాలంటే దాని మనుగడ క్లిష్టతరమే అనాలి. గాంధీజీ మరణించినప్పుడు నెహ్రూ అన్నమాట లివి : 'మనం ఇలా శోకిస్తూవుంటే ఆయన కోపిస్తాడు. మనం ఆయనకు శ్రద్ధాంజలి అర్పించవలసిన విధానం ఇది కాదు. ఆయన తలపెట్టి చాలావరకు సాధించిన బృహత్తర నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టి, దానికి మన జీవితాలను అంకితంచేస్తామనే వాగ్దానం చేయడం ద్వారా, ఆ దృఢ సంకల్పాన్ని వ్యక్తపరచడం ద్వారా మనం ఆయనకు మన భక్త్యంజలిని సమర్పించడమే అందుకు సరియైనమార్గం. అందుచేత మనం శ్రమించాలి, కష్టపడాలి, త్యాగంచేయాలి. ఏ కొన్ని విధానాలలోనైనా ఆయనచూపిన బాటలోనడుస్తూ ఆయన అనుచరుల మనిపించుకోవాలి.' జవహర్‌లాల్ నెహ్రూకూడా మననుండి దీనినే ఆశిస్తారని నమ్మవచ్చును."

"తన ప్రజలపై ఇంత అధికారమూ, బలమూ కలిగివున్న మరే ఇతర మానవుడైనా తప్పక క్రూరుడుగా మారివుండేవారు; కాని నెహ్రూ అలా కాలేదు.

ఒక నిజమైన ప్రజాస్వామ్య వాదిగా నెహ్రూ దేశానికి నాయకత్వం వహించి తన ప్రజలను అనుసరించారు. వారికి తగిన మార్గాన్నిసూచించి తను వారిని అనుసరించాడు. దేశ ఓవళికలను ప్రతిబింబించే ఆశ్చర్యజనకమైన చైతన్యంతో ఆయన దేశాన్ని సమీపించారు.

తల్లులు రోడ్డుప్రక్కన నిలబడి తమ పిల్లలకు చాచా నెహ్రూ చూపించే దృశ్యాలింకా కానరావు. ఆయన కేవలం దేశానికి ప్రధానమంత్రేకాదు, దేశ వాంఛలకూ ఉద్యమాలకూ ఆయన ప్రతిబింబం, భారతదేశపు సుందర రాకుమారు డాయన. తమ పూర్వీకులు తమకు రామునిగూర్చిన కథలు చెప్పినట్లుగా ఇక ముందు, అనేక తరాలవరకూ కూడా తల్లులు తమ పిల్లలకు జవహర్‌లాల్ కథను చెప్తారు."

## ఫ్రీ ప్రెస్ జర్నల్

నెహ్రూ స్వాతంత్ర్యసమరంలో ఆయన నిర్వహించిన పాత్రను గురించీ, స్వతంత్ర భారత దేశపు ప్రథమ ప్రధానమంత్రిగానూ, ప్రపంచలక్ష్యాన్ని తీర్చిదిద్దడానికి సహాయపడిన నాయకుడుగానూ ఆయనను గూర్చి భవిష్యత్ చరిత్రకారులు శ్లాఘిస్తూగాని, తద్వ్యతిరేకంగాగాని అనేకవిధాలుగా ఉద్ఘాటించవచ్చును. ఆ చరిత్రకారుల అభిప్రాయం మనకు ముందుగా తెలియదు. కాని ఈ దుర్భర, దుస్సహ సమయంలో ఈ దేశాన్ని తన ముందుగా నడిపించిన ఒకగొప్ప ప్రజానాయకుడు ఇక లేడనిమాత్రం మనకు తెలుసు. ఆయన జీవితంలోనూ మరణంలోనూ కూడా ఆయన ఆదర్శాల ఘనతనూ, విశాలదృష్టికీ అన్నిటినీమించి తన సాటి మానవులపట్ల ఆయన చూపిన ఉపకార పరతకూ మనం ఆయనకు శాశ్వతంగా ఋణపడి వున్నామని మనకు తెలిస్తేచాలు.

ఏ మనిషికూడా ఇంతకంటె ఎక్కువగా ఆశించలేడు. ఆయన మన మధ్యలోనుండి వెళ్ళిపోయినప్పటికీ, తాను ప్రేమించిన తన దేశవాసుల మనస్సులలోనూ హృదయాలలోనూ, మానవత్వపుటూహలన్నింటా ఆయన జీవించేవుంటారు. భారతదేశంలో ఆయనవెలిగించిన జ్యోతి ముందుతరాల వారికి గర్వకారణంగా ప్రకాశించగలదు. ఆ జ్యోతిని కొనసాగించడానికి అర్హులుగా వారు రూపొందవలసివుంది. నెహ్రూచూపించిన దేశభక్తీ, మానవతా మార్గాలపై ఆయన అడుగుజాడలను ధైర్యంగా, సహిష్ణతతో అనుసరించడమే భారతీయులు ఆయనకు నిర్మించగల గొప్పస్మృతిచిహ్నం కాగలదు. భారత దేశ సేవలో తన్ను తాను అంకితంచేసుకొన్న ఒక మానవునిగా తాను స్మరింపబడాలనే నెహ్రూ ప్రగాఢవాంఛ. ఏకొద్దిమందికో లభించే అత్యంత సఫలవంతమైన జీవితం ఆయనకు లభించిందని మనకు తెలుసు."

## పేట్రియట్

"భారతజాతి స్వచ్ఛంద నాయకుడుగా, స్వతంత్ర భారత దేశపు ప్రథమ ప్రధానిగా, నెహ్రూ, భారత విప్లవాన్ని చేపట్టి, మానవుడు తన విముక్తికీ – స్వతంత్రతకూ పోరాడే పోరాటాన్ని ధ్యేయంగా, ఆ విప్లవానికొక అర్థమూ ఆదర్శమూ కల్పించారు. బీటుపోని తన చారిత్రక పరిజ్ఞానంతో జాతీయోద్యమం సామ్యవాదా న్నంతర్గతంగా గైకొని సాగాలనే విజాన్ని గ్రహించిన తొలి భారతీయ నాయకు డాయన."

"మహాపురుషులతో పెనవేసుకున్న ప్రపంచయుగాలు వారి జీవితంతోనే అంతం కావు. క్రొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాల ఆర్థిక ప్రగతి కృషితోనూ, అలీన విధానంద్వారా అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపర్చే కృషితోనూ నెహ్రూ యుగం ప్రగాఢ సంబంధం ఏర్పర్చుకుంది. కొత్తగా స్వాతంత్ర్యం సంపాదించిన దేశాలకు అలీన విధానమే అనుసరణీయమని నిరూపిత మయిన తర్వాత కల్లోలిత ప్రపంచంలో స్వాతంత్ర్యం గౌరవ భావాలను యీ విధానం కల్పింపజేసింది. ప్రపంచ వ్యవహారాలలో శాంతి, అంతర్జాతీయ అవగాహనలను పెంపొందించడంలో ఆయన గణనీయమైన కృషి చేశారు. అనేక ప్రభుత్వాధినేతలు ఆయన విధానాలతో ఏకీభవించనప్పటికీ ప్రపంచవాణికి ఆయన ప్రతినిధి అయ్యారు."

"స్వాతంత్ర్యం, పురోభివృద్ధికిఅత్యంతావసరమైన ఐక్యత, క్రమ శిక్షణలను ప్రజలలో నెలకొల్పడానికి జవహర్‌లాల్ నెహ్రూ సర్వ శక్తులా కృషి చేసిన యీ రెండు అంశాలు దేశానికి మునుపెన్నడూ లేనంతగా యీనాడు అవసరం అయ్యాయి.

సామ్యవాద సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న అన్ని వర్గాలు తీవ్రంగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమయింది. ప్రజాస్వామ్యం, సామ్యవాదమే నెహ్రూ భారత దేశానికి ఇచ్చిన సందేశంలోని సారాంశం. నెహ్రూ జీవిత కాలంలోనే సామ్యవాద వర్గాలలో సమైక్యత అవసరమైనప్పుడు ఆయన మరణం తర్వాత అది మరింత అవసరమయింది."

## మేల్

"ప్రపంచ మహా నాయకులలో నెహ్రూ ప్రత్యేకత గలవాడు. మానవ సమస్యలపై ఆయనకు గల సానుభూతి, విశాల దృష్టి అనుపమానమైంది. రాజకీయ రంగంలో అలీన విధానానికి ఆయన గౌరవనీయమైన స్థానం ఇచ్చారు. నేడు ప్రపంచంలో ప్రచ్ఛన్న యుద్ధ చాయలు తగ్గడానికి, స్వాతంత్ర్య ఉద్యమాలు తీవ్రతరం కావడానికీ, అగ్ర రాజ్యాల రాజకీయ వ్యవహారాలు కట్టు తప్పక పోవడానికీ కారణం నెహ్రూ నాయకత్వాన ఏర్పడిన మూడవ 'శక్తి మాత్రమే. ఆయన ధీరత్వం, రాజకీయ జ్ఞత, సానుభూతి, మానవతా కారణంగా, తన దేశ ప్రజలలోనే గాక ప్రపంచ ప్రజలలోసైతం నెహ్రూ అభిమానం, 'అప్యాయత పొందగాలిగారు. లార్డ్ పెథిక్ లారెన్సు పేర్కొన్నట్టు మానవులు ఒకరి మధ్య ఒకరు ఏర్పర్చుకున్న అగాధాలకు ఆయన వారధి కట్టారు. అదేవిధంగా ప్రాక్పశ్చిమ దేశాల మధ్య సామరస్యం పొసగజేశారు."

## దక్కన్ క్రానికల్

"తెలిసినవారందరూ నెహ్రూను ప్రేమించారు, గౌరవించారు. ఆయన తన స్వశక్తి స్వబుద్ధితోనే ప్రధానమంత్రి వంటి ఉన్నతమైన బాధ్యతగల పదవికి వచ్చారు. ప్రతి దేశంలోనూ కళాకారులు, తత్వవేత్తలు జన్మించారు. క్రమశిక్షణగల రాజకీయవేత్త, పరిపాలనాదక్షులైన జవాహర్‌లాల్ వంటి వ్యక్తిని భారతదేశం ప్రసాదించింది సమస్యలను ఎక్కువ ప్రయత్నం లేకుండానే త్వరితగతిని అవగాహన చేసుకోవడానికే గాక జాతిని పటిష్ఠమైన పునాదులపై ఏర్పాటు చేయడానికికూడా ఆయనకుగల సహజసిద్ధమైన బుద్ధికుశలత తోడ్పడింది. ఆయనలోగల బుద్ధికుశలత, శక్తి, శాంతి కాంక్షలు హితులలోనూ, అహితులలోనూ గౌరవనీయమైన ఉన్నత పరిపాలనాదక్షులుగా ఆయన స్థానం ఏర్పరచుకున్నారు. దేశీయ వ్యవహారాలలోనే ఆయన పూర్తి కాలాన్ని వినియోగించారు".

## డైలీన్యూస్

"నెహ్రూ నిర్యాణంతో, గత కొన్ని దశాబ్దాలుగా జాతి ఆశయాలు, జాతి లక్ష్యాలు జాతి ఘన విజయాలతో పెనవేసుకున్న నాయకుణ్ణి భారతదేశం కోల్పోయింది. భారతదేశ మతాతీత విధానాలకు ఆయన నిదర్శనం; భారత దేశ సమైక్యతకూ, భారత దేశం ఒక జాతిగా ఎన్నుకున్న ఉత్తమ ఉన్నత ఆదర్శాలకూ ఆయన నిదర్శనం."

## ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్

"ఈ విశాల ఉపఖండంయొక్క రాజకీయ ఆర్థిక పురోభివృద్ధిపై ఆయన విధానాల ప్రభావం ఏవిధంగా ఉన్నప్పటికీ, అనేక ఖండాల పీడిత ప్రజలు ఆయన మార్గదర్శకత్వానికీ, ప్రోత్సాహానికీ ఎదిరి చూచునట్లు చేసిన ఆయన మానవతావాదిగా స్థానం చెదిరిపోనిది. గాంధీవలెనే ఢిల్లీ నుంచి బయలుదేరిన నెహ్రూ నిర్యాణం వార్తకూడా మానవులందరి హృదయాలను, మనసులను ఆవరించింది."

## ఎకనామిక్ టైమ్స్

"ఒకప్పుడు ఎవరో నుడివినట్లు పోప్ తర్వాత నెహ్రూయే ప్రపంచంలో ఎక్కువ మంది ప్రశంసలు అందుకున్న మానవుడు. విభిన్న వర్గాల ప్రజాసమూహాల హృదయాలను ఇంతకాలం ఆకట్టుకున్న నెహ్రూ వంటి వ్యక్తులు చరిత్రలో చాలా కొద్దిమంది మాత్రమే ఉన్నారు. ఆయన వాక్సుధాగరిమ, ఆయన బాల్యజీవిత కథలు, కుటుంబచరిత్ర, నిస్సందేహంగా ఆయన చేసిన త్యాగాలు పడినబాధలు దేశానికాయన చేసినట్టు ఏవ్యక్తీ చేయనిఆయన నిస్వార్థసేవఇవన్నీ ఆయనకు జాతిపై ఒక విధమైన అధికారాన్ని ఇచ్చాయి. ఆయన కాలంలో ఆయన గురువు, మార్గదర్శి అయిన గాంధీ మినహా ఆయనకు యీ విషయంలో ప్రత్యర్థులు ఎవ్వరూ లేరు.

నెహ్రూ వ్యక్తిగత ఆశయాలనూ, తత్వాన్నీ ఎవరైనా ఏవిధంగాగాని సమీక్షించగలుగుతారు. ఎటువంటి సిద్ధాంతరాద్ధాంతాలు లేకుండా, జాతి, కుల, వర్గ దృక్పథాలు లేని స్వేచ్ఛాపూరిత మానవతావాది ఆయన. పశ్చిమ దేశాల భౌతిక వాదం తూర్పు దేశాల ఆధ్యాత్మిక వాదాల మధ్య గల అగాధాన్ని గూర్చి ఆయన ఎప్పుడూ అతిశయోక్తిగా మాట్లాడలేదు."

7 వ ప్రకరణం

# మరపురాని మధురసంఘటనలు

(సెహగాల్ నామం ఆయన జీవించినా, మరణించినా జనుల జిహ్వాగ్రంపై నాట్య మాడింది.
ఆయన జీవిత ముఖ్యసంఘటనలు — మరణకాల ప్రత్యక్షకథనం...)

# శ్రీ నెహ్రూ జీవితంలోని
# మరపురాని సంఘటనలు

శ్రీ నెహ్రూ బాల్యంనుండీ గణనీయమైన జీవితం గడిపారు. దేశపు ముద్దుల రాకుమారుడుగా ఆయన తరచు పిలువబడేవారు. ఆయన భోగభాగ్యాలమధ్య పెరిగారు. పెరిగి పెద్దయ్యాక రాజకీయాలలో ప్రవేశించారు. అదురు బెదురులేని స్వాతంత్ర్య యోధుడుగా, ధీరోదాత్తుడుగా నిలిచారు. ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. అయినా, ఆయన కుటుంబపు ఘనతలను, ప్రత్యేకతను చాటే కథలు, గాథలు అనేకం ప్రచారంలోకి వచ్చాయి. వాటిలో కొన్నింటిని శ్రీ నెహ్రూ తరువాత తమ వ్రాతలలో బహిరంగంగా ఖండించారు. కాని వాటిని కాదంటూనే శ్రీ నెహ్రూ తమ బాల్యం, తరువాతి జీవితానికి సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన అద్భుత సంఘటనలను స్వయంగా వెల్లడించారు. ఇవిమనస్సును కదిలించివేస్తాయి.

## బలమైన దెబ్బలు

శ్రీ నెహ్రూ అయిదారు సంవత్సరాల ప్రాయంలో వున్నప్పుడు ఒకనాడు తమ తండ్రి ఆఫీసుగదిలో బల్లపై రెండు ఫౌంటెన్ కలాలు వుండటం చూశారు. "ఆశాపూరితమైన దృష్టి"తో ఆయన వాటిని పరికించారట. ఈ సంఘటనను ఉదహరిస్తూ ఆయన ఇలా వ్రాశారు: "నాన్నగారు రెండు కలాలనూ ఒకేసారి ఉపయోగించవలసిన అవసరముండదని నేను అనుకున్నాను. అందుచేత వాటిలో ఒక కలాన్ని ఎవర్నీ అడగకుండానే తీసుకున్నాను. తరువాత కనిపించకుండా పోయినకలంకోసం తీవ్రంగా అన్వేషణ ప్రారంభమైంది. అప్పుడు నేను చేసిన పనికి చాలా భయం వేసింది. అయినా కలాన్ని నేనే తీసుకున్నట్లు చెప్పలేదు. కాని తరువాత కలం నావద్ద దొరకడం, నా తప్పిదాన్ని అంతా తెలుసుకోవడం జరిగింది. నేను చేసినపనికి నాయనగారికి బాగా కోపం వచ్చింది. నన్ను చాలా బలంగా దెబ్బలు కొట్టారు. ఒకవంక దెబ్బలబాధతోనూ, మరోవంక అవమానపు భారంతోనూ నేను అమ్మగారివద్దకు పరుగెత్తాను. తరువాత చాలా రోజులవరకు దెబ్బలు తగిలిన నా శరీరానికి ఏవేవోమందులు పూయడం, ఉపచారాలు చేయడం జరిగింది."

## సాహసకృత్యం

ఏడెనిమిది సంవత్సరాల ప్రాయంలో వుండగా జవహర్లాల్‌నెహ్రూ ప్రతిరోజూ గుఱ్ఱపుస్వారీకి వెళ్ళేవారు. ఆయనవెంట ఎప్పుడూ ఒక పరిచారకుడు వుండేవాడు, "ఒకనాడు సాయంత్రం నేను గుఱ్ఱం నుంచి జారి క్రిందపడ్డాను. గుఱ్ఱం ఒక్కటే ఇంటికి తిరిగివెళ్ళింది. అప్పుడు ఇంట్లోనాయనగారు టెన్నిస్‌పార్టీ ఇస్తున్నారు. ఖాళీగుఱ్ఱాన్ని చూసి వారంతా ఎంతో ఆందోళన చెందారు. మా నాయనగారూ, పార్టీకి వచ్చినవారూ శకటాలలో హుటాహుటీన నన్ను వెతుకుతూ బయలుదేరారు, నేను వారికి దారిలో కనిపించాను. ఏదో వీరకార్యం సాధించిన యోధునిమాదిరిగా నన్ను వారు చూడసాగారు" అని శ్రీ నెహ్రూ వ్రాశారు.

## ఈతకొలను ఆహ్లాదాలు

ఆనంద భవన్ లో ఒక పెద్ద ఈతకొలను వుండేది. శ్రీ నెహ్రూ దానిలో ఈత నేర్చుకునేవారు. సాయంత్రంపూట ఆయన తండ్రిగారి మిత్రులు చాలామంది కొలనుకు వచ్చేవారు "ఈ విధంగా స్నానానికి వచ్చేవారితో ఆహ్లాదంగా గడిచేది. ఈత రాని వారిని లోనికి నెట్టి వారు భయపడటం చూసి అంతా నవ్వేవారు అప్పుడు అలహాబాదులో జూనియర్ అడ్వొకేటుగా వున్న డాక్టర్ తేజ్ బహదూర్ సప్రూ సంగతి నాకు బాగా జ్ఞప్తికివుంది. ఆయనకు ఈతరాదు. నేర్చుకోవాలన్న అభిలాషకూడా ఆయనకులేదు. ఆయన మొదటి మెట్టుమీద 15 అంగుళాల నీటిలోతులో మాత్రమే కూర్చునేవారు. అంతకంటె ముందుకు పోవడానికి ఆయన ధైర్యం చాలక నిరాకరించేవారు. కనీసం రెండవ మెట్టుమీదకి వెళ్ళడానికి కూడా ఒప్పుకునేవారుకాదు. ఎవరైనా లోపలికి లాగడానికి ప్రయత్నిస్తే గట్టిగా కేక వేసేవారు. మా నాయనగారు కూడా పెద్ద ఈతగాడు కారు. కాని ఎలాగో కష్టంమీద ఒక ఒడ్డునుంచి మరో ఒడ్డుకు ఈదగలిగేవారు."

## వింత అనుభూతి

14వ ఏట తన అనుభవాలను గురించి చెబుతూ పండిట్‌జీ ఇలా అన్నారు: "నాలో క్రొంగ్రొత్తభావాలు, అస్పష్టమైన ఆలోచనలు మెదలసాగాయి. ఆడవారిపట్ల మరింత ఆసక్తి కనబరచ నారంభించాను. బాలురతో కనిసి తిరగడమంటేనే నాకు ఇంకా ఇష్టంగా

వుండేది. బాలికలతో కలిసివుండటమంటే నా ఘనతకు ఏదో లోటుగా భావించేవాణ్ణి. కాని బాలికలు హాజరైన కాశ్మీరీ పార్టీలలో వారిని చూసినప్పుడుఅదోవిధమైన అనుభూతి కలిగేది."

## హారో జీవితం

శ్రీ నెహ్రూ తమ 17 వ ఏట హారో నుంచి బయలుదేరారు. అక్కడినుంచి వెళ్ళి రావడానికి ఆయన నిశ్చయించుకున్నారు. కాని తీరా బయలుదేరే సమయానికి దుఃఖం పొర్లివచ్చింది. కండ్లలో నీళ్ళు తిరిగాయి. ఆ ప్రదేశమంటే ఆయనకు ఎంతో మక్కువ. అక్కడ నుంచి ఆయన బయలుదేరిరావడం మంచికి దారి తీసింది. ఇది ఆయన జీవితంలో ఒక దశను ముగింపజేసింది. "అయినా హారోను విడిచి రావడానికి నేను నిజంగా ఎంతవరకు విచారించా ననేది నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇది పాక్షికంగా హారో సంప్రదాయాలు, ఆచారాల దృష్ట్యా నేను సంతోషపడకుండానే వుండవలసిందనే భావం కలిగించదా? ఆ ప్రదేశస్థులతో కలిసి పోగలిగేందులకై అక్కడి ఆచార వ్యవహారాలను నేనుఉద్దేశ పూర్వకంగా ప్రతిఘటించలేదు."

## వక్తృత్వ సమావేశాలు

కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చదివే భారతీయ విద్యార్థులకు 'మజ్లిస్' అనే సంస్థ వుండేది. అక్కడ తాము తరుచుగా రాజకీయ సమస్యలను చర్చించుకునేవారమని శ్రీ నెహ్రూ వ్రాశారు. ఈ చర్చలలో విషయానికి కాక పార్లమెంటు, విశ్వ విద్యాలయ సంఘం పద్ధతులను అనుకరించడంలో ఎక్కువ శ్రద్ధ తీసుకునేవారు. "నేను 'మజ్లిస్'కు తరచుగా వెళ్తుండేవాడిని. కాని నేను అక్కడ వున్న మూడు సంవత్సరాలలోనూ మాట్లాడింది చాలా తక్కువ. నాకు సభాపిరికి, బిడియం పోలేదు. కళాశాల వక్తృత్వ సమావేశాల్లోకూడా నాకు ఇవి అడ్డువచ్చేవి. సంవత్సరం ముగిసేవరకూ వక్తృత్వ సమావేశాల్లో పాల్గొననిసభ్యులు జరిమానా చెల్లించాలనే నియమం ఒకటి వుండేది. నేను తరచుగా జరిమానా చెల్లించేవాడిని."

## ఉత్తరకుమార ప్రజ్ఞలు

"మజ్లిస్‌లోనూ, ఇతరసంభాషణలలోను కూడా భారతదేశపు రాజకీయాలను గురించి చర్చించే టప్పుడు భారతీయ విద్యార్థులు తరచు ఆత్యావేశపూరితంగా మాట్లాడుతూ వుండేవారు. బెంగాలులో అప్పుడప్పుడే తల ఎత్తుతున్న హింసాత్మక చర్యలను ప్రశంసించేవారు కూడా. ఆ తరువాత ఆ వ్యక్తులే ఇండియన్ సివిల్ సర్వీసు సభ్యులుగానూ, హైకోర్టు జడ్జీలుగానూ, విధేయులైన లాయర్లుగానూ అదే కోవకు చెందిన వ్యక్తులుగా ఉన్నత పదవుల నధిష్ఠించడం నాకు తెలుసు. ఈ ప్రగల్భ శూరులలో ఏ కొద్ది మందో మాత్రమే ఆ తరువాత భారత రాజకీయోద్యమాలలో గణనీయమైనపాత్ర నిర్వహించివుంటారు."

## ఐ.సి. యస్. కోసం

నెహ్రూ కేంబ్రిడ్జిలో వున్నప్పుడు, ఒకసారి, అతను ఏ జీవితాన్ని ఎన్నుకోవాలా అన్నప్రశ్న వచ్చింది. కొంత సేపటికి ఇండియన్ సివిల్ సర్వీసును సూచించారు. కాని దానికి నెహ్రూకు వయస్సు చాలలేదు. ఒక వేళ అందులోనెగ్గితే దూర ప్రాంతాలలో ఉద్యోగం చేయవలసివస్తుందనే అభిప్రాయంతో కుటుంబంలోనివా రెవరు కూడా ఈ సూచనను ఆమోదించలేదు. ఆప్రయత్నం విరమించబడింది. ఈ సంఘటనను ఆయన ఇలా వ్యాఖ్యానించారు. "రాజకీయాలపట్ల నాలో అభినివేశం, వృద్ధిచెందుతూవున్నప్పటికీ ఐ. సి. యస్. లో చేరి బ్రిటిష్ ప్రభుత్వపు పాలనా యంత్రాంగంలో ఒక మరనవుదామనే ఆ ఆలోచనను నే నా రోజు అంత విద్వేషభావంతో చూడలేదు. అదే ఆలోచన తరువాతికాలంలో అయితే నాకు ఏహ్యంగా తోచేది."

## తప్పిన ప్రమాదం

1910 వ సంవత్సరంలో నెహ్రూ నార్వేలో నౌకావిహారానికి వెళ్ళినప్పుడు ఒక ప్రమాదంనుండి సూక్ష్మంగా తప్పించుకొన్నారు. ఆయనా, ఆయన ఆంగ్లేయ మిత్రుడూ ఒక చిన్న హోటలులో బసచేసి సమీపంలోని హిమనదినుండి ఉరకలు పెడుతూ వస్తున్న ఒక సెలయేరులో స్నానార్థం వెళ్ళారు. నెహ్రూ నీళ్ళలోనికి దిగారు; అంత లోతుగాలేదు కాని నీళ్ళు గడ్డకట్టుకునేటంత చల్లగా వున్నాయి. అడుగుమాత్రం విపరీతంగా జారుడుగా వున్నది. నెహ్రూ జారినీటిలోపడిపోయారు. హిమజలం అతని స్పర్శజ్ఞానాన్ని హరించి వేయడంతో అవయవాలను అదుపులో పెట్టుకునే శక్తికూడా లేకపోయింది. కాలు నిలువ ద్రొక్కుకొనలేక ఆ ప్రవాహవేగంలో తీవ్రంగా కొట్టుకొని పోసాగారు. అతని ఆంగ్లేయ సహచరుడు ఎలానైతేనేం లేచి ఆ ప్రవాహపు గట్టునే పరుగెడుతూ చివరకు నెహ్రూకాలు అందిపుచ్చుకొని అతనిని వెలుపలికి లాగడంలో కృతకృత్యుడయ్యాడు. ఆ తరువాత వారు అసలుప్రమాదాన్ని గుర్తించారు. అదేమిటంటే, వారికి ముందు రెండు మూడు వందల గజాల దూరంలోనే ఆ ప్రవాహం ఒక బ్రహ్మాండమైన కొండ పార్శ్వంమీదినుండి దొర్లి,

ఆ ప్రాంతపు రమణీయ దృశ్యాలలో ఒక పైన జలపాతంగా రూపు దిద్దుకొన్నది.

## వెన్నాడిన జింక

బుద్ధుడు యువరాజుగానున్న రోజులలో అతని దాయాది దేవదత్తుడు కొట్టినపావురం బాణాహతమై తన పాదాలవద్ద పడినప్పుడు ఆయన ఎంతో హృదయ క్లేశముచెందినట్లు చెప్తారు. నెహ్రూ జీవితంలో కూడ అలాంటి సంఘటనే ఒకటి జరిగింది. అరణ్య ప్రాంతాలు ఆయనకు ఆహ్లాదం చేకూరుస్తూవుండిన కారణంగా సంహారంలో అభిలాష లేకపోయినప్పటికీ ఆయన తరచు వేటకువెళ్తూవుండేవారు. కాశ్మీరులో ఒకసారి ఇంచు మించు కాకతాళీయంగా ఒక జింకను కొట్టిచంపారు. జింకను చంపిన ఈ సంఘటన వేటలో ఆయనకున్న కొద్ది ఉత్సాహాన్ని హరించి వేసింది. "గాయపడి మరణించి నా పాదాల వద్ద పడివున్న యీ అమాయక ప్రాణి, ఎవరికీ అపకారం చేయని యీ చిన్నిజంతువు కన్నీళ్ళతో నిండిన తన సుందర విశాల నేత్రాలను పైకెత్తి నన్ను పరికించింది. అప్పటినుండీ ఆ చూపులు నన్ను తరచు వెంటాడుతూనే వుంటాయి."

## సప్రూ సంభ్రమం

నెహ్రూ తన తొలి దినాలలో బహిరంగోపన్యాసాలు ఇవ్వడానికి అధైర్యపడి జంకుతూ వుండేవారు. అలహాబాదులో 1915 లో ఒకసారి, ప్రెస్ స్వాతంత్ర్యాన్ని నిర్బంధించే ఒక నూతన చట్టాన్ని ఆక్షేపిస్తూ జరిగిన సమావేశంలో ఆంగ్లంలో క్లుప్తంగా ప్రసంగించారు. సమావేశం ముగియగానే డా. తేజ్‌బహాదుర్ సప్రూ సంభ్రమంగా వచ్చి నెహ్రూను బహిరంగంగా వేదికపైననే కౌగలించుకొని ముద్దుపెట్టుకుని ఆయనను ఆశ్చర్యాంబుధిలో ముంచివేశారు. "ఆ సంభ్రమం నేను ఉపన్యసించిన విషయాన్ని, తీరునూ దృష్టిలోపెట్టుకుని కాదు. నేను బహిరంగంగా ఉపన్యసించినందుకూ, ప్రజాసేవకు ఒక నూతన కార్యకర్త లభ్యమైనాడన్న ఆనందమూ ఆయన అవధులు మించిన ఉత్సాహానికి కారణాలు. ఆ రోజులలో ప్రజాసేవ అనేది ఉపన్యాసాలద్వారానే వ్యక్తపరుపబడుతూ వుండేది."

## మంచుపగులులో

1915 లో తన వివాహం జరిగిన క్రొత్తలో అన్నమాట. అమరనాద్ గుహలను సందర్శించాలని నెహ్రూ ఒక బంధువుతోకలిసి లధక్ రోడ్డుపైకి వెళ్ళారు. సుమారు 11,500 అడుగుల ఎత్తున వున్న తమ మకామునుండి ఒక చిన్న బృందంగా పర్వతంమీదికి బయలుదేరారు. స్థానిక గొర్రెలకాపరి ఒకతను వీరివెంట గైడ్‌గా వచ్చాడు. సుమారు 16000 అడుగుల ఎత్తుకు ఎక్కిన తరువాత అరమైలు వెడల్పున్న ఒక హిమక్షేత్రాన్ని దాటవలసి వచ్చింది. "అక్కడ అనేకమైన మంచు పగుళ్ళు వుండడం వల్లనూ, ప్రమాద భరితమైన అనేకస్థలాలు స్వచ్ఛమైన మంచుతో కప్పివేయబడి వుండడంవల్లనూ, దానిని దాటడం కొంత దుష్కరం అనిపించింది. ఆ స్నిగ్ధమైన మంచుపై అలా కాలుపెట్టానో లేదో నాకు తెలియకుండానే అలా జారి భీకరంగా నోరుతెరుచుకొని వున్న ఒక పెద్ద మంచుపగులులోనికి వెళ్ళిపడ్డాను. ఆ బ్రహ్మాండమైన చీలికలో పడిన వస్తువేదైనాసరే సురక్షితంగా కొన్ని భౌగోళిక యుగాల వరకూ భద్ర పరుపబడి వుంటుందన్న సంగతి నిస్సంశయం. అయితే నా సహచరులు ఒక తాడును వేళ్ళాడవేశారు. ఆ మంచు పగులు గోడలకు హత్తుకొన్న నేను దానిని భద్రంగా పట్టుకొని బయటికి లాగబడ్డాను. ఈ సంఘటన మమ్మలను విచలితులను చేసినప్పటికీ ముందుకు సాగాలనే మేము వాంఛించాము. అయితే పోను పోను అగాధమైన మంచు పగుళ్ళు అత్యధిక సంఖ్యలో కానరావడం, మా వద్దవాటిని దాటేందుకు తగిన సాధన, సామగ్రి లేకపోవడం కారణాలుగా మేము ఎంతో నిరాశానిస్పృహలతో వెనుదిరగవలసివచ్చింది. అమరనాథ్ గుహాసందర్శన ప్రయత్నం నెరవేరకుండానే వుండిపోయింది."

బ్రిటిష్ పాలన దేనినైతే అరికట్టాలనుకొన్నదో దానికే దారితీసింది:

1919 లో జరిగిన ఆఫ్ఘన్ సంక్షిప్త యుద్ధానంతరం ముస్సోరియాలో ఆఫ్ఘనులకూ బ్రిటిష్ ప్రతినిధులకూ సంధి సంప్రతింపులు జరుగుతున్నాయి. ఆదేసమయంలో నెహ్రూ అస్వస్థులుగా వున్న తన తల్లినీ, భార్యనూ తీసుకొని అక్కడకు వెళ్ళడం జరిగింది. ఆఫ్ఘన్ ప్రతినిధివర్గం తమ కార్యకలాపాలను తామే నిర్వర్తించుకొన్నారు. ఒక నెల వరకూ నెహ్రూ ఆ ప్రతినిధివర్గం సభ్యులనెవరినీ చూడటంకూడా సంభవించలేదు. ఆకస్మికంగా ఒకనాటి సాయంత్రం పోలీసు సూపరింటెండెంటు నెహ్రూను కలుసుకొని, నెహ్రూ తాను ఆఫ్ఘన్ ప్రతినిధి వర్గంతో ఏ విధమైన సంప్రతింపులు, సంబంధాలు పెట్టుకొనననే హామీ పత్రాన్ని వ్రాసియివ్వాలన్న ప్రభుత్వ ఉత్తరువును చూపించాడు. ఏ విధమైన హామీ పత్రాన్నీ ఇవ్వడానికి నెహ్రూ తిరస్కరించారు. ఫలితంగా ఆయన డెహ్రాడూన్ జిల్లానుండి బహిష్కరించబడడం జరిగింది. ఈ విషయంపై మోతీలాల్ నెహ్రూ, ఉత్తరప్రదేశ్ గవర్నర్ల మధ్య అనేక సంప్రతింపులుకూడా జరిగాయి. చివరకు నెహ్రూ మాతృదేవి ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో మోతీలాల్ జవహర్‌లాల్ నెహ్రూలు ముస్సోరీకి బయలుదేరారు. సరిగ్గా బయలుదేరేముందు జవహర్‌లాల్ బహిష్కరణను తొలగిస్తూ జారీచేసిన ఒక టెలిగ్రాం వారికి అందింది.

ఈ సంఘటనను వివరిస్తూ పండిట్జీ ఇలా అన్నారు: "ఆ మరునాడు ఉదయం మేము ముస్సోరీచేరగానే హోటలు ప్రాంగణంలో నాకు కనిపించిన మొదటి వ్యక్తి ఒక ఆఫ్ఘన్ దేశీయుడు. అతడు నా కుమార్తెను ఎత్తుకొని వున్నాడు. అతడు ఒక మంత్రి అనీ, ఆఫ్ఘన్ ప్రతినిధి వర్గంలో

సభ్యుడనీ నాకు తెలిసింది. నా బహిష్కరణ జరిగిన వెంటనే ఆఫ్ఘనులు ఆ విషయం వార్తా పత్రికలలో చదివి నాపట్ల ఆసక్తులైనారనీ, ఆ ప్రతినిధివర్గనాయకుడు రోజూ మా తల్లికి ఒక బుట్టతో ఫలపుష్పాలు పంపుతూ వచ్చాడనీ మాకు తెలియవచ్చింది. ఆ తరువాత నేనూ, మా తండ్రిగారూ ఆ ప్రతినిధి వర్గంలోని ఒకరిద్దరు సభ్యులను కలుసుకొన్నాం. వారు మమ్మల్ని ఎంతో ఆదరంతో ఆఫ్ఘనిస్తాను సందర్శనకై ఆహ్వానించారు. దురదృష్టవశాత్తూ మేము ఆ ఆహ్వానాన్ని విని యోగించుకోలేకపోయాము."

దిగబడిపోయిన డిప్యూటీ కలెక్టర్

హోంరూలు సత్యాగ్రహ సమయంలో పండిట్‌జీ తరచుగా ఉత్తర ప్రదేశ్‌లోని గ్రామాలలో పర్యటిస్తూ వుండేవారు. "ఆ రైతులతో కలిసి భోజనంచేస్తూ, వాళ్ళ మట్టిగుడిసెలల్లో వారితోపాటు వుంటూ, గంటల తరబడి వాళ్ళతో మాట్లాడుతూ, చిన్నదిపెద్దది అన్న తేడాలేకుండా తరచుగా బహిరంగసభలలో ఉపన్యసిస్తూవుండేవాళ్లం. మేము ... ఎక్కడికి వెళ్ళినా పోలీసువారు, సి.ఐ.డి లు, లక్నోనుంచివచ్చినడిప్యూటీకలెక్టరు మమ్మల్ని అనుసరిస్తుండేవారు. నిరంతరంగా యిలా పొలాలకు అడ్డంపడి ఒక చోటనుండి మరొకచోటికి కదలివెళ్తూవుండేసరికి మేమన్నా, రైతులన్నా వారికి విపరీతంగా విసుగువచ్చేసింది. లక్నోనుంచి వచ్చిన డిప్యూటీకలెక్టరు మరీ అర్భకుడైన యువకుడు. మా ఉత్సాహాన్ని తగ్గించుకోవలసిందిగా ఆయన ఒక్కొక్కప్పుడు మమ్మల్ని వేడుకొనేవాడు చివరకు ఆయన మాతో వుండలేక దిగబడిపోయాడు.

ఆసక్తి కలిగించిన పెళ్ళి ఆలోచన:

1962 సం॥ లో రాజకీయ పోరాటం ఉధృతంగావున్న రోజులల్లో నెహ్రూ జ్యేష్ఠ సోదరి వివాహం మే 10వ తేదీన జరపాలని నిశ్చయమైంది. ఆ వివాహానికి గాంధీగారినీ, యితర పెద్ద పెద్ద నాయకులను పిలవడం జరిగింది. కాంగ్రెసు కార్య వర్గ సమావేశం కూడా అక్కడ ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. "ఈ రాజకీయ సమావేశాలవల్ల అలహాబాదులో ఎంతో అలజడి, ఆందోళన వ్యాపించింది. కొంత మంది మీద యిది బాగా పనిచేసింది. కొంత మంది ఇంగ్లీషువారు బాగా ఆందోళన చెందుతున్నారనీ, ఊళ్ళో అకస్మాత్తుగా ఏ ఉపద్రవమో వచ్చిపడబోతున్నదని భావిస్తున్నారనీ ఒక బారిష్టరు మిత్రుడు నాకు చెప్పాడు. ఇంగ్లీషువాళ్ళు తమదగ్గర పని చేసే భారతీయ సేవకుల్ని అనుమానించి జేబుల్లోరివాల్వర్లు వుంచుకొనేవారు. అవసరమైతే అలహాబాదు కోటలో వారికి తల దాచుకోవడానికి అంతా సిద్ధం చేసివుంచారని కూడా తర్వాత తెలిసింది. నేను ఆశ్చర్యపోయాను. అహింసా సిద్ధాంతాన్ని బోధించే ఒక శాంతిదూత ఊరిలోకి వస్తున్నంత మాత్రంచేత అలహాబాదులాంటి శాంతి నగరంలో ఏదో విపత్తు జరగబోతున్నదని ఎందుకనుకుంటున్నారో నా కర్థం కాలేదు. అసలు విషయం ఆ తర్వాత తెలిసింది. మే 10వ తేదీ (సరిగా మా సోదరి పెళ్ళి నిశ్చయమైనరోజు) 1857 సం॥ మీరూట్‌లో జరిగిన సిపాయీల తిరుగుబాటు వార్షిక దినం! ఆ వార్షికోత్సవాన్ని అక్కడ చెయ్యబోతున్నారు. అదీ అసలు విషయం!"

అయిదున్నరసంవత్సరాలు ప్రయాణం చేసిన ఉత్తరం:

1931 ఫిబ్రవరిలో మోతీలాల్‌నెహ్రూ మరణించిన తరువాత మూడునెలల అనంతరం జవహర్లాల్ నెహ్రూ సింహళంలో కొద్దిరోజులు గడిపి తిరిగి అలహాబాదు వచ్చేసరికి ఆయనకు ఒకఉత్తరం వచ్చింది. ఆ కవరుమీద వాళ్ళ నాన్నగారు వ్రాసినట్టు ఆయన చేవ్రాలుతో నెహ్రూ అడ్రసువ్రాసి వుంది. దానిమీద వివిధ పోస్టాఫీసుల తాలూకూ ఎన్నోముద్రలు, గుర్తులు వున్నాయి. ఆశ్చర్యంతో ఆయన దానిని విప్పారు. నిజంగా అది ఆయన తండ్రిగారు ఆయనకు వ్రాసిన ఉత్తరమే. వ్రాసినతేదీ 1926 ఫిబ్రవరి 28 అని వుంది. ఆఉత్తరం నెహ్రూకు 1931 వేసవిలో అందింది. ఆఉత్తరం ఆయనకు అందడానికి సుమారు అయిదున్నర సంవత్సరాలు పట్టింది. 1926 సం॥లో నెహ్రూ తన భార్య కమలతో సహా యూరపు దేశాలకు వెళ్ళబోతున్న సందర్భంలో ఆయన తండ్రి అహమదాబాదు నుండి వ్రాశారు. నెహ్రూ, ఆయన సతీమణి కలిసి ప్రయాణం చేసిన బొంబాయిలోని ఇటాలియన్ లాయడ్ స్టీమరు అడ్రసుకు నెహ్రూ పేరున వ్రాసిన ఉత్తరం అది. అసలు ఆవుత్తరం వాళ్ళకు అక్కడ అందలేదు. ఆ తర్వాత అది అనేకప్రాంతాలకు సంచారం చేసింది. బహుశా ఎన్నోపావురపుగూళ్ళల్లో వుండివుండి, చివరకు ఏ వర్తకుడో దాన్ని చూసి ఆయనకు పంపించి వుండాలి. ఏమయినా అది పీడోక్కలు వుత్తరం.

1931 సం. లో కరాచీ కాంగ్రెసు సమావేశం తరువాత ఆరోగ్య కారణాలవల్ల దక్షిణాదికి నెహ్రూతన అర్థాంగిని, కుమార్తెను వెంటబెట్టుకుని వచ్చారు, అప్పట్లో ఆయన తన హైదరాబాదు సందర్శనాన్ని గురించి వివరిస్తూ—"మేముహైదరాబాదుకు, ముఖ్యంగా శ్రీమతి సరోజినీనాయుడు, ఆమె కుమార్తెలు పద్మజ, లీలామణి గారలను చూద్దామని, వెళ్ళాం. అక్కడ మేము వుంటున్న సమయంలోనే కొంతమంది ఘోషాస్త్రీలు మా ఆవిడ కమలను కలుసుకుందామని, ఆమెచేత ఓ చిన్న ప్రసంగం చేయిద్దామని వచ్చారు. బహుశా ఆమె అప్పుడుపురుషులు రూపొందించిన చట్టాలూ, ఆచారాలకు వ్యతిరేకంగా స్త్రీ స్వేచ్ఛా పోరాటంగురించి మాట్లాడివుండాలి. (అది ఆమెకు చాలా యిష్టమైన విషయం) మగవారి ఎడల స్త్రీలను మరీ అణకువగా వుండవద్దనికూడా సలహా యిచ్చింది. దాని ఫలితం రెండుమూడువారాల తర్వాత కనిపించింది. హైదరాబాదునుంచి విసుగెత్తిన ఓ భర్త కమలకు ఒక ఉత్తరం వ్రాశాడు. కమల హైదరాబాదుకు వచ్చివెళ్ళినప్పటినుంచి అతనిభార్య చాలా వింతగా ప్రవర్తిస్తున్నదట. అతనిమాటే వినడంలేదట చెప్పినట్టు నడవడంలేదట. మాటమాటికీ అతనితో వాదిస్తూ కూర్చుంటున్నది. ఒక్కొక్కప్పుడుమరీ బరితెగించిన ధోరణిలో ప్రవర్తిస్తున్నదట!"

# చివరిరాత్రి

మే 26వ తేదీ మంగళవారం రాత్రి.

శ్రీ నెహ్రూ డెహ్రాడూన్ నుంచి న్యూఢిల్లీకి తిరిగి వచ్చాక, ఇతరరోజులకంటే సంతృప్తిగా భోజనం చేశారట. విమాన ప్రయాణంవల్ల ఆయనకు ఆకలి ఎక్కువై వుంటుంది. భోజనానంతరం శ్రీమతి ఇందిరాగాంధి తన గదిలోకి వెళ్ళిపోయారు. శ్రీ నెహ్రూ ఫైళ్ళు చూసుకుంటూ గంటన్నరసేపు గడిపారు. అధికార సంబంధమైన రెండుమూడు జాబులను కూడా డిక్టేట్ చేశారు. క్రితంరాత్రి వ్రాయించిన లేఖలపై మర్నాడు ఉదయం తిరిగి పనికి ఉపక్రమించినప్పుడు సంతకంచేయడం ఆయనకు మామూలు. కనుక సంతకం లేకుండానే ఆ లేఖలు వుండిపోయాయి. రాత్రి సుమారు 11 గంటలకు లేఖలను డిక్టేట్ చేసినపిమ్మట శ్రీ నెహ్రూ దేశంలోని పత్రికల కత్తిరింపులను చూచారు. తాజా విదేశ సంచికలను కొన్నింటిని ఆసక్తితో తిరగవేశారు. తరువాత తన పుస్తకాల గదిలో క్రొత్తగా వచ్చే గ్రంథాలను వుంచే అరలవద్దకు వెళ్ళారు. వాటిలోనుంచి ఒక పుస్తకాన్ని ఏరుకొని పడకగదిలోకి వెళ్ళారు. దుస్తులు మార్చుకున్నారు. మొదటి అంతస్తు పడకగది వరాండాలో పైలైటు వేసుకొని అర్ధరాత్రి వరకు చదువుకున్నారు. పిమ్మట లైటు ఆర్పేసి పడుకున్నారు.

ఆయన పరిచారకులు ఇద్దరు ఆ రాత్రి డ్యూటీ మారారు. వారిలో ఒకరు శ్రీ నాథూరామ్, ఆయన యువకుడు. పొట్టిగా నల్లగా వుంటాడు. ఆయనది రావల్పిండి. శ్రీ నెహ్రూ పడకగదిలైటు ఆర్పివేయబడినప్పుడు శ్రీ నథూరామ్ డ్యూటీ మారి వెళ్ళిపోయాడు. మరొకతను డ్యూటీలో ప్రవేశించాడు. శ్రీ నెహ్రూ తెల్లవారుజామున 3 గంట. లకు నిద్ర మేల్కొన్నట్లు ఆయన తెలిపాడు. అయితే ఇది శ్రీ నెహ్రూకు అసాధారణమైన విషయ మేమీ కాదు. ఆ సమయంలో శ్రీ నెహ్రూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళి కొన్ని నిమిషాలకు తిరిగివచ్చి విశ్రమించారు.

శ్రీ నెహ్రూకు ఉదయం 5-30 గంటలకు తిరిగి మెలుకువ వచ్చింది.

ఈ సమయానికి శ్రీ నథూరామ్ తిరిగి డ్యూటీలో ప్రవేశించాడు. అప్పుడప్పుడు కాళ్ళు ఒత్తమని అడగడం శ్రీ నెహ్రూకు పరిపాటి. ముఖ్యంగా రాత్రి చాలా ప్రొద్దుపోయేవరకు పనిచేసిన పిమ్మట ఆయన అలా కాళ్ళు ఒత్తించుకుంటూవుంటారు. కాని ఈ సారి శ్రీ నెహ్రూ వీపులో నొప్పిగా వుందని చెప్పడంతో శ్రీ నథూరామ్ ఆందోళన జెందాడు. అప్రమత్తుడయ్యాడు.

"ఒంట్లో ఎలా వుంది స్వామీ" అని నథూరామ్ యజమానిని అడిగాడు.

"అంత బాగాలేదు" అని యజమాని సమాధాన మిచ్చారు. ఉదయం సుమారు 6 గంటలకు శ్రీ నథూరామ్ వెళ్ళి శ్రీమతి ఇందిరాగాంధికి ఈ విషయం తెలియజేశాడు. వెంటనే డాక్టర్లు వచ్చేశారు.

---

సనాతన మూఢాచారాలు నశించడం ఎంత ముఖ్యమో అలాంటివే క్రొత్తవి సృజింపబడకుండా చూచుకొనటం అంతే ముఖ్యం.

# జవహార్ పండితుని నిర్యాణము

డా. దివాకర్ల వేంకటావధాని

ఆఱిపోవని యొకజ్యోతి యాఱిపోయె
రాలదనుకొన్న యొకరిక్క రాలిపడియె
దివ్యరుచి యొక్క రత్న మదృశ్యమయ్యె
ప్రాకెఁ జీఁకట్లు నల్గడఁ బట్టపగలె

జవహారు పండితోత్తముని
　స్వర్గతిచే సకల ప్రపంచము
దవిరళ శూన్యతా వికృతి
　యాపహిలెం గని దాని గుండియల్
పవులఁగ సుమ్మలించు జన
　వర్గము వెచ్చని యూర్పు లెల్లెడం
గలియు విషాదవార్ధి తర
　గల్ వెడలించెడి గాడ్పులోయనన్.

ధనబల శేముషీగరిమ
　త్యాగము చేసి మహాత్మగాంధి చూ
పిన నవమార్గమందు నడ
　పించి ప్రజాతతి భారతావనీ
జనని స్వతంత్రతా విభవ
　శాలినిఁ జేసిన పుత్రరత్నముల్
ముసు గనకుండ మాతృవర
　మ్మూర్తిఁ దలంచుటయే యశక్య మౌ

దేశమెతాను దానె మఱి
　దేశముగా మది తత్ప్రవృద్ధికై
క్లేశము లెన్నొ సైచి ధన
　గేహ శరీర బలాదులన్ని స్వా
ర్థాశ యొకింత లేకయ స
　మర్పణచేసిన భక్తవర్యుఁడా
దేశముఁ బాసి తద్విరహ
　తీవ్రత నెంత తపించిపోవునో.

పుటము పెట్టిన క్రొత్త పుత్తడిపైడిది
　సంతుకొల్పెడి మేని కాంతితోడ
కనువారియెడఁదలఁదనుపుపుట్టఁగఁజేయు
　తెలిచిఱునవ్వు వెన్నెలలతోడ
దీనాళిపై దయా దివ్య మాధ్వీధార
　లొలికించు వెడఁద కన్దోవలతోడ
ధీరధీవికసనోద్దీప్తి సూచించెడి
　కమనీయ ఫాలభాగంబుతోడ

ధారుణీస్పర్శ మాత్ర భేదము వహించు
పుణ్యబృందారకాభ సన్మూర్తితోడ
భద్రమత్తేభ గమన శోభనతతోడ
నాతఁడెచటనొ నడచుచున్నట్లె తోఁచు

సేవయు పాండితీ గరిమ
　శేముషి త్యాగము సాహసమ్ము దీ
నావనమున్ గుణంబుల స
　మాహరణం బొనరించి పద్మ భూ
దేవుఁడు నెహ్రు పండితునిఁ
　దీర్చె నొకానొక దివ్య మూర్తిగా
నా విలసద్గుణమ్ములక
　టా! యిఁక నెవ్వరి నాశ్రయించునో

తన రాజనీతి విద్యా వైభవమునకుఁ
　బరదేశ విబుధు లచ్చెరువు నొంద
తన శాంతి సంధాన సామరస్యములకు
　సకల జగత్తు హస్తములు మోడ్చ
తన యుపన్యాస మందాకినీ ధారకు
　శ్రోతల యెడఁదలుఱ్ఱూత లూగ
తన గ్రంథరచనా విదగ్ధతాస్ఫూర్తికి
　విద్వద్వ్రతంసులు వెఱఁగు పడఁగ

తన మహాదేశభక్తికిఁ ద్యాగమునకు
భరతదేశీయు లెల్లరుఁ బరవశులుగ
దివ్యజీవితముఁ బుచ్చి దివికి నరిగె
జవహారుఁడు దేశమున కింక శరణ మేది?

ముత్తెము కడుపునఁ బుట్టిన
యుత్తమ రత్నంబుపోక నుర్వీతల మం
దొత్తగిలె నొక్కయుగ మిఁకఁ
గ్రొత్తశకంబునకు నెట్టి కుదురేర్పడునో.

భరతోర్వీజనయిత్రి దాస్యమును బా
　పంబూని స్వాతంత్ర్య సం
గరమం దగ్రగయోధుఁడై సచివ సం
　ఘశ్రేష్ఠుఁడై తల్లిక
ఠరమౌ కీరితి గూర్చి లోకమునకున్
　శాంతిం బ్రసాదింప సు
స్థిర యత్నంబు లొనర్చు జవ్హరు గతిం
　చెన్ దేవుఁడే దిక్కిఁకన్.

తల్లీ! భారతి నీ యనుంగుఁ గొడుకు
　ద్యత్కీర్తి కాంతిచ్ఛటా
మల్లీగుచ్ఛ పరిష్కృతాఖిల జగ
　న్మధ్యుండు సర్వావనీ
విల్లోకార్చితపాదపంకజుఁడు సం
　విన్మూర్తి జవ్హార్ బుధుం
డుల్లోకప్రతిభుండు వీడిచనె ని
　న్నోదార్చు టెట్లోకదే!

# భారత ప్రియ పుత్రుడు

శ్రీ యం. ఆర్. అప్పారావు, ఎం. ఏ.
(సాంస్కృతిక - ఎక్సైజ్ - మద్యనిషేధ శాఖామాత్యులు)

మహాపురుషు నిర్యాణవార్త కాలనేమి కదలిక నాపె
భారతమాత హృదయస్పందన నిమేషమ్మాగె
మానవాళి వాగ్రవాళి ఒకింత మూగవడియె
ఆలోచనాపరంపర ఇట్టె ఆగిపోయె.

ప్రపంచ వినాశక శక్తుల కడ్డెవరు ?
మానవ రాక్షసులనుండి రక్షించు శ్రీరామరక్ష యెవరు ?
పీడిత ప్రజానేక సంరక్షణకర్త యెవరు ?
సామ్రాజ్యకాంక్షఅను పెనుభూతమునకుఆంజనేయుడెవరు?
జాత్యహంకార స్వేచ్ఛావిహారమణచు ధీరు డెవరు ?

జవ్వారు అమరపురికేగ ఇంద్రుండె లేచి ఆహ్వానించె
ఝాన్సీలక్ష్మి నివాళులు అర్పించె
మహాత్ముడు గాఢాలింగనము జేసె
సుభాసుబాబు శభాషని వీపు తట్టె.
మోతీలాల్ కమలాదేవి ఆనందబాష్పముల్ రాల్చిరి.
ప్రసాద్ జవ్వారు చెట్టపట్టాల్ పట్టి నడిచిరి
పటేలు, పంతు, ప్రకాశము, నాగేశ్వరులు ఎదు రేగిరి
దరహాసవదనములు ఆనందహృదయమ్ములు పొంగారె
జయ జయ ధ్వానముల్ స్వర్గమంత చెలరేగె.

సత్యాహింసలను అమోఘాస్త్రముల నిర్మించె మహాత్ముండు
సాధించె స్వరాజ్యమ్ము భారతావని కాతండు
హింసావాదమ్మును తుదముట్టించ జన్మించె మహాత్ముండు
ప్రపంచ చరిత్ర గతియె మార్చు సిద్ధాంత మవతరించె
మహాత్ముండు జవ్వారుని వారసునిగా వరించె
అతడు సత్యాహింసల మహిమచే ప్రపంచమ్మునె మార్చె
ఆఫ్రేషియా రాజ్యమ్ము లనేకమ్ములకు స్వాతంత్ర్యమ్ము
చేకూర్చె
సామ్రాజ్య తత్వమ్మునె పూర్తిగ మట్టిగలిపె.

రోదసీ — అణుశక్తియుగమ్ము అవతరించె
మానవ హస్తమ్మునకు భస్మాసురశక్తి లభించె
అరవిందు డాశించిన దివ్య మనస్తత్వ మవతరించలేదింక
గాంధీజీ జవ్వారుల పుణ్యశక్తియే రక్షక మింక

అణుయుగ భస్మాసుర విధ్వంసకమ్ము
జవ్వార్ పుంమోహన దివ్యస్వరూపమ్ము
పంచశీలయె శాంతి అమోఘ అస్త్రమ్ము
ఆటమ్ హైడ్రోజన్ బాంబుల మ్రింగు దివ్యాస్త్రమ్ము.

అస్పృశ్యుల దీనుల ఆర్తనాదమ్ము దీర్చె
కాలకాలాలుగా మూగవడ్డ బీదనోళ్ళకు వాక్కొసంగె
ప్రజాస్వామ్యమ్ముచే సర్వమానవుల సార్వభౌముల జేసె
భారతావని ప్రపంచమున కెల్ల మకుటాయమానము జేసె.

దినాతిదీన భారతీయుల కన్నదాత జవ్వారుండు
అభినవ భగీరథుండు జవ్వారుండు
కట్టించె భక్రానంగల్, హీరాకుడ్డులతండు.
భారతదేశమున కన్నదాయి ఆంధ్రదేశమ్ము
ప్రారంభించె నిచ్చట పోచంపాడు, నాగార్జున సాగరమ్ము,
శ్రీశైలమ్ము.

విద్యావిహీనులకు విద్యాదాన మొసంగె,
ఆస్పత్రులు, పరిశ్రమలు, సర్వసంపదల్ సమకూర్చె
భారత నిర్మాణ దపం బూని కష్టించి ప్రాణార్పణ చేసె.

ఇట్టి మహానుభావుండు,
చరిత్ర ప్రసిద్ధుండు,
ప్రియభారత పుత్రుండు
మానవాళి రక్షకుండు
మరెప్పుడు అవతరించునో లెండు.

(26 వ తేదీన అసెంబ్లీలో చదివిన గీతికా ఖండిక)

# శాంతినేత

హనుమంతు పార్వతీశ్వరరావు (స్వభాను)

ఆశయాల అనుబంధంలో
ఆచరణలు దిద్దుకొంటూ
ఆదర్శాలకై పాటుపడుతున్నాం
అయ్యో! ఆరిపోయిందా? ఆశలజ్యోతి
అమరు లందరు ఆహ్వానించారా?
శాంతికాముకులు చెరిగారా!
శ్రీరాముడు దేవుడైన చరితము వినలేదా?
బుద్ధుడు అవతారపురుషుడై మనగలేదా!
గాంధీ మన శాంతిదూత ఘనత నిలువలేదా?
కినడీ శాంతిని ప్రపంచఖ్యాతిని గనలేదా!
వీరందరు శాంతికై పాటుపడినవా రేగదా!
శాంతినేత నెహ్రూపేరు చెరిగిందా నేడు?
లేదు! లేదు! హైందవుల మననే మందిరమై
భరతమాత హారంలో మణిరూపంగా నిలచె!

చైనీయుల చెడుబుద్ధి చరితలోన నిల్పి
"ప్రపంచ చరిత్ర"ను ప్రచురించగ వెళ్ళేరు.
అమరపథము ప్రధానిగా అచటికి వెళ్ళారు
ఆహ్వానించా రాలోకంలోనివారు!
నాకము చేరెను నెహ్రూ ముల్లోకము లేలగా
మన నెహ్రూ మరణ మది పరలోక యాత్రగదా!
సురల తిరిగివచ్చు టది, మనము చూడలేముగదా!
శాంతినేత మనకొరకై ప్రశాంతిపథము వీడెనో?
చైనీయుల దుండగములు చెల్లాచెదరుగ చేయ
ఆగ్నేయాస్త్రము మన కనుమతింప జేయుటకు
స్వర్గభూమినుండి మనకు చక్కని మార్గము వేయ
శాంతితోడ భూ, దివముల సామరస్య సాధనకై
చర్చలు జరుపగ వెళ్ళె, చరితార్థుడు మన నెహ్రూ
అమరప్రధాని యాత్ర అంతము కాదేనాటికి.

# ఆర్తగీతి

ప్రణవశ్రీ

మన ప్రధాని మఱి లేఁడా?
మన నెహ్రూ మఱి లేఁడా?
నిజమేనా నీ వన్నది?
నిజమేనా నే విన్నది?

కనుల నీలికాంతులతో,
తనువున ఖద్దరు ప్రభతో,
మనమున నిర్మలకృపతో,
అనితర సామ్యాకృతితో –
మన నెహ్రూ మఱి రాఁడా?
మన ప్రధాని మఱి లేఁడా?

అజ్ఞానపు టంధజగతి
విజ్ఞాన వివేకరుచుల
సుజ్ఞాన సుశోభ నిడిన
ప్రజ్ఞాంశు విభాకరుండు –
మన ప్రధాని మఱి లేఁడా?
మన నెహ్రూ మఱి రాఁడా?

కలికాల వికారములకు
కలఁగిపోయి, కష్టపడుచు,
పలవించెడు ప్రజావళిని
పలు విధముల పైకెత్తిన
మన నెహ్రూ మఱి రాఁడా?
మన ప్రధాని మఱి లేఁడా?

తరతరాల దనుజరాజ
పరిపాలన బాధలతో
పరితపించు జానిసలకు
స్థిరవిముక్తి చేకూర్చిన
మన ప్రధాని మఱి లేఁడా?
మన నెహ్రూ మఱి రాఁడా?

పంచశీల పరమమంత్ర
సంచయజపసాధనచే
వంచకనృప పైశాచిక
వంచనలను పాఱఁద్రోలు
మన నెహ్రూ మఱి రాఁడా?
మన ప్రధాని మఱి లేఁడా?

కడుపునిండ కుడువ బువ్వ,
ఒడలినిండ ముడువ వలువ,
పడియుండఁగ నిడివి కొంప –
బడుగుల కిడ పాటుపడిన
మన ప్రధాని మఱి లేఁడా?
మన నెహ్రూ మఱి రాఁడా?

కులమతాది కుటిల భేద
ముల ముక్కలు, ముక్కలైన
నలువదికోటుల జనతను
కలసి బ్రతుక కాంక్షించిన
మన నెహ్రూ మఱి లేఁడా?
మన ప్రధాని మఱి లేఁడా?

భ్రాంతిరహిత భయవిరహిత
శాంతిరాజ్య సంస్థాపన
పంతముతో వసుధఁ గూర్ప
నెంతయు శ్రమియించినట్టి
మన ప్రధాని మఱి లేఁడా?
మన నెహ్రూ మఱి రాఁడా?

కనికరమే తన గుణముగ,
పనిసేతయె తన మతముగ –
మనకొఱకే మని ఘనముగ
మనకొఱకే కనుమూసిన
మన నెహ్రూ మఱి రాఁడా?
మన ప్రధాని మఱి లేఁడా?

8వ ప్రకరణం

# 'ప్రియమైన జవహర్‌లాల్...'

(వివిధ సందర్భాలలో శ్రీ జవహర్‌లాల్ నెహ్రూకు ఇతరులు వ్రాసిన జాబులు, ఆయన ఇతరులకు వ్రాసిన లేఖలు కొన్ని ఈ భాగంలో పొందుపరచబడినవి. బ్రాకెట్లలో ఇచ్చిన పరిచయ వాక్యాలు పండిట్‌జీ స్వయంగా వ్రాసినవి.)

సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వఉత్తర్వు :

అలహాబాదుకు చెందిన జవహర్‌లాల్ నెహ్రూ, ప్రజా భద్రతకు భంగకరంగా ప్రవర్తిస్తున్నట్లు లేదా ప్రవర్తించనున్నట్లు విశ్వసించడానికి తగు కారణాలు వున్నాయని స్థానిక ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది. కనుక ఇప్పుడు సంయుక్త రాష్ట్రాల లెఫ్టినెంట్ గవర్నరు, 1915 వ సం. పు భారత రక్షణ (ఏకీకరణ) నియమావళి 3వ నిబంధన సంక్రమింపజేస్తున్న అధికారాలను పురస్కరించుకొని అలహాబాదుకు చెందిన సదరు జవహర్‌లాల్ నెహ్రూ సంయుక్తరాష్ట్రాలలోని డెహ్రాడూన్ జిల్లా హద్దులలో ఏ ప్రాంతంలో కూడా ప్రవేశించరాదనీ, నివసించరాదనీ, లేదా వుండరాదనీ, ఆదేశించడానికి సంతసిస్తున్నారు. సదరు జవహర్‌లాల్ నెహ్రూ ఉద్దేశపూర్వకంగా ఈ ఆదేశాన్ని ఉల్లంఘించి నట్లయితే, 1915 వ సం. పు భారతరక్షణ (ఏకీకరణ) నియమావళి 5 వ నిబంధనలోని (1) వ సబ్‌సెక్షన్ క్రింద శిక్షకు పాత్రుడు కాగలడని ఆయన ఇందు మూలముగా హెచ్చరించబడుతున్నాడు. ఈ నిబంధన ప్రతి ఒకటి ఈ ఉత్తర్వుతో జతపరచబడినది.

ఎం. కీనే

తేదీ : మే 1920 ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,
నైనిటాల్ సంయుక్త రాష్ట్రాలు

శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ, ఈ రోజున డెహ్రాడూన్ జిల్లాను విడిచివెళ్ళగలరు. డూన్ సూపరింటెండెంటు ఉత్తర్వుతో.

ఎం. ఎల్ టక్స్.
ఎస్. పి. డెహ్రాడూన్
16-5-20

---

లాలా లజపత్‌రాయ్ వ్రాసినది :

తిలక్ రాజకీయ పాఠశాల
లాహోర్,
నవంబరు 19,1922,

ప్రియమైన జవహర్‌లాల్,

మీ లేఖ అందింది. తారక్‌నాథ్‌దాస్ వ్రాసిన జాబును చదివాను. దానిని మీకు తిరిగి పంపుతున్నాను. ఆయనకొన్ని మంచి సూచనలు చేశారు. అవి కాంగ్రెసు నాయకులు పరిశీలించ దగినవి. కాకినాడ సమావేశంలోకానీ లేదా అంతకు పూర్వంకానీ వాటిని పరిశీలించే అవకాశం లభించగలదని ఆశిస్తున్నాను. అకాలీ రక్షణ సంఘం విషయంలో మీ నాయనగారు వారితో చేసుకున్న ఏర్పాటును గూర్చి అకాలీ నాయకులు ఇంతవరకు నాకు ఏమీ తెలియజేయలేదు. వారు ఏమైనా తెలిపే పర్యంతం ఈ విషయంలో నేను ఏమీ చర్యలు తీసుకోదలచలేదు. నాకు ఆరోగ్యం సరిగా వుండటం లేదు. కొన్నిరోజులపాటు నేను హఠాత్తుగా కనిపించకుండా పోవచ్చు. మీ కార్యక్రమాన్ని చూచాను దానికి నా అభ్యంతర మేమీ లేదు. మీరు మీ ఆరోగ్యాన్ని గురించి శ్రద్ధ తీసుకోగలరని ఆశిస్తున్నాను. అయితే తన ఆరోగ్యాన్ని గురించి పట్టించుకోని వ్యక్తి ఇలాంటి సలహా ఇవ్వడం ఉచితంగావుండదు.

మీ విశ్వసనీయుడు
లజపత్‌రాయ్

(కాంగ్రెసు కార్యక్రమానికి శ్రీ తారక్‌నాథ్‌దాస్ తరచుగా వివిధ సూచనలు ఇస్తూవుండేవారు.

ఆ రోజుల్లో అకాలీ సిక్కులు గురుద్వారాల విషయంలో ఆందోళన సాగించారు. వారి నాయకులు అనేకమంది అరెస్టు అయ్యారు. కాంగ్రెసు వారికి సహాయం చేసింది.)

---

మహాత్మాగాంధీ వ్రాసినది :

(నా భార్య ప్రసవించింది. మొగశిశువు కలిగాడు. శిశువు వారం లోపుగానే మరణించాడు. ఆ సందర్భంలో ఈ టెలిగ్రాం వచ్చింది)

టెలిగ్రామ్ :

సబర్మతి
నవంబరు 28,1924

శ్రీ నెహ్రూ, అలహాబాదు.

శిశువు మరణానికి విచారిస్తున్నాను. దైవనిర్ణయం అనివార్యమైనది.

గాంధి

రోమేన్‌రోలా వ్రాసినది :

విల్లెన్యూవ్ (వాడ్) విల్లా ఓల్గా
11 మే 1926

ప్రియమైన జవహర్‌లాల్ నెహ్రూ,

మీ లేఖనూ, ఋషితుల్యులైన మన మిత్రుడు గాంధీ వ్రాసిన లేఖనూ అందుకొని ఆనందించాను. మీపేరు మాకు పరిచితమే. కొన్ని రోజుల క్రితం హిందుస్థాన్ టైమ్స్‌లో ప్రచురించబడిన ఒక ఉపన్యాసంలో మీ పేరు చూశాము.

నేనూ నా సోదరి మిమ్ములను కలుసుకోవాలనుకుంటున్నాము. వచ్చేవారం ఎప్పుడైనా ఒకరోజు మధ్యాహ్నం మీరు శ్రీమతితో కలిసి రావడానికి సాధ్యమవుతుందా ? విల్లా ఓల్గాలో మనం కలిసి టీ తీసుకోవచ్చు. కొంత సేపు మాట్లాడుకోవచ్చు. మే 19 వ తేదీ బుధవారం — 22 వ తేదీ శనివారంల మధ్య ఏ రోజున మీరు ఇచ్చటికి రావడానికి వీలుగా వుంటుందో తెలియజేయండి. మీరు రాదలచిన రోజున వాతావరణం సరిగా లేక పోయినట్లయితే

ఆరోజు ఉదయం మీ రాకను మరో రోజుకు వాయిదా వేస్తున్నట్లు టెలిగ్రామ్ ఇవ్వండి.

స్విడ్జర్‌లాండ్‌లోని ఆరోగ్య ప్రదమైన వాతావరణానికి శ్రీమతి నెహ్రూ త్వరలో కోలుకో గలరని ఆశిస్తున్నాను.

జనీవా ఇంటర్నేషనల్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న బాలిక మీకూతురు కదూ? ఆమె ఉపాధ్యాయిని మిస్‌హార్టచ్ మాకు సన్నిహిత మిత్రురాలు, ఆమె చాలా ఉత్తమురాలు, తన బాధ్యతలను ఎంతో శ్రద్ధగా నైపుణ్యంగా నిర్వర్తిస్తుంది. మీ కుమార్తె చాలా సమర్థురాలైన ఉపాధ్యాయిని పర్యవేక్షణలో వుందనడంలో ఎంతమాత్రం సందేహంలేదు.

నా మిత్ర వాత్సల్యాన్ని స్వీకరించండి.

రొమేన్ రోలా

---

మహాత్మా గాంధీ వ్రాసినది:

(ఈలేఖ సైమన్ కమిషన్‌కు వ్యతి రేకంగా లక్నోలో మేము శాంతియుతంగా నిరశన ప్రదర్శనలు జరిపిన వెంటనే వ్రాసినదను కుంటాను. ఈ పదర్శనల సందర్భంలో పోలీసులాఠీ దెబ్బలు మాకు బాగా తగిలాయి.)

వార్ధా
డిశంబరు 3, 1928

ప్రియమైన జవహర్,

నీకు నా ప్రేమ వాత్సల్యాలు తెలుపుతున్నాను. నీవు ఆ కార్యాన్ని చాలా ధైర్యంగా నిర్వర్తించావు. నీవు ఇంకా సాహన వంతమైన పనులు చేయవలసివుంది. భగవంతుడు నీకు దీర్ఘాయుష్షను ప్రసాదించి, భారత దేశాన్ని బంధనాలనుంచి విముక్తి చేయడానికి నిన్ను తన సాధనంగా చేసుకొనుగాక.

నీ
బాపు

---

సరోజినీనాయుడు వ్రాసినది:

(నేను లాహోర్‌లో జరిగిన భారతజాతీయ కాంగ్రెసు మహాసభకు అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంలో వ్రాసినది.)

లక్నో,
సెప్టెంబరు 29, 1929

ప్రియమైన జవహర్,

భారతదేశం మొత్తంలో నిన్నటిరోజున మీనాన్నగారి హృదయం కంటే గర్వదాయకమైన హృదయం కానీ, మీ హృదయం కంటే బరువైన హృదయం కానీ వున్నదంటే నాకు ఆశ్చర్యం. నాదో అసామాన్యమైన పరిస్థితి. ఆయన గర్వాన్నీ, మీ బాధను కూడా నేను దాదాపు సమపాళ్ళలో పంచుకున్నాను. మీరు అద్భుతమైన త్యాగాలు చేయడానికి ముందే తీర్మానించబడి వున్నట్లుగా మీ విషయంలో నేను తరచుగా ఉపయోగించిన మాటల ప్రాముఖ్యతను గురించి ఆలోచిస్తూ నేను చాలా రాత్రివరకు మేల్కొనివున్నారు. మీరు ఎన్నికైనప్పుడు జరిగిన కరతాళధ్వనుల మధ్య మీ ముఖకవళికలను నేను గమనించాను. అప్పుడు నాకు పట్టాభిషేక మహోత్సవాన్ని శిలువ లేయబడడాన్ని కూడా చూస్తున్నట్లనుపించింది. నిజానికి ఇవి రెండూ అవిభాజ్యమైనవి. కొన్ని పరిస్థితుల్లో దాదాపుగా సమాన మైనటువంటివి. ముఖ్యంగా ఈనాడు ఇవి మీకు సరిసమాన మైనట్టివి. ఎందుచేతనంటే మీ మనస్సు చాలా సున్నితమైనది. బలహీనత, కపటం, దోషిత్వం, మోసం — వీటితో వ్యవహరించడంలో ప్రస్ఫుటమైన జ్ఞానం, భయం తక్కువగా వున్నవారికంటే వందరెట్లు ఎక్కువగా మీరు బాధపడతారు. అయితే స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల విషయంలో మీకు గల అకుంఠితమైన మనోభావాలు, చిత్తశుద్ధి పట్ల నాకు సంపూర్ణ విశ్వాసం వుంది. మీ స్వంత ఆలోచనలను, ఆదర్శాలను ఆచరణలో పెట్టడానికి స్వకీయమైన శక్తికానీ లేక తగు మద్దతుకానీ లేదని మీరు భావిస్తున్నట్లుగా నాకు మీరు చెప్పినప్పటికీ మీకు ఒక సవాలు చేయబడినట్లుగా, అలాగే జోహార్లర్పించ బడినట్లుగా కూడా నేను తలంచుతాను. ఈ సవాలు మీ సల్లక్షణాలన్నింటినీ అద్భుతమైన శక్తి, ధైర్యం, జ్ఞానాలుగా పరిమితి నొందింపజేస్తుంది. నా విశ్వాసంలో నాకు ఎట్టిసంశయంలేదు.

అద్భుతమైన, కఠోరమైన మీ కృషిలో నేను మీకు ఏ విధంగా సహాయపడడానికి సాధ్యపడుతుందో మీకు తెలుసు. నేను మీకు నిర్దుష్టంగా ఏమీ సహాయం చేయలేకపోయినా కనీసం అవగాహనను, అనురాగాన్ని పరిపూర్ణంగా ప్రదర్శించగలను. ఖలీల్‌గిబ్రాన్ అన్నట్లు "ఒకరి దిక్కులు ఒకరికి రెక్కలు తొడగలేకపోవచ్చు." అయితే ఒకరిలో కలిగే అజేయమైన విశ్వాసం మరొకరిలో కూడా జ్యోతిని వెలిగించి ప్రపంచాన్ని ప్రకాశమానం చేస్తుందని నా నమ్మకం

మీ ప్రియమైన మిత్రురాలు, సోదరి
సరోజినీ నాయుడు

---

రవీంద్రనాథ్ టాగూర్ వ్రాసినది:

(నాభార్య ఆరోగ్యం బాగా దెబ్బతిన్నందువల్ల ఆమెను చికిత్స కొరకు యూరపుకు పంపడానికి నిశ్చయించారు. అప్పుడు నేను అల్మోరా జైలులో వున్నాను. ఆమెకు వీడ్కోలు చెప్పడానికై భవాలీ చికిత్సశాలకు వెళ్ళడానికి ఒక రోజుపాటు నేను జైలునుంచి బయటికి వచ్చినప్పటికీ నేను ఆ జైలులోనే గడిపాను. శాంతినికేతన్‌లో వుంటున్న నా కూతురు ఇందిర తల్లి వెంట యూరపు వెళ్ళింది.)

ఉత్తరాయణ్
శాంతినికేతన్, బెంగాల్,
ఏప్రిల్ 20,1935

ప్రియమైన జవహర్‌లాల్,

మేము ఎంతో హృదయభారంతో ఇందిరకు వీడ్కోలిచ్చాము ఆమె ఇచ్చట అంత ముఖ్యురాలుగా ఎంచబడుతున్నది. ఆమె చదువుసంధ్యలు, ప్రవర్తనను నేను నిశితంగా పరిశీలించాను. మీరు ఆమెను పెంచిన తీరు నాకు ఆనందం కలిగించింది. ఆమె ఉపాధ్యాయులంతా ముక్తకంఠంతో ఆమెను ప్రశంసించారు. పరిస్థితులు చక్కబడి ఆమె త్వరలోనే ఇక్కడికి తిరిగివచ్చి చదువు కొనసాగించగలదని ఆశిస్తున్నాను.

మీ భార్య అస్వస్థతను గురించి యోచించినప్పుడు నాకు ఎంత విచారం కలుగుతుందో వివరించలేను. సముద్రయానంవల్ల, యూరపులో చికిత్స జరగడంవల్ల ఆమెకు పూర్తిగా ఆరోగ్యం చేకూరగలదని నేను ఆశిస్తున్నాను. ప్రేమపూర్వక ఆశీస్సులతో.

మీ
రవీంద్రనాథ్ టాగూర్

—

హెచ్. జె. లాస్కీ వ్రాసినది:

(వ్యక్తిగతం, రహస్యం) లండన్‌స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్
పొలిటికల్ సైన్స్
లండన్, డబ్ల్యు. సి. 2,
నవంబరు 6,1935

ప్రియమైన నెహ్రూ,

మీరు హలిఫాక్స్‌ను కలుసుకొని ఆయనతో భారతదేశ పరిస్థితిని గురించి మాట్లాడడానికి ఒత్తిడి వచ్చినట్లు నాకు తెలిసింది. ఆయనవద్దనుంచి లిఖితపూర్వకంగా నిర్దుష్టమైన అభ్యర్థన వచ్చే పర్యంతం మీరు అలా చేయరని నేను విశ్వసిస్తున్నాను. లేకపోయినట్లయితే అపోహ కలిగించడానికి సులభంగా ఆస్కారం ఏర్పడుతుందని నేను అనుకుంటున్నాను. ఇందువల్ల చాలా హాని సంభవిస్తుంది.

మీ విశ్వసనీయుడు
హెచ్. జె. లాస్కీ

—

బెర్ట్రాండ్ రస్సెల్ వ్రాసినది:

టెలిగ్రాఫ్ హౌస్, హర్టింగ్, పీటర్‌ఫీల్డ్
జనవరి 30,1936

ప్రియమైన శ్రీ నెహ్రూ,

మీరు ఇంగ్లాండుకు వచ్చిన సమయంలో నేను మిమ్ములను కలుసుకోలేకపోయినందుకు చాలా విచారిస్తున్నాను. నా భార్యకు జబ్బుగా వుంది. వాతావరణం మార్చవలసి వచ్చింది. అయితే ఆమె ప్రయాణానికి తగిన స్థితిలోలేదు. అందువల్ల నేను యిప్పటి వరకు వుండిపోవలసి వచ్చింది. మీ కృషిపట్ల ముఖ్యంగా జాతీయోద్యమాన్ని సామ్యవాదంతో సమ్మిళితం చేయడంపట్ల నాకు పూర్తి సానుభూతి వుంది. బహుశా ఈ సంగతి మీకు తెలిసిందే. ప్రభుత్వ దృక్పథందృష్ట్యా ఈ సమయం అంతగా అనుకూలమైనది కాకపోయినప్పటికీ మీ పర్యటన ఫలప్రదం కాగలదని నేను తలంచుతున్నాను. శుభాకాంక్షలతో.

మీ విశ్వసనీయుడు
బెర్ట్రాండ్ రస్సెల్

—

రవీంద్రనాథ్ టాగూర్‌కు వ్రాసినది:

ఏప్రిల్ 1,1936

ప్రియమైన గురుదేవ,

మీరు కమలను గురించి చెప్పిన మాటల ఆంగ్లానువాదాన్ని విశ్వభారతి న్యూస్‌లో ఈ వేళ చదివాను. మీరు కనబరచిన ఔదార్యానికి నేను ఎంతో ముగ్ధుడనయ్యాను. మీ దీవెనలు, మమ్ముల చక్కని పథంలో నడిపించడానికి మీరు వున్నారనే మా ఆలోచన నాకు ఎంతటి శక్తినిచ్చాయో మీకు చెప్పదలచాను.

ఢిల్లీ స్టేషనులో మిమ్ములను దర్శించుకోవడం నాకు సంతోషం కలిగించింది. అయితే ఇలాంటి సమావేశాలకు రైలుస్టేషను అనువైన ప్రదేశంకాదు. నాకు సంతృప్తి కలగలేదు. మీ ప్రస్తుత పర్యటన ముగిశాక విశ్రాంతి తీసుకోగలరని ఆశిస్తున్నాను.

మీ కార్యక్రమ వివరాలు పూర్తిగా తెలియకపోవడం వల్ల ఈ జాబును శాంతినికేతన్‌కు వ్రాస్తున్నాను.

మీ ప్రేమపాత్రుడు
జవహర్‌లాల్ నెహ్రూ

(చాలామంది రవీంద్రనాథ్ టాగూర్‌ను గురుదేవుడని పిలుస్తారు)
విశ్వభారతిన్యూస్, ఏప్రిల్ 1936

—

మొహమ్మద్ ఇక్బాల్ వ్రాసినది:

లాహోర్,
జూన్ 21,1936

ప్రియమైన పండిట్ జవహర్లాల్,

మీ లేఖ నిన్న అందింది. చాలా కృతజ్ఞతలు. మీ వ్యాసాలకు నేను సమాధానం వ్రాసినప్పుడు, * అహ్మదీల రాజకీయ వైఖరిని గురించిన అభిప్రాయ మేదీ మీకు లేదని నేను అనుకున్నాను. నిజానికి నేను మీకు సమాధానం వ్రాయడానికి గల ముఖ్యకారణం ముస్లి

* ఇదొక ముస్లిమ్‌తెగ. దీనిని 'ఖద్యానిస్' అని కూడా అంటారు. ప్రాచీన మహమ్మదీయులు దీనిని పరిగణించలేదు.

ములలో విశ్వాసభావం ఏ విధంగా ఉత్పన్నమైంది, చివరకది అహ్మదిజంలో బహిరంగ ప్రాతిపదికగా ఎలా రూపొందిందీ మీకు వెల్లడించ దలచడమే. నా వ్యాసం ప్రచురింపబడ్డాక విద్యావంతులైన ముస్లిములకు కూడా అహ్మదీల ఉపదేశాలను రూపొందించిన చారిత్రక కారణాలను గురించిన పరిజ్ఞానం లేదని తెలుసుకొని చాలా ఆశ్చర్యపడ్డాను. పంజాబు తదితర ప్రాంతాలలోని మీ ముస్లిం అభిమానులు మీ వ్యాసాలు చూసి ఆందోళన చెందారు. అహ్మదీయ పుద్యమంపట్ల మీకు సానుభూతి వున్నదని వారు అనుకోవడమే దీనికి కారణం. మీ వ్యాసాలు చూసి అహ్మదీలు ఆనందించడం కూడా దీనికి ప్రధాన హేతువు. మీ విషయంలో అపోహ కలగ దానికి అహ్మదీ పత్రికలు చాలావరకు కారణం. అయితే నేను మొదట అనుకున్నది పొరపాటు అభిప్రాయ మైనందుకు నాకు సంతోషంగా వుంది. వేదాంతంపట్ల నాకు ఆసక్తిలేదు. అహ్మదీలతో వారి స్వంత ప్రాతిపదికపై వ్యవహరించేందుకై దీనిలోకి దిగవలసివచ్చింది. ఇస్లామ్, ఇండియాలకు శ్రేయోదాయకంగా మంచి ఉద్దేశాలుతోనే నా వ్యాసం వ్రాశానని మీకు హామీ ఇస్తున్నాను. అహ్మదీలు ఇస్లామ్ మతానికి కానీ, ఇండియాకు కానీ ద్రోహం చేస్తారని నేను అనుకోను.

నేను మిమ్మలను లాహోర్‌లో కలుసుకోలేక పోయినందుకు చాలా విచారిస్తున్నాను. ప్రస్తుతం నాకు చాలా సుస్తీగా వుంది. కనుక బయటికి కదలలేను. అనారోగ్య కారణంగా గత రెండు సంవత్సరాలనుంచీ నేను దాదాపుగా రిటైర్‌మెంట్ జీవితం గడుపుతున్నాను. మీరు పంజాబుకు మళ్ళీ ఎప్పుడు వస్తారో తెలియపరచండి. పౌరస్వేచ్ఛ విషయంలో మీరు నెలకొల్పదలచిన సంఘం విషయమై నేను వ్రాసిన జాబు చేరిందా? అది అందినట్లు మీరు వ్రాయలేదు కాబట్టి అది ఇంకా మీకు ముట్టనట్లు భావిస్తున్నాను.

మీ విశ్వసనీయుడు
మహమ్మద్ ఇక్బాల్

---

వి.గొల్లాంజ్ వ్రాసినది: లండన్
ఫిబ్రవరి 8,1937

ప్రియమైన నెహ్రూ,

ఆల్బర్ట్ హాల్ రాలీకి మీరు సందేశం పంపినందుకు చాలా కృతజ్ఞతలు. అది ఎవరి వద్దనుంచి వచ్చిందో నేను వెల్లడించలేదు. "భారతప్రజలు" అని చదవడమే తరువాయిగా హర్షధ్వానాలు మారు మ్రోగాయి. టెలిగ్రామ్ చివరన మీ పేరు చదవడానికి ముందు కూడా ఇదే విధంగా హర్షధ్వానాలు మ్రోగాయి. మీ పేరు చదివాక ఇవి ద్విగుణీకృతమయ్యాయి. మీ విజ్ఞాపనకు ప్రతి సదస్యుడూ ప్రభావితు డయ్యాడనడానికి ఇదే ప్రబల నిదర్శనం.

ఈ సమావేశం విజయవంతమైంది. ఇది ముఖ్యరాజకీయ పరిణామాలకు దారి తీయవచ్చు.

కృతజ్ఞతలతో, శుభాకాంక్షలతో.

మీ సోదరుడు
వి. గొల్లాంజ్

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ
స్వరాజ్ భవన్,
అలహాబాదు. యు. పి.

---

అమృత్ షెర్‌గిల్ వ్రాసినది:

(అమృత్‌షెర్‌గిల్ ప్రతిభావంతురాలైన చిత్రకారిణి. ఆమె పారిస్‌లో శిక్షణపొందారు. అచ్చట అకాడమీలో ఆమె చిత్రాలు ప్రదర్శించబడినవి. చిన్నవయస్సులోనే ఆమె హఠాత్తుగా మరణించారు.)

నవంబరు 6,1937

కొద్దిసేపు క్రిందట ఒకరు "జవహర్‌లాల్ నెహ్రూకు సుస్తీగా వుందట తెలుసా" అని అడిగారు. ఆ సంగతి నాకు తెలియదు. నేను పత్రికలు చదువను.

నేను మిమ్ములనుగురించి చాలా ఆలోచిస్తూవున్నాను. నేను జాబు వ్రాయలేక పోవడానికి బహుశా ఇదేకారణమేమో. మీలేఖ రావడం ఆశ్చర్యం కలిగించింది. పుస్తకం పంపినందుకు కృతజ్ఞతలు.

నిజానికి జీవిత చరిత్రలు, ఆత్మకథలు అంటే నాకు అసహ్యం. నిజం చెప్ప వవి. అడొకరకమైన డంబాలు చెప్పుకోవడం. కాని మీ ఆత్మకథ అంటే నా కిష్టం తరచుగా మీరు మీలోని గొప్పతనాన్ని చెప్పుకోరు. ఇతరులు "మొదటిసారిగా సముద్రం నన్ను చూసినప్పుడు" అని అంటే మీరుమాత్రం "మొదటిసారిగా నేను సముద్రాన్ని చూసినప్పుడు" అని అనగల సమర్థులు.

మిమ్మల్ని సన్నిహితంగా తెలుసుకోవాలని నా ఉద్దేశం. ఏ విధమైన భేదములేక పొసగే గుణంగల పరిపూర్ణ వ్యక్తిత్వం వున్న వ్యక్తులవైపు, తమ వెనక జిగురైన దుఃఖపాశాల వుచ్చులు వెదజల్లుకోని వ్యక్తులవైపు ఎప్పుడూ నేను ఆకర్షింపబడుతూవుంటాను.

జీవన ప్రాంగణంలో ఎవరూ కలత చెందుతా రనుకోను. చాలా తేలిగ్గా కనిపించే విషయాలు, అనిపించే విషయాలు యౌవ్వన ప్రాంగణంలోంచి దాటుకుని వెళ్ళిన వ్యక్తికి; గజిబిజిగా, అనేకంగా కనిపిస్తే అట్టివ్యక్తి బాగా కలతచెందుతా డనవచ్చు.

కాని మీకు మాత్రం క్రమబద్ధమైన చక్కటిమనసువుందనుకోండి.

నిజానికి మీకు నా చిత్రాలమీద ఆసక్తి వున్నదని అనుకోను. ఆశక్తి లేకుండానే మీరు నా చిత్రాల్ని చూశారు.

మీరు కర్కశులుకారు. సరళమైన ముఖం మీది. మీ ముఖం అంటే నాకు యిష్టం. అది సున్నితమైనది, మనోహరమైనది.

అంతేగాదు ఒక ప్రత్యేకత గలది. మా నాన్నగారు మీకు పంప మన్న కటింగ్ ఒకదానిని దీనితోపాటు జతచేర్చి పంపిస్తున్నాను. దానిని ఆయన వ్రాశారు.

భవదీయురాలు
అమృత్ షెర్ గిల్

సరోజిని నాయుడు వ్రాసినది :

మహాత్ముని శిబిరం
కలకత్తా
13 నవంబరు, 1937

ప్రియాతి ప్రియమైన జవహర్,

ఒక కొత్తధోరణిలో నీకు వుత్తరం వ్రాస్తున్నాను. పొట్టిమనిషి * బచ్చలి, ఉడకబెట్టిన శెనగలు తింటూ తనకేమీ పట్టనట్టు కూర్చున్నారు. అలా ఆయన కూర్చుంటే ప్రపంచం ఆయన గురించి పొంగిపొర్లి బెంగాలీ, గుజరాతీ, ఇంగ్లీషు, హిందీ అలలుగా విడి, పొర్లుకొస్తోంది. బిదాన్, ఆతని అనుచరులు ఆయన తన ఆరోగ్యంపై చూపిస్తోన్న స్తబ్ధతకు చాలా ఆందోళన పడుతున్నారు. ఆయన నిజంగా అనారోగ్యం గానే వున్నారు. ఆ అనారోగ్యం దుర్బలమైన ఆయన ఎముకల్లోను, పలచబారిన రక్తంలో మాత్రమేకాదు, ఆయనమనసు మూలల్లో కూడాను ... తన కాలంనాటి ఏ కాంతపు అత్యంత విచారకరమైన మూర్తి ... తన చావును తనే కొనితెచ్చుకొంటోన్న దురదృష్టవంతుడైన భారతమాత పుత్రుడు ...

మరో దురదృష్టవంతుడవైన నీకు పుట్టినరోజు శుభాకాంక్షలు పంపిస్తున్నాను. నీ ఉత్తర ప్రత్యుత్తరాలపై నిఘా వుంచే ఎక్స్‌రే కళ్ళు వున్నందువల్ల బహుశా ఇది నీకు సమయానికి అందక పోవచ్చు. నువ్వు పడే ఆందోళనను, ఏకాంతాన్ని చాలా పరీక్షగా ఈ రెండేళ్ళనుంచీ చూస్తున్నాను.

వచ్చేఏడాదికి నీకు నేను ఎలాంటి శుభాకాంక్షలు యివ్వను? ఆనందం లభించాలనా? శాంతా? విజయమా? మిగతా వారికి యివంటే గొప్పగొప్ప విషయాలే కాని నీకవి అంతప్రధానమైనవి కావు. స్వేచ్ఛకై ప్రయత్నించే వ్యక్తికి — వ్యక్తిగతమైన స్వేచ్ఛ కాదు, దేశాన్ని బానిసత్వంనుండి తప్పించడం అనే స్వేచ్ఛ — ఆ స్వేచ్ఛను ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించే వ్యక్తికి అవసర మయ్యే దృఢమైన విశ్వాసం, వెనుదీయని ధైర్యం నీకు లభించాలని ఆశిస్తున్నాను. మనస్తాపము, బాధ, ఏకాంతము నిన్ను వీడనప్పటికీ ప్రమాదభరితమైన ఆ నిటారుబాటలో ధైర్యంతో, వజ్రసంకల్పంతో నడువు. నువ్వు చేసే త్యాగాలన్నిటికీ అంతిమధ్యేయం స్వేచ్ఛ అని గుర్తుంచుకో...కాని నువ్వు ఒంటరిగా నడవలేవు.

ప్రేమతో
సరోజిని

* పొట్టిమనిషి అంటే గాంధీజీ

హ్యూలెట్ జాన్సన్ నుండి:

డీనరీ, కేంటర్‌బరీ
16 జూలై, 1938

ప్రియమైన నెహ్రూ,

నాకోరకై ఎంత చక్కటి గ్రంథాలయాన్ని పంపించారు మీరు. ఇందుకు నేనెంతయినా కృతజ్ఞుడ్ని. ఏమాత్రం తీరిక లభించినా ముందుగా ఆసక్తితో వీటన్నిటినీ తిరగవేస్తాను.

మీ రాక ఒక మధుర స్మృతి. గాంధీ రాక నాలో లేపిన స్మృతుల ప్రక్కనే చేర్చదగ్గ స్మృతి మీది. మరికొంత ముందుకు వెళ్ళి చెప్పాల్సివస్తే, గాంధీ విధానాలకు మీ విధానాలు ఎలా పరిపూర్ణతను కలిగిస్తాయో అలా, ఆయన రాకకు మీరాక సంపూర్ణతను యిచ్చింది. మీ తదుపరి రాక ఎక్కువ రోజులపాటు వుండాలని, ఆరోజుకొరకై ఆతృతతో నిరీక్షిస్తుంటాను.

అభివందలనాతో,

భవదీయ
హ్యూలెట్ జాన్సన్

—

మావో సే టుంగ్ నుండి :

ఏనన్, షెన్సీ
24 మే, 1939

శ్రీ జె. నెహ్రూ
ఆనందభవన్
అలహాబాద్, యు.పి.

ప్రియ మిత్రమా,

డా॥ ఎమ్. ఆతల్ ఆధిపత్యం క్రింద వైద్యబృందం యిక్కడకు రావడం, జపాను సామ్రాజ్యవాదులతో పోరాటం సాగించేందుకు చైనా ప్రజలను ప్రోత్సహించి, అభినందిస్తూ భారత జాతీయ కాంగ్రెసు వర్తమానాలను మాకు అంతజేయడం మాకెంతో ఆనంద దాయకంగా వుంది.

భారతీయ వైద్య బృందం యిక్కడ తన పనిని ప్రారంభించింది. 8వ. రూట్ ఆర్మీ సభ్యులంతా వారికి హృదయపూర్వక స్వాగతాన్నిచ్చారు. మాతోపాటు మా బాధలను పంచుకోవడానికి వచ్చిన వారి వుత్సాహం, వారిని కలుసుకున్న ప్రతి ఒక్కరిలోనూ చెరగని ముద్రలు వేసింది.

ఈ సమయంలో, మీరు యిచ్చే వైద్య సహాయానికీ, వస్తు సహాయానికి మీకూ, మీ విశాల భారతావని ప్రజకు, భారత జాతీయ కాంగ్రెసుకు మా కృతజ్ఞతలను తెలుపుకుంటూ, భవిష్యత్తులోకూడా భారత ప్రజలు, భారత జాతీయ కాంగ్రెసు తమ

సహాయ సహకారాల్ని కొనసాగిస్తూ తద్వారా జపాను సామ్రాజ్య తత్వవాదులను పారద్రోలడానికి తోడ్పడగలరని ఆశిస్తున్నాము.

చివరలో, ముఖ్యంగా మీకు మా కృతజ్ఞతలను, శుభాకాంక్షలను, హృదయపూర్వక అభినందనలను తెలుపుకొంటున్నాము.

మీ శ్రేయోభిలాషి,
మావో సే టుంగ్

—

సరోజినీనాయుడు వ్రాసినది :

హైదరాబాదు — దక్కన్,
దీపావళి 1939

ప్రియమైన జవహర్లాలుకు —

నీ జీవితంలో తొలి అర్ధశతాబ్దమూ ఒక కథగా, ఒక గేయంగా చరిత్ర పుటల్లో కెక్కింది. శేషజీవితంలోని తొలిరోజులుకూడా నీ చిరకాల కలల్ని పండించి, మానవ ప్రగతి చరిత్రలో మహోన్నత స్వేచ్ఛా ప్రదాతల్లో ఒకరిగా నీ కొక శాశ్వతత్వాన్ని ప్రసాదించుగాక !...

సాంప్రదాయకమైన 'శుభం' కలుగుగాక అని నిన్ను నేను ఆశీర్వదించలేను. సర్వసాధారణమైన వ్యక్తి ఆశించే వ్యక్తిగతమైన సుఖ సంతోషాలు, విరామం, సంపద — యీలాంటి సామాన్యమైన విషయాలు నీ జీవితంలో ముఖ్యస్థానం ఆక్రమిస్తా యనుకోవడం లేదు నేను ... దుఃఖం, బాధ, త్యాగం, ఆవేదన, శ్రమ — అవును, ఇవే భగవంతుడు నీకు ప్రసాదించిన వరాలు. వీటినే నువ్వు పరమానందాన్ని, విజయాన్ని, స్వేచ్ఛను ప్రసాదించేవాటిగా ఎలాగో ఒకలాగున మార్చుకోవాలి. ... నిన్ను సరిగా అర్థం చేసుకోలేకపోయినా, నిన్ను గాఢంగా ప్రేమించే ప్రజాసందోహం మధ్య ఏకాంతంగా వుండడానికి సృష్టించబడ్డ దురదృష్టవంతుడివి నువ్వు...

ఎడతెగని నీ ఉత్సాహాభినివేశాలు తమ లక్ష్యాన్ని సాధించి దివ్యమైన, సుందరమైన జీవితాన్ని ప్రసాదించుగాక !

ఇదే నీ కవయిత్రి సోదరి, సహధర్మిని నీ కిచ్చే దీవన.

సరోజినీ నాయుడు

ఆగ్రాలో 17 వ తేదీన, పవిత్రమైన ప్రయాగలో 19 వ తేదీ ఉదయం 2-32 గం. కు నేను వుంటాను.

—

అబుల్ కలాం అజాద్ వ్రాసినది :

కలకత్తా,
27 మార్చి, 1940

నా ప్రియమైన జవహర్లాల్,

నా ప్రసంగాల ఇంగ్లీషు అనువాదాలను మీరు 15 వ తేదీ ఉదయం రైల్లో నాకు యిచ్చినప్పుడు అనువాదం ఎలావుందోనని అక్కడక్కడ చూసి గబగబా తిరగవేసేశాను. తీరిగ్గా చదవడానికి యీనాటికిగాని నాకు వ్యవధి చిక్కలేదు. ఇప్పుడు నేను పూర్తిగా కాళీగా వున్నాను. మీ ప్రతిని క్షుణ్ణంగా చదివాను. దీన్ని చదవగానే నాలో ఎలాంటి అభిప్రాయం కలిగిందంటే నా మామూలు గంభీర స్వభావాన్ని ఏక్కడికక్కడ చెదిరిపోయి. మీ తెలివితేటలకు, అరుదైన ప్రజ్ఞకు నా హృదయపూర్వకాభివందనాలను మీకు నేను అర్పించుకుందామన్నంతగా అనిపించింది. ఆంగ్లభాషపై మీకున్న ఆధిపత్యం యింతవరకూ నేను ఊహిస్తున్న స్థాయినే మించిపోయింది. బాగా నిష్ణాతులైనవారు యీనాడు యీలాంటి బృహత్కార్యాన్ని నెరవేర్చడానికి కొన్ని రోజుల పర్యంతం తీసుకుంటే మీకది కొన్ని గంటలు మాత్రమే — అందులోనూ, ఏలాంటి ప్రత్యేక శ్రద్ధా తీసుకోనవసరం లేకుండానే — పడుతుందని నొక్కివక్కాణించగలను.

అనువాదం అనేది అసలు స్వతహాగా వ్రాయడం కన్న చాలా కష్టమైన పని. మూలంలోని భావాన్ని పరిపోషిస్తూ అనువదించాలంటే తేలికైన పనేమీకాదు. మూల భావాన్ని నిలుపుకుంటూనే అనువాదం ద్వారా రచయిత తన శైలిని వ్యక్తం చెయ్యాల్సివుంటుంది. రెండు భాషల్లోనూ సమానమైన శక్తిసామర్థ్యాలువున్న వ్యక్తే యీ బృహత్కార్యానికి పూనుకోగలడు. మీ అనువాదంలో నన్ను బాగా ఆకర్షించినది ఏమిటంటే, అనువాదంవల్ల మూల భావానికి ఎక్కడా ఏలాంటి యిబ్బందీ కలుగలేదు. నా ఉరుదూ శైలిని చాల అందంగా మీరు ఇంగ్లీషులోకి మలచారు. ఒకవేళ పాఠకుడు అసలు యిది ఇంగ్లీషులోనే వ్రాయబడిందని భావించినా నేను ఆశ్చర్యపడను, అంత చక్కగా మలచారు మీరు.

నన్ను ఆకర్షించిన మరో విషయం — నగిషీలు చెక్కిన నా ఆలోచనల్ని అందుకోగలగడం. నా వాక్యాలకు ఒక ఆకారాన్ని, ఒక లయను కల్పించే నా ఆలోచనలను మీరు చక్కగా దర్శించారు. నిజానికి మీరు అనువాదం ప్రారంభించడానికి ముందే నా యితివృత్తపు పూర్తిచిత్రం మీ కనులముం దున్నది. నిజంగా యిదొక బృహత్కార్యమే. ముఖ్యంగా నా కూర్పులు ఏవిధంగాను ప్రత్యక్షంగా సహాయకారులు కానప్పుడు మరీని.

కొన్నిచోట్ల ఇంగ్లీషులోకి అనువదించడానికి వీలుగా ఉర్దూ భాగాలను కొద్దిగా మార్చి విస్తృతీకరించడమో, కుదించడమో చేశారు. ఈమార్పులన్నీ శ్రద్ధగాపరిశీలించాను నేను. కొన్నిచోట్ల నా రచనను మెరుగుపరచినందుకు నాకెంతో ఆనందంగా వున్నది. ఎక్కడాకూడా నా రచనలోని భావంగాని, స్వరూపంకాని దెబ్బ తినలేదు. వైస్రాయ్ ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ నేను యిలా వ్రాశాను —

"సఫూన్ పర్ సఫాయ్ పరజానాకే బాద్ భీ బా-ముష్కిల్ ఇన్‌ఖదర్ బతానేపర్ ముస్తాద్ హోతాహై..." ఇక్కడ "బా-ముష్కిల్" అన్న మాట నా అలంకారిక ప్రకటన కంతటికీ ఆయువు పట్టులాంటిది. ఆ అలంకారం వెనక దాగివున్న అసలు విషయాన్ని చక్కగా పరిపోషిస్తూ మీరు యీ విధంగా చెప్పారు:

"ఒక పుట తరువాత మరో పుట-అలా చదువుకుంటూ వెళ్ళాక చిట్టచివరకు తెర మెల్ల మెల్లగా తొలగిపోయింది. మన కళ్ళకు దర్శనమయ్యింది..." 'బా-ముష్కిల్' అన్న మాటను ప్రయోగించి నేను ఏమి చెప్పదలచుకున్నానో ఆ అర్థాన్ని మీరు విపులీకరించిన వాక్యం మరింత చక్కగా వ్యక్తంచేసింది. మీ ప్రకటన నా ప్రకటనకన్న యుక్తమైనదని నేను ఒప్పుకోక తప్పదు. ఇటువంటి అనేకమైనవాటిల్లో యిది ఒక ఉదాహరణ మాత్రమే.

బహుశా 30 తేదీన నేను అలహాబాదు రావచ్చనుకుంటున్నాను. అప్పటిపరకూ మీరు అలహాబాదులోనే వుంటారని ఆశిస్తున్నాను.

మీ శ్రేయోభిలాషి
ఎ. కె. ఆజాద్,

---

చాంగ్ కై షేక్ వ్రాసినది :

(1940 అక్టోబరు 18 వ తేదీన వ్రాసిన ఉత్తరం)

ప్రియమైన నెహ్రూజీ -

గత ఏడాది చుంగ్‌కింగ్‌లో మనం జరిపిన ఆ సంతోషకరసంభాషణ తాలూకు స్మృతులు యిప్పటికీ నా మనసుల్లో క్రొత్తపరిమళాలను వెదజల్లుతూనే వున్నాయి. మీరు చైనాకు విచ్చేసిన కారణంగా పెనవేసుకున్న మన స్నేహపాశాలను తరచుగా నేను జ్ఞప్తికి తెచ్చుకుంటుంటాను.

ఈ సందర్భంలో నేను ఒక విషయం చెప్పదలచాను. దురాక్రమణ గావిస్తున్న జపానువారిని మనం ఎదుర్కొనే విషయం, దేశ ప్రజలు వుద్దేశించినట్టు, క్రమక్రమంగా బలాన్నీ, నైతిక విలువనూ పుంజుకొంటోంది. మన ఆసియాప్రజల సంయుక్తకృషి పర్యవసానం పై ప్రస్తుత ఆందోళన పరిస్థితి ఆధారపడి వున్నదని నాఅభిప్రాయం. జపానువారి అతిదాహందృష్ట్యా మనం మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించుకోవడానికిగాను తొలుదొల్త శాంతిని ప్రతిష్ఠించుకోవలసిన అవసరంవుంది. మన దేశాల నాయకులు ప్రపంచ పరిస్థితిని క్షుణ్ణంగా అవగాహన చేసుకున్నారుగనుక వారు యీలాంటి అత్యవసర పరిస్థితిని వెనువెంటనే ఎదుర్కొనగలిగిన విధానాన్ని అవలంబించి, శత్రువును ఎదుర్కోవడంలో మన అభిప్రాయాలతో, ఆశయాలతో ఏకీభవిస్తారని నేను ఆశిస్తున్నాను.

ప్రస్తుతం మీ దేశంలో తాయ్ చి టో సుహృద్భావ పర్యటన జరుపుతున్నారు. నా హృదయపూర్వక అభివందనాలను వ్యక్తిగతంగా మీకు అందజేయమని వారిని నేను కోరాను.

మీ విశ్వసనీయుడు
చాంగ్ కై షేక్

---

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వ్రాసినది :

కలకత్తా
23 నవంబరు 1941

ప్రియమైన పండిట్ జీ,

వెనువెంటనే మీరు సమాధానం యిచ్చినందుకు మీకు నా కృతజ్ఞతలు. అది నన్ను బాగా కదిలించివేసింది. మీతో వాదించాలనే వుద్దేశం నాకులేదు. మీ వుద్దేశాలను నిజంగా నేను అభినందిస్తున్నాను. పరిస్థితులకు బానిసలమైపోయి మనం వుండే యీ దేశంలో జైలు అంటే అర్థం కేవలం బయటకు కనిపించే దాని సరిహద్దులకు మాత్రమే పరిమితమై వుండలేదు. సువిశాలమైన యీ దేశం అంతటా సమవ్యాప్తి చెందివున్నది. ఇది తొలగిపోవడానికి యింకా ఎన్నో కాల్పులు తప్పవు.

ఏ మయినా మీరు మీ నిశ్చయాన్ని మరొకసారి పునరాలోచించుకోవాలని నేను చాలా ఆతృతపడుతున్నాను. ప్రపంచ చరిత్రను శోధించి వ్యక్తంచేసిన మీ సమీక్ష, భారతదేశపు స్వేచ్ఛా పోరాటం మిమ్మల్ని అగ్రశ్రేణి రాజకీయ భావుకులుగా ప్రతిష్ఠించాయి. ప్రస్తుతం మనం క్లిష్టదశలో నడుస్తున్నాం. అనైక్యత, బాధా మేఘాలు తరచుగా మనల్ని నిరాశాపూరితుల్ని చేస్తున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితిఅనిశ్చితస్థితిగా ఒప్పుకోవడానికి మనం నిరాకరిస్తాం. మార్పు ఏదో రావాలి. అది శక్తి, అధికారం, గౌరవం అనే యీ మూడు వినాశకర శక్తులు మార్గదర్శకాలుగా లేనప్పుడే మానవ జాతి కృషివల్ల మాత్రమే లభ్యమవుతుంది.

భారతదేశపు పరిస్థితులకు సంబంధించినంతవరకు, ముఖ్యంగా హిందువుల భవిష్యత్తుకు సంబంధించినంతవరకు, మీ ధోరణి మనుషులకు, నా ధోరణి మనుషులకు కొన్నిచోట్ల అభిప్రాయభేదాలున్నాయి. కాని మానవజాతి నాగరికతను వినాశనం నుండి పరిరక్షించి, ఉన్నతశ్రేణికి దానిని తీసుకుపోగల ఆత్మస్వేచ్ఛకు భారతదేశం అనాదిగా అనన్యమైన, గణనీయమైన; కృషిచేస్తున్నదనే విషయంలో మనమంతా ఏకీభవిస్తాం. మీకు తీరికవున్నప్పుడు — దానికి కాలపరిధిని నేను నిర్ణయించడంలేదు — మీరు మాకు కమలప్రసంగాలద్వారా భారతదేశపుచరిత్రకు సంబంధించిన నిష్పాక్షికమైన వివరణను, భారతదేశపు బలానికి బలహీనతలకు కారణాలను, రాజకీయ దాస్యంకూడా నాశనం చేయలేని శాశ్వతమైన విలువలను సంతరించుకోవడంలో భారతదేశం చేసిన కృషిని, స్వేచ్ఛా జీవితం, స్వీయగౌరవం గల జీవితం జీవించాలంటే అది ఎలాంటి

పరిస్థితులను అధిగమించాలో మొదలయిన విషయాలను తెలియ జేయాలని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. ఈలాంటి క్లిష్టతరుణంలో అనిశ్చితాభిప్రాయాలతో కూడిన ఆధునిక ప్రజాసందోహం మధ్య భవిష్యద్భారతావని స్వరూపాన్ని సంకుచిత పార్టీవిషయాలకు అతీతంగా ఎత్తిపట్టుకోగలిగే బహుకొద్దిమందిలోనూ మీరూ ఒకరు.

దయచేసి మీరు నా కోరికను అంగీకరించండి. ప్రసంగ విషయాన్ని తెలియజేయండి. అందుకు అవసరమైన తొలి ప్రయత్నాలను నన్ను చేయనివ్వండి.

అభివందనాలతో

మీ శ్రేయోభిలాషి
శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ

---

ఫీల్డ్‌మార్షల్ ఎ. పి. వావెల్ వ్రాసినది :

భారతదేశంలో చీఫ్‌కమేండరు
కొత్త ఢిల్లీ
28 డిశంబరు 1941

ఆర్యా,

ఇటీవల నేను చుంగ్‌కింగ్‌లో వున్నప్పుడు మేడమ్ చాంగ్ కై షేక్ నన్ను, నేను తిరిగి భారత దేశానికి చేరగానే తన శుభాకాంక్షలను మీకు అందజేయవలసిందిగా కోరింది. ఆమె క్షేమంగా వున్నది. మీరంటే ఆమెకు మంచి అభిప్రాయం వుంది. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఆమెను కలుసుకోలేదు. ఆమె ధోరణి నన్నెంతగానో ఆకర్షించింది.

దయచేసి ఇది ఒక ప్రయివేటు వ్యక్తి మీకొక వార్తను అందజేస్తున్నట్టుగానే భావించండి తప్ప భారతదేశపు చీఫ్ కమేండరు యిస్తున్నట్టుగా మాత్రం కాదు.

మీ విశ్వాసపాత్రుడు
ఎ. పి. వావెల్

---

సర్ స్టఫోర్డ్ క్రిప్స్ వ్రాసినది :

3 క్వీన్ విక్టోరియా రోడ్డు
కొత్త ఢిల్లీ
ఏప్రెలు 1942

వ్యక్తిగతమైనది, అనధికారమైనది.

ప్రియమైన జవహర్లాల్,

ఒకానొక నిశ్చయం — మన ఉభయ ప్రజల భవిష్యత్సంబంధాలు ఫలవంతం చేసే నిశ్చయం — అనబడే బృహత్తర భారాన్ని మోసే మీకు ఆఖరిసారిగా విజ్ఞప్తి చేసుకోనివ్వండి.

నేను నా పరిధిలోనూ, మీరు మీ పరిధిలోనూ ప్రజల్ని స్నేహ, సహకారాలద్వారా మనం నడిపించగలం; నడిపించాలికూడా. ఇప్పుడు వచ్చిన అవకాశం మరొకసారి రాదు. ఇది నిష్ప్రయోజనమైతే మరోరూపంలో మరికొన్ని అవకాశాలు రావచ్చు. కాని మన ప్రజల స్నేహ సత్సంబంధాలను పటిష్ఠవంతం చేయడానికి యింత చక్కటి అవకాశం మరొకసారి రాదు.

నాయకత్వం — మీరు వహిస్తున్న నాయకత్వం — మాత్రమే దీనిని నెరవేర్చగలదు. అన్ని సమస్యలనూ, బాధలను ఎదుర్కొని వాటిని తొలగించడానికి అనన్యమైన ధైర్యాన్ని ఒక గొప్ప నాయకుడు — నాకు తెలుసు, అవి మీలో వున్నాయి — చూపించవలసిన తరుణం.

మీ గుణ గణాలు నాకు తెలుసు. మీ శక్తి సామర్థ్యాలు నేనెరుగుదును. వాటిని యీనాడు వినియోగించమని కోరుతున్నాను.

సర్వదా మీ విశ్వసనీయుడు
స్టఫోర్డు

---

ఎస్. హెచ్. షెన్ వ్రాసినది :

చైనా రిపబ్లిక్ కమీషనరు కార్యాలయం
కొత్తఢిల్లీ
15 ఆగష్టు 1945

ప్రియమైన పండిట్ నెహ్రూ,

1940 గ్రీష్మంలో యూఆన్ ఎగ్జామినేషన్ అధ్యక్షుడు డా॥ తాయ్ భారత దేశానికి సుహృద్భావ సంస్థ అధిపతిగా రావడం మీకు జ్ఞాపకం వున్న దనుకుంటాను. ఆ సంస్థలో నేను సభ్యుడిని. అంతకు క్రితం సంవత్సరం మీరు చైనాకు వచ్చినదానికి ప్రతిగా రావడమే ఆసంస్థ భారతదేశానికి రావడంలోని ఉద్దేశ్యం. దురదృష్ట వశాత్తూ మేము భారతదేశానికి వచ్చేసరికి మిమ్మల్ని కలుసుకోవడం మాకు సాధ్యం కాలేదు.

ఆనాడు ఎదురయిన నిరుత్సాహాన్నుంచి తప్పుకోవడానికి గాను డా॥ తాయ్ ఒక పద్యాన్ని కూర్చారు. దాన్ని, అలహాబాదులో తనకు హృదయపూర్వకంగా స్వాగతాన్నిచ్చిన శ్రీమతి పండిట్‌కు అందజేయవలసిందిగా కోరారు.

ఇటీవలి అభివృద్ధి దృష్ట్యా మీకూ, మౌలానా ఆజాద్‌గారికీ తన శుభాకాంక్షలను అందజేయమని డా॥ తాయ్ నన్ను కోరారు. మంచి దస్తూరికి పేరుపడిన ఆయన చక్కటి స్వదస్తూరితో వ్రాసిన ఆ పద్యం ప్రతిని ఒకదానిని నాకుకూడా పంపించారు.

దీనిని నేను యింగ్లీషులోకి అనువదించడానికి ప్రయత్నించాను. కాని, ఏ పద్యమైనా, ముఖ్యంగా చైనాలో వ్రాసిన పద్యం, విదేశీ

భాషల్లోకి అనువదింపబడినప్పుడు మూలంలోని సొగసును పోగొట్టుకుంటుందనే విషయం మీరు గుర్తిస్తారనే భావిస్తున్నాను.

అభివందనాలతో
మీ విశ్వసనీయుడు
ఎస్. హెచ్. షెన్

---

మహాత్మా గాంధీ వ్రాసినది:

(ఢిల్లీలో చెలరేగిన మతకలహాలకు నిరసనగా అనేకదినాలు మహాత్మాగాంధీ నిరాహారదీక్ష కొనసాగించి, చివరకు ఆ దీక్షను విరమించిన రోజున నాకు ఆయన వ్రాసిన వుత్తరం యిది.

ఢిల్లీలో జరిగిన సంఘటనలకు, గాంధీజీ నిరాహారదీక్షకు నేను చాలా ఆందోళన చెంది ఒకటి రెండురోజులు భోజనంకూడా చెయ్యలేదు. నిజానికి యిది ఏమీ పెద్దగా కొనసాగిద్దామన్న నిరహారదీక్ష ప్రయత్నంకాదు. ఆ సంఘటనలవల్ల ఆందోళిత మనస్కుడై ఆ విధంగా దానంతటదే సంభవించింది. మామూలు ప్రతివ్యక్తికీ అనుభవంలోని విషయమే యిది. ఆ విషయం ఎలాగో గాంధీజీకి తెలిసింది. దాన్ని విరమించమని ఆయన చెప్పిన హితవు యిది.

ఇక్కడ ఆయన ప్రయోగించిన "భారతభూషణ్" అనేమాట నాపేరులో వున్న అంతరార్థం. జవహర్ అంటే భూషణము అని.

ఇది ఆయన వ్రాసిన ఆఖరి వుత్తరం. పన్నెండు రోజుల అనంతరం 1948 జనవరి 30 వ తేదీన ఒక హంతకుని చేతిలో ఆయన కన్నుమూశారు.)

1948 జనవరి 18,

ప్రియమైన జవహర్లాల్,

నిరాహారదీక్ష విరమించు.

పాకిస్తాను పంజాబు స్పీకరువద్దనుండి వచ్చిన టెలిగ్రాం కాపీని దీనితోపాటు జతపరచి పంపిస్తున్నాను. నేను నీకు ఏం చెప్పాలనో అదే జహిద్ హుస్సేన్ చెప్పారు.

భారతభూషణ్‌గా చిరకాలం జీవించుగాక!

ఆశీస్సులతో
బాపు

పశ్చిమ పంజాబు విధానసభ స్పీకరు వద్దనుండివచ్చిన టెలిగ్రాము.

మీ నిరాహారదీక్షయొక్క నిస్వార్థమైన, ఉన్నతమైన ఆశయాలపై 13 వ తేదీన శాసనసభలో కొనసాగించిన ప్రసంగాలనుండి కొన్ని ఉచితభాగాలను మీకు తెలియజేయడానికి నేనెంతో సంతోషిస్తున్నాను. మీరు వ్యక్తంచేసిన అభిప్రాయాలతో నేనూ, యీ శాసనసభా ఏకీభవిస్తున్నాం.

మాలిక్ మహమ్మద్ ఫిరోజ్‌ఖాన్ నూన్:

"మతకర్తలను మినహాయిస్తే, మహాత్మాగాంధీని మించిన మహోన్నతవ్యక్తిని ప్రపంచంలోని ఏ దేశమూ సృష్టించలేదు"

గౌరవ మియాన్ మహమ్మద్ ముంతాజ్‌ఖాన్ దౌలతానా, ఆర్థికమంత్రి:

ముసల్మానులపై మహాత్మాగాంధీ నిరహారదీక్ష వ్యక్తం చేసిన భావాలను అభినందించడం మన విద్యుక్తధర్మం. హిందూ - ముసల్మాను సమైక్యతకు అవసరమైతే తన ప్రాణాన్నే అర్పించడానికి సిద్ధపడేవ్యక్తి కనీసం ఒకరైనా భారతదేశంలో వున్నారనే విషయాన్ని యిది వ్యక్తం చేస్తున్నది. ఈ నిరహారదీక్ష యిటుపై కొనసాగించవలసిన అవసరం లేకుండాచేయమని మనం భగవంతుని ప్రార్థిద్దాం. మైనారిటీ ప్రజలను రక్షించాలనే ఆయన అభిప్రాయాలతో మనం పూర్తిగా ఏకీభవిస్తున్నాం అని యీ శాసనసభగద్దె నుండి నేను మహాత్మాగాంధీకి హామీ యిస్తున్నాను.

గౌరవఖాన్ ఇఫ్తీకర్ హుస్సేన్‌ఖాన్, ప్రధానమంత్రి:

పవిత్రమైన కార్యార్థం మహాత్మాగాంధీ చేస్తున్న ఒక గొప్ప ప్రయత్నానికి నా తరఫున, నాతోటిమంత్రుల తరఫున నేను హృదయపూర్వక అభినందనను ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాను. విలువైన ఆయన జీవితాన్ని కాపాడడానికి యీ దేశంలో చేసే ఏ ప్రయత్నంలోనూ మేము వెనుకంజవేయము."

పశ్చిమ బెంగాలు విధానసభ స్పీకరు

---

జార్జి బెర్నార్డుషాకు వ్రాసినది:

కొత్తఢిల్లీ
4 సెప్టెంబరు 1948

ప్రియమైన షా,

మన మిద్దరం ఎప్పుడూ ఊపిరి పీల్చలేని పనుల్లో సతమతమై వున్నవాళ్ళమే. అలాంటి మీకు అదనంగా శ్రమ యివ్వాలనుకోవడంలేదు. అయినా నేనెందుకు మీకు ఉత్తరం వ్రాస్తున్నానో నాకే సరిగా తెలియదు. కాని, మీరు దేవదాస్ గాంధీకి జులై 16 న వ్రాసిన ఉత్తరం ప్రతిని ఒకదానిని ఆయన నాకు పంపించారు. అది నాలో మీకు ఉత్తరం వ్రాయాలనే కోరికను రేకెత్తించింది.

నలభైఏళ్ళ క్రిందట నా పద్దెనిమిదోఏట నేను కేంబ్రిడ్జిలో చదువుకొంటున్నప్పుడు అక్కడ ఒక సభలో మీరు ఉపన్యసించగా

మీ ప్రసంగం విన్నాను. అప్పటినుంచీ మళ్లీ మిమ్మల్ని చూడ లేదు, కనీసం ఉత్తరమయినా వ్రాయలేదు. కాని నాతరంలో చాలా మందిలాగా మీ పుస్తకాలు, రచనల సహచర్యంతో మేం పెరిగి పెద్దవారి మయ్యాం. కొంతవరకూ నేను యీనాటి రూపంలోకి మీ రచనల పఠనంద్వారానే. మలచబడ్డాను. ఇది మీకు ఏమైనా విలువను ఆపాదిస్తుందో లేదో నాకు తెలీదు.

మీరు నాకు సన్నిహితులుగా వున్నందువల్ల, లేదా నా అభిప్రాయాలకు సన్నిహితులుగా వున్నందుచేత మీతో మరీ సన్నిహితంగా రావడానికి, తరచుగా అభిలషిస్తుంటాను. కాని అవకాశాలు మాత్రం కలగడంలేదు. అందుచేత మిమ్మల్ని కలుసుకోవడానికి మీరు వ్రాసిన పుస్తకాల్ని చదవడమే చక్కటి మార్గం అని నేను భావించాను.

గాంధీ హంతకుడ్ని మేము ఏంచెయ్యాలో అనిమిమ్మల్ని దేవదాస్ అడిగాడు. ఆయనను ఉరితీయాలని నా అభిప్రాయం. నా మట్టుకు నేను, రానున్న దినాలలో మరణదండన నిషేధించాలనే అభిప్రాయానికి అనుకూలంగా అభిప్రాయాన్ని ప్రకటించినా, ఆ హంతకుడిని మరణదండన నుండి తప్పించడానికి నేను ఏ ప్రయత్నాన్నీ చెయ్యను. ప్రస్తుత పరిస్థితులలో అది వినా మరోమార్గంలేదు. ఒక మామూలు విషయంలోకూడా యిప్పుడు ఒక వ్యక్తిని 15 లేక 20 ఏళ్ళు జైలులో వుంచడంకన్న మరణదండన విధించడమే మేలేమోనని అనిపిస్తుంది.

ప్రాణం చాలా లేలికయిపోయింది. కొంతమందికి మరణదండన విధించినా, విధించకపోయినా దానివల్ల తగినంతగా పరిణామాలు వస్తున్నట్టులేదు. ఒక్కొక్కప్పుడు మరణదండన కూడా ఆయా వ్యక్తులుచేసిన తప్పిదాలకు తగిన శిక్షలు కావు.

భారత దేశంపై మీకున్న అభిప్రాయాలకు మా దేశపు ప్రజలు కొందరు మీకు కష్టం కలిగించినందుకు మీకు నా క్షమాపణలను చెప్పుకొంటున్నాను. ఇతరులకు ప్రశంసల్నికోరే పాత అలవాటును మించి మా వాళ్ళు చాలామంది పైకి ఎదగలేదు. బహుశా మాలో మాకే తగినంత నమ్మకం లేక పోవడంవల్ల కావచ్చు. సంఘటనలు మమ్మల్ని విపరీతంగా కదిలించివేశాయి. భవిష్యత్తు ఎలా ఉండాలని కలలుగన్నామో అలా కనిపించడంలేదు.

వచ్చే అక్టోబరులో రెండు మూడు వారా లుండే నిమిత్తం ఇంగ్లాండుకు వచ్చే అవకాశం వుంది. మీ దగ్గరకువస్తాను. ఇది మీ దినసరి కార్యక్రమాలకు ఏ విధమైన ఆటంకం మాత్రంకాదు. మిమ్మల్ని పశ్నలతో వేధించను. మనసుకు తట్టే పశ్నలు కొకొల్లలుగా వున్నాయి. వీటికి సరియైన సమాధానాలు లేవనిపిస్తుంది. ఒకవేళ వున్నా, వాటిని ఆచరణలో పెట్టేది మానవులేగనుక ఆచరణ మాత్రం సాధ్యంకాదు. కొద్దిసేపు మిమ్మల్ని కలుసుకోవడం జరిగితే అది, ఆ విలువైన క్షణాల్ని నా జ్ఞాపకాల ఆల్బమ్‌లో భద్రంగా దాచుకుందామని, ఆ క్షణాలే యిప్పటికన్నా నేను మానసికంగా ఎదగడానికి కారణ మవుతాయని మాత్రమే.

మీ

విశ్వసనీయుడు

జవహర్‌లాల్ నెహ్రూ

జార్జి బెర్నార్డ్ షా,
అయత్ సెంట్ లారెన్స్,
వెల్విన్, హెర్ట్స్, ఇంగ్లాండు.

జార్జి బెర్నార్డ్‌షా వ్రాసినది :

లండన్

18, సెప్టెంబరు 1949

ప్రియమైన నెహ్రూ,

నా రాజకీయ రచనలతో మీకు సుపరిచితులని తెలుసుకోవడం నాకు మహదానందాన్ని కలిగించింది. ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రిందటే చనిపోవలసిన, కేవలం స్వరూప మాత్రంగా మిగిలిన ముసలి అస్థిపంజరంతప్ప బెర్నార్డ్‌షాలో యింకేమీలేని యిక్కడికి- ఈ మారుమూల గ్రామానికి — రావడానికై విలువైన మీ సాయంకాలాన్ని వినియోగించడం మీకు ప్రయోజనకారేనని చెప్పి మిమ్మల్ని మోసగించలేను.

ఒకసారి నేను ఒక వారంరోజులు బొంబాయిలో, మరొక వారం సింహళంలో గడిపాను. అప్పుడే నేను భారతదేశాన్నిగూర్చి క్షుణ్ణంగా తెలుసుకున్నాను. సింహళంలో ప్రతిఒక్కరూ స్వభావసిద్ధంగా కనిపిస్తారు. అందుకే అది మానవజాతి నాగరికతకే మూలస్థానం అని నా నమ్మిక. మిగతా అన్నిదేశాలూ కేవలమూకుమ్మడి ప్రాంతాలే.

నేను చదివే వార్తాపత్రికలద్వారా తెలుసుకున్నది తప్ప భారతదేశాన్నిగూర్చి నాకు యింకేమీ తెలియదు. నేను ఇంగ్లీషువాడిని కాదు, ఐరిష్‌వాడిని. ఇంగ్లీషువారి పరిపాలననుండి విముక్తికై చిరకాలం జరిగిన పోరాటంలో; హిందూస్తాన్ పాకిస్తాన్‌వలె ఐరి.

తూర్పు ఐర్లాండుగా చీల్చిన చీలికలో జీవించాను. మీరు కేంబ్రిడ్జిలో ఆనాటికి ఎంత కొత్తవారో నేనూ ఇగ్లాండుకు అంతే కొత్త,

జిన్నర్ మరణం మీ ఇంగ్లాండు రాకకు అడ్డుపడుతుందేమోననే భయపడుతున్నాను. సరియైన అనుయాయుడు ఆయనకు లేకపోతే మీరే మొత్తం ఆ ద్వీపకల్పాన్ని అంతటినీ పరిపాలించ వలసి వుంటుంది.

విశ్వసనీయుడు
జి. బెర్నార్డ్ షా

గౌరవ ప్రధానమంత్రి
కొత్తఢిల్లీ
భారతదేశం

జార్జి బెర్నార్డ్‌షా వ్రాసినది:

4, వైట్‌హాల్ కోర్టు (130)
లండన్, ఎస్. డబ్ల్యు.
12 నవంబరు 1948

ప్రియమైన పండిట్ నెహ్రూ,

నేను నిరాశ చెందలేదు. మీరు లండనులో వున్నప్పుడు యీ మారుమూల గ్రామానికి రావడానికై ఒక సాయంకాలాన్నంతా వినియోగించడానికి వీలులేని వ్యాపకాలతో మునిగివుంటారని మీకునేను ఉత్తరం వ్రాసినప్పుడే నాకు తెలుసు. మీరు వచ్చివుంటే మీరు నాకొక చక్కటి అతిథి అయివుండేవారనే విషయాన్ని యిక్కడ మీకు చెప్పుకోవలసివుంది.

సమావేశంలో మీరు పాల్గొనడం వ్యక్తిగతంగా అది మీకొక విజయం. యితరుల సాధారణమైన ప్రసంగాలతో పోల్చిచూస్తే మీ రేడియోప్రసంగం చాలా స్ఫుటంగా, ప్రధానంగా వుంది. ఆ తరువాతి ప్రసంగాలు మిమ్ములను స్టాలిన్‌కు ఆసియాలో సమ ఉజ్జీగా చేశాయి. ఇప్పట్లో మళ్ళీ యుద్ధం వచ్చేసూచన లేదని ఘంటాపథంగా మీరు చెప్పడం నిజంగా సరియైన సమయం సరియైన మాటను చెప్పడమే అది. మన మంత్రిమండలి సభ్యులు తెలివితక్కువవారు కాదు. కాని వా రేమిమాట్లాడుతున్నారో వారికే తెలియదు.

జి. బెర్నార్డ్‌షా

గౌరవ జవహర్లాల్ నెహ్రూ
కొత్తఢిల్లీ
భారతదేశం

"నన్ను గురించి ఆలోచించేవారికి

నా మాట:

భారతదేశాన్నీ, ప్రజలనూ హృదయ పూర్వకంగా
ప్రేమించే వ్యక్తిని నేను; భారతప్రజల ప్రగాఢ
ప్రేమాదరణలకు పాత్రమైన వ్యక్తిని నేను."

— నెహ్రూ

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad-1.
Printed at YUVA PRESS, Public Garden Road, Hyderabad.